మల్లాది

వెంకట కృష్ణమూర్తి



# మిస్టరీ స్టోరీస్

(అనువాద కథలు)

# విషయ సూచిక


01. పథకం 05
02. ఇద్దరు ప్రియులు 09
03. రెండు హత్యలు 13
04. శిక్ష 17
05. అన్వేషణ 21
06. హంతకురాలు 25
07. దొంగ గారు 29
08. పూల ప్రేమికులు 33
09. ఓ పాపం- ఓ ఫలితం 37
10. ఎవరు? 41
11. ఏక్టింగ్ జాబ్ 45
12. బందీ 49
13. అన్వేషణ 53
14. అనుమానం లేని హత్య 57
15. సహాయకారి 61
16. గుండె నిండా ప్రేమ 65
17. చెదురుమదురు బుల్లెట్ 69
18. బోల్తా 73
19. నన్ను చంపు 77
20. ప్రతీకారం 81
21. రక్షణ సేవ 85
22. మేటనీ షో 89
23. ప్రయాణంలో పదనిసలు 93
24. రెండో తాళంచెవి 97
25. ఇలా జరిగింది 101
26. వేట 105
27. ఫేమిలీ గేమ్ 109
28. గుండె మండితే 113
29. రెండో హత్య 117
30. ప్రిన్సిపాల్ 121
31. ఫాదర్స్ డే 125
32. సహచరుడు 129
33. క్రిస్టమస్ ట్రీ కిల్లర్ 133
34. అనగనగా ఓ రోజు 137



**మీ ఇంటికే మల్లాది రచనలు తెప్పించుకోండి**

చాలామంది పాఠకులు తమ ఊళ్ళో లిపి ప్రచురణలు లభ్యం కావడం లేదని ఫోన్స్ చేస్తున్నారు. మీ పుస్తకాల షాపు వారు మీకు కావాల్సిన మల్లాది రచనలని తెప్పించకపోతే, మమ్మల్ని ఈ కింది ఫోన్ నంబర్లలో సంప్రదించండి. వాటి ధరని యం ఓ చేసినా లేదా ఆన్ లైన్ బేంకింగ్ చెల్లింపు జరిపినా, వాటిని రిజిస్టర్డ్ బుక్ పోస్ట్‌లో మీ చిరునామాకి పంపగలం.

లిపి పబ్లికేషన్స్, గాంధి నగర్, హైద్రాబాద్ 500 080

040-2761 2244 98490 22344




# మిస్టరీ స్టోరీస్

## 1. పథకం

### రోన్ గోలర్ట్

**అతనికి**, అతని భార్యకి మధ్య మళ్ళీ వాగ్వాదం చెలరేగింది. అది ఎప్పటిలా జెర్రి గురించి. కోపంతో అతను తన భార్య చెంపలు వాయగొట్టాడు. ఆమె కొన్ని పుస్తకాలని అతని మీదకి విసిరేసింది. అతను తన భార్య వల్ల తను చాలా కాలంగా ఉంటున్న ఇంటిని కూడా మార్చాల్సి వచ్చింది. బ్రూక్లిన్ లోని చక్కటి అపార్ట్‌మెంట్‌లో వారు నివశించేవారు. ఐతే వారి మధ్య పోట్లాట మొదలవగానే పక్క ఇళ్ళవాళ్ళు గోడల మీద పెద్దగా శబ్దం అయ్యేలా కొట్టేవారు. దాంతో కనెక్టికట్‌లో స్వంత ఇల్లు కొనుక్కుని మారాడు. ఆమె జెర్రితో వెళ్ళిపోకుండా తనతో కలిసి ఉండటానికి కారణం తన ఐదు లక్షల డాలర్ల ఖరీదైన ఇల్లు, తన ఆరు అంకెల జీతం అని అతనికి తెలుసు.

ఇటీవల అతనిలో ఓ భయం మొదలైంది. తన భార్య తనని చంపాలని అనుకుంటోందా? లేకపోతే ఎక్స్‌పైర్ అయిపోయిన టిన్డ్ ఫుడ్ తన ఇంట్లో ఎలా ప్రత్యక్షం అవుతుంది? అలాంటివి ఏ దుకాణంలో అమ్మరు. వాటిని గమనించి షెల్ఫ్‌ల్లోంచి తీసేసే సిబ్బంది ఉంటారు. తను పోతే తన ఆస్థి మొత్తం ఆమెకే వెళ్తుంది. జెర్రిని ఇంకాస్త స్వేచ్ఛగా కలవచ్చు.

జెర్రి తనలా ఓ పెద్ద కంపెనీలో సి ఇ ఓ కాదు. రెండు సార్లు జైలుకి వెళ్ళి వచ్చినవాడు. ఇంకా నేరాలతోనే సంపాదిస్తున్నాడు తప్ప తనలా నిజాయితీగా పని చేసి సంపాదించడం లేదు. ఓ బేంక్ దొంగతనంలో అతను హత్యా నేరంలో ఇరుక్కున్నాడు. కాని కోర్టు అతన్ని నిర్దోషిగా తీర్పు చెప్పింది.

విసిగి పోయిన అతను తన భార్య సమస్యకి శాశ్వత పరిష్కారం కనుగొన దలిచాడు. జెర్రి కన్నా తను మేధావి. జీవితంలో ఒకే ఒక్క సారి ధైర్యం చేస్తే తను వారిద్దరి సమస్య

నించి శాశ్వతంగా బయట పడగలడు. అందుకు తనలో తెగింపు కూడా ఉంది. జెర్రి గురించి విచారించాడు. అతనికి న్యూయార్క్ లోని ఓ మాఫియా గేంగ్‌తో సంబంధం ఉందని, వారికి జెర్రి డ్రగ్స్‌ని సరఫరా చేసే కొరియర్ బాయ్‌గా పని చేస్తున్నాడని తెలిసింది. తనని అతను చంపే ముందే తను జెర్రిని చంపడం శ్రేయస్కరం అనే నిర్ణయానికి వచ్చాక ఇక ఆలస్యం చేయలేదు. ఓ పథకాన్ని రూపొందించాడు. ఓ వారం పాటు దాని మీద కూర్చుని అందులోని లోపాలని కనిపెట్టి వాటిని సరిదిద్దాడు. పోలీసులకి తన మీద ఎలాంటి అనుమానం రాకుండా ఉండటానికి అనువుగా ఆ పథకాన్ని రూపొందించాడు.

న్యూయార్క్ లోని అండర్ వరల్డ్‌లో నూట ఏభై డాలర్లకి గతంలో ఓ పిస్తోలుని అతను కొన్నాడు. యూరప్ నించి అమెరికాకి ఓ జి ఐ (అమెరికన్ సైనికుడు) స్మగుల్ చేసి తెచ్చిన ఆ పిస్తోలు తనదని పోలీసులు ట్రేస్ చేయలేరు.

ఓ ఆదివారం దాన్ని శుభ్రం చేసి ఆయిల్ వేసాడు. అది పని చేస్తోందో లేదో తెలుసుకోడానికి న్యూయార్క్‌కి వంద మైళ్ళ దూరంలోని ఉడ్స్ (అడవి) లోకి వెళ్ళి దాన్ని ఉపయోగించి చూసాడు. అతి చక్కగా పని చేస్తోంది. ఆ పిస్తోలుతో పాటు వచ్చిన డజను బుల్లెట్లలో రెంటిని ఉపయోగించాక మిగిలినవి కారు సీట్ కింద ఆ పిస్తోలుతో పాటు దాచాడు.

* * *

ఆ రాత్రి న్యూయార్క్‌లో మంచు పడుతోంది. అతని భార్యకి ఇంటికి లేండ్ లైన్‌కి గంటకో సారి ఫోన్ చేసినా ఆమె రిసీవర్ ఎత్తలేదు. ఆన్సరింగ్ మెషీన్ బదులు పలికింది. తన భార్య ఎక్కడికి వెళ్ళిందో అతను అర్థం చేసుకోగలిగాడు. జెర్రి ఇంటికి వెళ్ళి ఉంటుంది. పళ్ళు పట పట కొరికాడు. మౌంటెన్ రోడ్ లోని రెండు బెడ్‌రూంల చిన్న ఇంటిని జెర్రి అద్దెకి తీసుకుని ఉంటున్నాడని ఓ సారి అతని భార్య చెప్పింది. ఆమెని జెర్రి చిరునామా అడగకుండానే అతను ఆ ఇంటిని కనుక్కున్నాడు. జెర్రి దగ్గరకి తన భార్య బయలు దేరి వెళ్ళి వచ్చాక ఆమె స్పీడో మీటర్ లోని మైళ్ళని నోట్ చేసి, ఆమె వెళ్ళక మునుపు నోట్ చేసిన మైల్స్‌తో పోల్చి చూసి, ఆ తేడాని సగం చేసాడు. జెర్రి ఇల్లు తన ఇంటికి పన్నెండు మైళ్ళ పరిధిలో ఉందని అలా కనుక్కున్నాడు. మేప్ తీసుకుని పన్నెండు మైళ్ళ పరిధిలోని ప్రాంతాన్ని పరిశీలించాడు. తన భార్య జెర్రితో కలిసి తరచు రాత్రిళ్ళు భోజనం చేసే రెస్టారెంట్ మౌంటెన్ రోడ్‌లో ఉండటంతో అతను ఆ ప్రాంతంలో ఉన్నాడని గ్రహించాడు. అతని భార్య హేండ్ బేగ్‌లో ఆమె చెల్లించిన బిల్స్ రసీదులు రహస్యంగా పరిశీలిస్తే మౌంటెన్ రోడ్ లోని వాల్ మార్ట్ లోనే షాపింగ్ చేస్తోందని అతను గ్రహించాడు.

ఆ ఏరియా పోస్టాఫీస్‌కి వెళ్ళి జెర్రి పేరు చెప్పి అతని చిరునామాని పోస్ట్ మేన్‌ని అడిగి కనుక్కున్నాడు. ఇక మంచు పడే రాత్రి కోసం ఎదురు చూడసాగాడు. తన భార్యతో



వాగ్వివాదంలోకి దిగడం అతనికి అన్నిటికన్నా తేలికైన పని. జెర్రి పేరు ఎత్తితే చాలు. అతన్ని కలవడం తన హక్కు అన్నట్లుగా ఆమె మండి పడుతుంది.

* * *

డిసెంబరు నెలలో ఆ రాత్రి న్యూయార్క్‌లో మంచు కురవసాగింది. అతను తన భార్యతో వాగ్వివాదం లోకి దిగాడు. ఆమె కోపంలో విచక్షణ కోల్పోతుందని అతనికి తెలుసు. ఆ పాయింట్‌కి ఆమెని తీసుకు వచ్చి చెప్పాడు.

"పద. మనిద్దరం వెళ్ళి జెర్రి ముందే ఈ సంగతి తేల్చుకుందాం."

అనుమానించకుండా ఆమె సరేనంది.

"మీ ఇద్దరూ నా గురించి ఒకరితో మరొకరు మాట్లాడటం మంచిదే." ఒప్పుకుంది.

ఇద్దరూ చలి కోట్లు ధరించారు. తన కారుని తీయలేదతను. ఆమె కారు లోనే బయలుదేరారు. ఆమె మౌంటెన్ రోడ్ లోని జెర్రి ఇంటి ఆవరణలోనే కారాపింది. ఆమె కారులో సీట్ కింద దాచిన పిస్తోలుని, బుల్లెట్ల పెట్టెని ఆమె చూడకుండా తీసుకున్నాడు. చలికి చేతికి గ్లవ్స్ ఉండటంతో అతని వేలి ముద్రలు వాటి మీద పడలేదు. అర్ధరాత్రి కాబట్టి పక్క ఇళ్ళల్లో లైట్లు కూడా వెలగడంలేదు.

ఆమె జెర్రీ ఇంటి బెల్ నొక్కింది. అతను తలుపుని కొద్దిగా తెరచి ఆమెని చూసి వెంటనే తలుపుని పూర్తిగా తెరిచి లోపలకి వచ్చిన ఆమెని చుంబించాడు. ఆమె వెనకే వచ్చిన ఆమె భర్తని చూసి నివ్వెరపోయాడు.

"నీతో మాట్లాడాలి. లోపలకి పద. మనం ఓ ఒప్పందానికి వద్దాం." కోటు జేబుల్లో చేతులు ఉంచుకున్న అతను చెప్పాడు.

జెర్రి అతని వంక అయోమయంగా చూసి లోపలకి నడిచాడు. వెనకే అతని భార్య నడిచింది. వాళ్ళిద్దరూ తన వైపు తిరిగాక అతను జేబు లోంచి పిస్తోలు తీసి ముందు జెర్రిని కాల్చాడు. తర్వాత తన భార్యని కాల్చాడు. ఇద్దరి గుండెల్లోకి గుళ్ళు దూసుకెళ్ళాయి. తర్వాత వారి ఇద్దరి నుదుటి ముందు తుపాకీ బేరల్‌ని ఉంచి మరో సారి కాల్చాడు. మాఫియా వారు చంపే విధానం అదే అని అతనికి టివి సీరియల్స్ వల్ల తెలుసు. తన చేతులు భయంతో వణకడం లేదని, తను ఎలాంటి ఆందోళన లేకుండా ప్రశాంతంగా ఉన్నాడని అతను గ్రహించాడు. మాఫియా కిల్లర్స్ తాము చంపేవారిని సమర్థతతో, త్వరగా చంపుతారు. వారు ఎదురు తిరిగేంత సమయం ఇవ్వరు. ఐనా ఒకర్ని కాల్చగానే ఇంకొకరు తిరగబడే ప్రయత్నం చేయచ్చు.

అతను టేక్ ఉడ్ టేబిల్ మీది వస్తువులని నేల మీదకి తోసేసాడు. కిటికీ లోంచి బయటికి చూసాడు. రోడ్ మీద వాహనాలేం కనపడలేదు. ఓ సారి తన పథకాన్ని మననం చేసుకున్నాడు. జెర్రికి తెలిసిన వాళ్ళు బెల్ కొడితే అతను తలుపు తీసాడు. జెర్రిని చంపడానికి

వచ్చిన ఆ మాఫియా మనిషి తన భార్య కూడా అక్కడ ఉండటంతో, సాక్షిని అంతం చేయడానికి ఇద్దర్నీ చంపాడు.

పిస్తోలు తన దగ్గరే ఉంది. మాఫియా మనిషి కాల్చాక ఏం చేస్తాడు? దాన్ని అక్కడే వదిలి వెళ్తాడా? వెంట తీసుకెళ్తాడు. తనూ తీసుకెళ్ళడం మంచిది. కాని అది తన దగ్గర ఉండటం క్షేమం కాదు. దాన్ని ఇంటికి చేరే లోగా పారేయాలి. మరో సారి ఆ గదిని పరీక్షగా చూసాడు. మాఫియా మేన్ అతని జేబులు వెదుకుతాడు. ఇల్లంతా వెదుకుతాడు. బహుశా డ్రగ్స్ కోసం. లేదా అది అమ్మగా వచ్చిన డబ్బు కోసం. అతను ఆలస్యం చేయకుండా ఇల్లంతా వెదికినట్లుగా డ్రాయర్లని తెరిచి అందులోని వస్తువులని కింద పడేసాడు. పుస్తకాలన్నింటిని షెల్ఫుల్లోంచి కింద పడేసాడు. అలమారల తలుపులన్నీ తెరిచాడు. ఓ టివి సీరియల్‌లో చూసినట్లుగా వంట గదిలోకి వెళ్ళి కత్తి తీసుకుని అతని పడక గది లోని పరుపులని, దిళ్ళని కత్తితో కోసి, షవర్ కేప్ పెట్టుకుని లోపలి దూదిని వెదజల్లాడు. దూది పింజలు అతని జుట్టులో చిక్కుకోలేదు.

అతను ఓసారి ఇల్లంతా పరిశీలించి చూసాక తృప్తి పడ్డాడు. పోలీసుల విచారణలో తనకి, తన భార్యకి పడదని తెలుస్తుంది. దాని గురించి తన పాత ఇంటి ఇరుగుపొరుగు చెప్తారు. కాని వారి దృష్టిలో జెర్రిని చంపడానికి వచ్చి తన భార్యని కూడా చంపారనే ఉంటుంది. తను వాళ్ళని అక్కడ చంపితే ఇల్లంతా వెదకడు.

మాఫియా వాళ్ళు తమ కారులో వస్తారా? ఓ టివి సీరియల్‌లో హంతకుడు సబ్ వేలో వచ్చి తను చంపిన వ్యక్తి కారులో వెళ్ళాడు. జెర్రి జేబులు వెతికాడు. కారు తాళం చెవులు కనపడలేదు. వెతికితే, టేబిల్ మీంచి కింద పడ్డ ట్రేలో నేల మీద అవి కనిపించాయి. తాళం చెవుల గుత్తిని అందుకుని తలుపు తెరచి గేరేజ్ లోకి వెళ్ళాడు. మీట నొక్కి గేరేజ్ తలుపు తెరిచి బయటకి చూసాడు. తాము నడిచి వచ్చిన పాదముద్రలు మీద మంచు కురిసి అవి మాయం అయ్యాయి. ఇందుకే అతను మంచు కురిసే రాత్రి కోసం వేచి ఉన్నది. అంతే కాక పోలీస్ కుక్కలు కూడా తన వాసనని బట్టి మంచులో అనుసరించలేవు.

అతను జెర్రి కారు ఎక్కి ఇగ్నీషన్‌లో తాళం చెవిని ఉంచి దీర్ఘంగా నిట్టూర్చి, దాన్ని ఓసారి తిప్పాడు. తక్షణం పెద్ద శబ్దంతో ఆ కారు లోని డైనమేట్ పేలిపోయి అతని శరీరం మీద ఛిన్నాభిన్నమైంది.





# 2. ఇద్దరు ప్రియులు

## విలియం ఎఫ్ నోలన్

తనకి వృత్తిరీత్యా పరిచయం అయిన ఆ లాయర్‌ని చూసి పోలీస్ ఆఫీసర్ నవ్వాడు.

"మీ కస్టడీలో ఉన్న డేనీకి లాయర్‌ని నేను. అతనితో ఓసారి మాట్లాడాలి." లాయర్ చెప్పాడు.

సరే అన్నట్లుగా తల ఊపి చెప్పాడు పోలీస్ ఆఫీసర్.

"హతురాలు ఓ అపార్ట్‌మెంట్‌లో తుపాకీ గుండుకి బలయ్యింది. ఆమె పక్కనే డేనీ తుపాకీతో నిలబడి ఉండటం ఆ అపార్ట్‌మెంట్‌లో నివశించే నలుగురు సాక్షులు చూసారు. సమాచారం అందుకోగానే నేను వెళ్ళాను. ఆ గుండుని తను కాల్చలేదని అతను చెప్పాడు."

"మీకేమనిపిస్తోంది?" అడిగాడు లాయర్.

"అతను చెప్పింది నిజమే అనిపించింది. కాని హంతకులు నిజాయితీగా నటించ గలగడం నేను అనేకసార్లు చూసాను."

లాయర్ చిన్నగా తలపంకించి చెప్పాడు.

"నా క్లైంట్‌కి శిక్ష పడేదాకా అతను నిర్దోషి అని నమ్మడం నా వృత్తి ధర్మం."

"కాని జడ్జి అతన్ని నిర్దోషి అని భావించేదాకా అతను దోషి అని భావించడం నా వృత్తి ధర్మం. మీరు అతన్ని చూడాలని అనుకుంటున్నారు కదా?" అడిగాడు పోలీస్ ఆఫీసర్.

"అవును. అది అతని హక్కు కూడా."

పోలీస్ ఆఫీసర్ అవునన్నట్లుగా తల ఊపాడు.

ప్రెసింక్ట్ (పోలీస్ స్టేషన్) లోని ఓ చిన్న గదిలో ఆ లాయర్ నిందితుడు డేనీని కలిసాడు. అతనితో కరచాలనం చేసి డేనీ వంక పరిశీలనగా చూసాడు. అతని వయసు ముప్పైఅయిదు-నలభై మధ్య ఉండచ్చని అంచనా వేసాడు. అతని మొహం ఎంతో దీనంగా ఉంది. అతని చేతి మీద తడుతూ చెప్పాడు.

"బాధపడకండి. నేను నా ప్రయత్నం చేస్తాను. ఏం జరిగిందో చెప్పండి."

"మీ దగ్గర సిగరెట్ ఉంటే ముందు ఒకటి ఇవ్వండి." డేనీ కోరాడు.

లాయర్ అందించిన సిగరెట్‌ని తీసుకుని .'థాంక్స్' చెప్పి దాన్ని వెలిగించి రెండు దమ్ములు పీల్చి చెప్పాడు.

పొగని గట్టిగా ఊపిరితిత్తుల్లోకి నిండుగా పీల్చి డేనీ చెప్పాడు.

"నేను నిరపరాధిని."

"అనే నేను నమ్ముతున్నాను. ఏం జరిగిందో చెప్పండి. హతురాలు కేథరైన్ అపార్ట్‌మెంట్‌లో ఆ సమయంలో మీరు ఎందుకు ఉండాల్సి వచ్చింది? ఆ తుపాకీ మీదేనా?"

"ఆ తుపాకీ నాది కాదు. ఒట్టు...నా భార్య నాకు విడాకులు ఇచ్చినప్పటి నించి కేథరైన్‌కి, నాకు అక్రమ సంబంధం నడుస్తోంది. నేను ఆ సమయంలో ఆమె అపార్ట్‌మెంట్‌లో ఉండటానికి కారణం అదే."

"జరిగిన సంఘటనలన్నీ యథాతథంగా, ఏదీ దాచకుండా చెప్పండి."

లాయర్ జేబులోంచి ఓ నోట్ పేడ్‌ని, పెన్సిల్‌ని తీసాడు. డేనీ చెప్పసాగాడు.

"ప్రతీ శుక్రవారం రాత్రి ఏడున్నరకి నేను కేథరైన్ అపార్ట్‌మెంట్‌కి వెళ్ళి ఆమెతో ఓ గంట-గంటన్నర గడుపుతాను. తర్వాత బయట ఏదైనా రెస్టారెంట్‌కి భోజనానికి వెళ్తాం. ఒకోసారి బ్రాడ్‌వేలో నాటకానికో లేదా సినిమాకో వెళ్తాం. మళ్ళీ ఆమెని ఇంటి దగ్గర దింపాక ఓ అరగంట గడిపి మా ఇంటికి వెళ్ళిపోతాను. ఇలా గత రెండేళ్ళుగా జరుగుతోంది."

"ఆమె మిమ్మల్ని ప్రేమిస్తోందా?"

"అలాంటిదేం లేదు. బదులుగా నేను నెలనెలా ఆమె అపార్ట్‌మెంట్ అద్దెని కడుతూంటాను."

"ఓ!"

"కాని ఈ రెండేళ్ళ సాన్నిహిత్యంలో నాకు ఆమె మీద ప్రేమ కలిగింది. అందులోంచి అసూయ కూడా పుట్టిందని ఒప్పుకుంటున్నాను."

"ఆమె ప్రవర్తనలో మీరు అనుమానించదగ్గ విషయాలు మీ దృష్టికి వచ్చాయా?" అడిగాడు లాయర్.

"దురదృష్టవశాత్తూ అవును. ఆమె తన సోదరుడితో ఆస్థి తగాదాలో కోర్టుకి వెళ్ళింది. ఆర్నెల్ల క్రితం అందులో గెలిచింది. ఆ తర్వాత ఆమెకి నేను అపార్ట్‌మెంట్ అద్దె కట్టాల్సిన అవసరం లేకపోయింది. ఐనా ఆమె ఆకర్షణలో పడ్డ నేను అద్దె కట్టడంతో పాటు వారానికి అదనంగా వంద డాలర్లు కూడా గత ఐదు నెలలుగా ఇస్తున్నాను."

డేనీ సిగరెట్‌ని బల్ల మీద ఏష్ ట్రేలో నులిమి ఆర్పేసి మళ్ళీ చెప్పసాగాడు.

"రెండు నెలల క్రితం ఆమె అపార్ట్‌మెంట్‌లో సిగరెట్ పీకలని చూసాను. అవి నేను కాల్చే బ్రాండ్‌వి కావు. ఓసారి ఆమె వాషింగ్ మెషీన్‌లో టమోటా కెచప్ అంటిన మగవాడి షర్ట్‌ని కూడా చూసాను."

"మీరామెని వాటి గురించి ప్రశ్నించారా?"

"లేదు. ఆ పని చేస్తే ఇక రావద్దనే తరహా ఆమెది. ఆమెది స్వతంత్ర మనస్థత్వం. నా భార్య కాదు కాబట్టి ఆమె మీద నైతికంగా నాకు ఎలాంటి హక్కూ లేదు."

"నిజమే. ఐనా మీలో అసూయ తలెత్తిందన్నమాట."

"అవును. నాకామె మీద కేవలం శారీరక ఆకర్షణ మాత్రమే లేదు. ఆమె లేకపోతే జీవించలేననుకునే మానసిక దౌర్బల్యం కూడా ఏర్పడింది అని ఆలస్యంగా తెలుసుకున్నాను."



"దాన్నే ప్రేమ అంటారు." లాయర్ నవ్వుతూ చెప్పాడు.

'రెండు నెలల క్రితం ఓ రాత్రి ఓ కార్లో మరో మగాడి పక్కన కేథరైన్ కూర్చుని వెళ్ళడం చూసాను." బాధగా చెప్పాడు డేని.

"తర్వాత ఆమెని అతని గురించి అడిగారా?"

"అడిగాను. నేను భ్రమపడ్డాడనని చెప్పింది."

"మీరు అతన్ని మళ్ళీ చూస్తే గుర్తు పడతారా?"

"ఊహు. చీకట్లో లీలగా చూసాను. అతన్ని గుర్తు పట్టలేను."

"సరే. ఆ తర్వాత?"

"ఈ శుక్రవారం సాయంత్రం ఏడున్నరకి ఎప్పటిలా నేను కేథరైన్ అపార్ట్‌మెంట్‌కి వెళ్ళాను. ఎనిమిదిన్నర దాకా ఇద్దరం గడిపాం. హోటల్‌కి భోజనానికి రానంది. ఆకలి లేదంది. పోనీ సీట్లు రిజర్వ్ చేసాను కాబట్టి బ్రాడ్‌వేకి వెళదాం అంటే తలనొప్పిగా ఉందని, రానని చెప్పింది. నేను అది ఆ క్షణంలో నిజం అనుకున్నాను. ఆమె దగ్గర శెలవు తీసుకుని బయటకి వచ్చి లిఫ్ట్‌లో కిందకి దిగుతూంటే కేథరైన్ చెప్పిన సమాధానాలు ఆమె అపార్ట్‌మెంట్ నించి బయటకి రావడం తప్పించుకోడానికి చెప్పినవని, ఆమె రహస్య ప్రియుడు ఆ సమయంలో ఆమె దగ్గరకి వస్తున్నాడని నాకు అనిపించింది. దాంతో నేను మళ్ళీ లిఫ్ట్‌లో పైకి వెళ్ళి ఆమె అపార్ట్‌మెంట్ తలుపు కనపడేలా మెట్ల దగ్గర మాటు వేసాను. అది నా వయసువాడు చేసే పని కాదు. టీనేజ్ కుర్రాళ్ళు చేసే ఆ పనిని నేను చేసానంటే నాలో ప్రేమ, అసూయలు ఎంత తీవ్రంగా ఉన్నాయో ఇప్పుడు నాకు అర్థమవుతోంది."

లాయర్ కూడా తన సిగరెట్‌ని ఆర్పేసి డేనీ చెప్పేది వినసాగాడు.

"అరగంట తర్వాత లిఫ్ట్‌లోంచి ఓ ఏభై ఏళ్ళతను బయటకి వచ్చాడు. సరాసరి కేథరైన్ అపార్ట్‌మెంట్ తలుపు దగ్గరకి వెళ్ళి తాళంచెవితో దాని తలుపు తెరచి లోపలికి వెళ్ళడం చూసాను." డేనీ కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

"నేను అపార్ట్‌మెంట్ డూప్లికేట్ తాళంచెవిని కోరినా కేథరైన్ దాన్ని నాకు ఇవ్వలేదు. అతను ఎంత సేపు ఉంటాడో తెలుసుకో దలచుకున్నాను. రాత్రంతా ఉండి అతను పగలో, మర్నాడు మధ్యాహ్నమో వెళ్ళినా సరే, అతను బయటకి వచ్చేదాకా నేను అక్కడ నించి కదల దలచుకోలేదు. అతను ఇరవై నిముషాల తర్వాత బయటకి వచ్చాడు. అతను లిఫ్ట్‌లో కిందకి దిగాక నేను ఓ పావుగంట సేపు ఏం చేయాలా అని ఆలోచిస్తుండి పోయాను. చివరకి కేథరైన్‌ని అతని గురించి నిలదీయ దలచుకున్నాను."

డేని చెప్పేది వింటూ ఆ లాయర్ తన నోట్ బుక్‌లో పాయింట్లు రాసుకోసాగాడు.

"డోర్ బెల్ కొట్టాను. కేథరైన్ తలుపు తెరచింది. నేనంతదాకా ఎన్నడూ చూడనంత పల్చటి నైట్ గౌన్‌ని ధరించి ఉంది. ఆమె ఒంటి మీద నించి నేనెన్నడూ వాసన చూడని

ఖరీదైన పెర్ఫ్యూమ్ వాసన వస్తోంది. నన్ను చూసి ఉలిక్కి పడి కేథరైన్ అడిగింది. 'ఈ వేళప్పుడు వచ్చావే?' నేనామెని తోసుకుంటూ లోపలకి వెళ్ళాను. ఆ కొత్త వ్యక్తి గురించి ప్రశ్నించాను. నా తీవ్ర కోపాన్ని చూసి భయపడింది. నిజం ఒప్పుకుంది. నన్ను వెంటనే వెళ్ళిపొమ్మని, ఇంకెప్పుడు రావద్దని బ్రతిమాలింది. ఐనా నేను కదల్లేదు. ఇంతలో డోర్ బెల్ మోగింది. నేను వెళ్ళి తలుపు తీస్తే అవతల అతను నిలబడి ఉన్నాడు. అతని చేతిలో హోటల్‌లో పేక్ చేసి తెచ్చిన భోజనం సంచీ ఉంది. అతను నన్ను చూసి నివ్వెరపోయాడు. వెంటనే కేథరైన్ వంక తీవ్రంగా చూస్తూ అరిచాడు. 'ఇతన్ని వదిలించుకున్నానని అబద్ధం చెప్పావన్నమాట.' నేనతని మొహం మీద నా కోపం కొద్దీ గట్టిగా పిడికిలితో బాది 'నిన్ను చంపేస్తాను' అని అరిచాను." డేనీ తల అడ్డంగా ఊపుతూ చెప్పాడు.

"అప్పుడు జరిగిందది. మా మధ్యకి అడ్డం రాబోయిన కేథరైన్‌ని అతను గుమ్మం అవతల నించే జేబులోంచి తీసిన తుపాకీతో రెండు సార్లు కాల్చాడు. చిన్నగా కేక పెట్టి ఆమె నేల కూలింది. నేను నిర్ఘాంత పోయాను. అతను ఆ తుపాకీని నా వైపు విసిరి వెళ్ళిపోయాడు. నేను అనాలోచితంగా, మూర్ఖంగా ఒంగి ఆ తుపాకీని నా చేతిలోకి తీసుకున్నాను. ఇంతలో తుపాకీ శబ్దం విన్న ఇరుగుపొరుగు వచ్చి చేతిలో తుపాకీ ఉన్న నన్ను, రక్తం మడుగులో పడి ఉన్న కేథరైన్‌ని చూసారు. పోలీసులు వచ్చి నన్ను అరెస్ట్ చేసారు. జరిగిందది. నేనామెని కాల్చలేదు."

"ఆ హంతకుడి పేరు? ఎవరు? ఎక్కడుంటాడు?"

"తెలీదు. చూస్తే మాత్రం గుర్తు పట్టగలను. పోలీసులు నేను చెప్పింది నమ్మలేదు. అతని ఉనికిని తెలుసుకునే ప్రయత్నం కూడా చేయలేదు."

"రెడ్ హేండెడ్‌గా మీరు దొరికాక ఇక వాళ్ళు శ్రమ పడరు. సరే. రేపు కోర్టులో ముందు మీకు బెయిల్ వచ్చే ప్రయత్నం చేస్తాను. వీటి మీద సంతకాలు చేయండి."

* * *

"ఆల్ రెయిజ్." కోర్టు లోని సెక్యూరిటీ గార్డు అరిచాడు.

డేనీ, లాయర్‌తో సహా అంతా లేచి నిలబడ్డారు. కొద్ది క్షణాల్లో జడ్జి వచ్చి తన స్థానంలో కూర్చున్నాడు. డేనీ ఆ జడ్జిని చూడగానే లాయర్ వంక చూస్తూ అరిచాడు.

"ఇతనే ఆ రోజు కేథరైన్ ఇంటికి వచ్చింది. ఇతనే హంతకుడు."

గడ్డానికి పట్టీ ధరించిన ఆ జడ్జి డేనీ బెయిల్ పిటిషన్‌ని తిరస్కరిస్తూ చెప్పాడు.

"అమాయకులని చంపే ఇలాంటి నిందితుడు సమాజంలో స్వేచ్ఛగా తిరగడం మంచిది కాదు. నేరం ఋజువైతే మరణశిక్ష పడాల్సిన ఇతనికి నేను బెయిల్‌ని ఇవ్వలేను."






# 3. రెండు హత్యలు

## ఫ్లిప్ జారెట్

సేమీకి తన బేంక్ వైస్ ప్రెసిడెంట్ వ్యక్తిగత కంప్యూటర్ పాస్‌వర్డ్ తెలిసి ఉండకపోతే, ఆ రాత్రి బేంకులోనే పని చేస్తూండేవాడు. అతను షికాగోలోని ఓ బేంకులో శని ఆదివారాలు మధ్యాహ్నం పన్నెండు నించి రాత్రి పన్నెండు దాకా పని చేస్తూంటాడు. రిపోర్ట్‌లని ప్రింటర్లలో ప్రింట్ చేసి, వాటిని అనేక బ్రాంచీలకి పోస్ట్ చేయడానికి వీలుగా కవర్లలో ఉంచి అతికించడం సేమీ పని.

పదిహేను రోజుల క్రితం ఓ రిపోర్ట్ మీద అతను తాగే డ్రింక్ ఒలికింది. దాన్ని శుభ్రం చేస్తూంటే ఆ పాస్‌వర్డ్ కనిపించింది. వైస్ ప్రెసిడెంట్ చాలా నిర్లక్ష్యంగా తన పాస్‌వర్డ్‌ని ఆ రిపోర్ట్‌లో రాసాడు.

సేమీ ఆ తర్వాత తన పనంతా ఎంతో తేలికగా చేయగలిగాడు. ఆ పాస్‌వర్డ్‌ని ఉపయోగించి ఇతరుల అకౌంట్లలోని బేలన్స్‌ని తన అకౌంట్‌లో జమ అయ్యేలా చేసాడు. ప్రతీ రాత్రి ఓ గంటన్నర పని చేస్తే చాలు. అనేకమంది అకౌంట్ల నించి తన అక్కౌంట్‌కి బదిలీనో లేదా తన అడ్రస్‌కి బేంక్ నించి చెక్కో రాసాగింది. రెండు వారాల్లోగా సేమీ లక్షాధికారి అయ్యాడు.

ఈ ఆటని మరో రెండు వారాలు కొనసాగించి ఆ తర్వాత మధ్యధరా సముద్రంలోని ఏదో ఓ దీవికి వెళ్ళి కొన్నేళ్ళు అక్కడ గడిపి, పోలీసులు తన కోసం వెదకడం ఆగిపోయాక తిరిగి వద్దామని అనుకున్నాడు. ఇంతలో మేటిజ్ అనే అకౌంట్ హోల్డర్ తన అకౌంట్‌కి రావాల్సిన అద్దె ఆ నెల తన అకౌంట్‌లో పడలేదని, అద్దెని వారు కట్టారని ఫిర్యాదు చేసాడు. ఎలక్ట్రానిక్ ట్రాన్స్‌ఫర్‌లో లోపం ఉండదు. దాంతో ఓ రాత్రంతా ఇద్దరు ఆడిటర్స్ తనిఖీలు చేసి జరిగేది చూచాయగా గ్రహించారు.

ఆ రాత్రి వైస్ ప్రెసిడెంట్ సేమీ దగ్గరకి వచ్చాడు. కంప్యూటర్ నించి ప్రింట్ అవుట్స్ తీసే సామాన్య పార్ట్ టైం ఉద్యోగి దగ్గర పిస్తోలు ఉండచ్చని వైస్ ప్రెసిడెంట్ భావిస్తే పోలీసులతో వచ్చి ఉండేవాడు.

ఆలోచనల్లో ఉన్న సేమీ కారుకి ఓ హై వే పోలీస్ పెట్రోల్ కారు ఎదురొచ్చింది. డిక్కీలో శవంతో పోలీసులకి పట్టుబడటం మూర్ఖత్వం కాబట్టి సేమీ పరిమితిని మించిన వేగంతో కారుని నడపడం లేదు. దాంతో వారు అతని కారుని ఆపలేదు.

సేమీ వెస్ట్ వర్జీనియా లోని తన ఇంటికి వెళ్తున్నాడు. ఏడాదిన్నరగా షికాగో లాంటి మెట్రోపాలిటిన్ నగరంలో గడిపాక, చుట్టూ ఖాళీ అయిన గనులు, పర్వతాలు, లోయలు గల చిన్న గ్రామంలోని తన ఇంట్లో తనకి ఏం తోస్తుంది? కాలక్షేపానికి అక్కడ ఏం ఉండదు.

ఐతే తను దాక్కోడానికి అదే భద్రమైన చోటని సేమీకి తెలుసు. తన స్వగ్రామం గురించి ఎక్కడా రికార్డుల్లో లేదు. ఇలాంటిదేదో చేసే ఉద్దేశంతోనే షికాగోకి చేరుకున్న సేమీ అన్నిచోట్లా తన స్వగ్రామంగా కాలిఫోర్నియాలోని సేక్రిమెంటోని పేర్కొన్నాడు.

వైస్ ప్రెసిడెంట్ మాయమయ్యాడని తెలీగానే పోలీసులు తన కోసం వెదుకుతారు. కాబట్టి అంతర్జాతీయ విమాన ప్రయాణం మంచిది కాదు. అంటే మధ్యధరా సముద్రంలోని దీవులకి తను ఇప్పుడు వెళ్ళలేదు. తన తల్లితో తన ఇంట్లో ఎటూ గడపలేదు. అక్కడ పని పూర్తి చేసుకొని పోలీసులు తను వెళ్తాడని ఊహించని ఊటా లేదా నెబ్రెస్కా రాష్ట్రాలకి వెళ్ళాలి. వాళ్ళు తన కోసం ఫ్లోరిడా, కేలిఫోర్నియా లాంటి రాష్ట్రాలలోని లగ్జరీ స్పాట్‌లలో వెదుకుతారు.

ప్రతీ సోమవారం తను అన్యాయంగా సంపాదించిన సొమ్ముని తన బేంక్ అకౌంట్ లోంచి డ్రా చేయడం మంచిదైంది. ఆ సొమ్మంతా కారు డిక్కీలోని ఓ సంచీలో ఆ వైస్ ప్రెసిడెంట్ శవం పక్కనే ఉంది. ఇంక తన బేంక్ అక్కౌంట్‌లో కేవలం ఆ రాత్రి బదిలీ చేసిన సొమ్ము మాత్రమే ఉంది. ఏటియంలోంచి ఐదు వందల డాలర్లు మాత్రమే తను ఐదు చోట్ల షికాగోలో డ్రా చేయగలిగాడు. ఇరవై నాలుగు గంటలలోగా డ్రా చేసే పరిమితి అది.

* * *

దూరంగా కొండలు కనిపించాయి. మర్నాడు ఉదయం దాకా వైస్ ప్రెసిడెంట్ మాయం అయ్యాడని ఎవరికీ తెలికపోవచ్చు. అది తెలిసేసరికి తను అతని శవాన్ని ఇంకెవరూ తెలుసుకోలేని చోట దాస్తాడు. నిజానికి ఇంత దూరం రావడానికి గల కారణాల్లో అదొకటి.

క్రమేపి కారు కొండ పైకి ఎక్కసాగింది. సేమీ మలుపుల దగ్గర జాగ్రత్తగా ఉండసాగాడు. అతను ఆ మలుపుల్లో లెక్కలేనన్ని సార్లు కారుని డ్రైవ్ చేసాడు. కొత్త వాళ్ళయితే భయపడచ్చు. సేమీ తన కారుని షార్ప్‌గా ఉన్న మలుపుల్లో లాఘవంగా తిప్పుతూ పోనిస్తున్నాడు. 'ఈ రోడ్డు ఎక్కాక ఇంక పోలీసుల భయం ఉండదు' అనుకున్నాడు. తన గ్రామానికి దారి తీసే ఈ చిన్న రోడ్డు మీద పెట్రోలింగ్ ఉండదు. కేవలం హై వే మీదే పెట్రోలింగ్ ఉంటుంది. ఈ రోడ్డు మీంచి కారు లోయలో పడటం గురించి సేమీ ఎన్నోసార్లు విన్నాడు. ఆ కారు డ్రైవర్లంతా ఆ రోడ్డు మీదకి మొదటిసారి వచ్చినవారే. తన గ్రామానికి చెందిన ఇద్దరు మాత్రమే ఆ రోడ్డు మీద మరణించారు. వారు తాగి ఉన్నారు. ఒకరు తన తండ్రి. మరొకరు ఓ టీనేజ్ యువకుడు. నిజానికి వాళ్ళని చంపింది ఆల్కహాల్ తప్ప ఆ రోడ్డు కాదు.

తన రాష్ట్రం మోటో 'ఆల్మోస్ట్ హెవెన్.' తను ఆల్మోస్ట్ హెల్‌కి-అంటే తన ఇంటికి వచ్చేసినట్లే. ఇంకో పావుగంటే. మర్నాడు తన గ్రామం నించి ఎక్కడికి వెళ్ళాలి? ఊటానా? నెబ్రెస్కానా? చెరుకు, మొక్కజొన్నల పంట పొలాలు సేమీకి వెన్నెల్లో కొండ మీంచి కింద కనపడ్డాయి. ఆ రెండూ పండే పొలాలు పిల్లల్ని ఆకర్షిస్తాయి. కారణం గోధుమ, ఇతర



ధాన్యాల్లా కావవి. వాటిని కోసుకుని తక్షణం తినచ్చు. చిన్నతనం గుర్తుకి రావడంతో మర్నాడు ఏదైనా పొలానికి వెళ్ళాలనుకున్నాడు. తన ఊరిలోని సగం మంది టీనేజర్స్ తనలా దొంగలు అవడానికి కారణం బహుశా చిన్నతనం నించే పొలాల్లో దొంగతనం చేయడానికి అలవాటు పడటం కావచ్చు. తన గ్రామానికి చెందిన ఎంతోమంది యువకులు జైళ్ళల్లో గడుపుతున్నారు.

రోడ్డుకి అటు ఇటు గల మట్టి రోడ్ల లోకి వెళ్తే, కొద్ది దూరంలో ఖాళీ గనులు కనిపిస్తాయి. షికాగోలోనే తను పార, గునపాలు కొని ఉండాల్సింది. రోడ్డు కిందకి దిగసాగింది. సేమీ అప్రమత్తంగా కాలుని బ్రేక్‌కి ఆనించి డ్రైవ్ చేయసాగాడు. మరో అరగంటలో కారుకి అటు, ఇటు ఇళ్ళు కనిపించాయి. చిట్టచివరికి తను ఎక్కడ్నించి షికాగోకి బలుదేరాడో అక్కడకి తిరిగి వచ్చాడు-ధనవంతుడిగా.

సేమీ కారుని ఇంటి ముందు డ్రైవ్ వేలో ఆపి దిగి వెళ్ళి తలుపు తోసాడు. లోపల బోల్ట్ పెట్టి ఉంది. అర్ధరాత్రి ఒకటిన్నరకి ఎందుకు తీసి ఉంటుంది? డోర్ బెల్ నొక్కాడు. కళ్ళు నులుముకుంటూ తలుపు తీసిన సేమీ తల్లి అతన్ని చూసి ఆశ్చర్యంగా అడిగింది.

"ఫోన్ అయినా చేయకుండా వచ్చావే?"

"అనుకోకుండా రావాల్సి వచ్చింది. ఆకలిగా ఉంది. తినడానికి ఏమైనా ఉందా?"

"ఓ అరగంటలో డిన్నర్ సిద్ధం చేస్తాను."

తల్లి వంటగదిలోకి వెళ్ళగానే ఇంటి బేస్‌మెంట్ లోని పార, పలుగులని రహస్యంగా బయటకి తెచ్చి, డిక్కీ తెరచి శవం పక్కన పెట్టాడు. తల్లి కంఠం విని, డిక్కీ తలుపు మూసి ఇంటి గుమ్మం దాకా వచ్చాక డబ్బు సంచీని లోపలకి తేవడం మరిచానని గుర్తుకు వచ్చింది.

"నీ ఉద్యోగం పోయిందా?" అడిగింది సేమి తల్లి.

"పోలేదు. నాకు ఇంకో ఉద్యోగం వచ్చింది. ఎక్కువ జీతం. నిన్ను చూసి చాలా రోజులైంది కాబట్టి అప్పటికప్పుడు అనుకుని బయలుదేరాను. ఎల్లుండి మళ్ళీ వెళ్ళిపోవాలి."

"మంచిది."

ఏభై వేల డాలర్లు తీసుకుని మిగిలింది తను వెళ్ళేలోగా తల్లికి తెలీకుండా బేస్‌మెంట్‌లో ఎక్కడైనా దాచాలి. మర్నాడు ఉదయం ఆవిడ చర్చికి వెళ్ళినప్పుడు ఆ పని చేయాలి అనుకున్నాడు. స్నానం చేస్తూ ఈల పాట పాడాడు.

"డిన్నర్ టేబిల్ మీద సిద్ధం. నేను పడుకుంటాను. రేపు మాట్లాడుదాం." తల్లి చెప్పింది.

"సరే."

అరగంట తర్వాత బయటకి వచ్చి తలుపు మూసాడు. తల్లికి కారు స్టార్టయిన శబ్దం వినపడకూడదని దాన్ని స్టార్ట్ చేయకుండా కొంత దూరం తోసుకెళ్ళాడు. తర్వాత దాన్ని స్టార్ట్ చేసి గనుల వైపు పోనించాడు. కారుని రోడ్డు మీంచి ఓ మట్టి రోడ్డు మీదకి తిప్పాడు. ఓ గని ముందు కారుని ఆపి దిగి డిక్కీ తెరిచాడు.

వైస్ ప్రెసిడెంట్ శరీరం ఇంకా ఎక్స్‌పైరీ డేట్‌కి దగ్గరగా రాలేదనుకున్నాడు. వాసన మొదలవలేదు.

"హలో మిత్రమా?"

ఉలిక్కి పడి వెనక్కి తిరిగి చూసాడు సేమీ.

"ఏం చేస్తున్నావ్?" తన పక్కింటి మిత్రుడు గోల్డ్‌బెర్గ్!

"ఎవరి శవం అది?" గోల్డ్‌బెర్గ్ పిస్తోలుని గురి పెట్టి అడిగాడు.

"నువ్వేం చేస్తున్నావ్ ఇక్కడ?"

"నీ కారు శబ్దానికి మెలకువ వచ్చింది. నువ్వు పార, గునపం డిక్కీలో పెట్టడం చూసి ఏదో విశేషం ఉందనుకున్నాను. నువ్వేం చేస్తున్నావో తెలుసుకోవాలనే ఆసక్తితో నీ కారు వెనక సీట్లో దాక్కున్నాను. నేను ఊహించినట్లుగానే నువ్వు కొద్దిసేపట్లో వచ్చి కారు స్టార్ట్ చేసావు. అది ఏదైనా సరే. నేరమే అయి ఉంటుందని నాకు తెలుసు."

"షికాగోలో ఒకర్ని చంపాను. ఆ శవం పూడ్చడానికి కాస్త నాకు సాయం చేయి."

"ఆ డబ్బు సంచీ గురించి చెప్పవే?" నవ్వుతూ అడిగాడు గోల్డ్‌బెర్గ్.

"చూసావా?" సేమీ మొహం వెంటనే పాలిపోయింది.

"నువ్వు పని చేసే బేంకులో కొట్టేసావా?"

"అవును."

"నా కోసం ఆ సాహసం చేసినందుకు థాంక్స్."

మరుక్షణం గోల్డ్‌బెర్గ్ చేతిలోని పిస్తోలు రెండు సార్లు పేలింది. రెండు గుళ్ళు సేమీ ఛాతిలోకి దిగాయి. అచేతనంగా నేల మీదపడ్డ అతని తలకి గురి పెట్టి మూడోసారి కాల్చాడు గోల్డ్‌బెర్గ్. సేమీ మరణించడానికి అది ఇన్‌సూరెన్స్ బుల్లెట్. తర్వాత పార, పలుగు అందుకున్నాడు. రెండు శవాలని ఓ ఖాళీ గని అంతర్భాగంలో పూడ్చాక సేమీ కారుని ఓ గని అంతర్భాగంలోకి డ్రైవ్ చేసి తీసుకెళ్ళి దాచాడు. ఆ కారు డిక్కీ లోంచి డబ్బు సంచీని తీసి తెరచి తృప్తిగా చూసి దాన్ని చేత్తో పట్టుకుని బయటకి వచ్చి తన ఇంటికి కాలినడకన బయలుదేరాడు.

మర్నాడు ఉదయం గోల్డ్‌బెర్గ్ సేమీ తల్లికి అబద్ధం చెప్పాడు.

"మెలకువ వచ్చి నిన్న రాత్రి నేను సిగరెట్ తాగడానికి బయటకి వస్తే సేమీ హడావిడిగా కనిపించాడు. అర్జెంట్ ఫోన్ వచ్చిందని, తను షికాగోకి వెళ్ళిపోతున్నానని మీకు చెప్పమని సేమీ నాకు చెప్పాడు."





# 4. శిక్ష

## అల్ నస్‌బామ్

మిసెస్ హార్ట్‌మేన్‌ని ఆ ఇద్దరు దొంగలు ఎన్నుకోడానికి గల మొదటి కారణం ఆవిడ వయసు. రెండో కారణం బయటకి స్పష్టంగా కనబడే ఆవిడ శారీరక బలహీనత. మూడో కారణం ఆవిడ కేషియర్ కౌంటర్‌లోంచి డబ్బు తీసుకుని బయటకి రావడం వారిలో ఒకరు గమనించడం. ఐతే బేంక్‌లోకి వెళ్ళి ఆవిడ ఎంత డ్రా చేస్తోందో చూస్తే మాత్రం బేంకు ఆవరణలో సదా పని చేసే సర్‌వైలెన్స్ కెమేరాలకి తాము చిక్కచ్చనే భయంతో ఎప్పటిలా లోపలకి వెళ్ళకుండా కిటికీలోంచే చూసారు. అందువల్ల కొన్ని సమయాల్లో వారి శ్రమకి తగ్గ ఫలితం లభించకుండా హేండ్ బేగ్‌లో తక్కువ డబ్బు ఉండటం కూడా వారికి అనుభవమే.

చెక్ డిపాజిట్ చేయడానికో లేదా నగదు విత్‌డ్రా చేయని ఇంకే పని మీదో ఆవిడ బేంక్‌కి వెళ్ళలేదు. నగదుని తీసుకోడానికే ఆవిడ బేంక్‌లోకి వెళ్ళిందని స్పష్టంగా గ్రహించాకే వారు ఆవిడని ఎన్నుకున్నారు. బేంకులోంచి బయటకి వచ్చాక ఆవిడ భుజం నించి వేలాడే పెద్ద హేండ్ బేగ్ వాళ్ళని ఆకర్షించింది. ఆవిడ ఎంత డబ్బుని విత్‌డ్రా చేసిందో వారికి తెలీకపోయినా, దాన్ని మిసెస్ హార్ట్‌మేన్ భద్రంగా పట్టుకున్న తీరుని బట్టి అందులో చాలా నగదు ఉందని వారు ఊహించారు. ఆ రోజు తాము దొంగతనం చేయడానికి ఆ ఇద్దరూ కాలినడకన వెళ్ళే ఆవిడని ఆ విధంగా ఎన్నుకున్నారు. తర్వాత ఆవిడని నిశ్శబ్దంగా అనుసరించారు.

ఆవిడ కాలినడక దూరంలో ఉన్న తన ఇంటికి వెళ్తూ మెయిన్ రోడ్డు నించి నిర్మానుష్యంగా ఉన్న ఓ సందులోకి తిరిగింది. వెంటనే వారిద్దరిలో ఒకరు ఆవిడని కదలకుండా పట్టుకుంటే మరొకరు ఆవిడ భుజాన వేలాడే సంచీని లాక్కుని వెనక్కి పరిగెత్తారు.

మిసెస్ హార్ట్‌మేన్ సహాయం కోసం అరవలేదు. తన బేగ్‌ని లాక్కుని పారిపోయే అతని వెంట పడలేదు. తనని పట్టుకున్నతని చేతిని కరిచింది. తర్వాత తన హై హీల్స్ కాళ్ళతో అతన్ని తంతూ కాలర్ పట్టుకుని వెళ్ళకుండా ఆపే ప్రయత్నం చేసింది. అతను దొరికితే తన బేగ్ దొరికినట్లే అనుకుంది. ఐతే ఆవిడ ఆ యువకుడి సమ ఉజ్జీ కాదు. అతను ఆవిడని బలంగా దూరంగా తోసి విడిపించుకుని పారిపోయాడు. వెళ్ళి పేవ్‌మెంట్ మీద పడ్డ ఆవిడ బాధగా మూలిగింది.

ఆ దొంగతనాన్ని ఎవరూ చూడలేదు. పారిపోతూ ఆ సందు మలుపు తిరిగే రెండో దొంగని చూసిందామె. అతను ఆ రోడ్డు చివర ఆగి అటు, ఇటు చూసాడు. తన తోడు దొంగ కనపడకపోవడంతో ఎటు వెళ్ళాలా అని కొద్దిసేపు ఆలోచించి చివరికి కుడి వైపు పరిగెత్తాడు.

మిసెస్ హార్ట్‌మేన్ మరో పావుగంట దాకా ఆ సందులో అక్కడే పడి ఉంది. తన పాదం పై భాగంలో ఎముక విరిగిందని ఆవిడకి అర్థమయ్యాక లేచి ఆ పాదం మీద బరువుని వేసి అది ఇంకాస్త విరిగేలా చేయదలచుకోలేదు. సహాయం కోసం ఎదురు చూడసాగింది. దాదాపు పావుగంట సేపు ఆవిడ ఆ దొంగల గురించి ఆలోచిస్తూనే ఉంది. ముసలిదైన తన మీద వారు దాడి చేయడం ఆవిడకి చాలా అధర్మంగా తోచింది. అందుకు వారికి తగ్గ శిక్ష తప్పక పడేలా చేయమని దేవుడ్ని ప్రార్థించింది కూడా. ఆ సందులోకి తిరిగిన ఓ కారు డ్రైవర్ దృష్టిలో ఆవిడ పడటంతో అతను వెంటనే కారుని ఆపి గబ గబ ఆవిడ దగ్గరకి వచ్చాడు. ఆవిడ జరిగింది చెప్పి కోరింది.

"పోలీసులకి ఫోన్ చెయ్యి బాబు. అంబులెన్స్‌లో హాస్పిటల్‌కి వెళ్తాను."

అతను తన సెల్ ఫోన్ నించి 911కి ఫోన్ చేసి జరిగింది చెప్పి ఆ సందు పేరు, ఇతర వివరాలు చెప్పాడు.

"వాళ్ళు వచ్చేదాకా నేను మీ దగ్గరే సహాయంగా ఉంటాను." చెప్పాడు.

అతని ఫోన్ కాల్ వెళ్ళిన ఆరో నిమిషానికల్లా పోలీస్ కార్, అంబులెన్స్, ఫైర్ ఇంజన్లు వచ్చాయి. మిసెస్ హార్ట్‌మేన్ సార్జెంట్‌కి జరిగింది చెప్పింది. పేరా మెడిక్స్ వారు ఆవిడ పాదాన్ని పరిశీలించారు. అప్పటికే అది వాచడం గమనించి, స్ట్రెచర్ మీద ఎక్కించి ఆవిడని అంబులెన్స్‌లోకి తీసుకెళ్ళారు.

"బేంక్‌లోంచి డబ్బు డ్రా చేసుకుని ఇంటికి వెళ్తూండగా ఇద్దరు దొంగలు ఇక్కడ నన్ను అటాక్ చేసారు." అంబులెన్స్ బయలు దేరబోయే ముందు సార్జెంట్ కెండ్రిస్ అడిగిన ప్రశ్నకి ఆవిడ జవాబు చెప్పింది.

"వాళ్ళని చూసారా?"

"నన్ను పట్టుకుని ఆపిన అతన్ని చూసాను. పాతికేళ్ళు ఉంటాయి. రెండోవాడిని చూడలేదు. వాడే నా బేగ్ లాక్కుని పారిపోయింది."

"బేగ్‌లో ఎంతుంది?"

"ముప్పై మూడు వేల ముప్పై రెండు డాలర్లు."

హాస్పిటల్‌కి కొందరు పత్రికా విలేకరులు వచ్చి ఆవిడని ప్రశ్నించారు. జరిగింది యధాతథంగా చెప్పింది.

"మీరు అంత పెద్ద మొత్తం బేంకులోంచి ఎందుకు తీసుకున్నారు?" ఓ విలేకరి అడిగాడు.

ఆవిడ కొద్దిగా సందేహించాక చెప్పింది.

"నేను చెప్పేది మీకు ఆశ్చర్యంగా ఉండచ్చు. కాని ఏడాదికి ఓసారి నేను నా బేంక్ అకౌంట్‌లో మినిమం బేలన్స్ ఉంచి, మిగిలిందంతా ఇంటికి పట్టుకెళ్తాను. ఆ డబ్బంతా



నేను ఇరవై ఏడేళ్ళ పాటు ఉద్యోగం చేసి కూడ బెట్టిన కష్టార్జితం. ఆ డబ్బుని కొద్ది రోజుల పాటు చూసి, తాకి ఆనందిస్తాను. అది నాకు ఎంతో తృప్తిని ఇస్తుంది. తర్వాత మళ్ళీ ఆ మొత్తాన్ని బేంకుకి తీసుకెళ్ళి డిపాజిట్ చేస్తాను."

"ఆ దొంగలు ఎలా ఉన్నారు?"

"నేను గతంలో ఎన్నడూ వారిని చూడలేదు. ఇంకోసారి చూస్తే నన్ను పట్టుకున్న వాడ్ని మాత్రం గుర్తుపట్టగలననే అనుకుంటున్నాను."

ఎక్స్‌రేలో కాలు కింది భాగం విరిగినట్లు తేలింది. వెంటనే ఆవిడకి చికిత్సని ఆరంభించారు. మర్నాడు సార్జెంట్ కెండ్రిస్ కాలికి సిమెంట్ పట్టీతో పడుకున్న మిసెస్ హార్ట్‌మేన్ దగ్గరికి లేప్ టాప్‌తో వచ్చి, కొందరు దొంగల ఫొటోలని ఆవిడకి చూపించాడు. వారిలో ఎవరూ ఆవిడ మీద దాడి చేసినవారు కారు.

"నాకు గుర్తున్నదల్లా నన్ను పట్టుకున్న వాడికి జీన్స్ పేంట్, టీ షర్ట్‌లు ఉన్నాయి. బంగారు స్ట్రాప్ గల రిస్ట్ వాచి ఉంది. అది ఎవరి నించో కొట్టేసిందే అయి ఉంటుంది. టీ షర్ట్ మీద 'డోంట్ హార్మ్ అదర్స్ - కన్‌ఫ్యూషియస్' అన్న వాక్యం, బుద్ధుడి బొమ్మ చూసాను."

పోలీసులు ఆవిడని మరి కొన్ని ప్రశ్నలు వేసి వెళ్ళిపోయారు. ఆవిడ నర్స్‌ని ఆ రోజు దినపత్రికని అడిగి తీసుకుని చదివింది. అందులో ఆవిడ ఫొటో వేసి ఆ దొంగతనం గురించి రాసారు.

ఆ మధ్యాహ్నం పోలీస్ సార్జెంట్ కెండ్రిస్ మళ్ళీ ఆవిడ దగ్గరకి కోపంగా వచ్చాడు. మిసెస్ హార్ట్‌మేన్ నిద్రపోతోంది. ఆవిడ లేచే దాకా వేచి ఉండమని, లేపకూడదని డాక్టర్ చెప్పడంతో అతను వెళ్ళిపోయాడు. సాయంత్రం అతను వస్తే ఆవిడ మేలుకునే ఉంది.

"ఎందుకు నాతో అబద్ధం చెప్పారు?" కెండ్రిస్ కోపంగా అడిగాడు.

"ఏం అబద్ధం చెప్పాను?"

"పోయిన డబ్బు గురించి. ఎంత పోయిందని చెప్పారు?"

"ముప్పై మూడు వేల ముప్పై రెండు డాలర్లు."

"అంత డబ్బు మీ బేగ్‌లోకి ఎలా వచ్చింది?"

"అప్పుడే బేంకులోంచి డ్రా చేసి తెచ్చానని నిన్ననే చెప్పా కదా?"

"అది అబద్ధం. నేను మీ బేంక్‌కి వెళ్ళి మీరు ఎంత డ్రా చేసారో కనుక్కున్నాను. ముప్పై రెండు డాలర్లు మాత్రమే నిన్న మీ అకౌంట్‌లోంచి డ్రా చేయబడింది."

మిసెస్ హార్ట్‌మేన్ తప్పు చేసిన దానిలా కెండ్రిస్ వంక చూసింది.

"ముప్పై రెండు డాలర్లంటే మీరు దొంగని పట్టుకోడానికి ప్రయత్నించరని ముప్పై మూడు వేల డాలర్లని పెంచి చెప్పాను. ముప్పై రెండు డాలర్లయితే పత్రికా విలేకరులు కూడా వచ్చేవారు కాదు. మీరు ఆ కేసుని పట్టించుకునేవారు కారు."

"ఐతే మాత్రం? అలా అబద్ధం చెప్పడం తప్పు." అతను కోపంగా వెళ్ళిపోయాడు.

మిసెస్ హార్ట్‌మెన్ సన్నగా నవ్వింది. ఆ రాత్రి రకరకాల ఆలోచనలతో ఉత్కంఠగా గడిపింది.

* * *

ఉదయం నర్స్‌ని పిలిచి అడిగింది.

"ఈ రోజు దినపత్రిక ఇస్తావా? నా ఊహ నిజమైతే అందులో ఓ ముఖ్యమైన వార్త వచ్చి ఉండాలి."

నర్స్ ఇచ్చిన దినపత్రికలోని హెడ్ లైన్స్ చదవలేదావిడ. సరాసరి నేరాలని ప్రచురించే పేజీలోకి వెళ్ళిపోయింది. ఒకోటి చదువుతూ ఓ వార్త దగ్గర ఆగిపోయింది.

'1895 సెవెన్త్ అవెన్యూలోని ఓ అపార్ట్‌మెంట్‌లో జరిగిన గొడవ గురించి ఇరుగు పొరుగు ఫిర్యాదు చేయగా పరిశోధించడానికి వెళ్ళిన పోలీసులు విలియం వైట్, జెస్సె బోల్ట్ అనే ఇద్దరు అందులో చచ్చిపడి ఉండటం చూసారు. కత్తులతో ఒకరినొకరు పొడుచుకుని చంపుకున్నట్లుగా పోలీస్ సార్జెంట్ కెండ్రిస్ నిర్ధారించాడు. ఇరుగు పొరుగు ప్రకారం ఉదయం నించి ఆ ఇద్దరు యువకులు ఒకరితో మరొకరు వాగ్వివాదం చేస్తూనే ఉన్నారు. వైట్ తనని మోసం చేసాడని జెస్సె ఆరోపిస్తే, తను అలాంటి మోసం చేయలేదని వైట్ కొట్టి పారేయ సాగాడు. వారి మధ్య ఆ వాగ్వివాదం చిలికి చిలికి గాలి వానగా మారి, చివరికి అది కత్తుల పోరాటానికి దిగిందని భావిస్తున్నారు. వారిద్దరూ గతంలో దొంగతనం నేరాల మీద అనేక సార్లు జైలుకి వెళ్ళిన రికార్డు ఉంది. వైట్ తనని ముప్పై మూడు వేల డాలర్ల విషయంలో మోసం చేసాడని ఆరోపించిన జెస్సె ఆ వివాదానికి ఆద్యుడయ్యాడని తెలుస్తోంది.'

మిసెస్ హార్ట్‌మేన్ దాన్ని మళ్ళీ చదివింది. ఇంకోసారి చదివింది. మరోసారి చదివింది. నాలుగోసారి కూడా చదివినా ఆవిడకి తృప్తి కలగక మరోసారి చదవసాగింది. చదువుతూంటే ఆవిడ మొహంలో చిరునవ్వు తొణికిసలాడుతూనే ఉంది.





# 5. అన్వేషణ

## థోమ్ సి కాలెబర్

బస్‌లోంచి బయటకి చూసి జూలై నెల్లో ఫ్లోరిడా రాష్ట్ర వాతావరణం చాలా ఆహ్లాదకరంగా ఉంటుంది అనుకున్నాడు. అరగంట తర్వాత ఆగిన బస్ లోంచి టోనీ గ్రాబిల్ బయటకి దిగాడు. చాలా గంటల ప్రయాణం వల్ల అతని మోకాళ్ళు పట్టుకున్నట్లు అనిపించడంతో కొద్దిసేపు బస్కీలు తీసి చేతులని విదిలించాడు. లగేజ్ కంపార్ట్‌మెంట్ లోంచి డఫెల్ బేగ్‌ని తీసుకుని బస్ స్టేషన్‌లో సమీపం లోని మోటెల్ గురించి విచారించాడు.

"జూలై నెల్లో అన్ని మోటెల్స్ వేసవి రద్దీతో నిండుగా ఉంటాయి. ఐదు నిముషాల నడక దూరంలో మీకు చాలా మోటెల్స్ కనిపిస్తాయి. ప్రయత్నించండి." రిసెప్షనిస్ట్ చెప్పింది.

* * *

శుభ్రంగా ఉన్న ఆ గదిలో టివి లేదు. టోనీ గ్రాబిల్ ఎక్కడ నించి వచ్చాడో ఆ భవంతిలోని గదుల్లో కూడా టివిలు ఉండవు కాబట్టి టోనీకి తేడా తెలీలేదు. అరగంట పైనే స్నానం చేసాడు. చాలా కాలం తర్వాత అతను ఇంతసేపు స్నానం చేసే స్వేచ్ఛని అనుభవించాడు. ఆ వేడి నీటి స్నానం అతన్ని సేద తీర్చింది.

'తను స్వతంత్రుడు' అన్న భావన అతనిలో ఇంకా పూర్తిగా కలగలేదు. 'ఇది చెయ్యి, అది చెయ్యద్దు' అని ఆజ్ఞలు జారీ చేసే వారెవరూ ఇప్పుడు అతనికి లేరు. తనకి ఏం చెయ్యాలనిపిస్తే అది చేయచ్చు. అతని మనసులో ఒకటే లక్ష్యం ఉంది.

గంట తర్వాత టోనీ మెయిన్ స్ట్రీట్‌లోకి వచ్చాడు. అది అతనికి పరిచయం అయిన వీధిలా తోచలేదు. అతనిలో ఆలోచనలు మొదలయ్యాయి. తను ఈ ఊరు నించి వెళ్ళిపోయి చాలా కాలం అయింది. నగరాలు మారుతూంటాయి. మనుషులు కూడా మారుతుంటారు. నగరాన్ని తప్పు పట్టలేం కాని మనుషుల విషయం వేరు. నిజాయితీ గల మనుషులు మారరు. స్వలాభపరులు మాత్రం మారుతుంటారు. మిల్లీ మారిందా?

ఇతర భార్యలు తమ భర్తల కోసం ఇంటి దగ్గర వేచి ఉంటారు. అలా వేచి ఉంటేనే భర్తలకి ఇళ్ళకి వెళ్ళాలని ఉంటుంది. మిల్లీ తన కోసం దేనికీ వేచి ఉండేది కాదు. భోజనానికి కాని, మరి దేనికైనా. మిల్లీ ఎవర్ని పెళ్ళి చేసుకున్నా సరే, డబ్బు కోసం మాత్రమే చేసుకుంటుందని టోనీ నమ్మకం. మిల్లీ ఉత్తరాలు రావడం ఆగిపోతే తమ మధ్య ఏదో చెడిందని టోనీకి అర్థమైంది. ఆమె లాయర్ నించి ఉత్తరం వచ్చిన మూడు నెలలకి విడాకుల ఆర్డర్ మీద జడ్జి చేసిన సంతకంలోని ఇంకు ఇంకా ఆరకముందే మిల్లీ మళ్ళీ పెళ్ళి చేసుకుంది.

మొదట్లో మిల్లీకి డబ్బు పిచ్చి అని టోనీకి తెలీదు. కాని క్రమేపి బంగారు ఆభరణాలు, ఖరీదైన దుస్తులు, బద్ధకంగా గడిపే జీవితం మీద ఆమెకి ఎంతటి ఆసక్తో అర్థమైంది.

పెట్రోల్ బంక్ నించి తనకి వచ్చే ఆదాయం ఆమె కోరికలు తీర్చేందుకు సరిపడేంత లేదని ఆమె గ్రహించాక తాము దూరం అవడం ఆరంభం అయింది. ఈలోగా కొరియా వార్ వచ్చింది. సైనికుడిగా చేరాడు. పరాయి మగాడికి భార్య అయిందని తెలీగానే మిల్లీని ఏం చేయాలో తక్షణం అతనికి తట్టింది. కాని తను దూరంగా యుద్ధరంగంలో ఉన్నాడు. తిరిగి వచ్చాక కొంత కాలం హాస్పిటల్‌లో గడిపాడు. కాని అప్పటికే విడాకులు తీసుకుని ఇంకో పెళ్ళి చేసుకున్న మిల్లీ తను తిరిగి వచ్చిన సంగతి తెలిసినా, తనని చూడటానికి రాలేదు. చెవుల పక్క నించి చప్పుడు చేస్తూ బుల్లెట్లు దూసుకు వెళ్ళినప్పుడు కూడా బాధపడని టోనీ మిల్లీ హాస్పిటల్ లోని తనని చూడటానికి రానందుకు బాధపడ్డాడు.

అరగంట నడిచాక వీధికి దూరంగా ఉన్న ఖరీదైన ఇళ్ళు టోనీకి కనిపించాయి. ప్రతీ ఊళ్ళో ఇలాంటి ఖరీదైన ఇళ్ళ సముదాయం ఉంటుంది. అన్ని ఇళ్ళ కిటికీలకి తెరలు వేసి ఉన్నాయి. మిల్లీ తప్పనిసరిగా ఆ ఇళ్ళలోని ఓ ఇంట్లో ఉంటుంది అనుకున్నాడు. చీకటి పడటం వల్ల మర్నాడు తిరిగి రావచ్చని అనుకున్నాడు.

* * *

ఏడు గంటల బస్ ప్రయాణం చేయడం వల్ల టోనీకి ఆ రాత్రి బాగా నిద్ర పట్టింది. మర్నాడు ఉదయం అతను బ్రేక్‌ఫాస్ట్ చేస్తూ తనని హోటల్‌లో ఎవరూ గుర్తు పట్టలేదని అనుకున్నాడు. వెయిటర్లు మారారు. మేనేజ్‌మెంట్ కూడా మారి ఉంటుంది అనుకున్నాడు. అమెరికాలో భార్యలు ఎలా చేతులు మారుతున్నారో అలా వ్యాపారాలు కూడా చేతులు మారుతూంటాయి. మార్పు అమెరికాకి సహజం అనుకున్నాడు.

కాని మిల్లీ విషయంలో జరిగిన మార్పు మాత్రం టోనీ సహజంగా భావించలేక పోయాడు. బయటకి వచ్చాక క్రితం రాత్రి చూసిన ఆ ఐశ్వర్యవంతుల కాలనీకి మళ్ళీ బయలు దేరాడు. టోనీ ఆ కాలనీలో ఓ పద్ధతి ప్రకారం తిరుగుతూ ఇళ్ళన్నిటినీ పరిశీలించాడు. బయటకి ఇళ్ళల్లోని వారు ఎవరూ రావడం లేదు. అంతా నిర్మానుష్యంగా ఉంది. కాని మిల్లీ కోసం పట్టు వదలకుండా తిరగసాగాడు. చివరికి టోనీ కృషి ఫలించింది.

రెండు లక్షల డాలర్ల విలువ చేసే ఓ ఇంట్లోంచి మిల్లీ బయటకి వచ్చింది. అదృష్టవశాత్తూ టోనీ ఆ ఇంటికి చాలా దూరంగా ఉండటంతో ఆమె అతన్ని చూడలేదు. చెత్త సంచీని పేవ్‌మెంట్ మీద పడేసి మిల్లీ మళ్ళీ లోపలకి వెళ్ళిపోయింది. ఆమెని ముఖాముఖి కలిసేందుకు అతను అప్పుడే సిద్ధంగా లేడు. ఆ ఇంటిని గుర్తుపెట్టుకుని టోనీ వెనుతిరిగాడు.

* * *

ఓ వారం పాటు టోనీ మిల్లీని రహస్యంగా గమనించాడు. షార్ట్స్‌లో, మిని స్కర్ట్, స్లేక్ లలో, సూట్‌లో, జీన్స్ పేంట్, టీ షర్ట్ లలో, గౌన్లనో...అమెరికాలో ఆడవాళ్ళు ధరించే అన్ని రకాల దుస్తుల్లో ఆమెని చూసాడు. ఆమె కారులో బయటకి వెళ్తే తిరిగి వచ్చేదాకా అక్కడే వేచి ఉన్నాడు. ఆమె దుస్తులు, కారు అన్నీ ఖరీదైనవే. మిల్లీ శరీర సౌష్టవం గలది. ఆ దుస్తులన్నీ అందుకే ఆమెకి బాగా నప్పాయి. తనని వివాహం చేసుకున్నప్పుడు మిల్లీలో ఇంతటి సౌష్టవం లేదు. ఒకప్పుడు తను ఆమె నల్ల జుట్టులోకి వేళ్ళని పోనించి ప్రేమగా ఎలా దువ్వేవాడో గుర్తుకు రాగానే అతని మనసు బాధపడింది. ఇప్పుడు ఆమె నల్ల జుట్టుకి గోధుమ రంగుని వేసుకుంది. నలుపే అందంగా ఉండేది.



ఆమెకి పిల్లలు లేరని గ్రహించాడు. తనని చూస్తే మిల్లీ ఏమంటుంది? ఏడుస్తుందా? తెలీనట్లు నటిస్తుందా? తనని విస్మరిస్తుందా? అది మరీ బాధాకరం. ఆమెని చూసాక ఏం మాట్లాడాలి? ఆ ప్రశ్నకి టోనీకి ఓ పట్టాన జవాబు దొరకలేదు. టోనీ త్వరపడదలచుకోలేదు. ఆమె ఉనికి తెలిసింది కాబట్టి ఇక తొందర అవసరం లేదు. ఆమె కనపడేదాకానే తొందర.

ఇంటి వెనక పచ్చికలో సన్ బాత్ చేస్తున్న మిల్లీని చూసాడు. ఈత కొలనులో ఈదే మిల్లీని చూసాడు. ఓ రోజు మిల్లీ షాపింగ్ చేసే డిపార్ట్‌మెంట్ స్టోర్‌లో ఆమెని దగ్గర నించి చూసాడు. షెల్ఫ్ అవతల నించి రహస్యంగా. షెల్ఫ్‌లోని డబ్బాల మధ్య నించి మరోసారి. ఆమె వెళ్ళిన సినిమాకి వెళ్ళి ఆమె వెనక సీట్లో కూర్చుని సినిమాని చూసే బదులు ఆమెని చూసాడు. మిల్లీ తనని గమనించి పలకరిస్తే 'హలో మిల్లీ' అని మాత్రమే బదులు పలకాలని నిశ్చయించుకున్నాడు. కాని మిల్లీ తనని ఆ రెండు సందర్భాల్లో గమనించలేదు.

ఆమె భర్త టోనీ ఊహించినట్లుగానే ఉన్నాడు. ఏభై ఏళ్ళ దరిదాపుల్లో ఉన్న అతనికి ఒంటిమీద ఖరీదైన భోజనం చేసేవారికి కనపడే ఛాయలు ఉన్నాయి. అనేక ఏళ్ళుగా ఖరీదైన హోటళ్ళలోని పోర్టర్స్, బెల్ హాప్స్, వెయిటర్లని కమాండ్ చేసిన వ్యక్తిలా కనిపించాడు. తలుపు తెరిచిన మిల్లీ చుట్టూ అతను తన చేతులు వేసి కౌగలించుకుంటే టోనీ మనసు బాధపడింది. ఆ రాత్రంతా టోనీ ఆ ఇంటిని గమనిస్తూనే ఉన్నాడు.

ఆమె భర్త మళ్ళీ వ్యాపారం పని మీద టూర్ వెళ్ళినట్లున్నాడు. మర్నాడు అతను టోనీకి కనిపించలేదు. టోనీ ఫ్లోరిడాలోని జూలై నెల్లో ఆ ఊరుకి వచ్చిన రెండో వారంలో ఓ రోజు నిద్రలేవగానే అనుకున్నాడు.

"ఇవాళే."

టోనీ ఉత్సాహంగా పక్క మీంచి లేచాడు. హుషారుగా ఈల వేస్తూ గడ్డం గీసుకున్నాడు. తన డఫెల్ బేగ్‌లో ఉన్న అతి శుభ్రమైన దుస్తులని ధరించాడు. ఉదయం బ్రేక్ ఫాస్ట్ ముగించాక మోటెల్ రిసెప్షనిస్ట్‌తో చెప్పాడు.

"నేను మధ్యాహ్నం గది ఖాళీ చేస్తున్నాను. దయచేసి న్యూయార్క్‌కి నాకు మధ్యాహ్నం మూడు గంటల బస్‌లో టిక్కెట్‌ని రిజర్వ్ చేయిస్తారా?"

"అలాగే సర్. మళ్ళీ మా ఊరు వచ్చినప్పుడు ఇక్కడే బస చేయండి." చిరునవ్వుతో చెప్పింది.

జిమ్ కోరాని తనని పెళ్ళి చేసుకోమని కోరాడు. కోరా అందుకు అందుకు అంగీకరించింది." చిన్నగా నిట్టూర్చింది మిసెస్ సుథర్ లేండ్.

"కోరా అప్పటికే గర్భవతి అయింది. అందుకు కారణం తన పాత బాయ్ ఫ్రెండ్ హేరింగ్‌టన్ ఫర్త్ తప్ప జిమ్ కాకపోవడం విచారకరం."

"మిసెస్ సుథర్ లేండ్. మరి..."

"సార్జెంట్! మీరు మధ్యలో అడ్డు ప్రశ్నలు వేయనని మాటిచ్చారు."

"అవునవును. చెప్పండి. వింటున్నాను."

"హేరింగ్‌టన్ డబ్బు, బాధ్యత తెలీని యువకుడు. అతని తండ్రి ఫర్త్ ఎలక్ట్రానిక్స్‌కి ప్రెసిడెంట్. సమాజంలో గొప్ప స్థానంలో ఉన్నాడు. తండ్రి సంపాదించింది తగలెయ్యడం హేరింగ్‌టన్ నిత్యకృత్యం."

"ప్లేబాయ్ అన్నమాట."

"అవును. మీరు చక్కగా అర్థం చేసుకుంటున్నారు. కోరాలాంటి అందమైన అమ్మాయిలతో పరిచయం చేసుకోవడం, వారితో ముచ్చట్లన్నీ తీరాక వాళ్ళని వదిలేయడం. మళ్ళీ కొత్త అమ్మాయి కోసం వేట. ఇదీ అతను చేసేది. గత..."

ఆగి ఆలోచించి ఆ వాక్యాన్ని ఆవిడ ఇలా పూర్తి చేసింది.

".... సరిగ్గా గుర్తు లేదు. కాని గత నలభై నాలుగు వారాలుగా అనుకుంటాను. అతని కార్యక్రమం ఇలాగే సాగుతోంది. అతని తండ్రి ఎప్పుడూ వ్యాపార వ్యవహారాల్లో తలమునకలై ఉంటాడు. కాబట్టి ఆయన కొడుకు గురించి పట్టించుకోడు. తల్లికి కొడుకు ఏది చేస్తే అది ఘనకార్యం."

"చెడ్డ తల్లితండ్రులన్నమాట."

"అవును. బాగా చెడ్డ తల్లితండ్రులు. సరే. హేరింగ్‌టన్‌కి అమ్మాయిల పిచ్చిలా కార్ల పిచ్చి కూడా ఉంది. మూడు నెలలకి ఓసారి కారుని మారుస్తూంటాడు. అతను కారుని మార్చినప్పుడల్లా ప్రియురాలిని మారుస్తాడు అని కూడా నేను చాలా వారాలుగా గమనిస్తున్నాను. అతనిలోని చెడ్డతనం గురించి పాపం కోరాకి తెలీదు. నాకు తెలుసు కాబట్టి నాకు అతనంటే ద్వేషం ఏర్పడింది. అతనికి బాధ్యత తెలిసుంటే ఇలా జరిగేది కాదు. కాని దాన్ని అతనికి నేర్పేవారు ఎవరు? తను గర్భవతిని అయ్యానని కోరాకి తెలిగానే ఆమెలో మానసిక సంఘర్షణ మొదలైంది. అటు జిమ్‌తో నిశ్చితార్థం కాబోతోంది. ఇటు హేరింగ్‌టన్ వల్ల తల్లి కాబోతోంది. ఏం చెయ్యాలి? కోరా పడ్డ ఆవేదనకి నేను సాక్షిని."

ఆవిడ తన కంట తడిని తుడుచుకుంది.

"కోరా మీకు ఎలా పరిచయం?" సార్జెంట్ ప్రశ్నించాడు.

ఆ ప్రశ్నకి జవాబు చెప్పకుండా ఆవిడ తను చెప్పేది కొనసాగించింది.



"కోరా ఇంకా జిమ్‌ని పెళ్ళి చేసుకోలేదు. నిజాయితీగా హేరింగ్‌టన్‌కి తన గర్భం గురించి చెప్పింది. జిమ్ డాక్టర్ అని చెప్పానా? అతను పనిచేసే హాస్పిటల్‌లోని అందమైన అమ్మాయిలందరికీ అతన్ని పెళ్ళి చేసుకోవాలని ఉంది. కాని అతను వాళ్ళని పట్టించుకోడు. క్రితం వారం కోరా జిమ్‌కి తను గర్భవతినని చెప్పింది. ఆశ్చర్యంగా జిమ్ ఆనందంగా ఆమెని కౌగిలించుకుని. 'ఎంత మంచి వార్త!' అన్నాడు. తన వల్ల ఆమె గర్భవతి అయింది అనుకున్నాడు పిచ్చి జిమ్. కోరా కూడా అసలు రహస్యం అతనికి చెప్పకుండా దాచింది."

"ఆమె దాచకుండా ఉండాల్సింది."

"నేనూ అలాగే అనుకున్నాను. కాని అప్పటికి దాచింది. కోరా చెడ్డదని అనుకోకండి. ఇది క్రితం వారం మొదట్లో జరిగింది. వారాంతంలో కోరా ఆ విషయం జిమ్‌కి చెప్పింది. కాని జిమ్ ఎంత గొప్పవాడంటే, పరాయి మగాడి వల్ల పిల్లని కనే ఆమెని పెళ్ళి చేసుకోడానికి అంగీకరించాడు! హేరింగ్‌టన్ గాడికి ఆ సంగతి చెప్తే వాడేమన్నాడో తెలుసా? వారి సంభాషణని నేను విన్నాను. 'అది నా వల్లే అని నాకేమిటి హామీ?" హేరింగ్‌టన్ కంఠాన్ని అనుకరించి చెప్పింది మిసెస్ సుథర్ లేండ్.

"మగాళ్ళంతా ఆలోచించే తీరే అది." చెప్పాడు సార్జెంట్.

"జిమ్ అయితే అలా అని ఉండేవాడా?" వెంటనే అడిగింది.

సార్జెంట్ తల అడ్డంగా ఊపాడు.

"మరి మగాళ్ళంతా చెడ్డవారంటారే? ఒక్క హేరింగ్‌టనే చెడ్డవాడు."

"నిజమే." సార్జెంట్ ఆవులించాడు.

"అదలా ఉంచితే హేరింగ్‌టన్ ద్వారా కోరా గర్భవతి అయిందన్న సంగతి తెలిసాక అతని తండ్రి హేరింగ్‌టన్‌తో చెప్పాడు.

"నీచుడా! రేపు కోరా కొడుకు లేదా కూతురుకి డిఎన్ఏ పరీక్షలో నెగ్గిన నీ ఆస్తికి వారసుడు అవచ్చు."

"ముసలివాళ్ళు అలాగే ఆలోచిస్తారు." సార్జెంట్ చెప్పాడు.

"దాంతో హేరింగ్‌టన్ ఓ స్పోర్ట్స్ కారు కొన్నాడు."

సార్జెంట్ ప్రశ్నార్థకంగా చూసాడు.

"కోరాకి స్పోర్ట్స్ కారు ఎక్కాలని చాలా కాలంగా కోరిక. దాన్లో ఎక్కించుకుని కొండల్లోకి తీసుకెళ్ళి ఆమెని చంపి పూడ్చి పెట్టాలని హేరింగ్‌టన్ పథకం. అతను ఆ కారులో గునపం, పారలని దాచడం నేను స్వయంగా చూసాను."

సార్జెంట్ మళ్ళీ ఆవలించాడు.

"రెండు గంటల క్రితం హేరింగ్‌టన్ ఫర్త్ నాకు ఓ బార్‌లో తారసపడ్డాడు. తప్పతాగి ఉన్నాడు. నేను అతని దగ్గరకి వెళ్ళి సూటిగా అడిగాను. 'ఈ వారంలో మీరు కోరాని

చంపబోతున్నారా?' అతను తత్తర పడలేదు. 'నీకెలా తెలుసు?' అనలేదు. మూర్ఖుడు! 'అవును. పాతి పెట్టడానికే గునపం, పారలని నేను హోం డిపోలో కొనడం మీరు చూసాక మళ్ళీ ఆ ప్రశ్న ఎందుకు వేస్తున్నారు? ఐతే నియమాల ప్రకారం నేను ముందు జరిగేది ఎవరికీ చెప్పకూడదు.' అని చెప్పాడు."

ఆవిడ మొహంలోకి రోషం ప్రవేశించింది. హేండ్ బేగ్‌లోంచి ఖాళీ స్లీపింగ్ పిల్స్ సీసాని తీసి చూపించి చెప్పింది.

"అతను చూడకుండా ఈ సీసాలోని మాత్రలన్నిటినీ అతని విస్కీ గ్లాసులో వేసాను. అవి అందులో కరిగిపోయాయి. నేను అతను దాన్ని పూర్తిగా తాగేదాకా ఉండి మీ దగ్గరకి వస్తున్నాను. నేను హేరింగ్‌టన్ ఫర్త్‌ని చంపాను కాబట్టి మీకు లొంగిపోవాలని వచ్చాను."

"మా దగ్గర అలాంటి వ్యక్తి చంపబడ్డ సమాచారం లేదు. మీ ఫోన్ నంబర్ ఇస్తే అవసరం ఉంటే మిమ్మల్ని కాంటాక్ట్ చేస్తాను."

ఆవిడ చెప్పిన అడ్రస్, ఫోన్ నంబర్లని రాసుకుంటున్నట్లుగా సార్జెంట్ నటించాడు. తన పాకెట్ నోట్ బుక్‌లోని పేజీని అతను వృధా చేయదలచుకోలేదు. ఆవిడ లేచి తన హేండ్ బేగ్‌ని, ఆ సీసాని తీసుకుని పోలీస్ స్టేషన్‌లోంచి బయటకి నడిచింది.

* * *

ఆ సాయంత్రం సార్జెట్ న్యూయార్క్ టైమ్స్ ఈవెనింగ్ ఎడిషన్‌ని తీసి అలవాటుగా, ఏ వార్తలోనైనా తన పేరు ఉందా అని చూడటానికి ముందుగా క్రైమ్ పేజీని చదివాడు. అతను ఓ వార్తని చదివి ఉలిక్కి పడ్డాడు.

ఆ ఉదయం టేలర్ మేక్స్‌వెల్ అనే ప్రసిద్ధ టి వి నటుడు ఓ బార్‌లో తాగుతూ స్పృహ తప్పాడు. తాగుబోతైన అతనికి అది అలవాటే కాబట్టి కొద్ది గంటల దాకా సిబ్బంది అతన్ని పట్టించుకోలేదు. తర్వాత అతన్ని గమనించి హాస్పిటల్‌కి తీసుకు వెళ్ళేసరికే అతను మరణించాడు. అతని విస్కీ గ్లాస్‌లోని మిగిలిన విస్కీని పరీక్షిస్తే విషం కలిసిందని తెలిసింది. టైలర్ మేక్స్‌వెల్ 'ది విల్ టు లివ్' అనే టి వి సీరియల్ హేరింగ్‌టన్ ఫర్త్ అనే పాత్ర ద్వారా ప్రేక్షకుల అభిమానాన్ని చూరగొన్నాడు. అందులో కోరా పాత్ర ధరించే మెరిల్ అతని హత్య మీద స్పందిస్తూ ఇలా అన్నది. 'చిన్న తెర మీద ఈ వారాంతంలో అతను నన్ను హత్య చేయాల్సి ఉంది. కాని ఇంతలో ఇలా జరగడం దురదృష్టం.'





# 7. దొంగగారు

## ఏ. ఎఫ్. ఓర్వనిక్

డాక్టర్ జేసన్ వైట్నే ఇంటి డోర్ బెల్ మోగింది. నలభై ఏళ్ళ అతను వెళ్ళి తలుపు తెరిచాడు. ఎదురుగా ఇద్దరు వ్యక్తులు కనపడ్డారు.

"డాక్టర్ జేసన్?" ఆ ఇద్దరిలో ఒకరు అడిగారు.

"అవును.రండి. మీరేనా ఫోన్ చేసింది?" అడిగాడు.

వాళ్ళిద్దరూ అవునన్నట్లుగా తల ఊపి లోపలకి వచ్చి సోఫాలో కూర్చున్నాక వైట్నే లోపలకి వెళ్ళి కొద్ది నిముషాల్లో రెండు చికెన్ సేండ్‌విచ్‌లు, పొగలొచ్చే కాఫీ కప్పులతో వచ్చాడు. వారిద్దరు వాటిని కృతజ్ఞతగా అందుకుని ఆవురావురుమంటూ తిన్నారు. ముగ్గురూ కాఫీ తాగుతూండగా వారి లోని ఒకరు చెప్పారు.

"నేను, నా పార్టనర్ జో మొఫెట్‌లు గత నాలుగు రోజుల నించి ఈ దుస్తుల్లోనే తిరుగుతున్నాం. స్పెయిన్ నించి ఇవాళే ఓ ఖైదీని తీసుకువచ్చాం. అతని పేరు హెన్రీ హేమండ్. నిజానికి అతను అండోరా అనే దేశంలో నివశిస్తున్నాడు."

"అండోరా అంటే స్పెయిన్, ఫ్రాన్స్ దేశాల మధ్య ఉండే ఓ అతి చిన్న దేశం కదా?" అడిగాడు డాక్టర్ వైట్నే.

"అవును. ఆ దేశంతో మనకి ఖైదీల మార్పిడి ఒప్పందం లేదు. కాబట్టి హేమండ్ అక్కడకి వెళ్ళి దాక్కున్నాడు. కాని అతన్ని స్పెయిన్ నించి తెచ్చాం. అతను ఓ రోజు వాకింగ్‌కి అండోరా, స్పెయిన్ సరిహద్దుకి బాగా దగ్గరగా వచ్చాడు. వెంటనే అతని కోసం కాపు కాసిన మేమిద్దరం అతన్ని చెరో రెక్క పట్టుకుని స్పెయిన్ దేశ సరిహద్దుని దాటించాం. అక్కడ సిద్ధంగా ఉన్న కారులో ఎయిర్ పోర్ట్‌కి తీసుకు వచ్చి గంట క్రితమే న్యూయార్క్‌కి చేరుకున్నాం. మేం భోజనం చేసి ముప్పై రెండు గంటలు దాటింది."

"అతను చేసిన నేరం ఏమిటో మీకు తెలిసే ఉండాలి. హేమండ్ బేంకు దొంగ. డబ్భై లక్షల డాలర్లు దొంగిలించాడు." రెండో ఆఫీసర్ జో చెప్పాడు.

చిన్నగా ఈల వేసాడు డాక్టర్ వైట్నే.

"నాలాంటివాడు ఏ గ్రీస్ ద్వీపానికో వెళ్ళి జీవితాంతం ఇంకే పని చేయకుండా హాయిగా జీవించగలిగేంత మొత్తం అది. దొంగతనం ఎలా జరిగింది?"

టేబిల్ మీది కెటిల్‌లోని కాఫీని జో మొఫెట్ తన ఖాళీ కప్పులో పోసుకుని మిగిలింది తన పార్టనర్ కప్పులో పోసి చెప్పాడు.

"న్యూయార్క్‌లోని ఫస్ట్ నేషనల్ సిటీ బేంకులో సెక్యూరిటీ విభాగంలో హేమండ్ పని చేస్తున్నాడు. ఓ బ్రాంచి నించి ఇంకో బ్రాంచికి డబ్బుని బదిలీ చేసే సెక్యూరిటీ వేన్

డ్రైవర్. నాలుగు నెలల క్రితం ఓ రోజు అతను అందులోని ఇద్దరు సెక్యూరిటీ గార్డులకి ఇచ్చిన చాక్లెట్లలో స్పృహ తప్పించే మందు కలిపాడు. వారు స్పృహ తప్పగానే డబ్బు సంచీలతో ఉడాయించాడు. నేరం బయటపడి అతని కోసం వెదకడం మొదలు పెట్టడానికి నాలుగు గంటలు పట్టింది. ఈలోగా అతను కెనడాకి పారిపోయాడు. అక్కడ నించి స్పెయిన్‌కి, ఆ తర్వాత అండోరాకి వెళ్ళాడని తెలుసుకోడానికి ఎఫ్ బి ఐకి ఇంత కాలం పట్టింది."

"డబ్బు దొరికిందా?"

"లేదు. అది ఎక్కడ దాచాడో విచారించాల్సి ఉంది. మీరు జైలుకి వచ్చి అతనికి ప్రాధమిక వైద్య పరీక్షని నియమాల ప్రకారం చేయమని కోరడానికి మీ దగ్గరకి వచ్చాం."

డాక్టర్ వైట్నే గోడ గడియారం వంక చూసాడు.

"నాకు మరో రెండు గంటల దాకా రోగులతో అపాయింట్‌మెంట్లు ఉన్నాయి. పదకొండుకి రాగలను."

"మేం నిన్న రాత్రి కూడా నిద్రపోలేదు. ఈ రాత్రి పదకొండు దాకా మేలుకోలేం. ఈ పని అయిపోతే ఇంటికి వెళ్ళి నిద్రపోవాలని మా ఆలోచన."

"మీరు ఇళ్ళకి వెళ్ళండి. నా వెంట మీరు ఉండనవసరం లేదు. నేను జైలుకి వెళ్ళి ఆ పని పూర్తి చేసి, రిపోర్ట్ టైప్ చేసి సంతకం చేసి దాన్ని సూరింటెండెంట్‌కి ఇచ్చేస్తాను. అర్ధరాత్రి ఒకటి లోగా ఆ పని పూర్తవుతుంది."

"అలా ఐతే సరే."

ఇద్దరూ డాక్టర్‌కి తమ కృతజ్ఞతలని తెలియ చేసి, కాఫీ పూర్తి చేసి, శెలవు తీసుకుని వెళ్ళిపోయారు. వెళ్ళబోయే ముందు ఈ ఏర్పాటు గురించి జైలు సూపరింటెండెంట్‌కి అక్కడ నించే ఫోన్ చేసి చెప్పారు.

* * *

డాక్టర్ వైట్నేని చూడగానే జైలు సెక్యూరిటీ గార్డ్ గేట్‌ని తెరిచాడు. వైట్నే ఊహించినట్లుగానే జైల్ సూపరింటెండెంట్ లేడు. ఇంటికి వెళ్ళిపోయాడు.

"హేమండ్‌ని సెల్‌లోంచి తెస్తాను. మీరు హెన్రి హేమండ్‌ని పరీక్షించవచ్చు." అసిస్టెంట్ వార్డెన్ చెప్పాడు.

ఇద్దరూ డాక్టర్ వైట్నే ఖైదీలకి వైద్య పరీక్షలు నిర్వహించే గదిలోకి దారి తీసారు.

"మీరు రెండుసార్లు ప్రమోషన్లని నిరాకరించారు కదా డాక్టర్?" వార్డెన్ నవ్వుతూ అడిగాడు.

అవునన్నట్లుగా వైట్నే తల ఊపాడు.

"ఎందుకని? నిజానికి మీ లాంటి డాక్టర్లు ఏ కార్పొరేట్ హాస్పిటల్‌లో పని చేసినా ఏడాదికి రెండున్నర లక్షల డాలర్ల జీతం వస్తుంది. మీరు డబ్బై వేల డాలర్ల జీతానికే ఇన్నేళ్ళుగా ఎందుకు జైల్ శాఖలో పని చేస్తున్నట్లు? ఎవరైనా ఏడాదిన్నర మించి ఇక్కడ పని చేయరు. మంచి ఉద్యోగం రాగానే వెళ్ళిపోతారు."



"ఎలాంటి ఒత్తిళ్ళు లేని ఈ ఉద్యోగం నాకు నచ్చింది. రోగులు నా మీద దావా వేయడం ఇక్కడ జరగదు."

"నేను హేమండ్‌ని తీసుకువస్తాను."

వార్డెన్ బయటకి వెళ్ళి కొద్ది నిముషాల్లో హేమండ్‌తో తిరిగి వచ్చాడు. వైట్నే అతన్ని పరీక్షగా చూసాడు. మనిషి నలిగినట్లుగా కనిపించాడు. దుస్తులు కూడా. కళ్ళ కింద నల్లటి వలయాలు ఏర్పడ్డాయి. అతని మొహం ఆందోళనగా ఉంది.

"రిలాక్స్ మిస్టర్ హేమండ్. జస్ట్ రిలాక్స్." అతని భుజం మీద ఆప్యాయంగా తడుతూ చెప్పాడు.

అతని బరువుని, టెంపరేచర్‌ని, నాడి కొట్టుకునే విధానాన్ని బిపిని చూసి వాటిని నోట్ చేసి అడిగాడు.

"మీకు బి పి ఉందా?"

"లేదు."

"అలాగా?"

కొద్ది క్షణాల తర్వాత వైట్నే వార్డెన్ వంక చూసి అడిగాడు.

"ఓ పావుగంట మమ్మల్ని ఒంటరిగా ఒదులుతారా? జైలు అధికారుల సమక్షంలో ఖైదీలకి బిపి పెరగడం మామూలే."

"అలాగే. మీ పనయ్యాక బెల్ కొడితే వస్తాను."

"థాంక్యూ."

వార్డెన్ బయటకి వెళ్ళి తలుపు మూసాక హేమండ్ వంక చిరునవ్వుతో చూస్తూ చెప్పాడు.

"రిలాక్స్ మిస్టర్ హేమండ్. ఆ ఎగ్జామిన్ టేబిల్ మీద పడుకోండి."

అతను పడుకున్నాక మళ్ళీ బిపి చూస్తూ చెప్పాడు.

"రిలాక్స్. మీరెంత రిలాక్స్ అయితే మీ బిపి అంత నార్మల్‌గా ఉంటుంది."

మళ్ళీ బిపిని చూసి తల అడ్డంగా ఊపి చెప్పాడు.

"లేదు. మీరు రిలాక్స్ కావడం లేదు. మీ రీడింగ్ హెచ్చులో ఉంది. మీరెలా రిలాక్స్ అవాలో చెప్తాను. అలా చేయండి. మీ కళ్ళని మూసుకోండి. అలా. నా సూచలని అనుసరిస్తే మీరు పూర్తిగా రిలాక్స్ అవుతారు. మీ కాళ్ళ వేళ్ళని అటు ఇటు కదిలించండి. అవి రిలాక్స్ అయ్యాయని భావించండి. గుడ్. ఇప్పుడు మీ చేతులు రిలాక్స్ అయ్యాయని భావించండి. ఇప్పుడు మీ తల. ఇప్పుడు మళ్ళీ మీ కనురెప్పలు. అవి బరువుగా ఉన్నాయని మీకు

అనిపిస్తోందా? గుడ్. అవి మాత్రం నిజంగా బరువుగా ఉన్నాయి. ఇప్పుడు మీ బిపి తీసుకుని చూస్తాను...వెరీ గుడ్. ఇప్పుడు మీరు అన్ని వత్తిళ్ళని మర్చిపోయి రిలాక్స్ అయ్యారు. మీ శరీరం మొత్తం రిలాక్స్ అయింది. మీ కాలి వేళ్ళు, పాదాలు, కాళ్ళు, చేతులు...మీ శరీరంలోని ప్రతీ అంగం రిలాక్స్ అయి మీరు ఎంతో హాయిని అనుభవిస్తున్నారు. నేను చెప్పే దాకా మీరు కళ్ళు తెరవలేరు. అందుకే మీ కనురెప్పలు మాత్రం బరువుగా ఉన్నాయి. ఏదీ? కళ్ళు తెరిచే ప్రయత్నం చేయండి చూద్దాం. చూసారా? నే చెప్పేంత దాకా అవి తెరచుకోవు..."

'నిద్రపో' అనే హిప్నాసిస్ సూచన చెప్పకుండా, తమ హిప్నటైజ్ అవుతున్నాడన్న అనుమానం కలగకుండా డాక్టర్ వైట్నే హేమండ్‌ని హిప్నటైజ్ చేసాడు. మరికొన్ని సూచనలని ఇచ్చి ఇంకాస్త గాఢంగా అతన్ని హిప్నటైజ్ చేసాడు వైట్నే. ఆ తర్వాత హెన్రీ హేమండ్ దొంగిలించిన డబ్బై లక్షల డాలర్లని దాచిన స్విస్ బేంక్ అకౌంట్ నంబర్లు, పాస్‌వర్డ్‌లని అడిగి తెలుసుకుని రాసుకున్నాడు. తర్వాత వాటిని అతను శాశ్వతంగా మర్చిపోతాడనే సూచనని పదే పదే ఇచ్చి అతను వాటిని మర్చిపోయేలా చేసాడు.

"నా పేరు, నాకు మీరు ఈ సమాచారం చెప్పిన సంగతి మీకు ఎన్నడూ గుర్తుండదు." ఆ తర్వాత వైట్నే నెమ్మదిగా అతన్ని హిప్నోటిక్ ట్రాన్స్‌లోంచి బయటకి తీసుకువచ్చాడు.

"ఎలా ఉంది?" నవ్వుతూ అడిగాడు.

"మంచి నిద్రపోయి లేచినట్లుగా బాగా రిలాక్స్‌డ్‌గా ఉంది."

"నాతో ఏం మాట్లాడారో మీకు గుర్తుందా?"


తల అడ్డంగా ఊపాడు.

"నా పేరు?"

"తెలీదు."

* * *

రెండు నెలల తర్వాత డాక్టర్ వైట్నే గ్రీస్ ఐలండ్ క్రీట్‌లో స్థిరపడ్డాడు. హేమండ్ దొంగిలించిన డబ్బై లక్షలని ఎక్కడ దాచాడో ఎఫ్‌బిఐ ఏజెంట్లు ఎంత ప్రయత్నించినా చెప్పించలేకపోయారు. తను మర్చిపోయానన్న ఒక్కటే జవాబు హెన్రీ హేమండ్ నించి వచ్చింది.





# 8. పూల ప్రేమికులు

## హెన్రీ స్లెసర్

వసంత కాలం ప్రపంచంలోకి ప్రవేశిస్తోంది. పోలీస్ స్టేషన్‌లలోకి కూడా.

టెక్సాస్‌లోని ఓ చిన్న ఊళ్ళోని ఆ పోలీస్ స్టేషన్‌లో, ఇంకే పోలీస్ స్టేషన్‌లో లేని ఓ ఆకర్షణ ఉంది. అది చిన్న పూల తోట. అక్కడ రకరకాల పూల మొక్కలకి పూసిన అనేక రంగుల పూలు దర్శనం ఇస్తున్నాయి.

అందుకు కారణం ఆ పోలీస్ స్టేషన్‌లో పని చేసే కెప్టెన్ డోన్ ఫ్లామర్. అతనికి చిన్నప్పటి నించీ పూల తోట అంటే ఆసక్తి. అతని తాత నించి తండ్రికి, తండ్రి నించి ఫ్లామర్‌కి ఈ హాబీ వంశపారంపర్యంగా అబ్బింది.

ఓ సాయంత్రం ఫ్లామర్ వ్యాహ్యాళికి వెళ్తూ, ఊరి చివర ఉన్న ఆర్టెన్ రోడ్‌లోని ఇళ్ళల్లోని ఓ ఇంటి ముందు ఉన్న పూల తోటని చూసి ఆగిపోయాడు. మొక్కలకి తీగలకి అనేక రంగుల గులాబీలు పూసాయి. పోర్చ్ పక్కన గోడ వార పింక్ రంగులోని హైడ్రన్‌జినియా పూలు పూసి ఉన్నాయి. ఇంకా జయంట్ పేన్సీ పువ్వులు, మమ్స్, పియోనీ పువ్వులు కనిపించాయి. బ్లూ బెల్స్, వయోలెట్స్ ఇంటి గోడల మీదకి పాకాయి. కెప్టెన్ ఫ్లామర్ తన పోలీస్ స్టేషన్‌లో పెంచే పెటూనియా పూల కన్నా ఆ ఇంట్లోని పూలు ఎక్కువ మృదువుగా కనిపించాయి. నిలబడి తన తోట వంక చూస్తున్న అతన్ని చూసి ఆ ఇంట్లోంచి ఓ యువతి బయటకి వచ్చింది. ఆమె వయసు ముప్పై దాకా ఉంటుందని, తన కన్నా పదేళ్ళు చిన్నదని బ్రహ్మచారి అయిన ఫ్లామర్ ఊహించాడు.

"మీ పూల తోట చాలా బావుంది." నవ్వుతూ ఆమెతో చెప్పాడు.

"థాంక్స్. చాలా పని గంటల ఫలితం ఇది."

"నిజమే. నా పేరు డోన్ ఫ్లామర్."

"మిసెస్ గ్రేస్ మేక్‌వే." అతనితో కరచాలనం చేస్తూ ఆమె తన పేరుని చెప్పింది.

ఇద్దరూ పూల చెట్ల పెంపకం గురించి, వాటికి వాడే ఎరువుల గురించి కొద్ది సేపు మాట్లాడుకున్నాక కెప్టెన్ ముందుకి సాగాడు. అది మొదలు ఫ్లామర్ కనపడ్డప్పుడల్లా మిసెస్ మేక్‌వే బయటకి వచ్చేది. ఇద్దరూ ఓ ఐదారు నిముషాలు మాట్లాడుకున్నాక అతను కదిలేవాడు. ఆమె ఎన్నడూ అతన్ని తన ఇంట్లోకి ఆహ్వానించలేదు. చాలా రోజుల తర్వాత ఓ రోజు మాత్రం అతన్ని ఆహ్వానిస్తూ చెప్పింది.

"రండి. మా వారు ఇంట్లోనే ఉన్నారు."

"ఈయన మిస్టర్ డోన్ ఫ్లామర్. మన తోట గురించి మాట్లాడుతుంటానని చెప్పానే. ఇతనే అతను."

అతని కరచాలనంలో పట్టు లేదు. చాలా లూజుగా, తన అయిష్టాన్ని తెలిపేలా మేక్‌వే ఫ్లామర్‌తో కరచాలనం చేసాడు. ఫ్లామర్‌కి అతను చెడ్డవాడు అనే ఆలోచన కలిగింది. తన స్వార్థం కోసం ఏదైనా చేయగలిగే మనిషని కూడా అనిపించింది.

"హేలివిల్‌లో అత్యంత అందమైన తోట మీ ఇంట్లో ఉంది. కంగ్రాచ్యులేషన్స్." అతన్ని అభినందించాడు.

"అది మా ఆవిడ పిచ్చికి నిదర్శనం. సమయాన్ని తోట కోసం అంతగా వెచ్చిచ్చద్దని అంటూంటాను." అతని కంఠం కరకుగా వినిపించింది.

"నా భర్తకి తోట మీద పెద్దగా అభిరుచి లేదు." ఆమె నవ్వుతూ చెప్పింది.

"మీరేం చేస్తుంటారు?" అడిగాడు మేక్‌వే.

"కెప్టెన్‌ని."

"ఓ!"

అతను ఓ జపనీస్ కంపెనీకి టెక్సాస్ బ్రాంచ్ మేనేజర్‌గా పని చేస్తున్నాడని అప్పటికే శ్రీమతి మేక్‌వే ద్వారా ఫ్లామర్‌కి తెలుసు. వాళ్ళతో కలిసి టీ తాగి ఫ్లామర్ శెలవ తీసుకున్నాడు.

ఎప్పుడైనా తన భర్త ఇంట్లో ఉంటే ఆమె ఫ్లామర్‌ని ఇంట్లోకి ఆహ్వానించేది. లేకపోతే బయటే మాట్లాడేది. ఆమె భర్త అనుమానస్థుడు అని ఫ్లామర్‌కి ఆమె ధోరణి వల్ల అర్థమైంది.

ఫ్లామర్ ఆమె తోటలో లేని పూల విత్తనాలని న్యూయార్క్ నించి పోస్ట్‌లో తెప్పించి ఇచ్చేవాడు. తనకి పోస్టులో వచ్చే తోట పనికి చెందిన మాస పత్రికలని ఫ్లామర్ చదివేసాక ఆమెకి ఇచ్చేవాడు. క్రమంగా ఫ్లామర్‌కి ఆమె మీద ఇష్టం కలిగి అది పెరగసాగింది. కాని అతను ఆ విషయం ఎన్నడూ ఆమె ముందు బయటపడకుండా మాటల్లో జాగ్రత్తగా ఉండేవాడు. ఆమె వివాహిత అని అతనికి తెలుసు. పైపెచ్చు అనుమానం భర్త గల భార్య. వీరి సంగతి ఆ గ్రామస్థులకి తెలిసినా వీరి గురించి వదంతులు పుట్టలేదు. ఇద్దరూ తమ పరిధులని దాటకపోవడం ఓ కారణం అయితే, పోలీస్ కెప్టెన్‌కి ప్రేమించడం గురించి తెలీదనే అభిప్రాయం కూడా వాళ్ళల్లో ఉండటం మరో కారణం.

కెప్టెన్ ఫ్లామర్ స్టేషన్ లోని పూలని కోసి వాటితో బొకేలని తయారు చేస్తూంటాడు. సాధారణంగా వాటిని స్థానిక హాస్పిటల్‌లోని రోగులకి కాని, ఓల్డ్ ఏజ్ హోంలోని వృద్ధుల గదుల్లో ఉంచుకోడానికి కాని ఇస్తూంటాడు. ఒకటి మిసెస్ మేక్‌వేకి ఇవ్వాలని ఉన్నా, అది ప్రేమికుల మధ్య అధికంగా జరిగే చర్య కాబట్టి అతను ఆ పని చేయదలచుకోలేదు.

* * *

ఆ రోజు సెప్టెంబర్ 19. అర్థరాత్రి అతని పడకగదిలోని ఫోన్ మోగింది. నాలుగు సార్లు మోగాక మెళకువ వచ్చిన కెప్టెన్ మేక్‌వే చేతిని చాపి ఫోన్ రిసీవర్‌ని అందుకున్నాడు.

"హలో." నిద్ర మత్తుగా చెప్పాడు.



"సార్. నేను సార్జెంట్ విలియమ్స్‌ని. ఓ హత్య జరిగిందని ఫిర్యాదు వచ్చింది."

కెప్టెన్ టైం చూస్తే రెండూ ముప్ఫై అయిదు.

"ఎక్కడ?" అడిగాడు.

"ఆర్డెన్ రోడ్‌లో సార్."

ఆర్డెన్ రోడ్ పేరు వినగానే అతనిలోని నిద్రమత్తు మాయం అయింది. నిటారుగా కూర్చుంటూ అడిగాడు.

"ఎవరు చంపబడింది?"

"మిసెస్ మేక్‌వే."

"ఓ మై గాడ్! నేను వెంటనే అక్కడికి వెళ్తున్నాను. నువ్వు కూడా రా."

కెప్టెన్ లేచి చన్నీళ్ళతో మొహం కడుక్కుని యూనిఫాం ధరించి బయలుదేరాడు. కారు డ్రైవ్ చేస్తూ ఆలోచించసాగాడు. ఆమెని ఎవరు చంపి ఉంటారు? ఖచ్చితంగా అది ఆమె భర్త పనే అయి ఉంటుంది.

కారు ఆ ఇంటిని సమీపించాక బయట ఆగి ఉన్న అంబులెన్స్‌ని, సార్జెంట్ మోటార్ సైకిల్‌ని, గుమిగూడిన చుట్టుపక్కల ఇళ్ళల్లోని వారిని చూసాడు. గబగబ లోపలకి నడిచాడు. మిసెస్ మేక్‌వే వంటగదిలో నేల మీద పడి ఉంది. ఆమె నుదుటికి ఒకే ఒక తుపాకీ గుండు గాయం, నేల మీద కారిన రక్తం కనిపించాయి. పెరట్లోకి గల తలుపు ఓరగా మూసి ఉంది.

"ఏమైంది?" మేక్‌వే వంక చూస్తూ అడిగాడు ఫ్లామర్.

"ఒకటింపావు అయింది టైం. గ్రేస్ నన్ను నిద్ర లేపి వంటగది లోంచి ఏదో చప్పుడు వినిపిస్తోందని వెళ్ళి చూడమని చెప్పింది. తరచు నాకు వినపడని అలాంటి చప్పుళ్ళు గ్రేస్‌కి వినపడుతూంటాయి. శ్రద్ధగా విన్నా నాకు ఏ చప్పుడూ వినపడలేదు. నేను పడుకున్నాను. హఠాత్తుగా పెద్ద శబ్దం వినపడటంతో నాకు మెళకువ వచ్చింది. చూస్తే గ్రేస్ మంచం మీద లేదు. నేను చటుక్కున మంచం దిగి ఇల్లంతా చూస్తే దొంగ పడ్డాడని తెలిసింది. వంట గదిలో గ్రేస్ నేల మీద పడి ఉంది. వెనక తలుపు ఓరగా తెరచి ఉంది. దాంతో దొంగ ఆమెని చూసి కాల్చి పారిపోయాడని గ్రహించి వెంటనే మీకు ఫోన్ చేసాను."

మేక్‌వే చెప్పిన విధానాన్ని బట్టి అతను ముందుగా ప్రిపేర్ అయ్యాడని ఫ్లామర్‌కి అనిపించింది. ఎక్కడా తడబడలేదు. సాధారణంగా ఇంతటి ఘోరం జరిగితే తడబడుతూ మాట్లాడుతారు. భయాందోళనలని మాత్రం చక్కగా అభినయించాడు అనుకున్నాడు.

దొంగ వెదికిన గుర్తుగా బట్టలు, ఇతర వస్తువులు ఇంట్లో చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. అలమార తలుపులు, టేబిల్ డ్రాయర్లు తెరచి ఉన్నాయి.

"మీరు దొంగని చూసారా?" అడిగాడు ఫ్లామర్.

"లేదు. పరిగెత్తుతున్న అడుగుల చప్పుడు మాత్రం విన్నాను."

ఫ్లామర్ ఇంటి లోపల, చుట్టుపక్కల క్లూల కోసం వెదికాడు. ఏమీ దొరకలేదు. పాద ముద్రలు కాని, వేలి ముద్రలు కాని కనపడలేదు. హత్యాయుధం దొరకలేదు. దొంగ రావడం నిజమా? లేక ఏ కారణంగా నైనా మేక్‌వేనే తన భార్యని హత్య చేసాడా?

"మీకు తుపాకీ ఉందా?" అడిగాడు.

"ఉంది. కాని అది ఏడాదిన్నర క్రితం రైల్లో పోయిన నా బ్రీఫ్ కేస్‌లో ఉంది. పోలీసులకి ఆ సంగతి అప్పుడే ఫిర్యాదు చేసాను."

మేక్‌వేనే హంతకుడు అని ఋజువు చేసే ఆధారాలేం అతనికి దొరకలేదు.

* * *

కెప్టెన్ ఫ్లామర్ ఏడాదిగా మళ్ళీ అటు వైపు రాలేదు. వాకింగ్‌కి ఇంకో వైపు వెళ్తున్నాడు. ఆ రోజు గ్రేస్ హత్య జరిగిన రోజు కాబట్టి ఏడాది తర్వాత మళ్ళీ ఆర్డెన్ రోడ్ లోకి వచ్చాడు. ఎప్పటిలా మేక్‌వే ఇంటి వైపు చూసాడు.

ఆమె ఇంట్లో ఇదివరకటిలా పూల తోట ఉంది. గులాబీలు, జయంట్ పేన్సీస్, మమ్స్, పియోనీస్, వయోలెట్స్, బ్లూ బెల్స్, పింక్ హైడ్రెన్ జియాలు...ఆ పూలని చూడగానే కెప్టెన్ కొద్ది క్షణాలు ఆలోచించాడు. వెంటనే ఆ ఇంట్లోకి వెళ్ళి బెల్ కొట్టాడు. ఓ వృద్ధురాలు తలుపు తెరిచి ప్రశ్నార్థకంగా చూసింది.

"తోట బావుంది. బై ది వే, నేను కెప్టెన్ డోన్ ఫ్లామర్‌ని. సరిగ్గా ఏడాది క్రితం ఇదే రోజు ఈ ఇంట్లో మిసెస్ మేక్‌వే హత్య జరిగింది."

"అవును. మేక్‌వే ఈ ఇంటిని మాకు అమ్మి షికాగోకి అనుకుంటా వెళ్ళిపోయాడు."

"పింక్ రంగు హైడ్రెంజియాల చెట్లలో కేవలం రెండు చెట్లకి మాత్రం నీలం రంగు హైడ్రెంజియా పూలు పూసాయి. ఎందుకో మీకు తెలుసా?" ప్రశ్నించాడు.

"మీరూ గమనించారన్నమాట. తెలీదు. ఏం?"

"భూమిలో ఐరన్ ఉంటేనే అవి నీలం రంగు పూలు పూస్తాయి. దయచేసి ఓసారి పార, గునపం ఇస్తారా?"

తవ్వితే కెప్టెన్ ఫ్లామర్ ఊహ నిజమై, నేలలో పాతి పెట్టబడ్డ పిస్తోలు, దొంగిలించబడ్డాయని ఫిర్యాదులో రాయబడ్డ ఆట్టే విలువలేని వస్తువులు కనపడ్డాయి. హత్యాయుధం దొరికింది. హంతకుడికి శిక్ష పడటానికి ఇది చాలు అనుకున్నాడు. రైల్లో పోయిందని రిపోర్ట్ ఇచ్చిన తన పిస్తోలు, పోయిన వస్తువులు తన ఇంటి బయట ఎలా పాతి పెట్టబడ్డాయో మేక్‌వే డిఫెన్స్ లాయర్ జూరీ సభ్యులకి సరైన కారణాన్ని చెప్పలేకపోయాడు. హత్యకి కారణం మిసెస్ గ్రేస్ మేక్‌వే మరణించాక మేక్‌వేకి వచ్చే ఇన్సూరెన్స్ డబ్బు.

మేక్‌వేకి తన భార్యని చంపినందుకు మరణ శిక్షపడింది.



# 9. ఓ పాపం-ఓ ఫలితం

## జేన్ స్పీడ్

పౌలా థోర్ప్ కెటిల్ లోంచి కాఫీని మూడు కాఫీ కప్పుల్లోకి వంచి తనతో బ్రేక్‌ఫాస్ట్‌కి కూర్చున్న భర్త వైపు ఓ కప్పు, రెండో కప్పుని తన అత్తగారి వైపు మృదువుగా జరిపింది. ఆమె భర్త హోవార్డ్ ఆర్ట్ ట్రెషర్స్ ఆఫ్ ఏన్షియెంట్ సిరియా అనే పుస్తకాన్ని చదువుతున్నాడు. అతనికి తినేప్పుడు ఏదైనా చదవడం అలవాటు. చదివేందుకు మంచి పుస్తకం లేకపోతే చివరికి పాత ఉత్తరమో లేదా టెలిఫోన్ డైరక్టరీనో అయినా చదువుతాడు.

ఆమె అత్తగారు జూడి అసాధరణమైన లావు గల దళసరి కళ్ళజోడు లోంచి తన కోడలి వంకే చూస్తోంది. పౌలాకి ఆ చూపు భయాన్ని కలిగిస్తుంది. ఎందుకు ఆవిడ గుడ్లప్పగించి తన వంక అలా ఎప్పుడూ చూస్తూంటుంది? తనలోని లోపాలని వెదికి తర్వాత తన కొడుక్కి చెప్పడానికా?

"బ్లూ బెర్రీ మఫిన్‌లని నువ్వు చక్కగా చేసావు. ఎక్సలెంట్ బ్రేక్‌ఫాస్ట్." హోవార్డ్ భార్యని మెచ్చుకుని కాఫీ కప్పుని అందుకున్నాడు.

పౌలా థోర్ప్ ఖాళీ గిన్నెలని తీసుకుని వంటగదిలోకి వెళ్ళింది. హోవార్డ్‌కి, పౌలాకి పెళ్ళయి ఆరు నెలలు అయింది. అమెరికాలో ఎవరింట్లో వృద్ధులు పిల్లలతో ఉండరు. వృద్ధాశ్రమాల్లో ఉంటారు. కాని అందుకు భిన్నంగా హోవార్డ్ తన తల్లిని తనతోనే ఉంచుకుంటున్నాడు.

* * *

తొమ్మిది నెలల క్రితం పౌలా తన కాబోయే భర్తని ఓ కాక్‌టెయిల్ పార్టీలో కలుసుకుంది. అతనికి చిత్రలేఖనం మీద గల అభిరుచి వల్ల వారు చాలాసేపు మాట్లాడుకోగలిగారు. పౌలాకి కూడా ఆ సబ్జెక్ట్ మీద బాగా ఆసక్తి. అతను ఆర్ట్ మీద తను రాయబోయే పుస్తకం గురించి చెప్పాడు. న్యూయార్క్ లోని ఇద్దరు ప్రచురణ కర్తలు దాని మీద ఆసక్తిని చూపించారని కూడా ఉత్సాహంగా చెప్పాడు.

న్యూయార్క్‌లోని ఓ చర్చిలో వారి వివాహం థాంక్స్ గివింగ్ డే మర్నాడు సింపుల్‌గా జరిగింది. తర్వాత పౌలా తన భర్తతో వెర్మొంట్‌కి షిఫ్ట్ అయింది. అతనికి అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా వచ్చే జీతం వల్లయితే వాళ్ళు హనీమూన్‌కి గ్రీస్ ఐలండ్‌లకి ఓడలో ఐదు రోజులు వెళ్ళ గలిగేవారు కాదు. కానీ, అతనికి తండ్రి ద్వారా సంక్రమించిన ఆస్తి మీద ఆదాయం వస్తుంది. నిజానికి అతనికి రాదు. అది అతని తల్లి జూడీ జీవించి ఉన్నంత కాలం ఆవిడకి వస్తుంది. ఆవిడ తదనంతరం ఆ ఆస్తి, ఆదాయం హోవార్డ్‌కి చెందాలని హోవార్డ్ తండ్రి విల్లు రాసాడు అని హోవార్డ్ పెళ్ళికి ముందు పౌలాకి చెప్పాడు.

"నాకు నా తల్లి అంటే బాగా ప్రేమ. ఆవిడ హృద్రోగి. కాబట్టి నువ్వు ఆవిడతో పేచీ పడకుండా జాగ్రత్తగా చూసుకోవాలి. అది నీ బాధ్యత." హనీమూన్‌లో హోవార్డ్ చెప్పాడు.

"ఆ విషయాలు మాట్లాడాల్సిన సమయం, సందర్భం ఇది కాదు." చురుగ్గా చూస్తూ చెప్పింది పౌలా.

"నిజమే. ఇది శృంగార సమయం కదా?" నవ్వాడు.

* * *

జూడీ ఎన్నడూ పౌలా మీద ఆధిపత్యం చలాయించలేదు. ఆమె మీద తన కొడుక్కి వ్యతిరేకంగా ఏదీ చెప్పలేదు. కాని చిన్నప్పటి నించి పౌలాకి అత్తగార్లంటే భయం. పౌలా నాయనమ్మ అసాధ్యురాలు అవడంతో ఆమె తల్లి తన అత్తగారి వల్ల చాలా బాధలు పడింది. అందుకని కూతుళ్ళు ఇద్దరికీ అత్తగార్ల మీద దురభిప్రాయం కలిగేలా పెంచింది. కాబట్టి పౌలా తన అత్తగారిలోని చెడ్డతనం ఇంకా బయట పడలేదని, త్వరలోనే అది బయట పడుతుందని భావించసాగింది. ఆమె తల్లి ఆ భయాన్ని అంతలా నూరి పోసింది.

జూడీకి మోకాళ్ళ నొప్పులు. కూర్చున్నంత సేపు ఏం కాదు. కాని లేచి నిలబడినా, నడిచినా మోకాళ్ళ నొప్పులు వస్తాయి. దాంతో ఆవిడ చక్రాల కుర్చీలో కూర్చునే ఇంట్లో తిరుగుతూంటుంది. అవసరమైన వస్తువులన్నీ చక్రాల కుర్చీలో కూర్చుంటే ఆవిడకి అందేంత ఎత్తులోనే ఉంచాలని హోవార్డ్ పెళ్ళయిన కొత్తల్లో తల్లి గురించి చెప్తూ పౌలాకి చెప్పాడు.

పౌలాకి రెండు కోరికలు ఉన్నాయి. ఒకటి ఆ ఇంట్లో మూడో వ్యక్తి లేకుండా తను, తన భర్త మాత్రమే జీవించడం. రెండోది తన మామగారు సంపాదించిన ఆస్థి ద్వారా వచ్చే ఆదాయాన్ని తామిద్దరం అనుభవించడం. ఆ ఆదాయం ప్రతీ వేసవి శెలవులకి యూరప్‌లోని ఓ దేశంలో ఓ నెల పాటు ఉండి వచ్చేందుకు సరిపడేంత ఉందని తెలిసాక పౌలాకి ఈ కోరిక కలిగింది. పౌలాకి కళ తర్వాత గల అభిరుచి పర్యాటకం. ప్రపంచంలోని అన్ని దేశాలని చూడాలన్నది పౌలా కోరిక. కాని హోవార్డ్ ఆర్ట్ టీచర్ తప్ప అతని తండ్రిలా వ్యాపారస్థుడు కాడు. అతని జీతం ఇల్లు గడవడానికే సరిపోతుంది తప్ప పౌలా కోరికలు తీరేందుకు సరిపోదు. హోవార్డ్ కళ మీద రాసిన పుస్తకాన్ని ఆసక్తి చూపించిన ఇద్దరు ప్రచురణకర్తలు తిరస్కరించారు. మూడో ప్రచురణకర్త కేవలం ఐదు వందల డాలర్లు మాత్రమే చెల్లించి ప్రచురించాడు. అది పునర్ముద్రణకి వస్తే ఎక్కువ చెల్లిస్తానన్నాడు. కాని ఆ ప్రచురణకర్త భయపడ్డట్లుగా మొదటి ఎడిషన్ ఐదేళ్ళ దాకా అమ్ముడు పోని సూచనలు కనిపించాయి.

* * *

ఓ రోజు పౌలా ఇల్లు సర్దుతూ తన అత్తగారి కళ్ళజోడుని యధాలాపంగా మేంటెల్ పీస్ మీద ఉంచింది. మధ్యాహ్నం భోజనానంతరం పడుకుని నిద్ర లేచిన జూడీకి తన కళ్ళజోడు కనపడలేదు.



పచారీ సామాను కొనడానికి వెళ్ళి గంటన్నర తర్వాత పౌలా ఇంటికి తిరిగి వచ్చాక జూడీ చెప్పింది.

"నా కళ్ళజోడు ఎప్పుడూ ఉంచే చోట లేదు. నువ్వు తీసావా?"

పౌలాకి మేంటెల్‌పీస్ మీద అది కనిపించింది. దాన్ని తీసి అత్తగారికి ఇస్తూ చెప్పింది.

"సారీ అండి. పొరపాట్న దాన్ని నేనే మేంటెల్ పీస్ మీద పెట్టాను."

"ఇప్పుడు అంతా స్పష్టంగా కనిపిస్తోంది. ఇది లేకపోతే అంతా అలుక్కుపోయినట్లుగా కనిపిస్తుంది. కళ్ళజోడు కాబట్టి సరిపోయింది. ఇదే నా ఎమర్జన్సీ మందు నాకు అందకుండా పెడితే మరణించేదాన్ని. నాకు గుండె నొప్పి వస్తే దాన్ని వేసుకోవాలని డాక్టర్ చెప్పారు. దీన్ని ఎప్పుడు ఇక్కడ నించి తీయక."

దాన్ని పెట్టుకుని ఆవిడ తన మందుల రేక్ లోని ఓ మందు సీసాని చూపించి కోడలికి చెప్పింది. జూడీ లావుకి కారణం ఆవిడ తిండి కాదు. అందరిలా సామాన్యంగానే తింటుంది. థైరాయిడ్ సమస్య వల్ల ఆవిడ బరువు పెరిగింది.

పౌలాకి ఆ రాత్రి మెరుపులా ఆ ఆలోచన వచ్చింది. అవి ఆమెకి తెలిసిన రెండు కొత్త సమాచారాల్లోంచి పుట్టాయి. ఒకటి, కళ్ళజోడు లేకుండా జూడీకి ఏదీ కనపడదు. రెండు, ఎమర్జన్సీ మందు ఆవిడ ప్రాణాలని నిలుపుతుంది. చాలా రోజులుగా పౌలా తన అత్తగారు ఎప్పుడు పోతారా, ఆర్థికంగా తాము ఎప్పుడు స్వతంత్రులు అవుతామా అని ఆలోచిస్తోంది. తనకి వచ్చిన ఆ ఆలోచనకి ముందు పౌలాకి భయం కలిగింది. తర్వాత ఎక్సయింట్‌మెంట్ కలిగింది. తన అత్తగారి ప్రాణాలు సహజంగా పోయే ఓ దారి తనకి దొరికింది అనుకుంది.

ఆ ఆలోచన వచ్చాక రోజులు, వారాలు గడిచాయి. కాని పౌలా దాన్ని మనసు లోంచి తీసేయాలనుకున్నా అది పోవడం లేదు. ఆవిడ ఇలా ఇంకెంత కాలం జీవిస్తుందో? ఏ పక్షవాతమో వస్తే అన్ని చాకిరీలు తనే చేయాలి, ఆవిడ జీవించి ఎవరికీ ఏం ప్రయోజనం లేదు లాంటి ఆలోచనలు పౌలాలో ఉత్పన్నమవుతున్నాయి.

అనుకోకుండా పౌలా ఓ రోజు ఆ పని చేసింది. టివిలో ఓ టాక్ షో చూస్తున్న పౌలాకి అత్తగారి పిలుపు వినపడింది. ఆ పిలుపు లోని తీవ్రతని గమనించి చటుక్కున లేచి ఆవిడ గదిలోకి పరిగెత్తింది. ఆవిడ తన కళ్ళజోడు కోసం తడుముకుంటోంది.

"ఏమిటి?" అడిగింది పౌలా.

"నా కళ్ళజోడు. నా ఎమర్జన్సీ మందు." తడబడుతూ అడిగింది.

"గుండె నొప్పి వచ్చిందా?"

"అవును. త్వరగా అవి ఇవ్వు."

పౌలా ఆవిడ కుర్చీ పక్కనే ఉన్న కళ్ళజోడుని మెల్లిగా కుడికాలితో దూరంగా నెట్టింది.

"చూస్తాను ఉండండి."

పౌలా ఒంగి మెడికల్ రేక్‌లోని ఆవిడ ఎమర్జన్సీ మందుని వేలి గోటితో వెనక్కి నెట్టింది.

"దొరికిందా?" ఆవిడ మాటల్లో ఆందోళన.

"చూస్తున్నాను."

"త్వరగా."

నిమిషంలో ఆవిడ ఒళ్ళంతా చెమటతో స్నానం చేసినట్లుగా తడిసిపోయింది. ఆవిడ ఇంకేం మాట్లాడలేదు. వెనక్కి వాలిపోయింది. పౌలా ఆ గదిలోంచి నిశ్శబ్దంగా బయటకి నడిచింది. అరగంట ఆగి మళ్ళీ ఆవిడ గదిలోకి వెళ్ళి చూసింది. ఆవిడ అచేతనంగా పడి ఉంది. అప్పుడు హోవార్డ్‌కి ఫోన్ చేసి చెప్పింది.

"మీ అమ్మగారు మాట్లాడటం లేదు. పిలిచినా పలకడం లేదు. వెంటనే రండి. నాకు భయంగా ఉంది."

భర్త వచ్చేలోగా కళ్ళజోడుని తీసి ఆవిడ చెవులకి తగిలించింది.

* * *

కార్యక్రమాలన్నీ అయ్యాక హోవార్డ్‌తో చెప్పింది.

"మీ నాన్నగారి ఆస్థిని మీ పేర బదిలీ చేయించుకునే ఏర్పాట్లు చూడండి."

"నిజమే. విల్లు బేంక్ లాకర్లో ఉంది."

మర్నాడు హోవార్డ్ బేంక్ లాకర్ తెరిచి లాయర్ దగ్గరకి వెళ్ళాడు. పాలిపోయిన మొహంతో వచ్చి పౌలాతో చెప్పాడు.

"విల్లు ప్రకారం మా అమ్మ తన అరవై ఐదో ఏడు దాకా జీవిస్తేనే నాకు ఆస్థి వస్తుంది. ఈలోగా పోతే రాదు. అది మా నాన్న స్థాపించిన, నేను పని చేసే ఆర్ట్ స్కూల్‌కి వెళ్తుంది."

"ఎందుకలా రాసారు?" నివ్వెర పోతూ అడిగింది పౌలా.

"మా నాన్న వింత మనిషని చెప్పాగా? అమెరికన్ మహిళ సగటు వయసు అరవై ఏడుట. ఈలోగా మా అమ్మ మరణిస్తే నేను ఆవిడని సరిగ్గా చూసుకోనట్లట."





# 10. ఎవరు?

## రాబర్ట్ ఎడ్మండ్ ఆల్టర్

సైమన్ గుడ్డుని కొట్టి దాన్ని పేన్‌లోని నూనె మీద వేసాడు. సరిగ్గా ఆ సమయంలోనే పక్కనే ఉన్న ఎనామిల్ కాఫీ పాట్ ఎగిరి గాల్లోకి లేచి, అందులోని కాఫీ నేల మీది ఇసుకలోకి ఒలికింది. ఆ తర్వాత సైమన్‌కి రైఫిల్ పేలిన చప్పుడు వినిపించింది.

వెంటనే అతను ఒలికిన కాఫీ పాట్ పక్కన నేల మీద రక్షణగా బోర్లా పడుకుని తల కొద్దిగా పైకెత్తి చూసాడు. సుమారు వంద గజాల దూరంలో, అతని కేంప్‌కి పశ్చిమం వైపు, కొండ అంచున ఓ పొద కనపడింది. తన మీదకి తుపాకీ పేల్చినవాడు అక్కడ నించి దాన్ని కాల్చి ఉండవచ్చని ఊహించాడు. అతను మోకాళ్ళ మీద కొద్ది దూరంలో తన టెంట్ వైపు, అందులో ఉంచిన తన వించెస్టర్ రైఫిల్‌ని అందుకోవాలని పాకాడు.

రెండోసారి తుపాకీ పేలడం, స్టవ్ మీది గుడ్డు ఉడికే పేన్ కూడా గాల్లోకి ఎగరడం ఒకేసారి జరిగాయి. అందులోని నూనె కొంత అతని తల మీద ఒలికి కాలింది. ఆ తర్వాత అతని నీళ్ళ కూజా కూడా గాల్లోకి ఎగిరి అందులోని నీరంతా నేల పాలైంది.

అప్పుడు సైమన్‌కి కొంత అర్థమైంది. ఆ రైఫిల్‌ని పేల్చినవాడికి మొదటిసారి గురి తప్పచ్చు. రెండోసారి కూడా గురి తప్పచ్చు. కాని వరసగా మూడుసార్లు గురి తప్పే అవకాశం లేదు. అంటే అతనికి తనని చంపాలని లేదు. మరి ఈ జీవం లేని వస్తువుల మీద గురి పెట్టి ఎందుకు కాల్చినట్లు?

మరోసారి రైఫిల్ పేలిన శబ్దం వినిపించడంతో పాటు, టేబిల్ మీది పీచెస్ ఉన్న రేకు డబ్బా గాల్లోకి ఎగిరి కిందపడింది. ఆఖరిసారి పేల్చిన గుండు వచ్చి టెంట్ పోల్‌కి తగిలింది. తక్షణం ఆ టెంట్ కుప్ప కూలింది.

అతను తల తిప్పి తన గుర్రం వంక చూసాడు. ఒకవేళ అతను కనుక దాన్ని చంపితే, ఇక తను ఉపేక్షించకుండా, తన ప్రాణాలకి తెగించి కూలిన టెంట్‌లోని రైఫిల్‌ని అందుకుని వంద గజాల దూరంలో పొద వెనుక దాక్కున్న అతన్ని చంపాలని నిశ్చయించు కున్నాడు. ఆ పొద మీదకి గురి చూసి కాలిస్తే చాలు. అది అతను కనపడకుండా రక్షిస్తుంది తప్ప, అతన్ని గుళ్ళ నించి కాపాడలేదు.

ఆ తుపాకీని పేల్చిన వాడికి తనని చంపాలనే కోరిక లేదని, కేవలం ఆటగా తన వస్తువులని కాల్చాడని సైమన్‌కి అప్పటికే అర్థమైంది. అది ఎవరి పని? అది వెస్టన్ స్టైల్ జోక్. నేడు తుపాకులని ధరించి స్వేచ్ఛగా తిరిగే రెడ్ ఇండియన్స్, చట్ట విరుద్ధంగా ప్రవర్తించే నేరస్థులైన కౌబాయ్‌లు క్రమంగా కనుమరుగవుతున్నారు. ఐనా అప్పుడప్పుడు తాగిన మైకంలో తుపాకీని ఇలా తప్పుగా ఉపయోగించే వారు లేకపోలేదు. పంతొమ్మిదో శతాబ్దం నించి

అమెరికా ఇరవయ్యవ శతాబ్దంలోకి అడుగు పెడుతూన్న ఈ తరుణంలో ఇలాంటి సంఘటనలు అరుదుగా జరుగుతూంటాయి అని సైమన్ అనుకున్నాడు.

కిడ్, జెస్సి, ఎర్ప్ లాంటి కౌబాయ్ హీరోల గురించిన అనేక కథలు విని కొందరు తాము కూడా అలాంటి హీరోలు కావాలనుకుని ఇలా పిచ్చిగా ప్రవర్తిస్తూండటం కద్దు. ఆ పొద వెనక మనిషి ఇలాంటి తరహాకి చెందినవాడై ఉంటాడు. బహుశ తన అవస్థని చూసి అతను పగలబడి నవ్వుకుంటూండి ఉంటాడు. తను దొంగలని, నేరస్థులని పట్టుకునే షరీఫ్. కాబట్టి తనని ఏడిపించాననే క్రెడిట్ కోసం ఈ పని చేసి ఉంటాడు.

ఆఖరిసారిగా మళ్ళీ రైఫిల్ పేలింది. అతని తల ముందు అడుగు దూరంలో నేలని తాకిన బులెట్ వేగానికి కొంత ఇసుక గాల్లోకి లేచింది. వెంటనే సైమన్ కూలిన టెంట్‌లోకి దూరి తన వించెస్టర్ రైఫిల్‌ని అందుకున్నాడు. ఐతే దూరం అవుతున్న గుర్రపు డెక్కల చప్పుడుని బట్టి ఆట ముగిసిందని గ్రహించాడు. ఆ గుర్రపు డెక్కల శబ్దం ఆ పొద దిశ వైపు నించే వినిపించింది.

సైమన్ చేతిలో రైఫిల్‌తో, ఒంగుని ఆ ఏభై అడుగుల కొండ మీదకి చకచకా ఎక్కాడు. దాని మీది ఆ పొద వెనక వెదికాడు. అక్కడ ఎవరూ లేరు. ఆ రైఫిల్‌ని పేల్చినవాళ్ళని పట్టించే ఒక్క క్లూ కూడా కనపడలేదు. నేల మీద ఇసుకలోని గుర్రపు కాలి గుర్తుల వల్ల అతనికి దాని యజమాని వివరాలేం తెలీలేదు. ఆ జోకర్ తను కాల్చిన రైఫిల్ గుళ్ళ ఖాళీ కేట్రిడ్జిలని అక్కడ వదిలేయకుండా తీసుకెళ్ళాడు. లేకపోతే వాటిని బట్టి అతను వాటిని ఏ దుకాణంలో కొన్నాడో తనకి తెలిసేది. అందుకే వాటిని తీసుకెళ్ళి ఉంటాడు.

సైమన్ ఆ చిన్న కొండ దిగి గుడారాన్ని, తన వస్తువులని తీసి గుర్రం మీద ఉంచాడు. కాఫీ కెటిల్, ఫ్రైయింగ్ పేన్‌లకి రంధ్రాలు పడి పనికి రాకుండా అయ్యాయి. టెంట్ పోల్ కూడా ఇక పనికి రాదు. ఇంకా నయం. తన గుర్రాన్ని కాలిస్తే ముప్పై రెండు మైళ్ళు కాలి నడకన వెళ్ళాల్సి వచ్చేది.

గుర్రం మీద అతను స్టేగ్ అనే చిన్న ఊరికి చేరుకున్నాడు. ఆ ఎడారిలోని ఓ చిన్న సెటిల్‌మెంట్ ప్రదేశం స్టేగ్. దాన్ని దాటేవారు కొద్దిసేపు విశ్రాంతి తీసుకోడానికి, దాహాన్ని, ఆకలిని తీర్చుకుని మళ్ళీ బయలుదేరడానికి ఉపయోగించే చిన్న కూడలి మాత్రమే అది. అక్కడ చర్చి కాని, ఇళ్ళు కాని, ఏ సౌకర్యాలు కాని లేవు. ప్రయాణీకుల అవసరాల కోసం ఓ దుకాణం, ఓ బార్ మాత్రం నడుస్తున్నాయి. తెలిసిన వారెవరూ తమ దగ్గర ఎక్కువ డబ్బుతో స్టేగ్‌లోకి రారు. దాని నిజాయితీ అలాంటిది.

'పోస్ట్ ఆఫీస్' అనే బోర్డు గల ఓ చిన్న భవంతిలో ముందు గుర్రం దిగి సైమన్ బయట గుంజకి గుర్రాన్ని కట్టేసి లోపలకి వెళ్ళాడు.

'హలో మిస్టర్ సైమన్. ఏమైనా జంతువులని వేటాడారా?" దాని యజమాని అడిగాడు.



అతను పోస్టాఫీస్ కం హార్డ్‌వేర్ దుకాణాన్ని అందులో నడుపుతున్నాడు.

"కొత్త కాఫీ పాట్, ఫ్రైయింగ్ పేన్, కప్పు, టెంట్ పోల్ కావాలి."

"కొత్తవి కొంటున్నారంటే మీరు ఎక్కడో బంగారు గనిని కనుక్కుని ఉండాలి. అవునా?" సమాధానం వస్తుందన్న ఆశ లేకపోయినా ఆ స్టోర్ యజమాని అడిగాడు.

ముభావి అయిన సైమన్ నోట్లోంచి ఒక్క మాట కూడా బయటకి రాలేదు. తనకి అవసరం అయినవి తీసుకుని డబ్బు చెల్లించి వాటిని తర్వాత తీసుకుంటానని చెప్పి ఓ పక్కన పెట్టాడు. తర్వాత ఎదురుగా ఉన్న బార్‌లోకి వెళ్ళాడు. ఐదారుగురు కౌబాయ్ టోపీలని ధరించి బల్ల ముందు కూర్చుని పేకాట ఆడుతున్నారు. వాళ్ళ ముందు బీర్ మగ్గులు ఉన్నాయి.

"హలో సైమన్. కూర్చుంటారా?" వారిలో ఒకరిద్దరు మర్యాదగా అడిగారు.

అతను బదులుగా తల ఊపి వాళ్ళ ముందు కూర్చున్నాడు. వారి ఆట అవగానే ఈసారి సైమన్‌కి కూడా ముక్కలని పంచారు. అతను ఆట ఆడుతూ పెద్దగా ఏం మాట్లాడలేదు. 'ఓ కార్డ్, చెక్, కాల్, రెయిజ్' లాంటి ఆటకి సంబంధించిన మాటలనే ముక్తసరిగా మాట్లాడాడు. అతని అదృష్టం బావుండి రెండు వందల డాలర్లని గెల్చుకున్నాడు. అతను లేచి దానికి అనుబంధంగా నడిచే హోటల్ రిసెప్షనిస్ట్ దగ్గరకి వెళ్ళి చెప్పాడు.

"గది కావాలి."

"జో చెప్పాడు, మీరు చాలా కొత్త వస్తువులు కొన్నారని. బంగారు గనిని కనిపెట్టారా?" అడిగాడు ఆ మెక్సికన్ రిసెప్షనిస్ట్.

యథాప్రకారం బదులు చెప్పకుండా సైమన్ మెట్లెక్కి మేడ మీద తనకి అలాట్ చేసిన గదిలోకి వెళ్ళాడు. గడ్డం గీసుకుని, స్నానం చేసి మంచం మీద పడుకున్నాడు.

అతను మళ్ళీ కిందకి దిగి బార్‌లోకి వచ్చేసరికి చీకటి పడుతోంది. ఓ స్టేక్‌ని (పంది మాంసం) ఓ రమ్ బాటిల్‌ని కొని బార్‌లో ఓ గంట సేపు గడిపాడు.

* * *

సైమన్ తను కొన్న ఆ పెద్ద బాటిల్‌లోని రమ్‌ని రోజుకి కొంత చొప్పున మొత్తానికి పూర్తి చేసాడు. రోజూ పేకాటే అతని కాలక్షేపం.

సైమన్ మూడు రోజుల తర్వాత హార్డ్‌వేర్ స్టోర్‌లోని తన సామాను తీసుకుని గుర్రం మీద తిరిగి బయలుదేరాడు. అదే చోట ఎప్పటిలా టెంట్‌ని బిగించాడు. రోజూ సమీపంలోని వాగు ప్రాంతంలోని ఇసుకని పరిశీలించసాగాడు. ఆ వాగులో బంగారు రజను కొట్టుకు వస్తుందని ప్రతీతి. వాగు దారిలో ఎక్కడో బంగారు గని ఉందని చాలా మంది నమ్మకం. ఎంతమంది ప్రయత్నించినా అది ఎవరికీ కనపడలేదు. సైమన్ తన అదృష్టాన్ని పరీక్షించుకోడానికి అక్కడ మళ్ళీ మకాం వేసాడు.

ఆ రాత్రి కేంప్ ఫైర్‌లో సైమన్ పేన్‌లో గుడ్ల సొనని, పంది మాంసాన్ని కలిపి వేయిస్తూండగా గుర్రపు డెక్కల చప్పుడుని విన్నాడు. స్టవ్ మీది నిప్పుని చూసి చీకట్లో ఎవరో తన దగ్గరకి వస్తున్నారని అతనికి అర్థం అయింది. వెంటనే తన నడుముకి ఉన్న హోల్‌స్టర్ లోంచి రివాల్వర్‌ని బయటకి తీసాడు. దాని సేఫ్టీ కేచ్‌ని తీసి దాన్ని కాళ్ళ దగ్గర దుప్పటి కింద దాచాడు. వించెస్టర్ రైఫిల్‌ని కుడి చేత్తో పట్టుకుని వచ్చే ఆ వ్యక్తిని దూరం నించే చూసాడు. దగ్గరకి వచ్చాక ఆ వ్యక్తిని గుర్తు పట్టి రైఫిల్‌ని నేల మీద ఉంచి, రివాల్వర్‌ని మళ్ళీ హోల్‌స్టర్‌లో ఉంచుకున్నాడు.

ఆ వచ్చిన అతను టోప్ జెన్కిన్స్. అతను పద్దెనిమిదేళ్ళ కుర్రాడు. కొంత కాలం సైమన్ దగ్గర పని చేసాడు కూడా. టోప్ గుర్రాన్ని ఆపి దిగి, దాన్ని చెట్టుకి కట్టేసి వచ్చి సైమన్ ఎదురుగా నిప్పు ముందు కూర్చున్నాడు.

"హలో సైమన్. కాఫీ వాసన దూరానికే బాగా వేస్తోంది." చెప్పాడు.

సైమన్ మౌనంగా కెటిల్ లోంచి కప్పులో కాఫీని పోసి అతనికి ఇచ్చాడు. అతను ఓ గుక్క తాగి, సంతృప్తిగా తల ఊపి అడిగాడు.

"నాలుగు రోజుల క్రితం నీకు ఏదో ఇబ్బంది కలిగిందని విన్నాను?"

ఎప్పటిలా సైమన్ మాట్లాడలేదు.

"స్టేగ్‌లోని వాళ్ళు చెప్పారు. ఎవడో జోకర్ నీ వస్తువులన్నిటినీ రైఫిల్‌తో తమాషాకి కాల్చేసాడట? వాడు దక్షిణ దేశానికి చెందిన వాడని పందెం కాస్తాను. అటు వైపు వాళ్ళే ఇలాంటి పనులు తరచూ చేస్తూంటారు."

సైమన్ వెంటనే పేన్‌ని నిప్పులోంచి తీసి కిందపెట్టాడు. తర్వాత తన రైఫిల్‌ని అందుకుని అందులోని గుళ్ళని బయటకి తీసాడు. టోప్ ఎలాంటి భావం లేకుండా చూస్తుండగా సైమన్ లేచి టోప్ గుర్రం దగ్గరకి వెళ్ళి దానికి వేలాడే అతని రైఫిల్‌ని అందుకున్నాడు. దాని గుళ్ళని కూడా తీసి జేబులో వేసుకుని రైఫిల్‌ని బేరల్‌తో పట్టుకుని బండరాయి మీద నాలుగుసార్లు బలంగా మోది, దాన్ని నిరుపయోగం చేసి తుప్పల్లోకి విసిరేసాడు.

"నీకు పిచ్చెక్కిందా?" టోప్ లేస్తూ అడిగాడు.

సైమన్ టోప్ నడుముకి ఉన్న బెల్ట్‌ని పట్టుకుని గాల్లోకి లేపి అతన్ని కిందకి కుదేసాడు. బిత్తరపోతూ లేస్తున్న అతని దవడ మీద బలంగా మోదడంతో టోప్ మళ్ళీ వెనకి పడ్డాడు.

"నీకేమైనా పిచ్చెక్కిందా? ఏమిటిది?" మళ్ళీ అడిగాడు టోప్.

"ఎందుకంటే నా వస్తువులని తుపాకీతో నాశనం చేసింది ఎవరో నాకు ఇప్పుడు తెలిసింది. నేను ఎవరికీ ఏదీ చెప్పలేదు. విన్నావా మూర్ఖుడా? జరిగింది నేను ఎవరికీ ఏదీ చెప్పలేదు." లేస్తున్న అతన్ని మళ్ళీ ఇంకోసారి గడ్డం కింద కొట్టి చెప్పాడు సైమన్.



# 11. ఏక్టింగ్ జాబ్

## రిచర్డ్ డెమింగ్

అతన్ని చూడగానే మిర్నా కాల్‌వర్ట్‌కి నూట ఏభై ఏళ్ళ క్రితం లండన్‌లోని వేశ్యలని చంపిన జాక్-ది-రిప్పర్ గుర్తొచ్చాడు.

"నాపేరు మూర్. ఇందాక మీకు ఫోన్ చేసింది నేనే." అతను సోఫాలో కూర్చున్నాక ఆమె వంక సూటిగా, ఆరాధనగా చూస్తూ చెప్పాడు.

"నాకేదో ప్రాణాంతక సమస్య ఉందని, దాన్ని నాకు చెప్తానని ఇందాక మీరు ఫోన్‌లో అన్నారు. ఏమిటిది?" అడిగింది మిర్నా.

"మిస్ మిర్నా. మీరు నటించిన ప్రతీ చిత్రాన్ని కనీసం ఐదు సార్లయినా చూసి ఉంటాను. పెద్ద తెర మీద, టివిలో, టేప్‌లో, డివిడిలో, ఐపాడ్‌లో. మీరు అత్యంత గొప్ప సినీ తార. నేను మీ అభిమానిని."

మిర్నా అతని కళ్ళల్లోని ఆరాధనని గమనించింది. వెంటనే భృకుటి ముడి వేసి చెప్పింది.

"నా ఆటోగ్రాఫ్ తీసుకోడానికా మీరు వచ్చింది? అందుకోసమైతే రానివ్వనని ఈ అబద్ధం చెప్పారా?"

"కానే కాదు. మిమ్మల్ని నేను అభిమానిస్తున్నాను కాబట్టి మీకు మేలు చేయడానికే వచ్చాను. హాని చేయడం నా వృత్తే అయినా అందుకు రాలేదు."

"హాని చేయడం మీ వృత్తా? మీరు నాకు ఏం హాని చేయగలరు?"

"కొంత పెద్ద రుసుముకి మనుషుల్ని తొలగించే సంస్థ నించి నేను మీ దగ్గరకి వచ్చాను."

"మీరు ప్రొఫెషనల్ కిల్లరా?" ఆశ్చర్యంగా అడిగింది ఆ హాలివుడ్ నటి.

"అవును. నా బాస్ నాకు ఈ పనిని అప్పగించాడు. కాని మిమ్మల్ని చంపడం నాకు ఇష్టం లేక మీ దగ్గరకి వచ్చాను. ఇది మీకు చెప్పి నా ఉద్యోగంలో నేను ఎన్నడూ చేయని పని చేసాను. ఈ సంగతి మా బాస్‌కి తెలిస్తే నా ప్రాణాలు పోతాయి."

"మీ పేరు?"

"పేర్లు వద్దు. మన మధ్య సంభాషణ నా బాస్‌కి నేను చెప్తే కాని తెలీదు కదా?"

"నన్ను ఎందుకు చంపడం?"

"మాకు చంపాల్సిన మనిషి ఫోటో, చిరునామా ఇస్తారు తప్ప చంపడానికి కారణం చెప్పరు."

"నన్ను చంపమని మీ సంస్థని ఎవరు కోరారు?" అడిగింది మిర్నా.

"ఒకవేళ నేను పట్టుబడ్డా అది పోలీసులకి తెలియకూడదని ఆ సమాచారం కూడా నాకు ఇవ్వరు. నేను గత ఐదేళ్ళుగా మీతో ప్రేమలో ఉన్నాను. అఫ్‌కోర్స్. నాలా మీతో ప్రేమలో ఉన్న వేల మందికి అది ఒన్ సైడెడ్. మీకు విడాకులు అయ్యాయని తెలీగానే, నాలాంటి సామాన్యుడికి అది సాధ్యం కాదని తెలిసినా మిమ్మల్ని పెళ్ళి చేసుకోవాలనే కోరిక కూడా కలిగింది." నవ్వాడు.

"ఇదంతా నేను పోలీసులకి చెప్పి వారి రక్షణ కోరితే?" మిర్నా ప్రశ్నించింది.

"అది వెంటనే పేపర్లలో వస్తుంది. ఆ తర్వాత పది పన్నెండు గంటల్లో నన్ను నా సంస్థ మనుషులు చంపేస్తారు. మిమ్మల్ని చంపడానికి ఓ షరతు ఉంది. మీరు ఈ రాత్రి కనక పేరిస్‌కి వెళ్ళే విమానం ఎక్కితే మిమ్మల్ని చంపకూడదు. మీరా విమానంలో లేకపోతే అది బయలుదేరిన గంటలోగా మిమ్మల్ని చంపాలి అని నాకు సూచన ఇవ్వబడింది."

"మేక్స్ ఫెన్నర్!" ఆమె వెంటనే కోపంగా చెప్పింది.

"ఎవరు? నిర్మాతా?" అతను అడిగాడు.

"అవును. అతనికీ నాకూ మధ్య ఓ గొడవ నడుస్తోంది. అతని కొత్త సినిమాలో నేను హీరోయిన్‌ని. రాతకోతలు పూర్తయి నాకు అడ్వాన్స్ కూడా ముట్టింది. ఐతే అతను మనసు మార్చుకుని విన్ జోర్డాన్‌ని ఆ సినిమాకి బుక్ చేసాడు. అగ్రిమెంట్ ప్రకారం ఒక వేళ నన్ను తీసేస్తే నాకు లక్ష డాలర్లు నష్టపరిహారంగా ఇవ్వాలి. నన్ను తన తర్వాతి సినిమాకి తీసుకుంటానని, లక్ష డాలర్లు ఉచితంగా ఇవ్వలేనని, విన్ జోర్డాన్ ఆ సినిమాలో నటించడానికి నాకు అభ్యంతరం లేదని ఉత్తరం రాసివ్వమని కోరాడు. అతని సినిమా కోసం నేను ఇంకో సినిమాని వదులుకున్నాను. పేరిస్‌లో తీసే చిత్రానికి ఆ డేట్స్‌కి నాకు ఇంకో పాత్ర వచ్చే ఏర్పాటు చేసాడు. ఐతే అది చాలా తక్కువ పారితోషికం. అదీ కాక అతను నన్ను బుక్ చేసిన సంగతి పేపర్లలో వచ్చింది. ఇప్పుడు నన్ను తీసేసి పైకి వస్తున్న విన్ జోర్డాన్‌ని పెట్టుకుంటే నా పరపతి పోతుంది. నా కెరీర్ నాశనం అవుతుంది."

"ఏదో కారణంగా మీరే ఆ పాత్రని తిరస్కరించారని చెప్పచ్చుగా?"

"విన్ ఆ పాత్రలో నటిస్తే అది ఆమెకి గొప్ప బ్రేక్ ఇచ్చే పాత్ర అవుతుంది. ఎట్టి పరిస్థితుల్లో నేనే దాంట్లో నటించాలి. లేదా నా కెరీర్ దాదాపు ముగిసినట్లే అవుతుంది. మేక్స్ ఫెన్నర్ లక్ష డాలర్ల కోసం నన్ను హత్య చేయించేంత నీచుడని నేను ఎన్నడూ అనుకోలేదు."

"మాకు ముట్టేది పది వేల డాలర్లే. తొంభై వేల డాలర్లు లాభించే వ్యాపార లావాదేవీగా దీన్ని అతను భావించి ఉంటాడు." అతను చెప్పాడు.

"నేను వెంటనే మీకు పది వేల డాలర్ల నగదుని ఇస్తాను. మీరు మేక్స్‌ని చంపుతారా?" ఆశగా అడిగింది.

అతను తల అడ్డంగా ఊపాడు.



"ఆ పని చేస్తే నేను మోసం చేసానని ఇట్టే గ్రహించి మా సంస్థ నన్ను చంపేస్తుంది."

"ఇంకెవరో అతన్ని చంపించారని వాళ్ళు అనుకోవచ్చుగా?"

"లాస్ ఏంజెలెస్‌లో ఇలాంటి సంస్థ మాది ఒక్కటే. పూర్వం వ్యక్తిగతంగా పని చేసే ప్రొఫెషనల్ కిల్లర్స్ అందరూ మా సంస్థలో ఉద్యోగస్థులు అయ్యారు."

"నేను మిమ్మల్ని నా బాడీగార్డ్‌గా వాళ్ళిచ్చే జీతానికి రెట్టింపు జీతంతో నియమించుకుంటే?" కొద్ది సేపు ఆలోచించి అడిగింది మిర్నా.

"దాని కన్నా నేను ఆత్మహత్య చేసుకుని మరణించడం మంచిది. లేదా వాళ్ళు నన్ను హింసించి చంపుతారు."

"నేను మీకు లక్ష డాలర్లు ఇప్పటికిప్పుడు ఇస్తాను. మీరు ఇంకేదైనా ఊరు వెళ్ళి జీవించవచ్చుగా?"

"లాభం లేదు. మిమ్మల్ని చంపడానికి ఇంకొకర్ని నియమిస్తారు. వారు ఇలా ముందు చెప్పరు. సింపుల్‌గా మిమ్మల్ని చంపేస్తారు."

మిర్నా మొహంలోని భయం అధికం అయింది.

"మీ నించి నా మీద అభిమానాన్ని వేరు చేస్తే మీరు కర్కశమైన హంతకుడు కదా?"

"అవును."

"అర్థమైంది. నన్నేం చేయమని మీ సలహా?" అడిగింది.

"నేనే మీరైతే పేరిస్‌కి వెళ్ళే ఆ విమానాన్ని ఎక్కి ఫ్రాన్స్‌లో తీసే ఆ చిత్రంలో నటిస్తాను. అది చిన్న పాత్రయినా సరే. దాని ముందు మీ ప్రాణాలు గొప్పవి కదా."

"సరే. మీ సలహాని పాటిస్తాను. మేక్స్ ఫెన్నర్ ఎంతటి దుర్మార్గుడో నాకు తెలిసేలా చేసిందుకు థాంక్స్."

"నేను మిమ్మల్ని కలిసినట్లు ఎవరికీ చెప్పకండి. చెప్తే నా ప్రాణాలు గాల్లో కలుస్తాయి."

"నా ప్రాణాలని కాపాడిన మీ గురించి ఎవరితో చెప్పను. ఆఖరికి నేను రాయబోయే ఆత్మ కథలో కూడా ఇది రాయను. మీకు నన్ను ముద్దు పెట్టుకునే కోరిక ఉంటే అది నిరభ్యంతరంగా తీర్చుకోవచ్చు. నిజానికి మీకు ఇంకా పెద్ద బహుమతే ఇవ్వాలని ఉంది. కాని రెండు గంటల్లో సామాను సర్దుకుని ఎయిర్‌పోర్ట్‌కి వెళ్ళాలిగా." నవ్వుతూ అతని వైపుకి ఒంగి చెప్పింది మిర్నా కాల్‌వర్ట్.

* * *

"ఏమైంది జాన్?" తన ఆఫీసు గదిలోకి వచ్చిన అతని వంక ఆదుర్దాగా చూస్తూ అడిగాడు చిత్ర నిర్మాత మేక్స్ ఫెన్నర్.

"అంతా సజావుగా సాగింది. మీరు నిజంగా తనని చంపించాలని అనుకుంటున్నారని మిర్నా నమ్మింది. ఆమె ఎయిర్‌పోర్టులో పేరిస్‌కి వెళ్ళే విమానం ఎక్కడం చూసాకే నేను మీ

దగ్గరకి వస్తున్నాను. మిర్నా నన్నేదైనా నాటకంలో చూసిందేమో, గుర్తు పడుతుందేమో అని భయపడ్డాను." జాన్ చెప్పాడు.

"సినిమా హీరోయిన్లు సాయంత్రాలు పార్టీలకి వెళ్ళడం మాని నాటకాలకి వెళ్తే బాగుపడతారు." నవ్వాడు మేక్స్.

"వెరీ గుడ్. లక్ష డాలర్లు ఉచితంగా ఇవ్వడం ఇష్టం లేక ఆలోచిస్తే నాకు ఈ పథకం తట్టింది. నా సినిమాలో మెయిన్ విలన్ పాత్రని నీకు ఇస్తాను. మాట తప్పేవాడిని కాను. కాబట్టి రేపు వచ్చి కాంట్రాక్ట్ మీద సంతకం చేయి."

"థాంక్స్! విలన్‌గా ఎన్నో నాటకాల్లో నటించాను సార్. నా సత్తా ఏమిటో చిత్రం రిలీజ్ అయ్యాక మీరే చూస్తారు."

* * *

"సర్. మీకోసం హోవార్డ్ స్మిత్ అనే అతను వచ్చాడు. మీకు లాభించే ఓ ముఖ్యమైన విషయం చెప్పాలిట." మర్నాడు సెక్రటరీ చెప్పింది.

మేక్స్ ఫెన్నర్ ఇంటర్‌కంలో జవాబు చెప్పాడు.

"పంపించు."

కొద్ది క్షణాల్లో తన గదిలోకి వచ్చిన, దృఢంగా ఉన్న అతన్ని చూసి అడిగాడు.

"మిస్టర్ హోవార్డ్ స్మిత్? ఏమిటి మీరు నాకు లాభించే ముఖ్యమైన విషయం చెప్పాలనుకున్నది?"

"నిన్న ఈ సమయానికి మీరు మిస్ కాల్‌వర్ట్‌కి ఏం చేయబోయారో అది మీకు చేయడానికి వచ్చాను మిస్టర్ ఫెన్నర్."

"నువ్వు ఏం మాట్లాడుతున్నావో నాకు అర్థం కావడం లేదు."

"మిస్ కాల్‌వర్ట్‌ని చంపడానికి మీరు ప్రొఫెషనల్ కిల్లర్‌ని నియమించారు. బదులుగా విన్స్ పిగోలెట్టి నన్ను ఆ పని చేయమని మీ దగ్గరకి పంపారు."

"మాఫియా బాస్ విన్స్ పిగోలెట్టీ?" భయంగా అడిగాడు ఫెన్నర్.

"అవును. మిర్నాకి ఆయన అభిమాని. మిర్నా జరిగింది ఆయనకి చెప్పగానే మా సంస్థని కాంటాక్ట్ చేసాడు. పిగోలెట్టి మీ చర్యకి ప్రతి చర్యని చేపట్టారు. మిమ్మల్ని నేను చంపబోయే ముందు ఎందుకు చంపుతున్నానో మీకు చెప్పి మరీ చంపమని కోరారు. మీరు సిద్ధమా?"

అతను పేంట్‌కి నడుంకి మధ్య దాచిన సైలెన్సర్ అమర్చిన పిస్తోలుని బయటకి తీసి రెండు సార్లు కాల్చినా శబ్దం పక్క గదిలోని సెక్రటరీకి వినపడలేదు. అతను బయటకి వెళ్తూ ఆమెకి థాంక్స్ చెప్పి వెళ్ళిపోయాడు.



# 12. బందీ

## ఎడ్వర్డ్ డి హోక్

ఆయన గేట్లోంచి బయటకి తన ఒంటి మీది దుస్తులతో, జేబులో కొన్ని డాలర్లతో బయటకి వచ్చాడు. కొద్ది దూరం వెళ్ళాక వెనక్కి తిరిగి తన జీవిత కాలంలో అరవై రెండేళ్ళు గడిపిన ఆ జైలు భవంతి వంక చూసాడు. తను అందులో అంత కాలం ఉన్నా ఆ భవంతి బయటి భాగం ఎలా ఉంటుందో గుర్తు లేదు. ఆ జైలు బయటి దృశ్యాన్ని తనని జైల్లోకి తీసుకెళ్ళినప్పుడు మాత్రమే చూసాడు. అది గుర్తు లేని దృశ్యం. తనిప్పుడు స్వతంత్రుడు. ఈ ప్రపంచంలో ఎక్కడికైనా వెళ్ళచ్చు. ఒక్క మళ్ళీ ఆ ఖైదులోకి తప్ప.

వెనక్కి తిరిగి మళ్ళీ ఆయన నడవసాగాడు. వృద్ధాప్యం వల్ల ఆయన అడుగులు నెమ్మదిగా తడబడుతూన్నాయి.

"ఎక్స్‌క్యూజ్ మి."

ఆ మాటలు వినపడగానే ఆయన తల తిప్పి చూసాడు. ఓ యువకుడు తన వెంటే నడవడం గమనించాడు.

"మీరు పవర్‌మేన్. అవునా?"

"అవును."

"నేను డైలీ న్యూస్ దినపత్రిక నించి. అన్నేళ్ళు జైల్లో గడిపాక స్వేచ్ఛా జీవి అవడం వల్ల మీకిప్పుడు ఎలా అనిపిస్తోంది? దయచేసి మా పాఠకుల కోసం మీ భావాలని చెప్పగలరా?"

"సారీ. నో కామెంట్."

"ఇంకో ప్రశ్న. మీకు విచారంగా ఉందా?"

"దేనికి విచారం?"

"మీరా పని చేసినందుకు. లేకపోతే జైలుకి వెళ్ళేవారు కారు. మీ జీవితంలోని అధిక భాగం అక్కడ గడిపేవారు కారు. కదా?"

"ఈ వయసులో ఏ విషయంలో కూడా నాకు విచారం కలగదు."

"మీరు ఈ ఊళ్ళోనే ఉండదలచుకున్నారా?"

"నేనింకా అది నిశ్చయించుకోలేదు." పవర్ మేన్ తన అడుగుల వేగాన్ని పెంచాడు.

"ఆఖరి ప్రశ్న...?"

"సారీ. ఇక నేనే ప్రశ్నకీ జవాబు చెప్పలేను."

పవర్ మేన్ ఆ రిపోర్టర్ తన వెనకే రావడం గమనించాడు. అతన్ని వదిలించుకోడానికి తన దగ్గరున్న తక్కువ మొత్తం లోంచి కొంత ఖర్చు చేయక తప్పదనుకున్నాడు.

సమీపంలోని ఓ టేక్సీని ఎక్కి టౌన్ సెంటర్‌లో దిగి డ్రైవర్‌కి ఐదు డాలర్లు ఇచ్చాడు.

ఆయన పూర్వం చూసిన దాని కన్నా ఆ ఊరు బాగా మారిపోయిందని గ్రహించాడు. అప్పుడప్పుడు జైల్లోని దినపత్రికల్లో ఆ ఊరులోని మార్పులని గురించి చదివినా ఆ మార్పుకి పవర్‌మేన్ సిద్ధంగా లేక పోవడంతో గుడ్లప్పగించి చూస్తూ నడవసాగాడు. అంత ఎత్తయిన భవంతులని ఆయన చూడటం అదే మొదటిసారి. మూడు అంతస్థుల వరకే ఆయనకి తెలుసు. కాని ఇప్పుడు ఇరవై ఒక్క అంతస్థుల భవంతులు కూడా వాటి స్థానంలో వెలిసాయి.

పట్టణంలోని పాత ప్రాంతానికి కాలి నడకన చేరుకున్నాడు. తనకి తెలీని కొత్త సంస్కృతి ఆ పట్టణంలో ఓ భాగం అయిందని గ్రహించాడు. తను త్వరగా దానికి అలవాటు పడాలి. పవర్ ఊహించినట్లుగానే పాత పట్టణంలోని ఇళ్ళు మారలేదు. అక్కడ స్కై స్క్రేపర్స్ లేవు. జైలుకి వెళ్ళక మునుపు ఆయన నివశించింది ఆ ప్రాంతమే.

ముందుగా పూర్వం తను నివశించిన ఇంటిని వెదికి పట్టుకున్నాడు. దాని బయట 'గదులు అద్దెకి. రోజుల చొప్పున లేదా నెలసరి' అన్న బోర్డుని చూసాడు. తన సోదరుడు దాన్ని అమ్మేసానని చాలా ఏళ్ళ క్రితం ఉత్తరం రాసినా ఆయనకి అది గుర్తు లేదు.

తలుపు తీసిన యువతి వెలిసి పోయిన నీలం రంగు డ్రస్‌లో ఉంది.

"గది కావాలి." అడిగాడు.

"రోజులా? నెలలా?"

"ముందు రోజులు. తర్వాత అది నెలసరిగా కూడా మారచ్చు."

"అదృష్టవశాత్తూ మా దగ్గర ఓ గది ఖాళీగా ఉంది. రండి. చూడండి."

పవర్‌మేన్ ఆమె వెంట నడిచాడు. ఆ ఇల్లు చూస్తూంటే ఆయనలో భావోద్వేగం ముంచుకు వచ్చింది. తన తల్లితండ్రులతో సోదరి, సోదరులతో తన పదిహేడవ ఏట దాకా గడిపిన ఇల్లది. సరిగ్గా తను ఆ రోజుల్లో ఉన్న గది తలుపునే తెరిచి చెప్పింది.

"ఇది సౌకర్యవంతమైన గది."

ఆమె లోపలకి వెళ్ళి గదిలో లైటుని వెలిగించింది. పవర్‌మేన్ ఆ గది వంక చూసాడు. గోడల రంగు మారింది.

"ఎక్స్‌క్యూజ్ మీ. కారిడార్ వెలుగులో మిమ్మల్ని గుర్తించలేక పోయాను. మీరు ఇదివరకు మా దగ్గర బస చేసారా?" అడిగింది.

"లేదు."

"మీ మొహం నాకు బాగా పరిచయంలా అనిపిస్తోంది."

"కాకపోవచ్చు. నేను ఈ ఊళ్ళోకి ఇప్పుడే వచ్చాను."

"గుర్తొచ్చారు. నిన్న మీ ఫోటోని డైలీ న్యూస్ పేపర్‌లో చూసాను. మీరు పవర్‌మేన్."

"అవును."



"సారీ. మీరు మా హోటల్‌లో ఉండటం మా వ్యాపారానికి దెబ్బ."

ఆమె ఆ గదిలోంచి బయటకి వచ్చింది.

"సారీ మిస్టర్ పవర్ మేన్. మీ గురించి ఇక్కడి అందరికీ తెలుసు. అద్దెకి ఉన్న మిగిలిన వాళ్ళు మీరు ఇక్కడ ఉన్నారని తెలిస్తే ఖాళీ చేసేస్తారు. పరిస్థితిని మీరు అర్థం చేసుకోగలరని అనుకుంటాను."

అర్థం అయిందన్నట్లుగా తల ఊపి అడిగాడు.

"దగ్గర్లో ఇలాంటిది ఇంకోటి ఉందా?"

ఆమె జవాబుగా తల అడ్డంగా ఊపింది.

"సారీ మిస్టర్ పవర్‌మేన్. నాకు తెలిసి ఎవరూ ఓ హంతకుడికి గది ఇవ్వరు."

పవర్‌మేన్ ఆ సందు లోంచి ఇంకో సందు లోకి వెళ్ళాడు. ఓ చోట 'గదులు అద్దెకి' అనే బోర్డుని చూసి ఆ ఇంటి తలుపు తట్టాడు. ఓ నలభై అయిదేళ్ళ అతను తలుపు తెరిచాడు.

"నాకో గది అద్దెకి కావాలి."

"మీ పేరు?"

"జాన్ స్మిత్." పేరు మార్చి చెప్పాడు.

"పవర్‌మేన్ కాదా?"

"కాదు. అతనెవరు?"

"మీరే."

మొహం మీదే తలుపు వేసేసాడు. తన మొహం ఇద్దరు గుర్తు పట్టడం పవర్‌మేన్‌కి ఆశ్చర్యాన్ని కలిగించింది. 'పేయింగ్ గెస్ట్ అకామడేషన్ అవైలబుల్' అన్న బోర్డు గల ఇంకో ఇంటి తలుపు తట్టాడు. ఆవిడ కూడా పవర్‌మేన్‌ని గుర్తు పట్టి గది ఇవ్వడానికి నిరాకరించింది. ఆ ఇంటి పక్కనే ఓ చిన్న చీప్ బార్ కనిపిస్తే పవర్‌మేన్ అందులోకి నడిచాడు.

"బీర్." చెప్పాడు బార్ స్టూల్ మీద కూర్చుని.

అతను పవర్‌మేన్‌ని గుర్తు పట్టలేదు. ఓ మగ్‌లో చల్లటి బీర్ ఇచ్చాడు. పవర్‌మేన్ దాన్ని అందరి కన్నా తక్కువ సమయంలో తాగి మగ్‌ని నింపమని కోరాడు. రెండోసారి నెమ్మదిగా తాగసాగాడు. అకస్మాత్తుగా టివిలో తన ఫొటో కనిపించడం, అనౌన్సర్ ఏదో చెప్పడం, ఆ బార్ మేన్ ఆయన్ని గుర్తు పట్టడం జరిగిపోయాయి.

"ఆశ్చర్యం! నువ్వేనా? ఇంత కాలం తర్వాత స్వతంత్రుడివి ఐనందుకు ఎలా ఉంది? అమెరికాలో అత్యధిక కాలం జైల్లో గడిపింది నువ్వేనని వార్తా పత్రికల్లో రెండు రోజుల నించి రాస్తున్నారు." అడిగాడు.

"ఆ హత్యని చేసినవాడివి అంత చిన్న తప్పు చేసి ఎలా దొరికి పోయావు?" ఇంకొకరు ఆసక్తిగా దగ్గరకి వచ్చి అడిగారు.

ఒకడు ఓ కత్తిని పవర్‌మేన్ జేబులో ఉంచి ఎగతాళిగా నవ్వుతూ చెప్పాడు.

"రెండో హత్యకి."

మరొకరు మరో ప్రశ్న, ఇంకొకరు ఇంకో ప్రశ్న...పవర్‌మేన్ ఏ ప్రశ్నకి జవాబు చెప్పకుండా డబ్బు చెల్లించి మౌనంగా బయటకి నడిచాడు. కొద్ది దూరంలో ఇంకో బోర్డింగ్ హౌస్ కనిపించింది. అక్కడికి గది తీసుకోడానికి వెళ్ళాడు. ఆ ఇంటావిడ చెప్పింది.

"నువ్వు పవర్‌మేన్‌వి. నువ్వు గది కోసం తిరుగుతున్నావని మా అసోసియేషన్ నించి నాకు ఫోన్ వచ్చింది. ఎవరూ ఈ ఊళ్ళో నీకు గది అద్దెకి ఇవ్వరు. అది వృధా శ్రమ."

చిన్నగా మూలిగాడు పవర్‌మేన్.

"ఎప్పుడో హత్య చేసిందుకు ఇప్పుడు గది ఇవ్వకపోవడం ఏమిటి?"

"వ్యాపారం దెబ్బ తింటుంది."

పవర్‌మేన్ మరో రెండు చోట్ల ప్రయత్నించాడు. కాని వారంతా ఆయన వస్తారని ఎదురు చూస్తున్నట్లుగా కనిపించారు. వాళ్ళల్లో వాళ్ళు ఫోన్ చేసి తన గురించి చెప్పుకుని ఉంటారని ఊహించాడు. ఆయన కాళ్ళు సమీపం లోని రైల్వే స్టేషన్‌కి దారి తీసాయి. అక్కడి వెయిటింగ్ రూంలో పడుకున్నాడు. అరగంట కూడా నిద్రపోలేదు. ఎవరో లేపారు.

"మిస్టర్. దయచేసి మీ టిక్కెట్‌ని చూపిస్తారా?"

"నేను ఎక్కడికీ వెళ్ళడం లేదు. కాబట్టి నా దగ్గర టిక్కెట్ లేదు."

"ఐతే మీరీ గదిని వాడుకోకూడదు. దయచేసి వెళ్ళండి."

అక్కడి నించి లేచి బయటకి వచ్చాడు. కొద్ది క్షణాలు ఆలోచించి మళ్ళీ రోడ్ల వెంట నడవసాగాడు.

జైలుకి వెళ్ళక మునుపు తను నివశించిన ఇంటికి చేరుకుని బెల్ నొక్కాడు. ఇందాకటి ఆవిడే తలుపు తెరిచింది. పవర్‌మేన్ లోపలకి నడిచాడు.

"మళ్ళీ వచ్చారా? మీకు గది ఇవ్వనని..."

ఆవిడ గొంతులోకి కత్తి దిగడంతో ఆవిడ చటుక్కున నేల మీదకి కూలిపోయింది. పవర్‌మేన్ టెలీఫోన్ దగ్గరకి వెళ్ళి ఓ నంబర్ డయల్ చేసి చెప్పాడు.

"హలో. ఇక్కడో హత్య జరిగింది. వెంటనే రండి...నేనే హంతకుడ్ని మాట్లాడుతున్నాను."

అడ్రస్ చెప్పి ఫోన్ పెట్టేసి ఆయన ఓ కుర్చీలో కూర్చుని సిగరెట్‌ని అంటించాడు.





# 13. అన్వేషణ

## ఏ. ఎఫ్. ఓర్సనిక్

ఆ రోజు వచ్చిన వర్షానికి ఆ సిమెట్రీలోని సమాధుల మీద ఉంచిన పూల గుత్తుల రేకులన్నీ బురదనేల మీదకి రాలిపోయాయి. ఆ పూలకి కట్టిన సేటిన్, నైలాన్ రిబ్బన్స్ ఊడిపోయి అవి కూడా బురద నీటిలో చిక్కుకుని తడిసి మెరుస్తున్నాయి.

రెయిన్ కోట్ ధరించిన విల్సన్ బ్లాక్ ఆ సిమెట్రీలోకి ప్రవేశించాడు. వాతావరణం బావున్నా కూడా సిమెట్రీలు ఆహ్లాదకరమైన ప్రదేశాలు కావు. ఆయనకి సిమెట్రీలతో పరిచయం అధికం. తన అరవై మూడేళ్ళ జీవితంలో విల్సన్ బ్లాక్ నలభైమంది భార్యలని సమాధి చేసాడు. బఫెలో నగర సమీపంలోని మౌంట్ కేవలరిలో, సేండియాగో సమీపంలోని ఎల్ కేమినోలో, సెయింట్ లూయిస్ సమీపంలోని ఓక్ గ్రీవ్‌లో...ఇంకా ఇలాంటి అనేక చిన్న గ్రామాల్లోని సిమెట్రీల్లో ఆయన భార్యలు పాతిపెట్టబడ్డారు. ప్రతీ వారికి ఖరీదైన హెడ్ స్టోన్ అమర్చాడు.

ఆయన పైన వెండి చుట్టిన వాకింగ్ స్టిక్‌ని ఓ చేతిలో పట్టుకుని నడుస్తున్నాడు. ఒకప్పుడు అలంకరణ కోసం కొన్నా నేడు అది నడకకి ఆధారంగా ఆయనకి ఉపయోగిస్తోంది. ఇప్పుడు ఆయన చేతిలో ఆ కర్ర లేకుండా ఎక్కడికీ వెళ్ళలేని స్థితి.

విల్సన్ ఓ సమాధి దగ్గరకి వెళ్ళి తన చేతిలోని పూల గుత్తిని దాని మీద ఉంచి, కొద్ది క్షణాలు కళ్ళు మూసుకుని ప్రార్థించాడు. దాని పక్కనే ఉన్న ఓ సమాధి ముందు ఓ ఏభై ఏళ్ళ మహిళ నిలబడి ఉంది. ఆ సమాధి మీద పూల గుత్తి ఉంది. విల్సన్ బ్లాక్ ఆవిడ వంక చూసాడు. ఐదడుగుల రెండంగుళాల పొడవు. సన్నగా ఉంది. ఆ వయసు వారిలా లావుగా లేదు. నల్లటి జుట్టులో అక్కడక్కడా తెల్ల వెంట్రుకలు మెరుస్తున్నాయి. వారిద్దరి మధ్య ఏభై గజాల దూరం ఉన్నా విల్సన్ ఆవిడని స్పష్టంగా చూడగలిగాడు.

విల్సన్ ఆ సిమెట్రీకి ఈ వారంలో నాలుగోసారి రావడం. వచ్చిన ప్రతీసారి ఆమెని చూసాడు. ఆమె ఒంటరిగా ఆ సమాధి ముందు కనపడుతుంది. ఒకోసారి మోకాళ్ళ మీద కూర్చుని ప్రార్థిస్తూ, మరోసారి ఆ సమాధిలోని వారితో ఏదో మాట్లాడుతూ, ఒకోసారి చుట్టుపక్కల గడ్డిలోని కలుపు మొక్కలని పీకుతూ లేదా బైబిల్‌ని చదువుతూ కనిపించింది. రెండోసారి విల్సన్ ఆ సమాధి ముందుకి వెళ్ళి దాని మీది పేరుని చదవాలని అనుకున్నాడు. కాని ఇంకా ఆ ఫలకం దానికి అతికించలేదు. అది కొత్తగా కట్టిన సమాధి అని చూస్తూంటే తెలిసిపోతోంది.

బహుశా ఆవిడకి పిల్లలు ఉండి ఉండరు. అందుకే ఒంటరిగా వస్తోంది. ఆ కారణంగానే భర్త మీద ప్రేమ అధికంగా ఉండి ఉండాలి. పిల్లలు లేని దంపతుల మధ్య

పెళ్ళయిన వారానికే విల్సన్ బ్లాక్ మనసు మారింది. మొదటిసారి ఆయన 'డబ్బు ఒద్దు, లిజాలాంటి భార్య కావాలి' అని నిశ్చయించుకున్నాడు. లిజాతో తన శేష జీవితం ఎంతో ఆనందంగా సాగుతుందని ఆ వారాంతానికే ఆయనకి అనిపించింది. మొదటిసారిగా అతనికి వైవాహిక జీవితం తృప్తికరంగా ఉంది. ఇల్లు శుభ్రంగా ఉంచుతుంది. లిజా రుచికరంగా వండుతుంది. పక్కలో సుఖాన్ని ఇస్తుంది. కారే పంపులని రిపేరు చేస్తుంది. మాడిన బల్బులని తనే తొలగించి కొత్తవి అమరుస్తుంది. చెత్త సంచులని బయటకి తనే తీసుకెళ్ళి పడేస్తుంది. చుట్టుపక్కల ఇళ్ళల్లోని పిల్లలు వీరింటికి వచ్చి ఆడుకుని వెళ్తుంటారు. అందుచేత 'తన భార్యని ఎలా చంపాలి?' అని పెళ్ళయ్యాక ప్రతీసారి తొలిచే ప్రశ్న అతని మెదడుని తొలచడం ఆగిపోయింది.

తనకి అరవై మూడు. కావాల్సినంత డబ్బుంది. లేనిదల్లా అనుకూలవతి అయిన భార్య. తన మాజీ భార్యల్లో ఎవరిలో లేని మంచి గుణాలు ఎన్నో లిజాలో ఆయనకి కనిపించాయి. అతని ప్రతీ మాటని లక్ష్యపెడుతూ, దేనికి వ్యతిరేకించే స్వంత అభిప్రాయాలని ప్రదర్శించకుండా లిజా మసలుకుంటోంది.

ఓ రాత్రి లిజా విల్సన్‌కి ఓ పని చెప్పింది. పెళ్ళయ్యాక ఆమె చెప్పిన మొదటి పని అది.


"ఈ చెత్త బేగ్‌ని దయచేసి బయట ఉంచి వస్తారా? ఆహార పదార్థాల వ్యర్థాలు గల ఇది ఇంట్లో ఉంటే వాసన వేస్తుంది."

"అలాగే."

విల్సన్ ఆ బేగ్‌తో బయటకి నడిచాడు. మూడో మెట్టు, రెండో మెట్టు, మొదటి మెట్టు మీద నించి ఆయన పాదం కింద పడగానే, పెద్దగా అరుస్తూ కాలు జారి కింద పడ్డాడు. పిల్లలు ఆడుకునే చక్రాల కార్లు, ఎక్కడ కాలు వేసినా వాటి మీద పడేలా అక్కడ నేల మీద అమర్చబడి ఉన్నాయి. అతని తల కాంక్రీట్ మెట్టు అంచుకి బలంగా తగిలి విచ్చుకుంది.

* * *

సిమెట్రీలోని విల్సన్ సమాధి దగ్గర నించుని ఎలిజబెత్ కళ్ళు తుడుచుకుంది. ఆమెకి సిమెట్రీలకి వస్తే ఎంతో విచారంగా ఉంటుంది. వాటిల్లో పాతిపెట్టబడ్డ పదిహేడు మంది భర్తలు ఆమెకి గుర్తుకు వస్తారు. విల్సన్ బ్లాక్ ఆమె పద్దెనిమిదో భర్త.






# 14. అనుమానం లేని హత్య

## మైఖేల్ కుర్లాండ్

స్పానిష్ భాష మాట్లాడే ఆ దేశంలో సాయుధ తిరుగుబాట్లు సర్వసాధారణం. మిలటరీ అధికారులు ఒకరిని మరొకరు కూలదోయడానికి సదా ప్రయత్నిస్తూంటారు. ఆ దేశంలో గత ఇరవై ఏళ్ళల్లో ప్రజాస్వామ్యం రెండుసార్లే రాజ్యం చేసింది. అదీ అతి తక్కువ కాలం.

ఆ దేశ రాజధానిలో నివశించే మేన్యువల్ హిస్ పోజఫోర్గస్‌కి ఓ సోదరుడు ఉన్నాడు. అతని పేరు ఫిలిప్పె. మేన్యువల్‌కి తన సోదరుడు ఫిలిప్పె అంటే ఇష్టం లేదు. ఫిలిప్పేకి కూడా మేన్యువల్ అంటే అదే భావన ఉంది. వారిద్దరూ ఆ నగరంలోని దూర ప్రాంతాల్లో నివశిస్తున్నారు. ఒకరింటికి మరొకరు అరుదుగా వస్తుంటారు. వారి మధ్య గల శతృత్వం గురించి వారి బంధువులు అందరికీ తెలుసు. ఒకరిద్దరు వారికి రాజీ చేయాలని ప్రయత్నించారు కాని ఉపయోగం లేకపోయింది. అసలు వారి మధ్య శతృత్వ భావానికి కారణం వారి మనస్తత్వాలే తప్ప తండ్రి ఆర్జించిన ఆస్తి పంపకాలో మరొకటో కాదు. అకారణ మానసిక ద్వేషాన్ని తొలగించడం కష్టం.

ఫిలిప్పె ఓ ఫర్నిచర్ దుకాణాన్ని ఆరంభించాడు. త్వరలోనే అది ఆ నగరంలోని అతి పెద్ద దుకాణంగా విస్తరించింది. మేన్యువల్ రేస్ కోర్సుల్లో, కోడి పందేల్లో గెలిచి డబ్బు సంపాదించాలని ప్రయత్నించి విఫలం అయ్యాడు. అతని డబ్బంతా పోవడంతో, అదే సమయంలో ఫిలిప్పె ఆర్థికంగా ఎదగడంతో మేన్యువల్‌కి తన తమ్ముడంటే అసూయ, ద్వేషం కలిగి అవి పెరుగుతూ వస్తున్నాయి.

మేన్యువల్ ప్రేమించిన యువతినే ఫిలిప్పె పెళ్ళి చేసుకోవడం వల్ల కూడా మేన్యువల్‌కి తమ్ముడంటే ద్వేషం కలిగింది. అతనికి ఎంతటి ద్వేషం కలిగిందంటే, ఫిలిప్పెని చంపాలని కూడా ఆలోచించాడు. తుపాకీతో కాల్చి, విషం ఇచ్చి, గొంతు పిసికి, కారుతో ఏక్సిడెంట్ చేసి...ఎలా చంపాలా అని కూడా తీరిక సమయాల్లో ఆలోచిస్తూ పథకాలు వేస్తూంటాడు. అనేక డిటెక్టివ్ పత్రికలని, ట్రూ క్రైం పత్రికలని చదివే మేన్యువల్‌కి చంపి తప్పించుకోవడం చాలా తేలికనే అభిప్రాయం కలిగింది. ఓ కథ చదివితే అది ముగిసాక 'విలన్ పప్పు సుద్ద. నేనైతే ఆ పొరపాటు చేసే వాడిని కాను. అందువల్ల వాడిలా పట్టుబడేవాడిని కాను' అనుకుంటూంటాడు.

ఐతే మేన్యువల్ ఏ పథకాన్నీ అమలు చేయకపోవడానికి కారణం అతనిలోని పిరికితనమే. జాక్ ది రిప్పర్ తప్ప మిగిలిన ప్రపంచ ప్రఖ్యాత నేరస్థులంతా కీర్తివంతులై పుస్తకాల్లోకి ఎక్కడానికి కారణం వారు పట్టుబడటమే అని మేన్యువల్ అభిప్రాయం. తను కూడా పట్టుబడి, అలా పదిమందికి తెలియాలనే కోరిక అతనిలో లేదు.

స్థానిక పోలీసుల మీద అతనికి మంచి అభిప్రాయం లేదు. వారు తను చదివే కథల్లోని పోలీసుల్లా తెలివైనవారు కారు. నేర పరిశోధనలో మొరటు పద్ధతులనే అనుసరిస్తారు కాబట్టి వారు తనని పట్టుకుంటారనే భయం లేదు. కాకపోతే ఫిలిప్పె హత్య చేయబడితే వారి అనుమానం ముందుగా తన మీదకి మళ్ళుతుంది. తీసుకెళ్ళి చిత్రహింసలు పెట్టి తనే హంతకుడని ఒప్పుకోమని బలవంతం చేస్తారు. ఆ చిత్ర హింసలని భరించలేక తను నిజం చెప్పచ్చు. కాబట్టి అసలు అనుమానం రాని పద్ధతిలో లేపేయాలి. అందువల్ల మేన్యువల్ తన రహస్య కలని ఇంకా నిజం చేసుకోలేకపోయాడు.

మళ్ళీ తిరుగుబాటు మొదలైంది. అది మొదలైన రెండో రోజు మేన్యువల్‌కి ఆ ఆలోచన తళుక్కున కలిగింది. దాన్ని గురించి ఆలోచించిన కొద్దీ అది అతనికి ఎంతో ఉద్వేగాన్ని కలిగించింది. తను తప్పక సాధించగలడన్న నమ్మకం కలిగింది.

మూడో రోజు చీకటి పడే సమయంలో మేన్యువల్ వెళ్ళి ఫిలిప్పె దుకాణం తలుపు తట్టాడు. ఎప్పటిలా ఫిలిప్పె ఆలస్యంగా తన స్టోర్‌లో పని చేసుకుంటున్నాడు. మేన్యువల్ బద్ధకస్తుడైతే ఫిలిప్పె పని రాక్షసుడు. అప్పటికే తన సిబ్బంది అంతా ఇళ్ళకి వెళ్ళిపోవడంతో ఫిలిప్పె లేచి వెళ్ళిన తన స్టోర్ తలుపు తెరిచాడు. మేన్యువల్‌ని చూసి చాలా ఉదాసీనంగా అడిగాడు.

"నీకేం కావాలి?"

"శతృవుని చూసినట్లు చూడక. ఈ ప్రాంతంలో అధికంగా గొడవలు జరుగుతున్నాయి. లూటింగ్, కాల్చడాలు, తగలపెట్టడాలు, చంపడాలు. నువ్వెలా ఉన్నావో అని చూద్దామని వచ్చాను."

ఫిలిప్పె జవాబు చెప్పకుండా వెనక్కి తిరిగి తన బల్ల దగ్గరకి వెళ్ళాడు.

"నువ్వు ఇంటికి రావాల్సింది. నేను కొద్ది నిముషాల్లో షాపు కట్టేసి బయలు దేరుతున్నాను."

"ఇంకొద్ది సేపట్లో కర్ఫ్యూ మొదలవుతుందిగా?"

"అవును. లేకపోతే రాత్రంతా షాపులో గడపాలి."

"మళ్ళీ గొడవలు మొదలయ్యాయి కాబట్టి ఈ రాత్రి నీ షాపుని దౌర్జన్యకారులు లూటీ చేస్తారని, తగలపెడతారనే భయం నీకు లేదా?" మేన్యువల్ ప్రశ్నించాడు.

"అదే జరిగితే అందుకు బాగా సంతోషించేది నువ్వే అని నాకు తెలుసు." ఫిలిప్పె నిర్లిప్తంగా చెప్పాడు.

మేన్యువల్ నవ్వాడు కాని బదులు చెప్పలేదు.

"పోలీసులు ఈసారి సమర్థవంతంగా పని చేస్తున్నారని దినపత్రికలో చదివాను. అదీ కాక నాకు ఇన్సూరెన్స్ ఉంది." ఫిలిప్పె చెప్పాడు.



మేన్యువల్ కొద్ది క్షణాలు ఆగి అడిగాడు.

"నిన్న నాకు వచ్చిన ఓ గొప్ప ఆలోచనని చెప్పడానికి వచ్చాను. అందులో ఎలాంటి లోటు లేదు. ఉంటే నువ్వు కనుక్కోగలవా?"

"నేను బిజీగా ఉన్నాను. మధ్యలో నువ్వు మాట్లాడుతూంటే లెక్క తప్పుతోంది వెళ్ళు." ఫిలిప్పె ఇందాకటి ఉదాసీనతతోనే చెప్పాడు.

"ఆ ఐడియా నీ విషయంలోనే కలిగింది."

ఫిలిప్పె ప్రశ్నార్థకంగా తలెత్తి చూసాడు. మేన్యువల్ తన చొక్కాలోంచి ఓ రివాల్వర్‌ని బయటకి తీసి ఫిలిప్పెకి గురి పెట్టాడు. వెంటనే ఫిలిప్పె కుర్చీలోంచి చటుక్కున లేచాడు.

"ఏమిటిది?" ప్రశ్నించాడు.

"రివాల్వర్. కొద్దిగా పాతది. ఐనా చక్కగా పని చేస్తుంది. నిన్ను చంపడానికి వచ్చాను."

"దేనికి నన్ను చంపడం?"

"కొన్నేళ్ళుగా ఇది తప్ప నేనింకేం కోరుకోవడం లేదు."

"నిన్ను ఉరి తీస్తారు." హెచ్చరికగా చెప్పాడు ఫిలిప్పె.

"ఊహు. అదే నా ఆలోచనలోని గొప్పతనం. చెప్తా విను."

ఫిలిప్పె మేన్యువల్ వంక చూసి చెప్పాడు.

"నీకు పిచ్చెక్కినట్లుంది."

"ఏ హత్యలో అయినా సమస్య శవంతోనే. పోలీసులు హతుడి శవాన్ని చూసే హంతకుడి కోసం వెదుకుతారు. క్లూలని సంపాదిస్తారు. సాక్షుల కోసం వెదుకుతారు. హత్యకి ఓ కారణాన్ని ప్రతిపాదిస్తారు. వారు క్రమంగా హంతకుడ్ని పట్టుకుంటారు."

"నువ్వు నన్ను చంపితే నిన్ను కనుక్కుని ఉరి తీస్తారు. అది జరగకూడదనుకుంటే బయటకి నడు. సాక్షులు లేరు. నేను జరిగింది ఎవరితోనూ చెప్పను."

ఫిలిప్పె చెప్పింది విననట్లే మేన్యువల్ మళ్ళీ చెప్పసాగాడు.

"ట్రిక్ ఏమిటంటే, పోలీసుల పరిశోధనని మొదట్లోనే ఆపేయడం. అంటే అసలు శవం దొరక్కపోవడం. అందుకు నాకో దారి దొరికింది. 'ఏ శవాలు దొరికితే వాళ్ళు హంతకుల కోసం వెదకరు?' అని ఆలోచించాను."

ఫిలిప్పె మౌనంగా వింటున్నాడు.

"నగరంలోని ఈ భాగంలో ఈ రాత్రి చాలా లూటింగ్ జరగచ్చని రేడియోలో విన్నాను. పోలీసులు ఈ భాగంలో ఎక్కువగా మోహరించి ఉన్నారట. వారికి 'కనపడితే కాల్చు' ఆజ్ఞలు జారీ చేయబడ్డాయి. ఒంట్లో తుపాకీ గుండు గల ఫిలిప్పె శవాన్ని రేపు చూసాక తమలో ఎవరో పొరపాట్న తన దుకాణాన్ని కట్టేసి బయటకి వెళ్ళే అతన్ని చంపారని వారు భావిస్తారు. లేదా అది ఉద్యమకారుల పని అని అనుకుంటారు. కొంతసేపటికి మనకి

పోలీసుల కాల్పులు వినిపిస్తాయి. వెంటనే నిన్ను బయటకి తీసుకెళ్ళి కాలుస్తాను. రేపు ఉదయం దాకా నీ శవాన్ని పోలీసులు చూడరు. అన్ని శవాలని రేపు ఉదయమే తీసుకెళ్తారు. నా పథకంలో తప్పుంటే చెప్పు. నేను వెళ్ళిపోతాను."

"నిన్ను ఉరితీస్తారు." నిస్సహాయంగా చూస్తూ చెప్పాడు ఫిలిప్పె.

"రేపు నీ మరణం గురించి తెలిసాక నేనెలా ఏడుస్తానంటే నీ మీద నాకు అంత ప్రేమ ఉందా అని అంతా ఆశ్చర్యపోతారు."

మేన్యువల్ తుపాకీని తన సోదరుడికి గురి పెట్టి ఓ సిగార్‌ని అంటించుకుని అడిగాడు.

"ఆఖరి సిగారు తాగుతావా?"

ఫిలిప్పె తల అడ్డంగా ఊపాడు. మేన్యువల్ లేచి వెళ్ళి ఫిలిప్పె తిరగబడకముందే అతని రెండు చేతులని వెనక్కి విరిచి వాటిని తనతో తెచ్చిన తాడుతో కట్టేసాడు. కాలం గడుస్తోంది. మేన్యువల్ మూడు సిగార్లు తాగాడు. బయట పూర్తిగా చీకటిపడి, నిశ్శబ్దం వ్యాపించింది. అకస్మాత్తుగా సమీపంలోంచి షాపు కిటికీ అద్దాలు పగులుతున్న శబ్దం, అరుపులు, మనుషులు పరిగెత్తుతున్న శబ్దం వినిపించాయి.

"లే."

ఫిలిప్పెని బయటకి నడిపించి తీసుకెళ్ళాడు మేన్యువల్.

"గుడ్ బై ఫిలిప్పె."

మేన్యువల్ తన రివాల్వర్‌ని ఫిలిప్పె ఛాతీకి గురి పెట్టాడు. తక్షణం తుపాకీ పేలిన శబ్దం వినిపించింది.

* * *

మర్నాడు ఉదయం పోలీసులు శవాల కోసం వెదుకుతూంటే మేన్యువల్ శవం ఫిలిప్పె దుకాణానికి కొద్ది దూరంలో కనిపించింది. అతని తల్లోకి గత రాత్రి ఓ పోలీసు పేల్చిన గుండు దిగి మరణించాడు.

"చీకట్లో సిగార్ వెలుగు చూసి ఈ లూటర్‌ని నేనే కాల్చాను." వారిలోని ఒకరు చెప్పారు.





# 15. సహాయకారి

## మేరియోన్ యం మార్ఖేహమ్

"నీలాంటి సహాయకారి ఈ ద్వీపంలో నివశించడం నా అదృష్టం." థెల్మానోర్ బూర్టన్ మృదువుగా చెప్పింది.

ఎవరి చేతైనా ఏదైనా పని చేయించుకోవాల్సి వచ్చినప్పుడు ఆమె కంఠం అలా మృదువుగా ఉంటుంది. ఆర్థర్‌తో మాట్లాడినప్పుడల్లా ఆమె కంఠం మృదువుగా మారడానికి కారణం, అతనితో పని పడినప్పుడే మాట్లాడుతూండటం. ఏదైనా మరమ్మత్తు చేయాల్సి వస్తే అందుకు డబ్బు ఇచ్చుకునే కంటే ఆర్థర్ చేత దాన్ని ఉచితంగా చేయించుకుంటుంది. టాయిలెట్ వాల్వ్, వేక్యూం క్లీనర్ స్విచ్, టివి సెట్‌లో రిసెప్షన్ సరిగ్గా లేకపోవడం... ఇలా ఏదో ఒకటి ఆవిడ ఇంట్లో తరచూ మారాం చేస్తూంటాయి. వెంటనే ఆవిడ ఆర్థర్‌కి ఫోన్ చేస్తుంది. అతను వచ్చి వాటిని బాగుచేసి పెడుతుంటాడు. పనయ్యాక అతనికో కప్పు టీ ఇస్తుంది. అంతే.

"మీరే లేకపోతే నేను ఏమై పోయేదాన్నో? నా భర్త హెన్రీ పోయాక నాకు ఎంత కష్టంగా ఉందో తెలుసా? రిపేర్‌కి వచ్చిన వర్కర్స్ ఎక్కువ డబ్బు తీసుకోవడమే కాక పని సరిగ్గా చేయకుండా నన్ను మోసం చేస్తూంటారు కూడా. పైగా చెప్పిన సమయానికి రారు. వారితో విసిగిపోయి మీ సహాయం కోరుతున్నాను." మృదువైన కంఠంలో బాధని మిళితం చేసి చెప్పింది.

* * *

ఆ రోజు ఆర్థర్ ఆమె సింక్ కింది భాగంలోంచి నీరు కారడాన్ని ఆపడానికి రిపేర్ చేస్తున్నాడు. అప్పటికే అతను ఆమె ఇంటికి వచ్చి రిపేరు చేయడం ఆ నెల్లో అది మూడోసారి.

"మిస్టర్ ఆర్థర్! మీరు, మిల్లీ మా పక్కింటికి వచ్చాక నా జీవితం ఇప్పుడు తేలిక పడింది. మిల్లీకి కూడా నిన్న నేను అదే మాట చెప్పాను."

ఆర్థర్ మిల్లీ నించి ఆ విషయం గత రాత్రే విన్నాడు.

"ఆమె నిన్ను పనివాడుగా భావిస్తోంది ఆర్థర్. నీతో కర్టెన్ రాడ్స్‌ని మార్పిస్తుంది. బాత్‌రూంలో లూజయిన టైల్‌ని మార్పిస్తుంది. ఆవిడ భర్త ఫొటోని బజారుకి తీసుకెళ్ళి ఫ్రేమ్ కట్టించి తెచ్చి ముందు గదిలో బిగించింది ఎవరు? మనం లూజియానానించి సౌత్ ఫ్లోరిడాలోని ఈ గోల్డ్ కోస్ట్‌కి వచ్చి ఎందుకు సెటిల్ అయ్యాం? రిటైర్డ్ జీవితాన్ని విశ్రాంతిగా గడపాలనేగా? సగటున వారానికి ఓ గంట మీరు ఆమెకి ఏదో ఓ పని చేసి పెడుతున్నారు." మిల్లీ అసహనంగా చెప్పింది.

"నేను ఎలా కాదనగలను?" ఆర్థర్ బదులు చెప్పాడు.

"నిన్నే కాదు. ఆమె నన్ను కూడా ఉపయోగించుకుంటోంది. కర్టెన్స్‌కి సరిపడే సోఫా కవర్లు ఎంపిక చేయడానికి తన వెంట సలహాకి షాపింగ్‌కి రమ్మంటోంది. మీరో పరోపకారి. ఒద్దన్నా వినరు. నాకీ వ్యవహారం పూర్తిగా అశాంతిగా ఉంటోంది."

ఆర్థర్ మౌనంగా విన్నాడు తప్ప జవాబు చెప్పలేదు.

"ఈసారి పిలిస్తే 'నేను రాను. నాకు కుదరదు' అని గట్టిగా చెప్పండి."

ఆర్థర్‌కి ఆ మాట చెప్పడానికి మొహమాటం అడ్డొస్తుందని మిల్లీకి తెలుసు.

* * *

ఆ రోజు ఉదయం థెల్మా మళ్ళీ ఆర్థర్ సహాయం కోరి వారి ఇంటికి ఫోన్ చేసింది. మిల్లీ ఆ ఫోన్ కాల్ రిసీవ్ చేసుకుని ఉంటే 'ఆయన లేరు' అని అబద్ధం చెప్పి పెట్టేసేది. కాని ఆర్థరే ఆ ఫోన్ కాల్‌ని రిసీవ్ చేసుకున్నాడు.

"ఆర్థర్! మీరోసారి అర్జెంట్‌గా రావాలి." థెల్మా కంఠంలో ఆందోళన ధ్వనించింది.

"ఏమైంది?"

"మీరు ఉన్న పళంగా రండి." ఏడుపు అడ్డు రావడంతో మాట్లాడలేక పోయిందావిడ.

"ఆవిడ ఏడ్చినా సరే. మీరు వెళ్ళడానికి వీల్లేదు." భర్త చెప్పింది విని మిల్లీ అడ్డు చెప్పింది.

"పాపం! ఏదో ప్రమాదం జరిగినట్లుంది."

"అందుకు ఆవిడ సహాయం చేసేవారిని పిలవడం నేర్చుకోనీండి. మనం లూజియానాలో ఉన్నంత కాలం నా వంట పాత్రలని నేనే తోముకున్నాను. సింక్ పాడైతే నేనే రిపేర్ చేసుకున్నాను. ఇంటికి నేనే రంగులు వేసాను. నా చేతులు ఇంత రఫ్‌గా మారడానికి కారణం వీటిని ఉపయోగించడమే. థెల్మా చేతులు ఎంత మృదువుగా ఉన్నాయో గమనించారా? ఒక్క పనీ చేయడం నేర్చుకోలేదు. బహుశా హెన్రీ చేతులు నా చేతుల్లా మొరటుగా మారి ఉంటాయి. బద్ధకస్థురాలు." మిల్లీ పళ్ళు పటపట కొరికింది.

"కాని మనలోని మంచితనాన్ని చంపుకోవడం దేనికి? ఇప్పుడు నేను ఖాళీగానే ఉన్నాగా?"

"మీరు థెల్మా సేవకుడు కాదు. నా భర్త. ఇరవై లక్షల డాలర్ల ఇల్లు గల ఆవిడ బీదదేం కాదు. ఎంత ఖరీదైన దుస్తులని ధరిస్తుందో మీరు గమనించారా?"

అతను ఏదో చెప్పబోతే గట్టిగా చెప్పింది.

"నేను తప్పు పట్టేది మిమ్మల్ని అనుకుంటే మీరు పొరబడ్డారు. ఆ థెల్మాని నేను తప్పు పట్టేది. ఆవిడ పనులు ఆవిడ చేసుకోవడం ఎన్నడో నేర్చుకుని ఉండాలి. ఇది అమెరికా. బ్రిటీష్ రాజ్ కాదు."

"ఎమర్జన్సీలో పిలిచింది."



భర్త వంక ఆమె నిరసనగా చూసింది.

"ఇలాంటప్పుడు వెళ్ళకపోతేనే ఆవిడకి మీరు ప్రతీసారి అందుబాటులో ఉండరన్న సంగతి తెలిసొస్తుంది."

ప్లీజ్ మిల్లీ! ఈ ఒక్కసారికి నన్ను వెళ్ళనీ." ఆర్థర్ ప్రాధేయపూర్వకంగా కోరాడు.

"అసలెందుకు వెళ్ళాలి మీరు? నేను థెల్మాతో చెప్తాను ఇక మీదట మనకి ఫోన్ చేయద్దని, మీరు ఆవిడ సర్వెంట్ కాదని." కోపంగా చెప్పింది.

ఆర్థర్‌కి వెళ్ళి థెల్మాకి సహాయం చేయాలని ఉంది. కాని భార్య మాట కాదని వెళ్ళాలనీ లేదు. ఏం చెయ్యాలా అని ఆలోచించాడు. అతనికో ఆలోచన తట్టింది.

"నేను వెళ్తాను. రెండు నిముషాల తర్వాత నువ్వు వచ్చి అర్జెంట్‌గా మనం బయటకి వెళ్ళాలని చెప్పు. వచ్చేస్తాను. అబద్ధం ఆడటం నీకు కొట్టిన పిండి కాబట్టి నేను అది ఆలోచించి నీకు చెప్పక్కర్లేదు. ఈ ఒక్కసారికీ ఇలా కానీ." సూచించాడు.

మళ్ళీ ఫోన్ మోగింది. ఈసారి మిల్లీ రిసీవర్‌ని అందుకుంది. అవతల వైపు నించి చెప్పేది విని చెప్పింది.

"ఆవిడే. అర్జెంట్‌ట. నేను సరిగ్గా ఐదు నిముషాల తర్వాత వచ్చి మిమ్మల్ని తీసుకు వస్తాను."

ఆర్థర్ వెంటనే తలుపు తెరచుకుని పక్కింటికి వెళ్ళాడు.

"ఓ ఆర్థర్! ఎంత ఆపద వచ్చి పడిందో తెలుసా? నా డైమండ్ రింగ్ సింక్‌లో పడింది." థెల్మా దుఃఖంగా చెప్పింది.

"అరెరె!"

"దాన్ని తీసి సింక్ గట్టు మీద పెట్టి చేతులు కడుక్కుని గోళ్ళకి రంగు వేసుకుని చూస్తే అది గట్టు మీద లేదు! కిందంతా వెదికినా కనపడలేదు. సింక్‌లో పడి ఉంటుంది. చూస్తే కనపడలేదు. డ్రైనేజ్ గొట్టంలోకి వెళ్తే ఇంక ఇంతే సంగతులు."

ఆర్థర్ తన ఇంట్లోకి వెళ్ళి, మిల్లీకి జరిగింది చెప్పి తన టూల్ బాక్స్ తెచ్చుకున్నాడు. డైమండ్ రింగ్ విలువైంది కాబట్టి మిల్లీ తనని పిలవడానికి రాదని అతను అనుకున్నాడు.

"హెన్రీ క్రితం క్రిస్‌మస్‌కే దాన్ని కొని నాకు బహుకరించాడు. ఛ! సింక్ గట్టున కాక ఈ బల్ల మీద పెట్టి ఉండాల్సింది. మీరు వాషింగ్ మెషీన్‌ని గంటలో బాగు చేసేసారు. ఇది ఎక్కువ సమయం పట్టదుగా! ఇంకో గంటలో నేను బ్రిడ్జ్ ఆడటానికి క్లబ్‌కి వెళ్ళాలి. నాకోసం చాలామంది అక్కడ ఎదురు చూస్తూంటారు. అందుకే గోళ్ళకి రంగు వేసుకున్నాను. మీకు టీ కలుపుతూ మాట్లాడతాను. ఇవాళ ఇంట్లో ప్లమ్ కేక్స్ ఉన్నాయి. డైమండ్ రింగ్ దొరికి మీరు చేతులు కడుక్కున్నాక...ఓ సారి ఇలాగే ఏమైందో తెలుసా? మావారు ఉన్నారప్పుడు," ఆర్థర్ పని చేస్తూంటే థెల్మా కుర్చీలో కూర్చుని చెప్పసాగింది.

డోర్ బెల్ మోగింది. థెల్మా వెళ్ళి తలుపు తెరిచింది.

"మిసెస్ థెల్మా. ఆర్థర్ సోదరుడు ఇప్పుడే ఫోన్ చేసాడు. అతను షికాగో నించి న్యూయార్క్‌కి వెళ్తూ విమానం ఇక్కడ మారుతున్నాడట. ఎయిర్‌పోర్ట్‌కి ఆర్థర్‌ని వెంటనే రమ్మని ఫోన్ చేసాడు." మిల్లీ మాటలు ఆర్థర్‌కి వినపడ్డాయి.

"ఎంత చెత్త అబద్ధం?' అనుకున్నాడు ఆర్థర్. షికాగో నించి న్యూయార్క్‌కి డైరెక్ట్ ఫ్లయిట్స్ ఉన్నాయి. ఇది దారి కాదు.

"అయ్యో! నా డైమండ్ రింగ్ డ్రెయిన్‌లో కొట్టుకుపోతే ఎలా?" థెల్మా బాధ పడింది.

"భయపడకండి. నేను వచ్చి దాని సంగతి చూస్తాను." మిల్లీ థెల్మా మాట్లాడేంత మృదువుగా చెప్పింది.

తర్వాత ఆర్థర్‌తో రహస్యంగా చెప్పింది.

"రెడ్ లాబ్‌స్టర్ రెస్టారెంట్‌లో నా కోసం వెయిట్ చేయండి. ఇక్కడ ఆవిడ పని పూర్తి చేసి వస్తాను."

అది కాలినడకన వెళ్ళేంత దూరంలో ఉన్న రెస్టారెంట్. తరచూ వారు ఆ రెస్టారెంట్‌లో భోజనం చేస్తుంటారు.

* * *

సింక్‌లోని చెత్త అడ్డుపడకుండా పోవడానికి అమెరికాలో సింకుల్లో గ్రైండర్ బ్లేడ్స్ ఉంటాయి. స్విచ్ వేస్తే అది ఆ చెత్తని పిప్పి చేస్తుంది. అప్పుడు నీళ్ళు పోసి చెత్తని గొట్టంలోంచి పంపడం తేలిక. నీళ్ళ దగ్గర ఎలక్ట్రిక్ వైర్లు ఉంటాయి కాబట్టి ప్రత్యేకంగా అక్కడ ఓ ఫ్యూజ్‌ని ఉంచుతారు. ఏ కారణంగానైనా ఆ వైర్లు బయటకి ఎక్స్‌పోజ్ అయితే, షాక్ తగలకుండా తక్షణం షార్ట్ సర్క్యూట్ అయి ఫ్యూజ్ పోయి అక్కడ విద్యుత్ నిలిచి పోయే ఏర్పాటు ఉంది.

రెండు రోజుల తర్వాత థెల్మా సింక్ దగ్గర పని చేస్తుండగా షాక్ తగిలి మరణించింది. పోలీసులు చేసిన పరిశోధనలో అక్కడి వైర్లు ఎక్స్‌పోజ్ అవడం, కొత్త ఫ్యూజ్ కాక మాడిపోయిన ఫ్యూజ్ ఉండటం గమనించారు. ఆవిడ దాని విషయంలో వెంటనే శ్రద్ధ తీసుకుని ఉంటే ఈ ప్రమాదం జరిగి ఉండదని వారు భావించారు.

ఆర్థర్ మిల్లీని దాని గురించి అడగలేదు. ఆవిడ కూడా చెప్పలేదు. ఆ తర్వాత వారి విశ్రాంత జీవితం సుఖంగా సాగింది.





# 16. గుండె నిండా ప్రేమ

## ఏ. మేథ్యూస్

ఆమెని చూడగానే అల్లిస్టర్ హగ్ గుండె లయ తప్పింది. కళ్ళప్పగించి లెనాడైన్ వంక చూస్తూండి పోయాడు. అది గమనించిన ఆమె అతన్ని చూస్తూ సన్నగా నవ్వింది.

లెనాడైన్ వయసు అల్లిస్టర్ వయస్సులో సగమే ఉంటుంది. నలభై. సన్నగా ఉండే ఆమెని చూస్తే ఆమె వయసు ముప్పై అనిపిస్తుంది. ఆమెలో అందం కన్నా సెక్స్ అపీల్ అధికంగా కనిపిస్తుంది. ఆమె ప్రతీ కదలికలో అది అల్లిస్టర్‌కి ప్రస్ఫుటంగా కనిపించింది.

"ఏమిటలా చూస్తున్నారు?" అడిగింది బికినీలో ఉన్న లైనాడైన్.

"ఉన్న నిజం చెప్తున్నాను. నా డబ్భై తొమ్మిదేళ్ళ జీవితంలో నీలాంటి అందగత్తెని నేను ఎన్నడూ చూడలేదు."

మధురంగా నవ్వింది.

"నా పేరు అల్లిస్టర్. నేను కేలిఫోర్నియా నించి వచ్చాను."

"నేను ఊటా రాష్ట్రం నించి వచ్చాను." ఆయనతో కరచాలనం చేస్తూ ఆమె చెప్పింది.

"మీరు వివాహితులా?" అడిగాడు.

మళ్ళీ మధురంగా నవ్వింది.

"చాలా సార్లు." జవాబు చెప్పింది.

"ప్రస్తుతం?"

"నా భర్త రెండు నెలల క్రితమే పోయాడు. దాంతో దుఃఖంగా ఉందని ఇక్కడికి వచ్చాను. హవాయ్ దీవిలో సముద్రపు ఒడ్డున అంతా ఆనందంగా, ఉత్సాహంగా ఉంటారు కదా? అందుకని ఇక్కడికి వచ్చాను." లెనాడైన్ లి క్లారె వివరించింది.

"నేను బర్కిలీ యూనివర్శిటీలో ఆర్కియాలజీ ప్రొఫెసర్‌గా పని చేస్తున్నాను. కాలేజీకి వేసవి శెలవులు కాబట్టి ఇక్కడికి వచ్చాను. ఏటా ఇక్కడికి వస్తున్నాను. నా భార్య పోయి ఆరేళ్ళయింది. కేన్సర్. మళ్ళీ పెళ్ళి చేసుకోలేదు."

"నా భర్త ఆర్నాల్డ్ పోయి రెండు నెలలైంది. అతను న్యూయార్క్‌లో స్కూల్స్ ఇన్‌స్పెక్టరేట్ ఆఫీసులో పని చేసేవాడు. నాకు పిల్లలు లేరు. పుట్టుకతోనే ఫేలోపియన్ ట్యూబ్‌లలో ఏదో లోపం ఉందని వైద్య పరీక్షల్లో తేలింది. నేను మోడల్ గర్ల్‌గా పని చేసేదాన్ని. నా భర్త ఇన్సూరెన్స్ కూడా భారీగానే వచ్చింది."

వారిద్దరూ హవాయ్‌లో ఉన్న రెండు వారాలు ఒకరితో మరొకరు మాట్లాడుకుంటూనే ఉన్నారు. ఒకరిద్దరు మగాళ్ళు కూడా లెనాడైన్‌కి పరిచయం అయ్యారు. వారిలోని ఫ్రాన్సిస్ లెనాడైన్ అంటే ఆసక్తి చూపించాడు.

నిజానికి అల్లిస్టర్ కన్నా ఫ్రాన్సిసే తనని వివాహం చేసుకోమని లెనాడైన్‌ని ముందుగా కోరాడు. ఆమె సున్నితంగా నిరాకరిస్తూ చెప్పింది.

"మీరు నా కన్నా ఇరవై ఏళ్ళు పెద్ద. సారీ."

అల్లిస్టర్ లెనాడైన్‌ని ఆఖరి రోజు అడిగాడు.

"నన్ను పెళ్ళి చేసుకోవా క్లారె?"

ఆమె చిన్నగా నవ్వి బదులు చెప్పింది.

"మీ ఫోన్ నంబరు ఇస్తే ఆలోచించి జవాబు చెప్తాను."

రెండు వారాల తర్వాత క్లారె నించి అల్లిస్టర్‌కి ఫోన్ వచ్చింది.

"మిస్టర్ అల్లిస్టర్. మీరు నన్ను ఎందుకు పెళ్ళి చేసుకోవాలని అనుకుంటున్నారు?" అడిగింది.

"నిన్ను గాఢంగా ప్రేమిస్తున్నాను."

"మీ గుండె నిండా నా మీద ప్రేమ నిజంగా ఉందా?"

"ఉంది."

"ఐతే దాన్ని నాకు సమర్పించగలరా? అంటే ఇంకెవరికీ అందులో కొంచెం కూడా భాగం ఉండకూడదు." లెనాడైన్ కోరింది.

"తప్పకుండా. నా గుండె గదిలో నువ్వు తప్ప ఇంకెవరూ లేరు." హామీ ఇచ్చాడు అల్లిస్టర్.

"సరే అయితే. మనం ఈ వీకెండ్‌కి ఓ సారి కలిసి మన పెళ్ళి ఏర్పాట్లు గురించి చర్చించుకుందాం."

"అలాగే. నేను ఊటాకి రానా?" ఆనందంగా అడిగాడు.

"ఒద్దు. నేనే మీ దగ్గరకి వస్తాను."

శుక్రవారం రాత్రి ఓక్‌లేండ్ విమానాశ్రయానికి ఉత్సాహంగా వెళ్ళి ఆమెని రిసీవ్ చేసుకున్నాడు. ఆ రాత్రి చాలాసేపు పెళ్ళి ఏర్పాట్లు గురించి మాట్లాడుకున్నారు.

"మీ గుండె నాకు ఇస్తానన్నారు. ఎప్పటికీ మీరు ఆ మాట మీద ఉంటారా?" చివరగా అడిగింది.

ఒట్టు వేయించుకుంది. ఆ తర్వాత తెల్లవారుతూండగా వారి మధ్య తొలిసారిగా మైథునం జరిగింది.

* * *

నాలుగు వారాల తర్వాత సేన్‌ఫ్రాన్సిస్కోలోని ఓ ప్రొటెస్టెంట్ చర్చిలో వారిద్దరి వివాహం జరిగింది. ఆ పెళ్ళికి హాజరైన అతిథులంతా వారి మధ్య వయసులో గల తారతమ్యానికి ఆశ్చర్యపోయారు. కొందరు అసూయ పడ్డారు కూడా. అల్లిస్టర్ పెద్ద కొడుకు, కోడలు, వారి



పిల్లలు, మనవలు కూడా ఆ పెళ్ళికి హాజరయ్యారు. మిలటరీలో పని చేసే రెండో కొడుకు ఆఫ్ఘనిస్థాన్‌లో డ్యూటీలో ఉండటంతో రాలేకపోయాడు. బర్కిలీ లోని ఓ కొండ మీద గల ఖరీదైన స్వంత ఇంట్లో అల్లిస్టర్ క్లారెల కాపురం మొదలైంది. అల్లిస్టర్ కొడుకు ఫిలిస్ వారి దగ్గర శెలవ తీసుకుని మర్నాడు వెళ్ళిపోయాడు. అల్లిస్టర్ జీవితం ఆమె సమక్షంలో ఎంతో ఆనందంగా సాగింది. ఆమె మంచి వంటగత్తె. అతని అవసరాలన్నిటినీ శ్రద్ధగా చూసుకుంటుంది. అతనికి ఒక్క పని కూడా చెప్పదు. తన భర్త గురించి అందరితో గొప్పగా చెప్తుంది. ఒకరిద్దరూ మగాళ్ళు ఆమె కోసం ప్రయత్నిస్తే 'నా భర్తతో అన్నిటా సుఖంగా ఉన్నాను. సారీ' అని తిరస్కరించింది.

* * *

ఓ రోజు అల్లిస్టర్ లెనాడైన్‌కి సూచించాడు.

"నాకు పురాతన వస్తువులు సేకరించడం హాబీ. మన ఇంట్లో షో కేసుల్లోని నాణాలు, తపాలా బిళ్ళలు, కప్పులు, సాసర్లు మొదలైనవన్నీ పురాతన వస్తువులు. నీకు కూడా ఏదైనా హాబీ ఉంటే బావుంటుందేమో? ఆలోచించు."

"నాకూ ఓ హాబీ లాంటిది ఉంది." నర్మగర్భంగా నవ్వుతూ చెప్పింది.

"ఏమిటది?" అడిగాడు.

కాని ఆమె దాని గురించి నోరు విప్పలేదు. అల్లిస్టర్ కూడా ఆ విషయం చెప్పమని అడగలేదు.

"మా ఇంటికి వెళదాం. నేను పుట్టిన పెరిగిన ఊరు ఊటా రాష్ట్రంలో ఉంది." వారి వివాహం అయిన ఆరేడు నెలల తర్వాత లెనాడైన్ అడిగింది.

"నీకు అది చూడాలనిపిస్తోందా?"

"అవును."

"సరే."

అల్లిస్టర్ ఇద్దరికీ రాను పోను ప్రయాణపు ఏర్పాట్లు చేసాడు. గురువారం సాయంత్రం విమానం ఓక్‌లేండ్ విమానాశ్రయం నించి బయలుదేరింది.

* * *

ఆమె ఇల్లంతా చూపించింది. అది వందేళ్ళ క్రితంది. తన తండ్రి ద్వారా అది తనకి సంక్రమించిందని తన భర్తకి లెనాడైన్ చెప్పింది. ఓ గదికి మాత్రం తాళం వేసి ఉంది.

"దీని తాళంచెవి పోయింది. కాబట్టి చూపించలేను." చెప్పింది.

రెండు రోజుల తర్వాత ఓ అర్థరాత్రి అల్లిస్టర్‌కి మెలకువ వచ్చి చూస్తే తన భార్య పక్కన లేదు. లేచి ఇల్లంతా వెతికాడు. తాళం ఉండాల్సిన గదికి తాళం లేదు! ఆ గది తలుపు కింద వెలిగే లైటుని గమనించాడు. అల్లిస్టర్‌కి ఆ గది తాళంచెవి పోయిందని

లెనాడైన్ అబద్ధం ఆడటం, అర్ధరాత్రి రహస్యంగా ఆమె అందులోకి వెళ్ళడం రెండూ విచిత్రంగా అనిపించాయి. కొద్దిసేపటికి ఆమె బయటకి వచ్చి తలుపు మూసి తాళం వేసి దాన్ని కుకూ క్లాక్ మీద ఉంచడం అల్లిస్టర్ రహస్యంగా గమనించాడు.

అప్పుడే మెలకువ వచ్చినట్లుగా తల తిప్పి పక్కన పడుకున్న లెనాడైన్ వంక చూసాడు. ఆమె చాలా ఏడ్చినట్లుగా మొహం ఉబ్బి ఉంది.

"ఏమైంది? ఎందుకు ఏడ్చావు?" కంగారుగా అడిగాడు.

"నీకు చెప్పకూడదు కాని, నన్ను చూసావు కాబట్టి చెప్తున్నాను. నా ఆఖరి భర్త మరణించిన రాత్రి ఇది. అతను గుర్తుకు వచ్చి..."

"నేనేం అనుకోను. ప్రేమ అనేది విస్తరించుకుని ఉంటుంది. దాన్ని ఒకరికే పరిమితం చేయమనడం అన్యాయం."


"ఇవాళ నేను విడిగా పడుకుంటాను."

"అలాగే."

ఆమె ఇంకో గదిలోకి వెళ్ళిపోయింది. అల్లిస్టర్‌లో ఆసక్తి అధికంగా ఉండటంతో తెల్లవారు ఝామున మూడున్నరకి లేచి వెళ్ళి కుకూ క్లాక్ మీది తాళంచెవి తీసుకుని ఆ గది తాళం తీసి లోపలకి వెళ్ళాడు. ఎలక్ట్రిక్ లైట్ స్విచ్ నొక్కితే దీపం వెలగలేదు. ఆరిపోయిన కొవ్వొత్తి, అగ్గిపెట్టెలని చూసి కొవ్వొత్తిని వెలిగించాడు. ఆ గదిలో నేల మీద అన్ని గదుల్లోలా రాళ్ళు పరిచి ఉండకపోవడం గమనించాడు. అక్కడక్కడా సిమెంట్ చేసి ఉంది. అది కూడా ఒకేసారి కాక అనేక సార్లు సిమెంట్ చేసారని గ్రహించాడు. గోడకి ఆనించి ఉన్న ఓ పెద్ద షెల్ఫ్ మీద పక్కపక్కనే గాజు సీసాలు వరసగా కనిపించాయి. అల్లిస్టర్ వాటి దగ్గరకి నడిచి వెళ్ళి ఆ సీసాల్లోని ద్రవాల్లో భద్రపరచబడ్డ వాటిని చూసాడు. అవన్నీ మనిషి గుండెలు! ఎవరివి అవి? లెనాడైన్ తన గుండెని అనేకసార్లు అడగడం గుర్తొచ్చింది. అవన్నీ ఆమె మాజీ భర్తలవి అని అతనికి స్ఫురించగానే చిరు చెమట పట్టింది. వారి శవాలు ఆ గదిలోని నేలలో పాతబడ్డాయని కూడా తేలిగ్గా గ్రహించాడు. తక్షణం వెనక్కి తిరిగాడు.

"మీ గుండె గదిలో నాకు తప్ప ఇంకెవరికీ స్థానం లేదని చెప్పారు. అది నాకు ఇచ్చే సమయం వచ్చింది డార్లింగ్. నేను సేకరించేది వాటినే."

ఓ చేతిలో గునపంతో, మరో చేతిలో తుపాకీతో నిలబడ్డ లెనడైన్ చిరునవ్వుతో కనిపించింది.





# 17. చెదురు మదురు బుల్లెట్

## గెరి బ్రాండ్‌నర్

ఆ రోజు ఈస్టర్ తర్వాత వచ్చిన సోమవారం. లియో బార్‌లోకి తన చేతి సంచీతో వచ్చిన ఓ వృద్ధుడు ఆ బార్‌లోని తాగేవారి వంక చూసాడు. తర్వాత ఓ కేబిన్ లోంచి ఖాళీ బీర్ బాటిల్‌తో బయటకి వచ్చే వెయిటర్‌ని చూసాడు. సరాసరి ఆ కేబిన్‌లోకి వెళ్ళి, అక్కడ కూర్చుని బీర్ తాగే ఓ పాతికేళ్ళ యువకుడిని అడిగాడు.

"ఇక్కడ కూర్చోవచ్చా?"

"ఇంకా చాలా కేబిన్స్ ఖాళీగా ఉన్నాయి." అతను విసుగ్గా చెప్పాడు.

"అది నిజమే. కాని నేను మీ దగ్గరే కూర్చోవాలని మీ అనుమతిని కోరుతున్నాను."

ఆ యువకుడు కళ్ళు చికిలించి చూసాడు.

"స్టోరీస్ కోర్ప్స్ సంస్థ గురించి మీరు విన్నారా? మన జీవితంలో జరిగిన సంఘటనలని చెప్పే వాటిని రికార్డ్ చేసుకుంటారు. ఇవాళ సాయంత్రం నా దగ్గరకి వాళ్ళు రికార్డింగ్ కోసం వస్తున్నారు. మీకు ఆ కథ చెప్తాను. నా ఉచ్ఛారణ, మాట్లాడే తీరులో ఏమైనా సలహాలు ఇస్తారేమోనని... పది నిముషాలు మించి ఇక్కడ ఉండను."

"స్టోరీస్ కోర్ప్స్ గురించి నాకు తెలుసు. భవిష్యత్ తరాల కోసం వారు రికార్డ్ చేస్తూంటారు. ఇందుకు నన్నే ఎందుకు ఎన్నుకున్నారు?" అతను ప్రశ్నించాడు.

"మీరు డిస్క్ జాకీగా లాస్ ఏంజెలెస్ లోని ఓ ఎఫ్ఎం రేడియోలో పని చేస్తున్నారు కాబట్టి మీరే ఈ విషయంలో నాకు తగిన సూచనలు ఇవ్వగలరని మీ దగ్గరకి వచ్చాను."

అతను కొద్దిగా గర్వంగా, కొద్దిగా ఆశ్చర్యంగా చూస్తూ అడిగాడు.

"నేను డి జెనని మీకెలా తెలుసు?"

"ఈ లోకంలో ఎవరూ రహస్యంగా ఉండలేరు."

అతను కూర్చోమన్నట్లుగా సౌంజ్ఞ చేసాడు. ఆ ముసలాయన తన చేతి సంచీని పక్కనే ఉంచుకుని అతని ఎదురుగా కూర్చున్నాడు. వెయిటర్ వచ్చి ఆ వృద్ధుడ్ని అడిగాడు.

"ఏం తీసుకుంటారు?"

"బీర్."

"సేండ్‌విచ్?"

"ఊహూ. నేను బరువు పెరగకుండా ఉండటానికి ప్రయత్నిస్తున్నాను."

ఆ వెయిటర్ తన పొట్టని చేత్తో తడుముకుని నవ్వుతూ చెప్పాడు.

"నేను కూడా మిమ్మల్నే అనుసరించాల్సిన అవసరం ఉంది."

బీర్ వచ్చాక డి జె వెయిటర్‌తో చెప్పాడు.

"ఓ పది నిముషాలు మమ్మల్ని డిస్టర్బ్ చేయకు."

వెయిటర్ తల ఊపి వెళ్ళిపోయాడు.

"నేను లాస్ ఏంజెలెస్‌కి రావడం ఇదే మొదటిసారి. అలబామా రాష్ట్రం నించి వచ్చాను." ఆ వృద్ధుడు చెప్పాడు.

"ఎల్ ఏ ఎలా ఉంది మీకు?"

"బావుంది. ఎక్కడ చూసినా పచ్చదనం. వర్షపాతం ఎక్కువ."

"అవును."

"నా కథ అలబామా రాష్ట్రంలో మొదలై ఇక్కడ ముగుస్తుంది."

ఆ యువకుడు ఆయన చెప్పేది వినసాగాడు.

"నా పేరు వెస్లే మిజి. క్రితం సెప్టెంబర్‌లో మోబిల్ నించి నేను, నా భార్య జూడీ మా ఇరవై అయిదవ మేరేజ్ ఏనివర్సరీకి మయామికి వెళ్ళి గడపాలని కారులో బయలుదేరాం. కొంత దూరం వెళ్ళాక రోడ్డు పక్కన దూరంగా కొన్ని చెట్లు కనిపించాయి. జూడీకి బ్లాక్ బెర్రీలంటే ఇష్టం. అక్కడ బ్లాక్ బెర్రీ చెట్లు కనిపించడంతో జూడీ కోరిక ప్రకారం నా కారుని ఓ మట్టి రోడ్డులోకి మళ్ళించి చిన్న అడవిలా ఉన్న ఆ ప్రదేశంలో కారుని ఆపాను. జూడీ కారు దిగి బ్లాక్ బెర్రీ పళ్ళని కోసుకోసాగింది. నేను కారులోనే కూర్చున్నాను. అయిదు నిముషాల తర్వాత కేరీ బేగ్‌లో కొన్నిటిని తెచ్చి కారులో ఉంచింది. ఇంకో ఖాళీ కేరీ బేగ్‌ని తీయడం గమనించి నేను చాలన్నాను. 'చెట్ల నించి చాలా గుత్తులు వేలాడుతున్నాయి. ఈ బేగ్‌ని కూడా నింపాక బయల్దేరదాం' అని, మళ్ళీ ఆ అడవిలోకి వెళ్ళింది. ఈ సారి నేను కూడా జూడీ వెంట నడిచాను. ఎందుకంటే జూడీ కన్నా పొడుగైన నేను వాటిని తేలిగ్గా అందుకుని కోయగలను."

ఆయన చెప్పేది ఆ యువకుడు ఆసక్తిగా వింటున్నాడు. ఆ వృద్ధుడు మగ్‌లో సగం మిగిలిన బీర్‌ని కొంత తాగి మళ్ళీ తను చెప్పేది కొనసాగించాడు.

"జూడీ ముందుకి వెళ్తూ కొద్దిగా తూలిపడింది. నేను వెంటనే ఆమె దగ్గరకి వెళ్ళి లేవదీయ బోయాను. కాని లేవలేదు. ఆమె చెవి ప్రాంతం నించి రక్తం కారడం చూసాను. చెదురు మదురుగా వచ్చిన ఓ బుల్లెట్ ఆమె చెవిని తాకి మెదడులోకి వెళ్ళింది."

"ఎంత దురదృష్టం!" ఆ యువకుడు చెప్పాడు.

"ఆమెని చంపిన ఆ బుల్లెట్‌ని పేల్చిన తుపాకీ చప్పుడు నేను వినలేదు. కాని ఆ తర్వాత మరో మూడు సార్లు తుపాకీ పేలిన శబ్దం విన్నాను. ఆ బుల్లెట్లు ఎక్కడ తగిలాయో నాకు తెలీదు. వాటిని ఎవరు కాల్చారో తెలుసుకోవాలని ఆ శబ్దం వినిపించే వైపు ఆ హంతకుడ్ని పట్టుకోవడానికి పరిగెత్తాను."

"కనపడ్డాడా?" అతను అడిగాడు.



"లేదు. నేను వెనక్కి వచ్చి జూడీని కారు వెనక సీట్లో పడుకో పెట్టి తక్షణం హాస్పిటల్‌కి బయలు దేరాను. దారిలో హై వే పెట్రోల్ పోలీస్‌లకి జరిగింది వివరించాను."

"జూడీకి ఏమైంది?"

"హాస్పిటల్‌కి చేరే లోగానే పోయింది." ఆ వృద్ధుడి కంఠం దుఃఖంగా మారింది.

"అరె పాపం!"

"ఆ బుల్లెట్ ఓ 30-06 డీర్ రైఫిల్ నించి వచ్చిందని పోలీసులు తర్వాత చెప్పారు. ఆ రైఫిల్‌ని ఎవరు పేల్చారో తెలుసుకునే క్లూలేమీ వాళ్ళకి దొరకలేదు. ఓ ఖాళీ విస్కీ బాటిల్ మాత్రం కనపడింది. దాని మీద వేలిముద్రలు దొరికాయి. కాని అవి ఎవరివో పోలీసులకి తెలీదు. వాళ్ళ దగ్గరున్న వేలిముద్రలతో వేటికీ అవి సరిపోలేదు. అంటే జూడీని చంపినవాడు ఎన్నడూ పోలీస్ రికార్డుల్లోకి ఎక్కని వ్యక్తి అన్నమాట."

"మీరు అతన్ని చూసి ఉంటే బావుండేది."

"అతన్ని చూడలేదు కాని అతను తన కారు ఎక్కుతూండగా చూసాను. ఆ కారు నంబర్ నా కారు నంబర్ని తిరగేస్తే వచ్చే నంబరే కాబట్టి తేలిగ్గా గుర్తుంచుకున్నాను."

"పోలీసులు ఆ కారుని ట్రేస్ చేయలేక పోయారా?"

"వాళ్ళకి నేనా నంబర్ ఇవ్వలేదు."

"ఎందుకని?"

"పోలీసులు అతన్ని పట్టుకుంటే, కేసు కోర్టుకి వెళ్ళి, అతని నేరం ఋజువై శిక్ష పడటానికి సాక్షులు ఎవరూ లేరు. ఆ సీసా మీది వేలిముద్రలు అతను అక్కడ ఉన్నాడన్న దానికే ఋజువు తప్ప తుపాకీ పేలిన సమయంలో ఉన్నాడని ఋజువు చెయ్యవు. అతన్ని జడ్జి బెనిఫిట్ ఆఫ్ డౌట్‌తో వదిలేయవచ్చు. ఒకవేళ అన్నీ ఋజువై శిక్ష పడ్డా కూడా కొంత కాలం తర్వాత అతను జైలు నించి బయటకి వచ్చి స్వేచ్ఛగా జీవిస్తాడు. కాని నాతో పాతికేళ్ళు కాపురం చేసిన నా భార్య నాకు తిరిగి రాదు. వస్తుందా?"

రాదన్నట్లుగా ఆ యువకుడు తల అడ్డంగా ఊపి చెప్పాడు.

"కాని అతను జూడీని కావాలని ద్వేషంతో చంపలేదు. మీరు చెప్పిందాన్ని బట్టి అది ఓ పొరపాటు మాత్రమే."

"నిజమే. కాని ద్వేషంతో చంపినా, పొరబాట్న చంపినా అందుకు నేను అనుభవించే ఫలితంలో మార్పు ఉంటుందా?" ఆ ముసలాయన అడిగాడు.

"ఉండదు."

"ఆ హంతకుడ్ని నేనే స్వయంగా శిక్షించాలని పోలీసులకి అతని వివరాలు చెప్పలేదు. అందువల్ల నేను అతన్ని శిక్షించినా పోలీసులు మా మధ్య సంబంధాన్ని కనుక్కోలేరు."

"అంటే ఆ హంతకుడి కోసం మీరు అన్వేషిస్తున్నారన్న మాట?" ఆశ్చర్యపోయాడు.

"అవును. రిటైరైన నాకు ఇంకేం పనీ లేదు. ఇదే నా పాస్ టైంగా చేసుకున్నాను. అంతే కాదు. అతన్ని కనుక్కున్నాను కూడా." గర్వంగా చెప్పాడు ఆయన.

"ఓ! కంగ్రాట్స్. అతను ఎక్కడున్నాడు?"

"ఆ కారు లాస్ ఏంజెలెస్ నంబర్ అని ఇందాక చెప్పానా? ఇక్కడే, ఈ నగరం లోనే. ఆ నంబర్ గురించి కాలిఫోర్నియా డిపార్ట్‌మెంట్ ఆఫ్ మోటర్ వెహికల్స్ కార్యాలయానికి రాస్తే, వారు నా కోరిక ప్రకారం ఆ కారు యజమాని చిరునామాని తిరుగు ఉత్తరంలో రాసారు. అతని పేరు, వృత్తి కూడా."

"ఎవరతను?"

"ఇవాళ ఉదయం నేను అతని ఇంటికి వెళ్ళాను. అతను బయటకి వచ్చేదాకా నా కారుని అతని ఇంటికి కొద్ది దూరంలో ఆపాను. అతను తన కారులో ఇంట్లోంచి బయలుదేరాక నేను అతన్ని అనుసరించాను."

"ఓ!"

అకస్మాత్తుగా ఆ వృద్ధుడి చేతిలోకి అతని చేతి సంచీ లోంచి ప్రత్యక్షం అయిన పాయింట్ 45 రివాల్వర్‌ని ఆ యువకుడు చూసాడు. దానికి సైలెన్సర్ అమర్చి ఉంది. ఆ యువకుడి మొహం తక్షణం భయంతో పాలిపోయింది.

"అది ప్రమాదవశాత్తూ జరిగింది. కావాలని జరగలేదు. మీరు చెప్పేదాకా నా తుపాకీ గుండు జూడీని తాకిందని, ఆవిడ మరణించిందని నాకు అసలు తెలీదు."

ఆ వృద్ధుడు బదులు చెప్పకుండా ఆ రివాల్వర్‌ని పైకి లేపి పేల్చాడు. గుండు సూటిగా వెళ్ళి ఆ యువకుడి నుదుటిలోకి దిగింది. తక్షణం అతను నిశ్శబ్దంగా పక్కకి వాలిపోయాడు. మరో బుల్లెట్‌ని ఆయన తల వెనక నించి లోపలకి దిగేలా కాల్చాడు. మాఫియా మనుషులు ఇలాగే హత్యలు చేస్తారని ఆయన చాలాసార్లు చదివాడు. ఈ హత్యని కూడా పోలీసులు మాఫియా హత్యగా భ్రమపడే అవకాశాలు ఎక్కువ. తర్వాత రివాల్వర్‌ని సంచీలో ఉంచుకుని లేచి, వెయిటర్ దగ్గరకి వెళ్ళి రెండు డాలర్ల నోటుని ఇచ్చి బయటకి నడుస్తూ అనుకున్నాడు.

'చెదురుమదురు బుల్లెట్ ఈసారి తన టార్గెట్‌ని చేరుకుంది.'





# 18. బోల్తా

## రేడార్ గై

బూడిద రంగు కోట్‌లో ఉన్న బెన్ లైన్ ఎక్కిన టేక్సీ విన్‌వుడ్ లోని పార్క్ దగ్గరకి చేరుకునేసరికి రాత్రి తొమ్మిది అవుతోంది. అతను టేక్సీ దిగి, డబ్బు చెల్లించి, తన ముఖం కనపడకుండా తల మీది టోపీని కిందకి లాక్కుని తన టైని సర్దుకున్నాడు. ఆ టైని, అతని వంటి మీది దుస్తులన్నిటినీ కూడా జైల్లోని ఒక ఉద్యోగి వంటి మీద నించి విప్పి ధరించాడు. ఆ సమయంలో అతను జైల్లోని చీపుళ్ళు, డస్టర్‌లు లాంటివి ఉంచే చిన్న గదిలో స్పృహ లేకుండా పడి ఉన్నాడని బెన్ లైన్‌కి తెలుసు. 'అతనికి ఇంకో రెండు గంటల పాటు స్పృహ రాకుండా ఉంటే చాలు. తను అనుకున్నది సాధించగలడు.' అని మనసులో అనుకున్నాడు.

ఖైదీలు ధరించే దుస్తులని విప్పి, ఆ బూడిద రంగు కోటు, పేంట్లని ధరించి బెన్ లైన్ లాస్ ఏంజెలెస్ కౌంటీ కారాగారం నించి టేక్సీలో సరాసరి విన్‌వుడ్ పార్క్‌కి వచ్చాడు. అతను కొద్ది దూరంలోని రిడ్జ్‌వే ఇంటికి చక చక చేరుకున్నాడు. డాక్టర్ వాడే నల్లటి సెడాన్ కారు ఇంటి బయట కనిపించగానే, అతను ఇంట్లోనే ఉన్నాడని సంతోషపడ్డాడు. లేదా అతను తిరిగి వచ్చే దాకా వేచి ఉండాల్సి వచ్చేది. దాని వెనక తలుపు తెరిస్తే అది తెరచుకుంది. ఇంకా బాగు చేయించలేదన్నమాట. బెన్ లైన్ క్రితంరోజు జైలు ఆవరణలో ఆగిన డాక్టర్ రిడ్జ్‌వే సెడాన్ వెనక తలుపుని లోపల నించి లాక్ పడకుండా చేసాడు. అది అసలు ఆయన గమనించే ఉండడు.

బెన్ సెడాన్‌లో వెనక సీట్ల మధ్య వెల్లకిలా పడుకున్నాడు. అది అసౌకర్యంగా ఉన్నా తను చేయబోయే పనితో పోలిస్తే దాన్ని బెన్ భరించగలడు. సరిగ్గా తొమ్మిదీ ఇరవైకి రిడ్జ్‌వే ఇంటి తలుపు మూసుకున్న చప్పుడైంది. అంటే ఇంట్లోంచి బయటకి వచ్చి తలుపు మూసాడన్న మాట. అంతా తను అనుకున్నట్లుగానే జరుగుతోంది. తొమ్మిదిన్నరకి డాక్టర్ రిడ్జ్‌వే జైల్లో ఉండాలి. సెడాన్ తలుపు కూడా తెరచుకుని మూసుకున్న చప్పుడు వినిపించింది. తర్వాత సెడాన్ స్టార్ట్ అయి ముందు వెనక్కి వచ్చి, తర్వాత రోడ్డు మీద కుడి వైపుకి తిరిగింది. బెన్ నెమ్మదిగా ఇరవై దాకా లెక్క పెట్టి లేచి వెనక సీట్‌లో కూర్చున్నాడు. వెనక నించి డాక్టర్ రిడ్జ్‌వే తల కనిపిస్తోంది. చెవుల దగ్గర జుట్టు నెరవడం మినహా, అతనిలో వృద్ధాప్యం వచ్చిన లక్షణాలే ఉండవు. అందుకే అతను లూసీని తేలిగ్గా లొంగదీసుకో గలిగి ఉంటాడు.

తను ఆ డాక్టర్‌లా అందగాడు కాదు. డబ్బున్నవాడు కూడా కాదు. డాక్టర్ రిడ్జ్‌వేని కలిసేదాకా లూసీ తనని ప్రేమించింది. ఎవరూ ఎవర్నీ ప్రేమించనంతగా ప్రేమించింది. లూసీకి ఓ సారి నిమోనియా వచ్చింది. తను చేసిన పొరపాటు ఆమెని రిడ్జ్‌వే దగ్గరకి తీసుకెళ్ళడం. అప్పుడు రిడ్జ్‌వే తమ జీవితాల్లోకి ప్రవేశించాడు.

లూసీలో తను అంత దాకా అమాయకత్వాన్నే చూసాడు. కాని ఆమెలోని మరో పార్శ్వం బెన్‌కి అవగతం అయింది. లూసీకి నయం కాగానే డాక్టర్ రిడ్జ్‌వే ఇంటికి మారింది. విడాకులకి ప్రయత్నించమని, ఆమె తిరిగి రాదని రిడ్జ్‌వే బెన్‌ని పిలిచి చెప్పాడు. రిడ్జ్‌వేని ఆవేశంతో చంపాలన్న బెన్ ప్రయత్నం విఫలం అయి, మొహం మీద చిన్న మచ్చతో రిడ్జ్‌వే తప్పించుకున్నాడు. తనకి రెండేళ్ళ జైలు శిక్ష పడింది. ఇక తన అడ్డు వాళ్ళకి తొలగింది అనుకున్నారు. జైల్‌కి విజిటింగ్ డాక్టర్‌గా వచ్చే రిడ్జ్‌వే ఈ రెండేళ్ళలో వైద్యం పేరుతో తనని చంపేయచ్చు. తనకి అనారోగ్యం కలిగితే డాక్టర్‌గా ఎవరికీ తెలీకుండా అతను తనని చంపి తప్పించుకోవచ్చు.

జేబులోంచి పిస్తోలు తీసి రిడ్జ్‌వే మెడకి దాన్ని నొక్కి పెట్టి చెప్పాడు బెన్.

"తల తిప్పక. డ్రైవ్ చేస్తూనే ఉండు. లేక్‌వుడ్ బుల్‌వార్డ్‌లో కుడి వైపు తిరుగు."

రిడ్జ్‌వే ఉలిక్కిపడి రివర్ వ్యూ మిర్రర్‌లో చూసాడు. వెనక అంతా చీకటి.

"బెన్?" అడిగాడు.

"అవును. నేను తప్పించుకుని వస్తానని చెప్పాను. మాట తప్పేవాడ్ని కాను నేను."

"నా దగ్గరకి ఎందుకు వచ్చావు? నాతో నీకేం పని?"

"చాలా ఉంది. నేను మెక్సికో వెళ్ళిపోవడానికి నీ సహాయం అవసరం."

"నువ్వు రోడ్డు దాటడానికే నేను సహాయం చేయను." కోపంగా చెప్పాడు రిడ్జ్‌వే.

బదులుగా తుపాకీ గొట్టాన్ని మరింత గట్టిగా నొక్కాడు బెన్.

"బెన్. నిన్ను పోలీసులు పట్టుకుంటే నీ శిక్ష రెట్టింపు అవుతుంది. బండి దిగి వెనక్కి వెళ్ళు. జరిగింది నేను ఎవరికీ చెప్పను. నా కారు ఇస్తాను. తీసుకెళ్ళు. ఇప్పటికే నన్నోసారి చంపడానికి ప్రయత్నించావు...ఇపుడు పట్టుబడితే..."

"షటప్. పైన కుడి వైపు తిరుగు."

"తిరక్కపోయినా, తిరిగినా నువ్వు నన్ను చంపుతావు. నీ మాటని నేను ఎందుకు వినాలి?"

"నువ్వు ఈ విషయంలో గేంబిల్ చేయక తప్పదు. తిరక్కపోతే కాల్చి నేనే డ్రైవ్ చేస్తాను."

సెడాన్ కారు కుడి వైపుకి మళ్ళింది. కొద్ది నిమిషాల సేపు గదిలో నిశ్శబ్దం.

"నువ్వు లూసీ కోసం నన్ను చంపాలనుకుంటే అందువల్ల ప్రయోజనం లేదు. లూసీ ఇప్పటికే ఖరీదైన జీవితానికి అలవడింది. దాంతో నీ దగ్గరకి రాదు. నా దగ్గర కూడా లేదు. ఇప్పటికే ఓ సెనేటర్‌తో ఆమెకి చాలా వ్యక్తిగత పరిచయం ఏర్పడింది."

"నువ్వు మాట్లాడటం ఆపు. నేను ఒక్క మాట కూడా నమ్మను. లూసీ నన్ను ప్రేమించకుండా ఉండలేదు. కేవలం డబ్బు కోసమే నిన్ను చేరిందని నాకు తెలుసు."



"సమస్య అదే. లూసీ డబ్బుని తప్ప ఏ మనిషినీ స్థిరంగా ప్రేమించలేదు. ఇంకా ఎక్కువ డబ్బున్నవాడి కోసం సదా వెదికే మనస్థత్వం ఆమెది. ఆమె కోసం ఎందుకు నువ్వు నన్ను చంపడం? అది వృథా శ్రమ అని త్వరలోనే నువ్వు గ్రహించి బాధపడతావు."

"పొరబడ్డావు. నేను లూసీ కోసం వచ్చి ఉంటే నీ ఇంట్లోకి వచ్చి ఉండేవాడిని. కాని నీ కారుని రహస్యంగా ఇలా ఎక్కి ఉండే వాడిని కాను. నేను వచ్చింది నీ కోసం." కఠినంగా చెప్పాడు బెన్ లైన్.

సెడాన్ కారు అకస్మాత్తుగా చెట్ల సముదాయం లోకి ప్రవేశించింది. రోడ్డుకి అటు, ఇటు దట్టమైన చెట్లు. మధ్యలో రోడ్డు.

"కుడి వైపు వచ్చే మట్టి రోడ్డు లోకి పోనీ." ఆజ్ఞాపించాడు బెన్.

అతని మాటని ధిక్కరిస్తే ప్రమాదం అని గ్రహించి, ఆ నిర్మానుష్య రోడ్డు మీద రిడ్జ్‌వే అతను చెప్పినట్లు చేసాడు.

* * *

సిగ్నల్ హిల్ దగ్గర బెన్ కుడి వైపు తిరిగి హైవే 101 మీదకి ఎక్కాడు. అతని ఎదురుగా ఉన్న రోడ్డు సేండియాగో నగరం దాకా వెళ్తుంది. అక్కడ నించి అమెరికా సరిహద్దుని దాటి మెక్సికోకి వెళ్ళిపోవడం తేలిక. ఎక్కడ ఎలా కంచె దాటాలో జైల్లోని ముగ్గురు మెక్సికన్స్ బెన్ లైన్‌కి స్పష్టంగా వివరించారు. ఓసారి మెక్సికోకి చేరుకుంటే చాలు. ఇక తనని అమెరికన్ పోలీసులు పట్టుకోలేరు.

తను లూసీ కోసం రిడ్జ్‌వేని చంపబోతున్నాడని అతను భ్రమపడ్డాడు. ఏనాడైతే లూసీ రిడ్జ్‌వే ఇంటికి మారిందో, ఆనాడే ఆమె మీద ద్వేషం రగిలి వ్యామోహం నశించింది. ఆ ద్వేషం లోంచి పుట్టిన పగ వల్ల రిడ్జ్‌వేని చంపాలనే ధ్యాస కలిగి అది బలపడింది. అది ఇప్పుడు పూర్తయింది. ఇక తనని పోలీసులు పట్టుకోకుండా ఉండాలంటే మెక్సికో ఒక్కటే సరైన చోటు. అమెరికాలో ఎక్కడ ఉన్నా తరచూ టివిలో చూపించే తన ఫొటో వల్ల తనని ఎవరైనా పట్టించే ప్రమాదం ఉంది. అదే మెక్సికోలో ఉంటే ఎవరూ పట్టించరు.

సెడాన్ టేంక్ ఫుల్‌గా ఉందని ముల్లు చూపిస్తోంది. రిడ్జ్‌వేని చంపాక వెదికితే అతని పర్స్‌లో ఆరు వేల డాలర్లు కనిపించాయి. అంత డబ్బుని అమెరికాలో ఎవరూ జేబులో ఉంచుకుని తిరగరు. ఎందుకని అంత డబ్బు అతను తన దగ్గర ఉంచుకున్నాడో? అదీ తన మంచికే జరిగింది. రెండేళ్ళు దాంతో మెక్సికోలో సుఖంగా జీవించి తర్వాత తిరిగి తన స్వదేశానికి రావచ్చు. అప్పటికి వేడి చల్లారి తనని ప్రజలు, పోలీసులు మర్చిపోతారు. చిన్నగా నవ్వుకున్నాడు.

మొదటిసారి తన చేతిలోని పిస్తోలు నించి వెలువడ్డ గుండు వల్ల రిడ్జ్‌వే మొహంలో చిన్న మచ్చ మాత్రమే ఏర్పడింది. ఈసారి మచ్చ కన్నా ఎక్కువే చేసాడు తను.

కొద్ది దూరం వెళ్ళాక ట్రాఫిక్ స్లో అయింది. చాలా కార్లు ఒకదాని వెనక మరొకటి ఆగి ఉన్నాయి. స్టేట్ ట్రూపర్ కార్లు రెండు దూరంగా కనిపించాయి. వాటి టాపు మీది లైట్లు ఆరి వెలుగుతూ తిరుగుతున్నాయి. దేనికి చెక్ చేస్తున్నారు? అన్న ప్రశ్న, దానికి జవాబు బెన్‌కి వెంటవెంటనే తట్టాయి. జైల్లోని స్వీపర్‌కి మెళకువ వచ్చిందా? తన కోసమే వెదుకుతున్నారా? తన కోసం అయితే మరీ మంచిది అనుకున్నాడు. ఈ సందర్భాన్ని ఊహించే తను ముందే అందుకు తగ్గ జాగ్రత్త పడ్డాడు.

ఒకో కారు మెల్లిగా ముందుకి కదలసాగింది. తన వంతు రాగానే బెన్ కారు ఆపాడు.

"ఎవరి కోసమైనా వెదుకుతున్నారా ఆఫీసర్?" అడిగాడు అతనికి డ్రైవింగ్ లైసెన్స్‌ని ఇస్తూ.

"అవును."

అది డాక్టర్ రిడ్జ్‌వే పేరున తన ఫొటోతో చేసిన నకిలీ డ్రైవింగ్ లైసెన్స్.

'మీరు వెదికేది నా కోసమే అయినా మీరు మాట్లాడేది నాతోనే అని మీకు తెలీదు పిచ్చివాళ్ళల్లారా' మనసులో నవ్వుకున్నాడు. కొద్ది నిమిషాల్లో తను లాంగ్ బీచ్ దాటి మొదటి సరిహద్దులో సెడాన్‌ని వదిలేసి కంచె దూకి మెక్సికోలోకి వెళ్తాడు. ఆ తర్వాత....

"మీ పేరు?" అడిగాడు స్టేట్ ట్రూపర్.

"రిడ్జ్‌వే. డాక్టర్ ఎమెరీ రిడ్జ్‌వే."

ఆ ట్రూపర్‌కి రిడ్జ్‌వే పర్స్‌లో దొరికిన విజిటింగ్ కార్డుని ఇచ్చాడు బెన్.

"ఓకేనా?" అడిగాడు.

"కాదు."

బెన్ అకస్మాత్తుగా ఆ ట్రూపర్ చేతిలో ప్రత్యక్షమై, తన వంకే గురి పెట్టబడ్డ సర్వీస్ రివాల్వర్‌ని చూసి నివ్వెరపోయాడు. రిడ్జ్‌వే శవాన్ని ఇంత త్వరగా ఎలా కనుక్కోగలిగారు?

"దానర్థం ఏమిటి?" నవ్వుతూ అడిగాడు బెన్.

"మీరు మెక్సికోకి పారిపోతారని మేం ఊహించాం. చేతులు పైకెత్తి కిందకి దిగండి డాక్టర్ రిడ్జ్‌వే." సీరియస్‌గా చెప్పాడు.

అప్పటికే ఆ కారుని చేతుల్లో తుపాకీలతో స్టేట్ ట్రూపర్లంతా చుట్టుముట్టారు.

"మీరు ఇంట్లోంచి పారిపోయిన నిమిషానికి లూసీ శవాన్ని మీ ఇంట్లో చూసాం. ఇరుగుపొరుగు వారు ఆమె అరుపులు విని ఫోన్ చేసారు డాక్టర్. మీరామెని విషం ఇచ్చి కాక మెడ పిసికి చంపారంటే బహుశా అప్పటికప్పుడు కలిగిన కోపంతో చంపి ఉంటారు. చేతులు పైకెత్తి కారు దిగండి." చెప్పాడు ఆ స్టేట్ ట్రూపర్.

బెన్ లైన్ వారి వంక నివ్వెరపోతూ చూస్తుండిపోయాడు.



# 19. నన్ను చంపు

## లియో ఆర్ ఎల్లిస్

బ్రెట్ డిలేన్ సింహద్వారం తలుపు తెరచుకుని తన ఇంట్లోకి ప్రవేశించాడు. తలుపు మూసి హాల్లోని లైట్‌ని వేసాడు. ఇంట్లోని అతని ఆఫీసు గది తలుపు కింద నించి లోపల లైటు వెలుగుతున్న కాంతి కనిపించింది. తక్షణం అది మాయం అయింది.

తను ఆ లైటు ఆర్పలేదని, తను చూస్తుండగానే బల్బ్ మాడిపోయిందని అనుకున్నాడు తప్ప లోపల దొంగ ఉండచ్చనే ఆలోచన కలగలేదు. లాస్ ఏంజెలెస్‌లో, బెవర్లీ హిల్స్‌లో ప్రధానంగా నటీనటులు నివశించే ఆ కాలనీలో దొంగలు పడటం గురించి బ్రెట్ ఎన్నడూ వినలేదు. కాబట్టి అది దొంగ పని అవచ్చన్న అనుమానమే కలగలేదు.

బ్రెట్ డిలేన్ ఆ గది తలుపు దగ్గరకి వెళ్ళి దాన్ని తెరిచి లోపలికి వెళ్ళి స్విచ్ నొక్కాడు. ఎదురుగా గోడకి ఓ మూల నక్కి ఉన్న ఓ పద్దెనిమిదేళ్ళ కుర్రాడు కనిపించాడు. అతని చేతిలో పిస్తోలు, కళ్ళల్లో భయం కనిపించాయి. ఆ గది కిటికీ తలుపు అద్దం పగిలి ఉండటం కూడా బ్రెట్ గమనించాడు.

బ్రెట్ అతనితో మాట్లాడటానికి నోరు తెరిచాడు. మరుక్షణం బాధగా గుండె దగ్గర చేతిని వేసి వెనక్కి తూలి, వెనక గోడకి ఆనించి వేసిన సోఫాలో పడ్డాడు. టైట్ పేంట్స్, మురికి జాకెట్ వేసుకుని ఉన్న ఆ యువకుడు బ్రెట్ వంక నిశ్శబ్దంగా చూసాడు. అతను తన చేతిలోని పిస్తోలుని ఏ క్షణంలోనైనా పేల్చడానికి సిద్ధంగా ఉన్నాడు.

బ్రెట్ తేరుకోడానికి అర నిముషం పట్టింది. ఆయన లేచి తూలుతూ నెమ్మదిగా బల్ల వెనక ఉన్న రివాల్వింగ్ చెయిర్‌లో కూలబడ్డాడు. తర్వాత దాని డ్రాయర్‌ని తెరవడానికి దాని హేండిల్ మీద తన చేతిని వేసాడు.

"డేడ్! దాన్ని తెరిస్తే గుండు నీ గుండెల్లో దిగుతుంది." వెంటనే హెచ్చరికగా చెప్పాడా యువకుడు.

"మందు. నా మందు..." బ్రెట్ ఆక్రోశించాడు.

"ఏం మందు?"

"గుండె నొప్పికి నాలిక కింద ఉంచుకునే మందు. ఇది."

మాట్లాడుతూనే బ్రెట్ డ్రాయర్ లాగి అందులోంచి చిన్న డబ్బాని తీసాడు. దాన్ని తెరచి అందులోని ఓ మాత్రని నోట్లో నాలిక కింద ఉంచుకున్నాడు. సీట్‌లో నీరసంగా కళ్ళు మూసుకుని వెనక్కి వాలిపోయాడు.

తెల్ల జుట్టు గల ఆ వృద్ధుడి వంక ఆ యువకుడు నిశ్శబ్దంగా చూసాడు. ఆయన నటుడని ఆ గదిలోని అనేక షీల్డ్‌లని బట్టి గ్రహించాడు. ఐతే ఆయన నటించిన సినిమాలు

విడుదలయ్యే కాలంలో ఆ యువకుడు పుట్టనేలేదు. బ్రెట్ నటించిన అనేక కేరక్టర్ రోల్స్ గల చిత్రాలు ఆ గదిలో గోడల నిండా అలంకరింపబడి ఉన్నాయి. 'పాత కాలం నటుడు' అనుకున్నాడు.

"నీకేం కావాలి?" చిన్నగా మూలిగి కళ్ళు తెరచి బ్రెట్ ఆ యువకుడ్ని అడిగాడు.

"దొంగతనం చేయడానికి వచ్చాను."

"నీకేం కావాలో అవి తీసుకుని వెళ్ళిపో."

"సరే. కాని ముందుగా నిన్ను చంపి. సాక్షి నన్ను కటకటాల వెనక్కి పంపగలదు. జైలుకి వెళ్ళడం నాకు ఇష్టం ఉండదు. అందుకని..." ఆపేసాడు.

"... అందుకని నన్ను చంపదలచుకున్నావా?"

"అవును."

"నేను చావుకి సమీపంలోనే ఉన్నాను. ఇది మూడోసారి నాకు హార్ట్ అటాక్ రావడం. ఈ మందు వేసుకుంటే నాకు అన్ని సార్లూ రిలీఫ్ కలిగేది. గుండె సర్దుకునేది. కాని ఈసారి మాత్రం... నిన్ను చూసిన షాక్‌కి నాకు హార్ట్ అటాక్ వచ్చింది. మూడోసారి హార్ట్ అటాక్ వస్తే జీవించడం అంటూ ఉండదు."

"అది అబద్ధం."

బ్రెట్ సన్నగా నవ్వాడు. ఆ నవ్వులో ఆ యువకుడికి ఆనందం కనిపించింది.

"దేనికా నవ్వు?" అయోమయంగా చూస్తూ అడిగాడు.

"పిల్లవాడా! బ్రెట్ డిలేన్ పేరు విన్నావా?"

"లేదు."

"నన్ను తెర మీద సినిమాల్లో ఎప్పుడైనా చూసావా?"

"లేదు."

"నన్ను చంపి నాకు సహాయం చెయ్యి. కాల్చు."

ఆ యువకుడి అయోమయం రెట్టింపైంది.

"నేను నిన్ను చంపడం నీకు సహాయం చేయడం ఎలా అవుతుంది?" ప్రశ్నించాడు.

"నా ప్రాణాంతక రోగం కొద్ది కొద్దిగా నన్ను బలహీన పరుస్తూ చంపుతోంది. 'ఎప్పుడు చస్తానా?' అనే భయంతో మరణించే కంటే ఇలా ఒక్కసారిగా మరణించడంలో నాకు ఆనందం ఉంది. నా పేరు నువ్వు వినలేదన్నావు. నా సినిమా చూడలేదన్నావు. నేను నటుడ్ని నీకు తెలుసా? రెండు వందల నలభై ఆరు సినిమాల్లో నటించిన నటుడ్ని. సెట్‌లో నా కోసం మిగతా నటీనటులు ఎదురు చూసేవారు. ప్రేక్షకులు నేనున్న సినిమాలకి నా కోసం వచ్చేవారు. నేను ఎక్కడికీ ఒంటరిగా, బాడీ గార్డులు లేకుండా వెళ్ళగలిగేవాడిని కాను. ఆటోగ్రాఫ్‌ల కోసం నన్ను ప్రజలు చుట్టు ముట్టేవారు. 1974లో ఓ రోజు షికాగో ఎయిర్‌పోర్ట్‌లోని తోటి



ప్రయాణీకులు ఆటోగ్రాఫ్‌ల కోసం నన్ను చుట్టుముడితే..." బాధగా మూలిగి మళ్ళీ గుండెని పట్టుకున్నాడు. గట్టిగా ఊపిరి పీల్చుకుని వదిలి, నుదుట పట్టిన చెమటని తుడుచుకుని మళ్ళీ చెప్పడం కొనసాగించాడు.

"నా విమానం నా కోసం పావు గంట సేపు ఆగాల్సి వచ్చింది. సెక్యూరిటీ పోలీసులు వచ్చి నన్ను నా అభిమానుల నించి వేరు చేసి నా విమానంలోకి ఎక్కించారు. మర్నాడు ఆ వార్త పేపర్లో వచ్చింది. ఇటీవల ఇంతటి అభిమానం గల నటీనటులే లేరు. ఐనా నువ్వు నా పేరు వినలేదు. నా మరణం సహజంగా జరిగితే ఆ వార్త రేపు దినపత్రికల్లో లోపలి పేజీల్లో ఎక్కడో ఓ అరంగుళం జాగాలో వేస్తారు. అందుకని నువ్వు చంపు."

"అందువల్ల ఏం లాభం నీకు?"

"అర్థం కాలేదా? ఏ నటుడికైనా గుర్తింపు ముఖ్యం. దాన్నే కీర్తి అంటారు. గుండాగి సహజంగా మరణించే కంటే నేను హత్య చేయబడితే నా మరణవార్త మొదటి పేజీలో వేస్తారు. నా చిత్రాల్లోని పాపులర్ సినిమాల గురించి ప్రస్తావిస్తారు. నేను లిండన్ జాన్సన్ ఆహ్వానం మీద వైట్ హౌస్‌కి వెళ్ళి ఆయనతో టీ తీసుకున్న ఫొటో వేస్తారు. నిన్ను పట్టుకునే దాకా ఆ వార్తలన్నిటినీ ప్రచురిస్తారు. నేను మళ్ళీ వార్తల్లో మనిషిని అవుతాను,"

బ్రెట్ డిలేన్ కంఠం గద్గదమైంది. ఆయన కళ్ళ వెంట నీళ్ళు కారుతున్నాయి.

"నేను ఎంతో కష్టపడి సంపాదించుకున్న, నా చేతి వేళ్ళల్లోంచి జారిపోయిన కీర్తిని చూస్తూ ఇన్నేళ్ళుగా నేను ఎంత బాధపడుతున్నానో తెలుసా?"

బ్రెట్ దీర్ఘంగా నిట్టూర్చాడు.

"నేను మరణించడం తప్పదు. దానికి దగ్గరగా కూడా వచ్చాను. కాబట్టి నన్ను కాల్చు. అహంకారం గల ఏ నటుడూ ఇంతకంటే ఇంకోటి కోరడు."

"నీకు పిచ్చెక్కింది."

"ఓ పాత్ర తెర మీదకి ప్రవేశించిన విధానం కన్నా ఆ పాత్ర నిష్క్రమించే విధానమే ప్రేక్షకుడికి గుర్తుండి పోతుంది. రోమన్ హాలీడే చూసావా? చివర్లో గ్రెగరి పెక్ నిశ్శబ్దంగా జేబుల్లో చేతులు ఉంచుకుని రాజప్రసాదం లోంచి నడిచి వెళ్తూంటే కేవలం అతని బూట్ల చప్పుడే వినిపిస్తుంది. ఆ సినిమా చూసిన వారెవరూ ఆ గ్రెగరీని మర్చిపోలేరు. కసబ్లాంకా చూసావా? అందులో హంఫ్రి బోగర్ట్ తన ప్రియురాలిని ఆమె ప్రియుడితో విమానంలో పంపించి చేసిన త్యాగం, ఆ తర్వాత అతను దూరం అయ్యే విమానం వంక చూసిన తీరు... కసబ్లాంకా ఆల్ టైమ్ క్లాసిక్ సినిమా అయింది. హంఫ్రి ప్రేక్షకులకి గుర్తుండిపోయాడు. ఓ నాటి గొప్ప నటుడు, ఒంటరి ఇంట్లో ఓ సామాన్య దొంగ చేత కాల్చి చంపబడితే, అతని సినిమాలు మళ్ళీ టివిలో ప్రసారం చేయబడతాయి. మరణించినా నేను మళ్ళీ ప్రేక్షకుల హృదయాల్లో జీవిస్తాను. నన్ను చంపు. ఈ జీవచ్ఛవాన్ని చంపి పుణ్యం కట్టుకో."

బ్రెట్ వెక్కి వెక్కి ఏడుస్తూ అర్థించాడు. ఆ యువకుడు తల అడ్డంగా ఊపాడు.

"నన్ను చంపు అని బతిమాలే వాళ్ళు పిచ్చివాళ్ళు. నీకు పిచ్చెక్కింది."

"ప్లీజ్! నన్ను చంపు."

"నాకు అర్థమైంది. ఇందాక బల్ల సొరుగు తెరిచినప్పుడు టేప్ రికార్డర్‌ని ఆన్ చేసావా?"

"లేదు. వచ్చి చూడు. సొరుగులో టేప్ రికార్డర్ లేదు. ఫోన్ రిసీవర్ కూడా క్రేడిల్ మీదే ఉంది."

"దాచిన మైక్రోఫోన్‌లు ఈ గదిలో ఉన్నాయేమో?"

"ఉన్నా నీ కంఠ ధ్వనిని బట్టి వారు నిన్ను పట్టుకోలేరు."

"నేను సాధారణ దొంగని. ఇంతదాకా ఎవర్నీ చంపలేదు. ఎవరూ లేని ఇళ్ళల్లో నేను దొంగతనం చేసినప్పుడు నాకు సాక్షులు తారసపడలేదు. ఇవాళ నీకు దుర్దినం డేడ్. నువ్వు సహజంగానే మరణించాలి. నేను రిస్క్ చేయదలచుకోలేదు. నీలాంటి గొప్ప నటుడ్ని చంపితే పోలీసులు నన్ను పట్టుకునే దాకా వదలరు."

అతను తక్షణం తను ఏ కిటికీలోంచి ఆ గదిలోకి ప్రవేశించాడో అదే కిటికీలోంచి బయటికి దూకి పారిపోయాడు.

బ్రెట్ డిలేన్ కొద్ది క్షణాలు గట్టిగా ఊపిరి తీసుకుని వదిలాడు. తర్వాత సొరుగు లోంచి పిస్తోలుని తీసి తయారుగా పట్టుకున్నాడు. మనసు మార్చుకుని వస్తే, రెండోసారి ఆ యువకుడికి అవకాశం ఇవ్వదలచుకోలేదు. తర్వాత రిసీవర్ అందుకుని ఓ నంబర్ తిప్పి చెప్పాడు.

"సారీ! మీ అమ్మ వండిన కూరలోని మసాలా ఎంత ఘాటుగా ఉందంటే నేను అల్సర్ మందు కోసం ఇంటికి తిరిగి రావాల్సి వచ్చింది. మనింట్లో దొంగ పడ్డాడు. నేను వాడి ముందు ఎంత గొప్పగా నటించానో రిపోర్టర్స్‌కి జరిగింది చెప్పేప్పుడు నువ్వు విందువు గాని. వెంటనే బయలుదేరిరా... నేను స్నానం చేసి మంచి దుస్తులు ధరించాలి. వాళ్ళు నన్ను చిత్రీకరిస్తారు. ఫొటోలు కూడా తీస్తారు."

బ్రెట్ డిలేన్ రిసీవర్‌ని పెట్టేసాడు.





# 20. ప్రతీకారం

## మైఖేల్ మెలోన్

పసుపుపచ్చ హౌస్ గౌనులో ఉన్న లూసీ తన చేతిలో చిరునవ్వు నవ్వే స్మైలీ ఫేస్ బొమ్మ గల కాఫీ కప్‌ని పట్టుకుని, మరణించిన తన భర్త గదిలోని ఫొటోల వంక చూసింది. మూడు వారాల క్రితం హార్ట్ అటాక్‌తో మరణించిన ఆమె భర్త స్టీఫెన్‌కి రహస్య ప్రియురాలు ఉందన్న సమాచారం ఆ రోజే లూసీకి తెలిసింది. అలబామాలోని టస్కాంబియా అనే ఊళ్ళో తమ ఇంటికి వందడుగుల దూరం లోని ఇంకో ఇంట్లో నివశించే ఓ విధవరాలితో అతనికి శారీరక సంబంధం ఉందన్న సంగతి తెలిసిన లూసీ షాకైంది అని చెప్పడం తక్కువ చేసి చెప్పడమే అవుతుంది. చాలా కాలంగా లూసీ ఇల్లు మారదామని చెప్తున్నా స్టీఫెన్ ఏదో కారణం చెప్పి ఇల్లు మారక పోవడానికి గల అసలు రహస్యం లూసీకి ఆ రోజే తెలిసింది.

అమెరెట్టో స్ట్రైమ్‌లేండోతో!

తన బెస్ట్ ఫ్రెండ్‌తో!!

చిన్నప్పట్నించి తనతో కలిసి చదువుకున్న తన బాల్య స్నేహితురాలితో!!!

షార్లెట్‌కి చెందిన ఓ మెక్సికన్‌ని అమెరెట్టో వివాహం చేసుకుని ఇద్దరు పిల్లల్ని కూడా కన్నది. ఆ మెక్సికన్ మర్ఫీ అర్థాయుష్కుడై సాధారణ జ్వరంతో మరణించాడు. టౌన్ హాల్‌లో క్లర్క్‌గా పని చేసే లూసీ, అమెరెట్టోతో ఫోన్‌లో మాట్లాడుతుంది తప్ప ఆమె ఇంటికి వెళ్ళడం, కలవడం తక్కువ. అమెరెట్టో కూడా తనింటికి లూసీని మనసు పెట్టి ఆహ్వానించక పోవడానికి కారణం ఇదన్నమాట! వాళ్ళిద్దరూ ఉండగా తను వెళ్తే రహస్యం బయట పడుతుందని పిలిచి ఉండదు.

ఐనా నలభై అయిదు పై బడ్డ అమెరెట్టోకి ఈ బుద్ధి ఈ వయసులో ఎందుకు? శారీరక అవసరం ఉంటే పెళ్ళి చేసుకోవచ్చుగా? పెళ్ళీడుకి వచ్చిన ఇద్దరు కూతుళ్ళు గల ఆ వృద్ధనారిది ఎంత పాడు బుద్ధి! ఇరవై ఏళ్ళ పెద్ద కూతురు ఆగ్నెస్‌కి ఇది తెలియచ్చన్న భయం కూడా లేదా?

ప్రఖ్యాత మూగ, చెవిటి, అంధురాలైన హెలెన్ కెల్లర్ పుట్టి పెరిగిన టస్కంబియాలోని తను ఎంత గుడ్డిది? ఎంతటి చెవిటిది? ఎవరూ తనని వీరి వ్యవహారం గురించి ఇంతదాకా హెచ్చరించలేదు. అదీ పదిహేనేళ్ళుగా సాగుతూందంటే, ఇద్దరూ ఎంత జాగ్రత్తపడి ఉంటారో? మోసకారి అయిన అమెరెట్టో రహస్యం ఆమె రాసిన ఉత్తరాల వల్ల బయటపడింది. ఆమెని తన భర్త తీసిన ఫొటోల వల్ల బయట పడింది.

తన భర్త పోయాక లూసీ అతని గదిలోని వస్తువులని, కాగితాలని సర్దుతూంటే ఓ తాళంచెవి కనిపించింది. అది చక్కటి సువాసన వేసే చిన్న నీలంరంగు వెల్వెట్ సంచీలో

లేకపోతే లూసీ దాన్ని పెద్దగా పట్టించుకునేది కాదు. దాని రెండో వైపు హృదయాకారంలో హేండిల్ ఉంది. 'ఏమిటీ తాళం చెవి?' అనుకుంది.

తర్వాత బేస్‌మెంట్‌లోని అతని లైబ్రరీని సర్దసాగింది. లూసీకి మొదటి నించీ సాహిత్యం మీద ఎలాంటి అభిరుచి లేదు. ఆమె భర్తకి చాలా ఉంది. ప్రయాణాల్లో కొన్న అనేక పుస్తకాలు అతని లైబ్రరీలో ఉన్నాయి. అతను ఆఫీసు పని మీద తరచూ ప్రయాణాలు చేస్తుంటాడు కాబట్టి ఆ లైబ్రరీ కూడా పెద్దదిగా ఉంది. బహుశా అతను అమెరెట్టోని కూడా తన ట్రిప్‌లో వెంట తీసుకెళ్ళి ఉంటాడు. లేకపోతే మోటల్‌లో అమెరెట్టోకి తీసిన ఫొటోలు తన భర్త రహస్య పేటికలో ఎందుకు ఉంటాయి?

రేక్స్ లోని పుస్తకాలని తీసి చూస్తూ ఓ పుస్తకాన్ని తెరవలేకపోయింది. దాని పేజీలు తెరచుకోలేదు. పరీక్షగా చూస్తే అది పుస్తకం కాదని, నిజానికి అలా డిజైన్ చేసిన, పైన కార్డ్ బోర్డ్ అట్ట అతికించిన ఇనప్పెట్టె అని గ్రహించింది. అలాంటి పెట్టెలు ఉంటాయని కూడా లూసీ ఎన్నడూ ఊహించలేదు. దానికి గల తాళంచెవి రంధ్రాన్ని చూసాక తన భర్త గదిలో సంచీలోని తాళంచెవి గుర్తుకు వచ్చింది. వెంటనే వెళ్ళి ఆ తాళంచెవిని తెస్తూ, తన భర్త ఆ పెట్టెలో ఏం దాచి ఉంటాడా అని అనుకుంది. ఆ తాళంచెవి దానిదే! మూత తెరచి చూస్తే సెంట్ పరిమళం బయటకి వ్యాపించింది. అమెరెట్టో ఆ గదిలోకి వచ్చిందా అని లూసీ తల తిప్పి చూసింది కూడా. ఎందుకంటే అది ఆమె వాడే సెంటే.

లోపల నించి రబ్బర్ బేండ్ పెట్టిన నీలి రంగు కవర్ల దొత్తరని బయటకి తీసింది. అన్నిటి మీద తన భర్త ఆఫీసు చిరునామాలని గమనించింది. ఆ కవర్ల మీది చిరునామా అమెరెట్టో చేతి వ్రాతలో ఉండటం చూసి ఆశ్చర్యపోయింది. భృకుటి ముడి వేసి ఒక్కొక్కటి బయటకి తీసి చదువుతూంటే వారి మధ్య గల శారీరక సాన్నిహిత్యం గురించి తెలిసింది. శారీరకంగానే కాక అమెరెట్టో తన భర్తతో అక్షరాల ద్వారా కూడా, ఆ ఉత్తరాలతో రతిని జరిపిందని తెలుసుకుంది. బూతు పదాలతో, బూతు భావాలతో వారి మధ్య తర్వాతి రతి ఎలా ఆరంభం అయి ఎలా అంతం అవాలని అనుకుంటోందో వివరంగా రాసి ఉన్నాయి. కొన్నిటిలో వారి గత రతిని అమెరెట్టో వివరంగా వర్ణిస్తూ, అది తనని ఎంత బాగా ఆనందింప చేసిందో వివరించింది.

లూసీ రెండు ఉత్తరాలు చదవగానే ఇక నిలబడలేక భర్త లైబ్రరీ కుర్చీలో కూలబడిపోయింది. అతని బల్ల మీద తల ఆనించింది. లూసీకి తెలియకుండానే ఆమెలో దుఃఖం కట్టలు తెంచుకుని పొంగి పొర్లింది. స్నేహితుల్లో ఇంతటి నమ్మక ద్రోహులు ఉంటారా? భర్తల్లో ఇంతటి మోసగాళ్ళు ఉంటారా?

వివిధ మోటెల్స్‌లో అర్ధ నగ్నంగా, నగ్నంగా అమెరెట్టోకి తీయబడ్డ ఫొటోలు కూడా ఆ పెట్టెలోని ఓ బ్రౌన్ రంగు దళసరి కవర్లో కనిపించాయి. అమెరెట్టోకి పిల్లలు పుట్టినా



ఒళ్ళు రాలేదు. ఆగ్నెస్ అమెరెట్టో చెల్లెలు అని చాలామంది భ్రమ పడతారని లూసీకి తెలుసు. ఆ సంగతి అమెరెట్టో కూడా గర్వంగా చెప్తూంటుంది. తను పిల్లలు పుట్టకపోయినా లావుగా ఉంటుంది. అందుకనే మోడల్‌గా ఫోజులిచ్చి అమెరెట్టో తన భర్తతో ఫొటోలు తీయించు కున్నట్లుంది.

లూసీ సిగరెట్లు మానేసి ఏడదిన్నర అయింది. కాని ఆ అగ్నిపర్వతం పేలగానే ఆమెకి సిగరెట్ తాగాలని అనిపించింది. లైబ్రరీలో వెదికితే ఆశించినట్లుగానే తన భర్త సిగరెట్ పాకెట్ ఆమె ఒకటి కనిపించింది. అందులోంచి ఓ సిగరెట్ తీసి ముట్టించింది. లూసీకి ఆ రోజంతా తల మీద బరువైన వస్తువుతో మోదితే బుర్ర మొద్దు బారినట్లుగా మొద్దు బారిపోయింది. ఆ రాత్రి తన భర్త నిద్ర మాత్రని ఉపయోగిస్తే కాని నిద్ర పట్టలేదు.

మర్నాడు నిద్ర లేచాక ఆమె పక్క మీంచి లేవకుండా కొద్ది సేపు ఏంచేయాలా అని ఆలోచించింది. తన భర్త జీవించి ఉంటే అతనికి విడాకులు ఇవ్వడమో లేదా చంపడమో చేసేది. ఆయన ఎటూ పోయాడు. ఇక మిగిలింది ఈ పాపంలో భాగస్వామురాలైన అమెరెట్టో. ఆమెకి తగిన ప్రతీకారం చేయాలి.

కాని ఎలా? ఆ ఉత్తరాలని, ఫొటోలని వెబ్ సైట్‌లో పెట్టడం అనే ఆలోచన తట్టింది. కాని నగ్న చిత్రాలని వెబ్ సైట్‌లో ఉంచితే అది నేరం. పోర్నోగ్రఫీ నిరోధక చట్టం కింద తనని పోలీసులు అరెస్ట్ చేయచ్చు.

ఇంకో ఆలోచన స్ఫురించింది. వెంటనే ఆమె మొహంలోకి వెలుగు ప్రవేశించింది. అమెరెట్టో మనస్తత్వం లూసీకి తెలుసు. అలా చేస్తే అది ఆమెరెట్టోని చాలా బాధిస్తుంది. పరిస్థితులని తట్టుకోగల మానసిక స్థైర్యం అమెరెట్టోలో లేదు. ఆమె ఓ సారి అప్పటికే మానసిక బలహీనతతో గోళ్ళ రంగుని తాగి ఆత్మహత్యా ప్రయత్నం చేస్తే కూతురు రక్షించిందని ఒక్క లూసీకే తెలుసు.

* * *

"మావారు పోయారని తెలిసాక నువ్వు 'మనిద్దరం ఇప్పుడు విధవలం' అని ఏడ్చావు గుర్తుందా?" లూసీ అమెరెట్టోని అడిగింది. వారిద్దరూ పెయిన్‌టెన్‌లోని తమ ఇంటి బయట పేవ్‌మెంట్ మీద నడుస్తున్నారు.

"అవును?"

"నిజానికి ఆగ్నెస్ అలా ఏడవాలి."

లూసీ కంఠంలోని సానుభూతిని, బాధని గ్రహించిన అమెరెట్టో వెంటనే అడిగింది.

"అదేమిటి?"

"మా వారు పోయాక ఆయన లైబ్రరీని సర్దుతుంటే ఆయన భద్రంగా దాచుకున్న ఉత్తరాలు, ఫొటోలు కొన్ని కనిపించాయి."

"అవి ఎవరి నించి?" ఆదుర్దాగా అడిగింది అమెరెట్టో.

"ఆగ్నెస్ నించి."

"ఎవరి నించి?" అగి లూసీ చెయ్యి పట్టుకుని అడిగింది అమెరెట్టో.

"నా భర్తకి, మీ అమ్మాయికి శారీరక అక్రమ సంబంధం ఉందన్న సంగతి నాకు ఆ ఉత్తరాలు చదివేదాకా తెలీదు. మా వారు తరచూ వంద మైళ్ళ దూరంలోని ఆఫీస్ కేంప్‌కి వెళ్ళినప్పుడల్లా ఉదయం వెనక్కి మీ ఇంటికి వచ్చి, ఆగ్నెస్‌తో సెక్స్‌లో పాల్గొనేవాడు. ఆ సమయంలో నువ్వు ఎక్కడకి వెళ్ళేదానివి?"

అమెరెట్టో మొహం కత్తి వాటుకు నెత్తురు చుక్క లేనంతగా పాలిపోయింది.

"నిజంగా?" ఒణికే కంఠంతో అడిగింది.

"అవును. మీ అమ్మాయిని నగ్నంగా మీ ఇంట్లో తీసిన ఫొటోలు కూడా చాలా చూసాను. అవి నా కళ్ళబడ్డాయి. వాటిని తగలబెట్టాను. ఇంకెవరి కళ్ళబడ్డా ఆగ్నెస్ బ్రతుకు పాడయ్యేది."

అమెరెట్టో నిలబడలేనట్లుగా ఆ పేవ్‌మెంట్ మీదే కూలబడి, పిచ్చిదానిలా చూడ సాగింది. ఆమె మనస్థితిని గమనించి బాధని నటిస్తూ చెప్పింది లూసీ.

"ఏమిటిది? లే. ఓ ఫొటోని ఆటోమేటిక్ కెమేరాతో టైమర్‌తో మా ఆయన తీసాడు. దాంట్లో ఎవరెవరు ఉన్నారో తెలుసా? మధ్యలో మా వారు, అటు ఇటూ నీ పెద్ద కూతురు ఆగ్నెస్, చిన్న కూతురు రీటా. నగ్నంగా వాళ్ళేం చేస్తున్నారో చెప్పలేను."

తక్షణం అమెరెట్టో లేచి నిలబడింది. గబగబా ముందుకు నడుస్తూ తన ఒంటి మీది కోట్‌ని తీసి పక్కకి విసిరేసింది. తర్వాత స్లేక్‌ని. తర్వాత బ్రాని. ఆ తర్వాత జీన్స్ పేంట్‌ని. ఆ తర్వాత పేంటీని, సాక్స్‌ని, బూట్లని.

అటు ఇటు ఇళ్ళ వంక చూస్తూ చేతులూ ఊపుతూ నగ్నంగా నడుస్తూ, మధ్య మధ్యలో ఆమె డేన్స్ చేయసాగింది. పక్క నించి వెళ్ళే కార్ల డ్రైవర్లు ఆమెని చూసి హారన్ కొట్టసాగారు. ఆ కార్ల వంక చూస్తూ గాల్లోకి ముద్దులు వదులుతూ అమెరెట్టో ముందుకి సాగింది. లూసీ తనలోని ద్వేషం చల్లారుతుండగా అమెరెట్టో వంక తృప్తిగా చూసింది. ఓ పోలీస్ కారు వచ్చి రోడ్డు పక్క ఆగింది. అందులోంచి దిగిన ఇద్దరు పోలీస్ ఆఫీసర్లు అమెరెట్టో దగ్గరకి వేగంగా వెళ్ళి ఆమెని ఏదో ప్రశ్నించి, ఆమె చేతులు వెనక్కి విరిచి బేడీలు వేసి కారులో ఎక్కించుకుని తీసుకెళ్ళారు.

లూసీ సన్నగా కూనిరాగం తీస్తూ వెనక్కి తిరిగింది.





# 21. రక్షణ సేవ

## బిల్ ప్రోంజిని, జెఫ్రె వాల్‌మేన్

జేమ్స్ రలై తన నూతన దుకాణం కిటికీల మీద ది ఫేక్సిమైల్ షాప్ అనే అక్షరాలని స్టెన్సిల్ చేస్తూంటే దుకాణం బయట ఓ కారు ఆగింది. అందులోంచి ఇద్దరు మనుషులు దిగారు. వారిలో ఒకరు దృఢంగా, పహిల్వాన్‌లా ఉంటే, రెండో అతను సన్నగా ఉన్నాడు. ఇద్దరి మొహాల్లో ప్రసన్నత లేదు. సన్నగా ఉన్నతని మొహంలో కాఠిన్యం కనపడుతోంది. వారు తన దుకాణంలోకి వెళ్ళడం చూసి జేమ్స్ బయట తను చేసే పనిని ఆపి వారి వెంట దుకాణంలోకి వెళ్ళాడు.

ఆ ఇద్దరు దుకాణంలో ప్రదర్శనకి ఉంచిన వస్తువులని పరిశీలనగా చూడసాగారు. రెబ్రాంట్ చిత్రం నకలుని, నకిలీ దంతంతో చేయబడ్డ ఆరో శతాబ్దానికి చెందిన చైనీస్ డ్రేగన్‌ని, సున్నపు రాయితో చేసిన ఈజిప్షియన్ స్ఫింక్స్ నమూనాని, పాలరాతితో చేసిన బుద్ధ విగ్రహాన్ని వారు చూసారు. సన్నటి వ్యక్తి స్ఫింక్స్‌ని అందుకుని దాన్ని దీక్షగా చూసాడు.

"మీకేమైనా సహాయం చేయగలనా?" జేమ్స్ వాళ్ళని అడిగాడు.

ఆ ఇద్దరూ జవాబు చెప్పకుండా దుకాణంలోని మిగిలిన వస్తువులని పరీక్షగా చూడసాగారు. రెండో అతను ఓ బొమ్మని చేతుల్లోకి తీసుకుని చూస్తూంటే చెప్పాడు జేమ్స్.

"అది నమూనా."

"నమూనానా?"

"అవును. క్రీస్తు పూర్వం ఆరో శతాబ్దానికి చెందిన గ్రీకు వీరుడి విగ్రహానికి ఇది నమూనా. ఆ పక్కది ఏథెన్స్‌లోని ఆక్రోపోలీస్ దేవాలయం నమూనా. ప్రపంచంలో లభ్యమయ్యే వివిధ ప్రాచీన కళా రూపాల నకిలీలని అమ్మే దుకాణం ఇది."

"అంటే చెత్తన్న మాట హేరీ." సన్నపాటి అతను దృఢమైన వ్యక్తి వంక నవ్వుతూ చూస్తూ చెప్పాడు.

"అలెక్స్. అది మాట్లాడే పద్ధతి కాదు." ఆ దృఢమైన వ్యక్తి కూడా నవ్వుతూనే హెచ్చరించాడు.

జేమ్స్ వంక అలెక్స్ తేరిపార చూసి అడిగాడు.

"నీ పేరేంటి మిత్రమా?"

"జేమ్స్ రలై. మీరు దేనికి కోసం చూస్తున్నారో చెప్తే, అది నా దుకాణంలో ఉందో లేదో చెప్పగలను." జేమ్స్ మర్యాదగా జవాబు చెప్పాడు.

అతను చేతిలోకి ఓ ఏనుగు, దాని తోకని పట్టుకున్న పిల్ల ఏనుగు ఉన్న బొమ్మని అందుకుని, దాని వంక చూస్తూ చెప్పాడు.

"హేరీ! ఆ ప్రశ్నకి నువ్వు జవాబు చెప్పు."

"దాని ఖరీదు ఎంత?" హేరీ అలెక్స్ చేతిలోని ఆ బొమ్మ వంక చూపిస్తూ అడిగాడు.

"అది పద్దెనిమిదో శతాబ్దంలో బౌద్ధ భిక్షువులు థాయ్‌లేండ్‌లో చేసిన బొమ్మకి నమూనా. అరవై నాలుగు డాలర్లు." వివరించాడు జేమ్స్.

"చాలా ఖరీదు." హేరీ నవ్వుతూ చెప్పాడు.

"నా అభిప్రాయం కూడా అదే."

అలెక్స్ దాన్ని కావాలని చేతి లోంచి కిందకి జార విడచాడు. ఆ మట్టి బొమ్మ చప్పుడు చేస్తూ కార్పెట్ లేని నేల మీద పగిలి ముక్కలైంది. తక్షణం జేమ్స్ మొహం ఎర్రబడింది. ఆ దుకాణంలోని ఇతర కస్టమర్స్ తమలో తాము మాట్లాడుకోవడం ఆపేసారు. అకస్మాత్తుగా ది ఫేస్కిమైల్ షాప్‌లో నిశ్శబ్దం ఏర్పడింది. జేమ్స్ ఆ ఇద్దరి వంకా కోపంగా చూసాడు. వారు కూడా జేమ్స్ వంక మొహంలో ఎలాంటి భావాలు ప్రదర్శించకుండా చూడసాగారు.

"ఎందుకా పని చేసావు?" అడిగాడు జేమ్స్.

"పొరబాటున అది నా చేతుల్లోంచి జారి కింద పడిపోయింది." జవాబు చెప్పాడు.

"మిస్టర్ అలెక్స్. దాన్ని నువ్వు కావాలని కింద పడేయడం నేను చూసాను."

"నేనా పని ఎందుకు చేస్తాను?"

"అదే నేను నిన్ను అడుగుతున్నాను. ఎందుకు దాన్ని పగలకొట్టావు?"

అలెక్స్, హేరీ ఇద్దరూ ఒకరి వంక మరొకరు చూసుకుని సన్నగా నవ్వుకున్నారు. అలెక్స్ తన జేబు లోంచి ఓ పర్స్‌ని బయటకి తీసాడు. అందులోంచి ఓ విజిటింగ్ కార్డ్‌ని తీసి జేమ్స్ చేతిలో ఉంచాడు. జేమ్స్ దాని మీద ముద్రించిన మాటలని చదివాడు.

సెంటినల్ ప్రొటెక్టివ్ అసోసియేషన్.

దాని కింద అటెన్షన్‌లో నిలబడ్డ యూనిఫాం లోని ఓ సైనికుడి బొమ్మ ముద్రించి ఉంది.

"మిస్టర్ జేమ్స్. నీలాంటి చిన్న వ్యాపారస్థుల దుకాణాల్లో ఇలాంటి పొరబాట్లు, ప్రమాదాలు జరుగుతూంటాయి. అప్పుడు నువ్వు ఏం చేయగలవు? దొంగతనం, అగ్ని ప్రమాదం లాంటివి జరగకుండా నిన్ను నువ్వు రక్షించుకోడానికి ఓ మార్గం నీ చేతిలో ఉంది. సెంటినల్ ప్రొటెక్టివ్ అసోసియేషన్ రక్షణ సేవ మీకు లభిస్తుంది. ఇప్పుడు జరిగిన లాంటి చిన్న పొరబాట్లు ఎవరైనా చేస్తే, మాకు వెంటనే ఫోన్ కొడితే మా మనిషి వచ్చి ఆ కస్టమర్ నించి నష్ట పరిహారాన్ని వసూలు చేసిపెడతాడు."

"ఓ? అందుకు మీరు ఏం తీసుకుంటారు?" ఆసక్తిగా అడిగాడు జేమ్స్.

"ఇందులో చేరడానికి సభ్యత్వ రుసుము వంద డాలర్లు. అది కాక ప్రతీ శుక్రవారం రక్షణ సేవకి పాతిక డాలర్లు రుసుముగా చెల్లించాలి."



"ఒకవేళ నేను ఇందులో సభ్యత్వం తీసుకోకపోతే?" తన చేతిలోని కార్డుని గాల్లో ఆడిస్తూ అడిగాడు జేమ్స్.

"ఇది నేరస్థులు అధికంగా ఉంటే ప్రదేశం. బీదల్లోనే నేరస్థులు అధికం అని పోలీసు స్టాటిస్టిక్స్ చెప్తున్నాయి. కాబట్టి ఏమైనా జరగచ్చు." అలెక్స్ చెప్పాడు.

"బహుశా ఈ అర్ధరాత్రే అగ్ని ప్రమాదం జరగచ్చు." హేరీ చెప్పాడు.

"చాలా చెడ్డ ఏరియా ఇది. క్రితం వారం ఎదుటి సందులోని కాఫీ షాప్‌లో అర్ధరాత్రి లూటీ జరిగింది. దాని యజమాని పేరు హోల్ట్జ మియర్. కావాలంటే అతన్ని అడగండి. అతను మళ్ళీ మా రక్షణ సేవ కోసం సభ్యుడయ్యాడు." అలెక్స్ చెప్పాడు.

"మళ్ళీనా?" అడిగాడు జేమ్స్.

"అవును. నిజానికి అతను కొంత కాలంగా ఇందులో సభ్యుడే. కాని ఆ లూటీ జరగడానికి ఒక రోజు ముందు సభ్యత్వ రుసుముని ఇక చెల్లించ కూడదని నిర్ణయించుకున్నాడు. శనివారం అర్ధరాత్రి పాపం, చాలా నష్టపోయాడు."

"ఈ రకం వ్యాపారాన్ని 'రౌడీయిజం' అంటారు కదా?" జేమ్స్ నవ్వుతూ అడిగాడు.

"సారీ?"

"మీరంతా రౌడీల బృందం కదా? ఈ పేరుతో దుకాణ యజమానులని బెదిరించి డబ్బు గుంజుతున్నారు కదా?"

"నువ్వేం మాట్లాడుతున్నావో నిజంగా నాకు అర్థం కావడం లేదు మిస్టర్ రలై. ఇక్కడి వ్యాపారస్థులని రక్షించడానికి సెంటినల్ ప్రొటెక్టివ్ అసోసియేషన్‌ని మీ లాంటి ఓ చిన్న వ్యాపారస్థుడు ఆరంభించాడు. ఇది అతను సేవలా చేస్తున్నాడు. వారానికి పాతిక డాలర్లు చాలా తక్కువ."

"కాని అది ఏ పనీ చేయకుండా వచ్చే మొత్తం అని మీరు మర్చిపోకూడదు."

అలెక్స్ బుద్ధ విగ్రహాన్ని చేతిలోకి తీసుకుని దాన్ని బేలన్స్ చేస్తూ చూడసాగాడు.

"ఈ దుకాణం అద్దె నాకు అందుబాటులో ఉంది. నేను ఈ దుకాణాన్ని తెరిచి రెండు రోజులే అయింది. మీ కారణంగా దీన్ని ఖాళీ చేయడం నాకిష్టం లేదు. కాబట్టి..."

"కాబట్టి మా సభ్యత్వ జాబితాలో చేరతావా?" ఇద్దరూ ఒకే సారి అడిగారు.

"నాకు వేరే ఛాయిస్ లేదు. కాబట్టి తప్పదు అనుకుంటాను."

వెంటనే అలెక్స్ నవ్వుతూ బుద్ధ విగ్రహాన్ని యథాస్థానంలో ఉంచి చెప్పాడు.

"మీరు చాలా తెలివైన వారు మిస్టర్ జేమ్స్ రలై. కాకపోతే మీరు ఇచ్చే డబ్బు నగదు రూపంలో కావాలి. చెక్కులు అంగీకరించబడవు."

"నేను కూడా మీకు నగదే ఇద్దామనుకున్నాను. ఎందుకంటే ఇంకా నేను నా దుకాణం పేర బేంకు అకౌంట్‌ని తెరవలేదు. రేపు మధ్యాహ్నం వస్తే ఇస్తాను."

"సారీ మిస్టర్ జేమ్స్. మీ నించి సభ్యత్వ రుసుము ప్లస్ ఈ శుక్రవారం రుసుము అందితే కాని మేము మిమ్మల్ని రక్షించలేం. ఈలోగా ఇక్కడ ఏం జరిగినా అందుకు బాధ్యత మాది కాదు. మీదే అవుతుంది." అలెక్స్ హెచ్చరికగా చెప్పాడు.

హేరీ అద్దాల పెట్టె లోని పాలరాతి తాజ్‌మహల్ బొమ్మని రెండు చేతులతో అందుకుని, దాన్ని ఎడమ అరచేతిలోకి మార్చుకుని బేలన్స్ చేయసాగాడు.

"సరే! ఇప్పుడు ఎంత కావాలి?"

"ఇవాళ సభ్యత్వ రుసుముగా వంద డాలర్లు, మిగిలింది రేపు మధ్యాహ్నం ఇస్తే, అప్పుడు ఈ క్షణం నించే మీకు రక్షణ సేవ మొదలవుతుంది." చెప్పాడు అలెక్స్.

"సరే." జేమ్స్ ఒప్పుకున్నాడు.

వెంటనే హేరీ ఆ తాజ్‌మహల్ బొమ్మని యధాస్థానంలో ఉంచేసాడు.

"రెండు వందల డాలర్లు ఇస్తాను. వంద సభ్యత్వం, మిగిలింది నెలకి రక్షణ రుసుము. వారం వారం మీరు నా దగ్గరకి రానవసరం లేదు. నెలకో సారి వస్తే చాలు."

"మరీ మంచిది." ఆనందంగా నవ్వుతూ చెప్పాడు అలెక్స్.

జేమ్స్ తన దుకాణం వెనక తలుపు తెరచుకుని ఓ కేబిన్ లోకి వెళ్ళాడు. కొద్ది సేపట్లో బయటకి వచ్చి ఇరవై డాలర్ల నోట్లు పది గల ఓ కవర్‌ని వారికి ఇచ్చాడు. అలెక్స్ వాటిని బయటకి తీసి లెక్క పెట్టుకుని తన పర్స్‌లో ఉంచుకున్నాక హేరీ చెప్పాడు.

"సెంటినల్ క్లైంట్ అయినందుకు కంగ్రాచ్యులేషన్స్! ఇక మీకు మా రక్షణ సేవ లభించి నెల దాకా ఎలాంటి ఇబ్బందీ ఎదురవదు. మీకు మా సహకారం గేరంటీ."

ఓ రసీదు బుక్, బాల్ పెన్ జేబులోంచి తీసి రసీదు రాసిచ్చి చెప్పాడు అలెక్స్.

"ప్రస్తుతానికి గుడ్ బై."

వాళ్ళు వెళ్ళాక జేమ్స్ రలై నాలుగు గంటలు కష్టపడి కొన్ని మార్పులు, చేర్పులు చేసిన ఓ ప్రత్యేక కలర్ జెరాక్స్ మెషీన్ యంత్రంతో నకిలీ ఇరవై డాలర్ల నోట్లని ప్రింట్ చేసాడు. వాటిని అట్ట పెట్టెల్లో పేక్ చేసి సిద్ధంగా ఉంచాడు. సాయంత్రం ఓ వ్యక్తి వచ్చి, ఆ నోట్లలో పదో వంతు విలువ గల డాలర్లని ఇచ్చి వాటిని తీసుకుని వెళ్ళిపోయాడు.

* * *

జేమ్స్ మర్నాడు ఉదయం దినపత్రికని చూస్తూంటే క్రైం పేజీలో హేరీ, అలెక్స్‌ల ఫొటోలు కనిపించాయి. ఆ వార్తని పెద్దగా ఆసక్తి లేకుండా చదివాడు. నకిలీ ఇరవై డాలర్ల నోట్లని మారుస్తూ వాళ్ళిద్దరూ పట్టుబడ్డారు.

ప్రింటింగ్ క్వాలిటీ సరిగ్గా లేవని రిజెక్ట్ చేసిన ఇరవై డాలర్ల నోట్ల లోంచి జేమ్స్ కావాలని వాటిని అలెక్స్‌కి ఇచ్చాడు.



# ౨౨. మేటనీ షో

## రుత్ విస్‌మేన్

"నీతో ప్రేమలో పడటంలో నా తప్పు లేదు." కార్లా తన పక్కన నగ్నంగా పడుకున్న అలన్‌తో చెప్పింది.

"అది నా తప్పా?" నవ్వుతూ అడిగాడు అలన్.

"ఊహు. అది మనిద్దరి తప్పూనూ. ఇందులో ఏ ఒక్కరిదో తప్పు అనడం అన్యాయమే అవుతుంది. నీకు దూరంగా ఉండలేకపోతున్నాను అలన్."

"నీ భర్త టామ్‌కి మన గురించి తెలుసా?" అలన్ అడిగాడు.

"బయట నీతో గడిపే సమయాన్ని ఆయనకి తృప్తికరంగా వివరించలేక పోతున్నాను. దాంతో టామ్‌లో అసహనం, అనుమానం మొదలయ్యాయి. అలెన్! నీ భార్య లిజా మన గురించి తెలుసుకుంటుందనే భయం నీకు లేదా?" కొద్ది క్షణాల తర్వాత కార్లా అడిగింది.

"అదే జరిగితే నీకు తెలుస్తుంది. లిజా నన్ను చంపేసిందని నువ్వు దినపత్రికల్లో చదువుతావు." తల అడ్డంగా ఊపి చిన్నగా నవ్వి చెప్పాడు.

"ఐనా మనం ఛాన్స్ తీసుకుంటూనే ఉండాలి అలెన్. నిజానికి ప్రతీదీ ఛాన్సే. అసలు నిత్యం చావకుండా నిద్ర లేవడంలోనే ఛాన్స్ ఉంది. ఐ లవ్ యూ. టామ్‌కి తెలిస్తే నన్ను వదిలేస్తాడు. నీ మీద ఎంత ఇష్టమంటే, అందుకు కూడా నేను సిద్ధంగా ఉన్నాను."

అలెన్ కార్లాని కొద్దిసేపు ముద్దు పెట్టుకున్నాడు.

అలెన్ హాలీవుడ్‌లో పైకి వస్తున్న నటుడు. లాస్ ఏంజెలెస్‌లో ఓ టి వి షోలో వారికి పరిచయమై చివరకి అది పక్క మీదకి దారి తీసింది. గత ఆరు నెలలుగా అలెన్, కార్లాలు వారానికి మూడు సార్లు మధ్యాహ్నాలు ఆ మోటెల్‌లో గంటన్నర సేపు కలుస్తున్నారు.

"చూస్తూండగానే గంటన్నర ఇట్టే గడిచిపోయింది. నీ సమక్షంలో టైమే తెలీదు అలెన్. ఇక నేను బయలు దేరాలి."

"మళ్ళీ మూడు రోజులకి నా ఒంట్లోని తిక్కని నువ్వు వచ్చి ఇలాగే కుదర్చాలి. అది నీకే సాధ్యం." నవ్వుతూ చెప్పాడు అలెన్.

"స్నానం చేసి వస్తాను. హాలీవుడ్ వాళ్ళు చాలా చెడ్డవాళ్ళని, డ్రెస్‌ని మార్చినట్లు అమ్మాయిలని మారుస్తారని విన్నాను. నువ్వు అలా కాదు." కార్లా మెచ్చుకుంది.

"స్నానం కలిసి చేద్దామా?"

"నేను త్వరగా వెళ్ళాలి. కలిసి చేస్తే గంట పడుతుంది." అతని పెదవుల మీద చూపుడు వేలుని నిలువుగా ఉంచి గోముగా చూస్తూ చెప్పింది.

కార్లా మంచం దిగి బాత్‌రూం తలుపు దగ్గరకి వెళ్ళి ఆహ్వానించింది.

"రా! నీ కోరికని ఎందుకు కాదనాలి?"

అలెన్ మంచం దిగి నగ్నంగా ఉన్న ఆమె పక్కకి వచ్చాడు. ఆమె బాత్‌రూం తలుపు తెరిచింది. ఎదురుగా కనపడ్డ దృశ్యాన్ని కార్లా తన జీవితంలో మర్చిపోలేదు. కదలిక లేని ఓ పురుషుడి శవం ఎదురుగా సగం బాత్ టబ్‌లో, సగం నేల మీదకి పడి ఉంది. తెరచి ఉన్న కళ్ళు నిర్జీవంగా చూస్తున్నాయి. నుదుటి లోంచి లోపలకి దూసుకెళ్ళిన బుల్లెట్ గాయం కనిపిస్తోంది. అప్పటికే రక్తం గడ్డ కట్టి ఉంది. నల్లటి పంట్లాం, బూడిద రంగు టీషర్ట్ ధరించిన అతని వయసు ముప్పై-ముప్పై అయిదు మధ్య ఉంటుంది. కార్లా నోట్లోంచి కేక కొద్దిగా బయటకి రాగానే అలెన్ తేరుకుని, ఆమె నోటిని మూసి ఆ కేకని బయటకి రానీకుండా ఆపాడు. తర్వాత కాలితో బాత్‌రూమ్ తలుపుని తన్ని మూసేసాడు.

"ఒద్దు. అరవకు. ఎవరైనా వింటారు." అలెన్ చెప్పే మాటలు కార్లాకి నూతి లోంచి వినిపించినట్లుగా వినిపించాయి.

అలెన్ కళ్ళు బయటకి తప్పించుకోవాలి అన్నట్లుగా ఆ గది లోని అన్ని దిక్కుల వంకా చూసాయి. కాని అలాంటి దారి కనపడనట్లుగా నిస్పృహ అతని మొహంలోకి ప్రవేశించింది.

"ఏం చేయాలి? ఛ! ఎలాంటి పరిస్థితిలో చిక్కుకున్నాం?" బాధగా చెప్పాడు అలెన్.

ఆమె ఇంకా తేరుకోక పోవడంతో ఆమె మొహం మీద చిన్నగా తట్టాడు.

"ముందు డ్రెస్ వేసుకో కార్లా. మనం వెంటనే ఇక్కడ్నించి బయలుదేరాలి." గుసగుస లాడుతున్నట్లుగా చెప్పాడు.

"అబ్బ! ఎవరతను? ఎంతటి భయంకర దృశ్యం?" కార్లా ఏడుస్తూ అడిగింది.

"నే చెప్పేది విను. సెంటిమెంటల్‌గా, బలహీనంగా ఫీలయ్యే సమయం కాదిది. ముందు మనం ఇక్కడ్నించి వెళ్ళాలి. భయపడకు."

"కాని ఈ శవం పోలీసుల కంట పడ్డాక, మనం ఈ గదిని అద్దెకి తీసుకున్నాం అని వాళ్ళకి తెలుస్తుంది. కాబట్టి ముందే మనం మోటెల్ మేనేజర్‌కి ఈ శవం గురించి చెప్తే మంచిది కదా?" కార్లా సూచించింది.

"పోలీసులకి చెప్పడమా! నీకు పిచ్చెక్కిందా?"

"అతన్ని ఎవరో హత్య చేసారు అలెన్! నుదుటి మీద కాల్చి చంపారు!!"

"నువ్వు తెలివి హీనురాలివని నాకు తెలుసు. కాని మరీ ఇంతని తెలీదు. పోలీసులు వస్తే రేపు ఉదయం మనిద్దరి ఫొటోలు పేపర్లోకి ఎక్కుతాయి. మీ ఆయన, మా ఆవిడ వాటిని చదువుతారు."

"సరే. నాకన్నా నువ్వే తెలివిగలవాడివి. వెళదాం పద." అతని కన్నా త్వరగా కార్లా డ్రస్ చేసుకుంది.



"కాని ఆగు. మనం ఆ శవాన్ని అలా వదిలి వెళ్ళకూడదు. వెళ్తే పోలీసులకి దాని గురించి, మన గురించి తెలుస్తుంది." అప్పుడే ఆ ఆలోచన వచ్చినట్లుగా చెప్పాడు అలెన్.

"ఎలా తెలుస్తుంది. దొంగ పేరుతో కదా నువ్వు మోటెల్‌ని తీసుకుంది?"

"మనం ఈ మోటెల్‌కి ఆర్నెల్లుగా వస్తున్నాం. మన పేర్లు తెలీకపోయినా మన కార్ల నంబర్లు ఇక్కడి సిబ్బందిలో ఎవరికైనా గుర్తుండచ్చు. రంగు, మేక్‌ని చెప్పినా చాలు. పోలీసులు మనల్ని కనుక్కోగలరు."

"మనల్ని పోలీసులు హంతకులుగా అనుమానిస్తారా?" భయంగా అడిగింది కార్లా.

"కొద్దిసేపు నోరుమూసుకో. నన్ను ఆలోచించుకోనీ."

తను ఉన్న పరిస్థితి కన్నా అతను ప్రదర్శించే తిరస్కార ధోరణి వల్ల ఆమె కళ్ళ వెంట నీరు కారసాగింది. ఇదివరకు తనో దేవతలా ప్రవర్తించాడు. ఇప్పుడు?

"అలెన్. నేను వెళ్తాను." చిరాగ్గా చెప్పింది.

"కదలక. ఇందులో మనం ఇద్దరం ఇన్‌వాల్వ్ అయి ఉన్నాం. బాధ్యతని నా ఒక్కడి మీదే వేసి ఎలా వెళ్తావు?"

"కాని నేను వెళ్ళాలి. హత్య కేసులో ఇరుక్కోవడం నాకు ఇష్టం లేదు. నువ్వే దీన్ని హేండిల్ చెయ్యి."

"చీకటి పడేదాకా ఆగు. నేనొక్కడ్నే ఈ శవాన్ని కారులోకి మోసుకు వెళ్ళలేను. ఈ శవాన్ని ఇద్దరం కలిసి మాయం చేస్తే కొంత ప్రమాదం తప్పుతుంది. నా పేరు ఇందులో ఇన్‌వాల్వ్ అయితే ఇక నాకు హాలివుడ్‌లో పని దొరకదు."

"ఇది ఈ గదిలో మన ముందు దిగినవారి పని అయి ఉంటుంది. మనం వెళ్ళి మేనేజర్‌కి ఈ సంగతి ఫిర్యాదు చేస్తే అప్పుడు మన నిజాయితీ ప్రపంచానికి తెలుస్తుంది." సూచించింది.

"నీ అంత మందమతిని ఇంతదాకా నేను చూడలేదు. అతను వెంటనే పోలీసులని పిలుస్తాడు. వాళ్ళు మనం చెప్పేది నమ్ముతారని హామీ లేదు. మన ఇద్దర్నీ అనుమానం మీద అరెస్ట్ చేయచ్చు. ఛ! వీడు ఈ గదిలోనే చావాలా?" తత్తరపడుతూ అలెన్ చెప్పాడు.

"అలన్. నేను వెళ్తున్నాను. టామ్ వచ్చే లోగానే మా ఇంటికి చేరుకుని నేను వంట పూర్తి చేయాలి."

"ఆగు. తప్పించుకోవాలని చూడకు. మనిద్దరం ఇందులో భాగస్వాములం. ఒంటరిగా నేను గదిని అద్దెకి తీసుకున్నానని పోలీసులకి చెప్తే వీడ్ని చంపడానికే అనుకుంటారు. నీ కోసం తీసుకుంటే ఆ అనుమానం బలహీనపడచ్చు."

కార్లాకి తను ఓ జైలు గదిలో చిక్కుకున్నట్లుగా అనిపించింది.

"దయచేసి నన్ను ఇందులో ఇరికించకు." అతన్ని ప్రార్థించింది.

"నాకో అనుమానం వస్తోంది. నీకు నాలా ఇంకెందరితో సంబంధం ఉంది? వారిలో ఓ ప్రియుడు అసూయతో ఈ పని చేసి ఉంటాడు. అవును. నాకది నిజం అనిపిస్తోంది."

"ఎంత అసహ్యంగా ఆలోచిస్తున్నావు? నేను వెళ్ళాలి."

"ఈ పని చేసిన నీ ఇంకో ప్రియుడు ఎవరో ఆలోచించు. రాజకీయ నాయకుడా? గూండానా? పోలీస్ ఆఫీసరా?"

"అలెన్! నన్ను అవమానించక." కార్లా తల అడ్డంగా ఊపుతూ చెప్పింది.

"నీ రహస్య ప్రియుడికి ఫోన్ చేసి నాకంతా తెలిసిందని, ఇందులోంచి బయట పడేయమని, లేదా అతని పేరు, హత్యకి కారణం బహిర్గతం చేస్తానని బెదిరించు."

"అలెన్!?!"

"అదొక్కటే పరిష్కారం. సరైన పరిష్కారం."

"నీ ఊహలన్నీ అబద్ధాలు. నన్ను నువ్వు నిజంగా ప్రేమిస్తే నా పేరు ఇందులో ఇన్‌వాల్వ్ చేయకు అలెన్. నేను వెళ్తున్నాను."

గుమ్మం దగ్గరకి వెళ్ళింది కార్లా.

"ఆగు. నువ్వు నన్ను ఈ శవంతో వదిలి వెళ్తే ఇక ఈ జన్మలో నీ మొహం చూడను." హెచ్చరించాడు అలెన్.

"అలాగే."

"నా కెప్పుడూ ఇక నువ్వు ఫోన్ చేయకు. నన్ను కాంటాక్ట్ చేసే ప్రయత్నం చేయకు. నువ్వు ఫోన్ చేసినా నేను ఆన్సర్ చేయను." రోషంగా మళ్ళీ అరిచాడు అలెన్.

"ఓకే. ఫోన్ చేయను. ప్రామిస్." అతని వంక కోపంగా చూస్తూ చెప్పింది.

కార్లా తలుపు తెరచుకుని బయటకి వెళ్ళిపోయింది. అలెన్ కిటికీలోంచి ఆమె కారు ఎక్కి వెళ్ళడం చూసాడు. తర్వాత బయటకి వెళ్ళి తన కారు డిక్కీ తలుపుని తెరిచాడు. మళ్ళీ లోపలకి వచ్చి తన కోటుని విప్పి బాత్‌రూం లోని ఆ శవానికి దాన్ని చుడుతూ చెప్పాడు.

"గుడ్ ఓల్డ్ జార్జ్! మరోసారి మనదే విజయం. ఆమెని ఎప్పటిలా తేలిగ్గా వదిలించుకున్నాను. ఇక ఈ మోటల్‌కి కొత్త పిట్ట వస్తుంది. నిన్ను మళ్ళీ జాగ్రత్తగా స్టూడియో లోని ప్రాపర్టీస్ డిపార్ట్‌మెంట్‌లో అప్పగించాలి."

అలన్ అచ్చం మనిషిలా కనిపించే, షూటింగ్స్‌లో వాడే మైనంతో చేసిన ఆ బొమ్మని మంచం కింద దాచిన అట్ట పెట్టెలో పెట్టి బయటకి తీసుకెళ్ళాడు.





# 23. ప్రయాణంలో పదనిసలు

## ఫ్రెడ్ ఎస్ టోబె

లాస్ ఏంజెలెస్ ఎయిర్‌పోర్ట్ నించి బోయింగ్ 737 గాల్లోకి లేచింది. అందులోని ప్రయాణీకుల్లోని కొందరు సినిమాని చూస్తూంటే, మరికొందరు పుస్తకాలని, పత్రికలని తెరిచారు. ఓ హాలీవుడ్ నటి తన హేండ్ బేగ్ లోంచి స్క్రిప్ట్‌ని తీసి దాన్ని చదవసాగింది. ఓ సిఈఓ తన కంపెనీ క్వార్టర్లీ ఫైనాన్షియల్ రిపోర్ట్ రఫ్ ప్రతిని చదువుతూ పెన్సిల్‌తో మార్క్ చేయసాగాడు. ఇద్దరు వృద్ధులు పేకాటలో మునిగిపోయారు.

ఎకానమి విభాగంలో కిటికీ పక్కన కూర్చున్న డాక్టర్ గోర్డోన్ ప్రిన్స్‌కి తన పక్కనే ఉన్న రెండు సీట్లు ఖాళీగా ఉండటం ఆనందాన్ని ఇచ్చింది. కొన్ని గంటల పాటు తను ఏకాగ్రతతో ఎలాంటి డిస్టర్బెన్స్ లేకుండా చదివే అవకాశం వచ్చిందని ఆ ఆనందం. తన బ్రీఫ్‌కేసు లోంచి మెడికల్ హిస్టరీ ఆఫ్ యూరప్ అనే టైప్డ్ మేన్యు స్క్రిప్ట్‌ని బయటకి తీసి చదవసాగాడు. మార్జిన్‌లో అనుమానాలని రాసుకోసాగాడు. ఆయన గైడ్‌గా ఓ విద్యార్థి కొన్ని నెలలుగా తయారు చేసి సబ్‌మిట్ చేసిన చిత్తు వ్రాతప్రతి అది. దాన్ని ఆయన ఆమోదిస్తే ఆ విద్యార్థికి పిహెచ్‌డి డిగ్రీ వస్తుంది.

కొద్దిసేపటికి రెండు సీట్ల వరసల మధ్య గల ప్రదేశంలో ఎవరో నిలబడటం గమనించి అతను తల తిప్పి చూసాడు. ఆరేడేళ్ళ ఓ చిన్న పిల్ల నిలబడి తన పెద్ద కళ్ళతో ఆయన్నే చూస్తోంది. బ్లూ డెనిం డ్రెస్ వేసుకున్న ఆ పాప ఆయన వంక కొన్ని క్షణాలు చూసి వెళ్ళిపోయింది. ఆయన మళ్ళీ దృష్టిని తను చదివే కాగితాల మీదకి మళ్ళించాడు.

మరో పది నిముషాల తర్వాత మళ్ళీ ఆ పిల్ల వచ్చింది. ఈ సారి డాక్టర్ గోర్డోన్ పక్క సీట్లో కూర్చుంది.

"హల్లో." పలకరించింది.

పనిలో నిమగ్నమయిన గోర్డోన్ చిన్నగా తల పంకించాడు తప్ప బదులు పలకలేదు. ఆయనకి కొంత విసుగు కూడా కలిగింది.

"నా పేరు సూజీ. మీరు రాస్తున్నారా?" కొద్ది క్షణాల తర్వాత ఆ పాప అడిగింది.

"లేదు. చదువుతున్నాను." కాగితాల్లోంచి చూపు తిప్పకుండానే చెప్పాడు.

"అదిగో. మళ్ళీ రాస్తున్నారు. నేను పెద్దయ్యాక చాలా రాద్దామనుకుంటున్నాను. మీరు సినిమా కథని రాస్తున్నారా?" ఓ నిముషం తర్వాత సూజీ మళ్ళీ అడిగింది.

"లేదు."

"ఇక్కడ నేనో నిమిషం కూర్చోవచ్చా? మీరు వద్దంటే వెళ్ళిపోతాను."

"మీ అమ్మ నువ్వేమయ్యావా అని వెతుక్కోదా?"

ఆ పాప గోర్డోన్ వంక ఆ రహస్యం చెప్పచ్చా, కూడదా అన్నట్లుగా కొద్ది క్షణాలు చూసి తర్వాత చెప్పింది.

"నాకు అమ్మ లేదు."

"అరెరె!"

"మమ్మీ, డాడీలు కారు ఏక్సిడెంట్‌లో మరణించారు."

డాక్టర్ గోర్డోన్ ఆ పాప వంక ఆసక్తితో కూడిన జాలితో చూసాడు.

"మా అన్నయ్య కూడా మరణించాడు. నిజానికి వాడే ఆ రోజు కారు నడిపింది. లైసెన్స్ వచ్చాక వాడు మొదటిసారి ఆ రోజే కారుని నడిపాడు. డాడీ, మమ్మీతో డబ్బు గురించి పోట్లాడుతూండగా కారు వెళ్ళి ఓ చెట్టుకి కొట్టుకుంది. వెనక సీట్లో ఉన్న నాకు ఏం కాకపోవడంతో అంతా నేను అదృష్టవంతురాలిని అన్నారు. నన్ను హాస్పిటల్‌లో చేర్పించారు. రెండు రోజుల తర్వాత అంతా సరిగ్గా ఉందని నన్ను బయటకి పంపించేసారు. మా అంకుల్ నన్ను తన ఇంటికి తీసుకెళ్ళి పెంచుతున్నాడు."

డాక్టర్ గోర్డోన్ ప్రిన్స్‌కి ఆ అనాథ పిల్లని చూస్తే బాగా జాలి కలిగింది.

"మీ అంకుల్ ఎక్కడ కూర్చున్నారు?" అడిగాడు.

"అంకుల్ నాతో రావడం లేదు. ఆయన బిజీగా ఉన్నానని చెప్పారు."

"అంటే నువ్వొక్కదానివే ప్రయాణిస్తున్నావా?"

ఒక్కోసారి ఒంటరిగా ప్రయాణించే పిల్లల్ని ఎయిర్‌పోర్ట్‌లో ఎయిర్ హోస్టెస్‌లకి అప్పగిస్తే, దిగాక వాళ్ళు ఆ పిల్లల్ని రిసీవ్ చేసుకోవడానికి వచ్చేవారికి తిరిగి అప్పగిస్తారని డాక్టర్ గోర్డోన్ విని ఉన్నాడు.

"అంకుల్ నన్ను విమానం ఎక్కించి తాగడానికి ఇంటికి వెళ్ళిపోయాడు."

డాక్టర్ గోర్డోన్ ప్రిన్స్ ఆ పాపని మరో ప్రశ్న వేయబోయే ముందు ఓ ఎయిర్ హోస్టెస్ అతని పక్కన కూర్చున్న సుజీని చూసి అడిగింది.

"ఈ పాప మిమ్మల్ని విసిగిస్తోందా? మీరు బిజీగా ఉంటే..."

"లేదు. లేదు. అంతా సరిగానే ఉంది."

ఎయిర్ హోస్టెస్ చిన్నగా నవ్వి, సుజీ తల మీద నిమిరి, 'ఆయన్ని విసిగించక' అని చెప్పి వెళ్ళిపోయింది.

"బోస్టన్‌లో నిన్ను ఎవరు రిసీవ్ చేసుకుంటారు?" గోర్డోన్ అడిగాడు.

"నన్ను అంకుల్ మిత్రుడు రిసీవ్ చేసుకుని ఓ రాజభవనానికి తీసుకెళ్తాడని, అక్కడ నన్ను చూసుకోవడానికి చాలామంది ఉంటారని, నేను సముద్రంలో ప్రయాణం చేయడానికి పెద్ద మర పడవ ఉంటుందని, ఓ చిన్న విమానం కూడా ఉంటుందని అంకుల్ చెప్పాడు. కాని అవన్నీ అబద్ధాలే." సుజీ ఎలాంటి భావం వ్యక్తం కాకుండా సాధారణంగా చెప్పింది.



"ఆయన అబద్ధం చెప్పారని ఎందుకు అనుకుంటున్నావు?" గోర్డోన్ ప్రశ్నించాడు.

"అంకుల్‌కి బోస్టన్‌లో స్నేహితులు ఎవరూ లేరు. ఉంటే వాళ్ళని నాతో ఫోన్‌లో మాట్లాడించమంటే ఎందుకు మాట్లాడించడు?"

"ఎవరో ఒకరు తప్పక నిన్ను అక్కడ రిసీవ్ చేసుకునే ఏర్పాటు చేసి ఉంటాడు. మీ అంకుల్ పేరేమిటి?"

"లూసిఫర్. ఆయన తాగినప్పుడు నేను తప్పిపోతే బావుండును లేదా చచ్చిపోతే బావుండును అంటూంటాడు."

"నిజంగా? ఎందుకని?"

"అప్పుడు నా డబ్బంతా ఆయనకి వస్తుందిట. మా నాన్నకి చాలా డబ్బుందిట. లక్షలకి లక్షలట. నాకు పద్దెనిమిదో ఏడు వచ్చేదాకా ఆ డబ్బుకి అంకుల్ రక్షకుడట. తర్వాత నాకు అది వస్తుందిట. నేను ఈ లోగా చచ్చిపోతే ఆ డబ్బు అంకుల్‌ది అయిపోతుందిట. అప్పుడు ఆఫీసుకి పని చేయడానికి వెళ్ళకుండా ఎంచక్కా ఇంట్లోనే ఉండి తాగచ్చుని."

లూసిఫర్ లాంటి దుర్మార్గపు ఆలోచనలు చేసేవారు ఈ లోకంలో ఉంటారని అతనికి తెలుసు. అనేక సినిమాల్లో, నవలల్లో అలాంటి పాత్రలు అతనికి పరిచయమే.

"నువ్వు చెప్పిందంతా నిజమా?" అడిగాడు.

"ప్రామిస్."

గోర్డోన్ ఆ వ్రాతప్రతిని చదవాలని ప్రయత్నించాడు కాని అది అతని వల్ల కాలేదు. సుజీ మీద కలిగిన సానుభూతి వల్ల అతనికి ఇందాకటి ఏకాగ్రత పోయింది.

"నా టెడ్డీ బేర్ నాతో ఉంటే బావుండేది." దీనంగా చెప్పింది సుజీ.

"నువ్వు సీట్‌లోకి వెళ్ళి నీ టెడ్డీ బేర్ దగ్గర కూర్చో. ఇంకొంచెం సేపట్లో డిన్నర్ పెడతారు. మీ ఇద్దరు తినచ్చు."

"నా టెడ్డీ బేర్ పేరు స్మోకీ. అది తినదు." కిలకిలా నవ్వి చెప్పింది.

మళ్ళీ కాసేపాగి చెప్పింది.

"స్మోకీ సీట్‌లో లేదు. నా పెట్టెలో ఉంది. దాన్ని అంకుల్ పెట్టెలో ఉంచాడు. దాని పొట్ట కోసి అందులో చాక్లెట్లు నింపానని, విమానంలో వాటన్నిటినీ తినేయకుండా బోస్టన్‌కి వెళ్ళాక వాటిని నేను తినాలని చెప్పాడు. అంకుల్ అన్నీ అబద్ధాలే చెప్తాడు. స్మోకీ పొట్టలో నిజానికి చాక్లెట్లు లేవు. అలారం గడియారం ఉంది."

గడియారం ప్రసక్తి రాగానే డాక్టర్ గోర్డోన్ గుండె ఓసారి లయ తప్పింది. అంకుల్ లూసిఫర్ లాంటి మనిషి ఓ టెడ్డీ బేర్ పొట్ట కోసి అందులో రహస్యంగా దాన్ని ఎందుకు అమరుస్తాడో అర్థం చేసుకోగలిగాడు.

"ఆ సూట్ కేస్ ఏది? నీ సీటు దగ్గర ఉందా?"

"లేదు. అంకుల్ దాన్ని ఎయిర్‌పోర్టులో ఓ మనిషికి ఇచ్చాడు. దానికి ఓ టేగ్‌ని అతికించి ఆ మనిషి దాన్ని నేను బోస్టన్‌లో తీసుకోవచ్చని చెప్పాడు. దాని టేగ్‌ని కూడా పారేస్తానని నాకివ్వలేదు. ఎయిర్ హోస్టెస్‌కి ఇచ్చాడు."

పబ్లిక్ ఎడ్రస్ సిస్టంలో పైలట్ కంఠం వినిపించింది.

"మీ కెప్టెన్ మాట్లాడేది. మనం ముప్ఫై ఆరు వేల అడుగుల ఎత్తున ఎగురుతున్నాం. టెయిల్ విండ్ బావుంది. మన గ్రౌండ్ స్పీడ్ ఆరు వందల..."

డాక్టర్ గోర్డోన్ ఓసారి విమానంలోని ప్రయాణీకులందరి వంకా చూసాడు. కాసేపట్లో ఈ అమాయకులంతా...ఎవరైనా ఓ చిన్న పిల్లని చంపడానికి ఇంతటి ఘోరాన్ని ఎలా చేయగలరు? భయాన్ని అణుచుకుంటూ గోర్డోన్ తన ముందున్న వ్రాతప్రతిని మూసేసి బ్రీఫ్ కేస్‌లో ఉంచేసాడు. అతని అంతర్ దృష్టిలో అందులోని కాగితాలు ఆకాశంలోంచి నేల మీదకి రాలిపోవడం కనిపించింది. సమయానికి ఈ సమాచారం తనకి అందడం అదృష్టం. కిందంతా భూమి తప్ప సముద్రం కాదు. సమీపంలో ఓ ఎయిర్‌పోర్టు తప్పక ఉంటుంది. ఎయిర్ హోస్టెస్ కోసం చూసాడు.

పది సీట్ల అవతల ఆమె ఎవరికో మంచినీళ్ళు ఇస్తోంది. లేచి ఆమె దగ్గరకి వెళ్తూ సుజీ చేతిని కూడా పట్టుకుని తీసుకెళ్ళాడు.

"ఈ పాప సూట్ కేస్‌లోని టెడ్డీ బేర్‌లో ఓ గడియారాన్ని అంకుల్ లూసిఫర్ దాచాడు. అది లగేజ్ స్టోరేజ్‌లో ఉంది. ఈ పాప మరణిస్తే అనాథ అయిన ఈ పాప ఆస్తి ఆయనకి లక్షల్లో లభిస్తుంది. సుజీ! ఇందాక నువ్వు నాకు చెప్పింది ఇదే కదా?"

"అవును." సుజీ ఒప్పుకుంది.

"ఓ మై గాడ్!" తక్షణం ఎయిర్ హోస్టెస్ మొహం వివర్ణమైంది.

గోర్డన్ చేతిని విడిపించుకుని సుజీ ఫస్ట్ క్లాస్ సెక్షన్‌లోకి పరిగెత్తింది.

అదే సమయంలో ఎయిర్ హోస్టెస్ పైలట్ దగ్గరకి కాక్‌పిట్ వైపు పరిగెత్తింది.

సుజీ ఓ సీట్‌లో కూర్చోగానే పక్కనే ఉన్న యువతి ఓ వ్రాతప్రతిని చదువుతూ విసుగ్గా చెప్పింది.

"ఓ అరగంట సేపు నన్ను వదిలి ఇంకెక్కడైనా కూర్చోమన్నానా? నీ డైలాగ్స్ అన్నీ నీకు వచ్చేసాయి. రేపు షూటింగ్ మొదలయ్యే సినిమా 'అంకుల్ లూసిఫర్' స్క్రిప్ట్‌లోని నా డైలాగ్స్ నాకు రావాలి కదా?"

అదే సమయంలో ఎయిర్ హోస్టెస్ మాటలు వినపడ్డాయి.

"యువర్ అటెన్షన్ ప్లీజ్. సాంకేతిక కారణంగా మన విమానం ఇంకో రెండు నిముషాల్లో ఓ యూఎస్ మిలటరీ ఎయిర్ పోర్ట్ విమానాశ్రయంలో దిగబోతుంది. దయచేసి సీట్ బెల్ట్‌లని..."



## 24. రెండో తాళంచెవి

### ఐజాక్ రోమన్

ఫిలడెల్ఫియా లోని దుస్తుల తయారీ ఫేక్టరిలో నేను స్ట్రాంబెర్గ్ కింద అకౌంటెంట్‌గా పని చేస్తున్నాను. స్ట్రాంబెర్గ్ కింద పని చేయడం అంటే ఓ పెట్టెలో పెట్టి తాళం వేయబడటంతో సమానం అని నా అభిప్రాయం. ఎంత ప్రయత్నించినా ఆ పెట్టెలోంచి బయటపడలేం. దాని తాళంచెవి అతని ఆధీనంలో ఉన్నట్లు నాకు అనిపిస్తుంది. అతను ఆ తాళంచెవిని ఎన్నడూ ఉపయోగించడని నాకు తెలుసు,

రోజూ ఆఫీసుకి ఓ గంట ముందు వచ్చి, ఓ గంట ఆలస్యంగా వెళ్ళడం పెట్టెలో కూర్చోవడమంటే. అలా చేయకపోతే స్ట్రాంబెర్గ్ ఏటా తీసేసే కొందరు ఉద్యోగస్థుల జాబితాలోకి నా పేరు కూడా ఎక్కుతుంది. కేంప్‌లకి వెళ్ళినప్పుడు ఒక డాలర్ తొంభై తొమ్మిది సెంట్ల భోజనం తినాలి తప్ప అర్హత ఉన్నా అయిదు డాలర్ల భోజనం తినకూడదు. ఒకవేళ తిన్నా టిఏ బిల్‌లో ఒక డాలర్ తొంభై తొమ్మిది సెంట్లే ఖర్చుగా రాయాలి. లేదా తీసేసే ఉద్యోగస్థుల జాబితాలోకి నా పేరు కూడా వెళ్ళిపోతుంది. చవక హోటల్‌లో బస చేసి, సరిగ్గా బాకీని వసూలు చేసి తేవాలి. లేదా ఆ జాబితాలోకి ఎక్కుతాం. ఏ అమ్మాయి మనతో నవ్వుతూ మాట్లాడినా స్ట్రాంబెర్గ్ మనసులో మండిపడతాడు. పరమ అసూయాపరుడు.

కాని ఓ రోజు నాకు నన్ను బంధించిన ఆ పెట్టెని తెరిచే తాళంచెవి దొరికింది. అది స్ట్రాంబెర్గ్ దగ్గర ఉన్న తాళంచెవి కాదు. రెండోది. దాంతో తెరిచినంత తేలిగ్గా నేను బంధింపబడ్డ పెట్టెని ఈ రెండో తాళంచెవి తెరుస్తుంది.

నాకు దొరికిన ఆ తాళంచెవి మరణం.

నేను పెట్టెలోంచి బయటపడితే ఎంత సుఖం? ఈ ఉద్యోగంలో అప్పుడు నేను ఎదగ గలుగుతాను. దుస్తులని కుట్టే ఎంతోమంది సుందరాంగులు అప్పుడు నా వంక కన్నెత్తి చూస్తారు. అన్నీ తన గుప్పిట్లో ఉంచుకుని శాసించే స్ట్రాంబెర్గ్ లేకపోతే నేను చాలా ప్రగతిని సాధించగలను. ఎవరికి తెలుసు? ఈ కంపెనీకి ప్రెసిడెంట్‌ని కూడా అవచ్చు నేను.

నేను ఓ సారి ఆ రెండో తాళంచెవిని ఉపయోగించాలనే నిర్ణయం గట్టిగా తీసుకున్నాక, ఆ పెట్టెలోంచి సగం బయటపడ్డ భావన నాలో కలిగింది. ఎంతో ఎనర్జీతో ఆ సమస్యని పరిష్కరించే ప్రయత్నం మొదలు పెట్టాను. స్ట్రాంబెర్గ్‌ని చంపడం ఎలా? అది క్లిష్టమైంది అవకూడదు. తేలికగా ఉండాలా పథకం. ఐతే నాకు ఇలాంటి విషయాల్లో అనుభవం లేదాయె. ఇది ఇంకొకరితో చర్చించే విషయం కూడా కాదాయె.

నేను చాలా మిస్టరీ కథలు చదివాను. ఒకటి, రెండు కథలు కూడా రాసాను. కాని వాటిని పత్రికలకి పంపే ధైర్యం ఐతే చేయలేదు. నేను చదివిన కథల్లోని కాల్పనిక బాధితులని

హంతకులు ఎలా హత్య చేసారా అని ఓ రోజు తీవ్రంగా ఆలోచించాను. ఐతే కాగితం మీద ఊహా కల్పిత పాత్రలని చంపడం తేలిక కాని స్ట్రాంబెర్గ్ లాంటి కొట్టుకునే గుండె, ప్రవహించే రక్తం గల వ్యక్తిని చంపడం కథ రాసినంత తేలిక కాదు అని గ్రహించాను.

ఎలా? ఎలా? ఎలా చంపడం?

విషం? ఊహు. దాన్ని నేను కొన్నానని పోలీసులు తేలిగ్గా ట్రేస్ చేయగలరు.

కారుతో గుద్ది? ఊహు. పాపీ చిరాయువు. స్ట్రాంబెర్గ్ కాలో, చెయ్యో విరిగి బ్రతికే అవకాశం ఉంది.

తుపాకీ? శబ్దం చేస్తుంది. దాన్ని తర్వాత ఎక్కడ పారేయాలన్నది కూడా సమస్యే ఎక్కడ పారేసినా పోలీసులు వెదికి పట్టుకోగలరు.

గొంతు పిసికి? గొంతు మీద కూడా వేలిముద్రలు పడతాయని ఎక్కడో చదివాను. అదీ కాక ఆ ప్రయత్నంలో స్ట్రాంబెర్గే ఆత్మ రక్షణకి నా గొంతు పిసికితే? నేను అతని ముందు శారీరకంగా కూడా అర్భకుణ్ణే.

కత్తి? అసహ్యంగా రక్తం అంటుతుంది. ఆ తర్వాత వెంటనే స్నానం చేయాలి. రక్తం అంటిన ఆ బట్టలని ఏం చేయాలి?

ఇవన్నీ క్లిష్టమైన హత్యలు తప్ప సామాన్యమైన హత్యా పథకాలు కావు.

ఎప్పుడైనా అకస్మాత్తుగా మంచి అవకాశం తారసపడినప్పుడు స్ట్రాంబెర్గ్‌ని చంపాలని చివరికి నిశ్చయించుకున్నాను. ఓ కథలో రాసినట్లుగా మెట్ల మీద నించి తోయడం నాకు అన్నిటికన్నా తేలిక పథకంగా తోచింది. మెట్ల మీంచి కాలుజారి పడటం అన్నది సర్వ సాధారణంగా జరుగుతూంటుంది. కాబట్టి అది క్లిష్టమైంది కాదు. వెనక నించి తోస్తే ఎవరు తోసారో అతనికి తెలీదు.

'స్ట్రాంబెర్గ్‌ని చంపాల్సిందే' అని మాత్రం గట్టిగా నిర్ణయం చేసుకున్నాను. తాళం చెవి దొరికింది. ఇక దాన్ని ఉపయోగించడమే తరువాయి.

ఒకటి రెండుసార్లు స్ట్రాంబెర్గ్ నాకు మెట్ల మీద తారసపడ్డాడు. కాని నేను అతన్ని తోయలేదు. తోసినా ఎవరూ చూసేవారు కాదు, కాని ఐదు మెట్ల మీద నించి తోసి ఏం ప్రయోజనం? దురదృష్టవశాత్తూ మా ఆఫీస్‌లో ఉన్న మెట్లే అన్ని. మా ఆఫీస్ కింది అంతస్థులో ఉంది. నా మనసు నిరంతరం అతను తాగే కాఫీనే జపిస్తోంది. రెండు విషం టేబ్లెట్లు పోలీసులు నన్ను ట్రేస్ చేయకుండా ఎలా సంపాదించడం?

* * *

నేను డిటెక్టివ్ పత్రికలు చదవడం, డిటెక్టివ్ కథల సంపుటాలు కొనడం అధికం అయింది. ఏ రచయిత అయినా ఏ ఒక్క కథలో ఐనా ఒక్క చిన్న ఐడియా అయినా ఇవ్వలేదు అని చదువుతున్నాను. కాని హంతకులు అంతా తుపాకులు, విషాలు, కత్తులు, గొంతు



నులమడాలు లాంటివి ఉపయోగించేవారే. ఒక్కరిలో కూడా నాకు ఒరిజినల్ తెలివి తేటలు కనపడలేదు. కొందరైతే భూమి మీద నించోకుండా ఆకాశంలో నిలబడుతున్నారు. శవం దొరక్కూడదని ఓ హంతకుడు ఓ రాకెట్‌ని తయారు చేసి దానికి బాధితుడి శవాన్ని కట్టి ఏకంగా అంతరిక్షంలోకి పంపేసాడు!

* * *

అకస్మాత్తుగా నేను ఆ పెట్టెలోంచి బయటపడ్డాను! ఆ రెండు తాళం చెవులు ఉపయోగించకుండానే. అంటే నేను స్ట్రాంబెర్గ్‌ని చంపకుండానే!!

ఓ రోజు సేల్స్ మేనేజర్ నా దగ్గరకి వచ్చి చెప్పాడు.

"మిత్రమా! ఐదు డాలర్లు చందా ఇవ్వు."

"దేనికి చందా?" అడిగాను.

"పార్టీకి."

"ఏ పార్టీ? ఎవరి పార్టీ?"

"ఫేర్ వెల్ పార్టీ. స్ట్రాంబెర్గ్ రాజీనామా చేస్తున్నాడని తెలీదా?"

"ఎప్పుడు?" ఆనందంగా అడిగాను.

"ఈ నెలాఖరికి. అతనికి న్యూయార్క్‌లో ఇంకో పెద్ద దుస్తుల కంపెనీలో ఇంకాస్త మంచి ఉద్యోగం దొరికింది. అందుకని అతను రాజీనామా చేస్తున్నాడు."

"నిజమే చెప్తున్నావా? లేక నన్ను ఏడిపించడానికా?" అనుమానంగా అడిగాను.

"నీ మీద ఒట్టు. రీజెంట్ హోటల్‌లో ఫేర్ వెల్ పార్టీని ఏర్పాటు చేసే బాధ్యతని నాకు అప్పగించారు. మనిషికి ఐదు డాలర్లు."

ఇక నేను స్ట్రాంబెర్గ్‌ని చంపాల్సిన పని లేదు. నాకతను అకస్మాత్తుగా ఇదివరకటిలా రాక్షసుడిలా కాక, మనిషిగా కనిపించ సాగాడు. 'అలాంటి మనిషిని చంపాలనే దుష్ట బుద్ధి అసలు నాలో ఎలా కలిగింది?' అన్న పశ్చాత్తాపం కూడా నాలో కించిత్ కలిగిందన్న సంగతి కూడా దాచకుండా చెప్పాలి.

ఆఖరి రోజు స్ట్రాంబెర్గ్ నన్ను తన గదిలోకి పిలిచి చెప్పాడు.

"ఐజాక్! నేను గత ఐదేళ్ళుగా నా కింద పనిచేసే వారందరికీ శిక్షణని ఇస్తున్నాను. వారిలో దానికి బాగా రెస్పాండ్ అయింది ఎవరో తెలుసా?"

"సేల్స్ మేనేజరా?" అడిగాను.

"వాడి మొహం. నువ్వే."

"నేనా?"

"అవును. నీకు తెలీకుండానే నీకు అనేక రకాల పరీక్షలు పెట్టాను. నువ్వు దాదాపు అన్నిటిలో నెగ్గావు. నీ టిపి బిల్స్ తృప్తికరంగా ఉన్నాయి. నీ పని నాకు తృప్తికరంగా ఉంది.

కాబట్టి నా తర్వాత ఈ కంపెనీకి నిన్నే ప్రెసిడెంట్‌ని చేయమని మన బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్‌కి రికమెండ్ చేసి వెళ్తున్నాను."

తక్షణం నా కళ్ళమ్మట బొటబొట కారిన కన్నీరు కృతజ్ఞతతో వచ్చాయని ఆయన భ్రమపడ్డాడు. అవి పశ్చాత్తాపంతో కారాయి. ఇలాంటి స్ట్రాంబెర్గ్‌నా నేను చంపాలనుకుని కలలు కని, పథక రచనలు చేసింది? ఛీ! నా జన్మ తగలడ.

* * *

నేను మా కంపెనీలో ప్రెసిడెంట్ అయి దాదాపు ఐదేళ్ళు కావస్తోంది. కాని అది నేను ఊహించినట్లుగా సరదా అయిన, తేలికయిన బాధ్యతేం కాదు. నువ్వు ప్రెసిడెంట్‌వి అయితే నువ్వు బాధ్యత అనే దాన్ని తీసుకోవాలి. క్రితం క్వార్టర్ కన్నా ఈ క్వార్టర్‌లో లాభం పెరగాలి. ఎలా పెంచుతావన్నది నీ ఇష్టం. కాని పెరగాలి. స్ట్రాంబెర్గ్ శిక్షణ ఇక్కడ నాకు చక్కగా ఉపయోగించింది. దేనివల్లనైతే నేను ఆయన్ని నిరశించానో అదే నేను చేయాల్సిన పరిస్థితిలో చిక్కుకున్నాను. ప్రతీ క్వార్టర్‌కి లాభాన్ని పెంచుతూనే ఉన్నాను.

నేను చేతులెత్తేసి ఈ ఉద్యోగం వదిలేయాలి అనుకునే సందర్భాలు వస్తూంటాయి. అంతలోనే స్ట్రాంబెర్గ్ గుర్తుకు వస్తాడు. వాటర్ కూలర్ దగ్గర పని మానేసి కబుర్లు చెప్పుకుంటూ నీళ్ళు తాగే ఉద్యోగస్థుల మీద అరుస్తాను. ఆఫీసుకి గంట ముందు వచ్చి, గంట ఆలస్యంగా వెళ్ళనివారిని, టిఏ బిల్‌లో ఖర్చులని కనీస స్థాయికి తగ్గించని వారిని ప్రతీ నవంబర్‌లో తీసేసి వారి స్థానంలో కొత్త వారిని అపాయింట్ చేసుకుంటాను.

హాప్‌కిన్సన్!

నా ఉద్యోగస్థులందరిలోకి నేనంటే హాప్‌కిన్సన్‌కి ఎక్కువ ద్వేషం అని నాకు అనిపిస్తూంటుంది. ఓ రోజు అతని టిఏ బిల్ చెక్ చేసి కొన్ని ఖర్చులని తగ్గించమని చెప్పగానే అతను రోషంగా చూస్తూ నాతో చెప్పాడు.

"మీ కింద పని చేయడం అంటే ఓ పెట్టెలో పెట్టి తాళం వేసిన భావన నాకు కలుగుతుంది సర్."

మరోసారి అన్నాడు.

"మనం రెండో అంతస్థులోని ఆఫీసుకి మారితే గాలి ధారాళంగా వస్తుంది కదా సర్?"

నేను ఇంకో ఉద్యోగం వెదుక్కునే ప్రయత్నం మొదలెట్టాను. ఎందుకంటే మా ఆఫీసులో ఎంతమంది హాప్‌కిన్సన్‌లు ఉన్నారో నాకు తెలీదుగా.





# 25. ఇలా జరిగింది

## జాన్ లుట్జ్

కలల్లో మాత్రమే జరిగే ఇలాంటిది నాకు జరుగుతుందని నేను ఎన్నడూ అనుకోలేదు. ఇది జరిగి చాలా కాలం అయింది కాబట్టి ఇప్పుడు మీకు చెప్పడంలో నష్టం లేదు.

వాతావరణం బాగా లేక నేను వెళ్ళాల్సిన విమానం బాగా ఆలస్యం అయింది. దాంతో మా ఇంటి నించి వెయ్యి మైళ్ళ దూరంలో ఉన్న ఓ నగరంలోని విమానాశ్రయంలో నేను చిక్కుపడిపోయాను. అది వేసవి రాత్రి కాబట్టి నేను కొంత సమయం వాకింగ్ చేస్తూ ఆ ఊరిని చూడదలచుకున్నాను. వర్షం రావచ్చన్న భయంతో రెయిన్ కోట్ ధరించి నేను ఎయిర్‌పోర్ట్ షటిల్ బస్ ఎక్కాను. డౌన్ టౌన్‌లో దిగి అక్కడ నడవసాగాను. రాత్రి పదకొండు అయినా కొన్ని బార్‌లు తీసే ఉన్నాయి. మిగిలిన దుకాణాలన్నీ మూసేసి ఉన్నాయి.

నేను ప్రతీ బార్‌లోకి వెళ్ళి ఓ గ్లాసు బీర్ తాగుతూ, అక్కడి మనుషులని పరిశీలిస్తూ నా నడకని సాగించాను. నా ఉద్యోగంలో నేను కొత్త ఊళ్ళని దర్శించాల్సి ఉంటుంది. అవకాశం దొరికితే ఆ ఊరుని ఇలా నడిచి చూడటం నా అలవాటు.

నా పర్స్ పోయిందని నేను గ్రహించే సరికి అర్ధరాత్రి ఒంటి గంట దాటుతోంది. నేను నైన్టీన్త్ స్ట్రీట్‌లో ఉండగా అది గ్రహించాను. పర్స్ పోవడం వల్ల జరిగే నష్టం చాలా తక్కువ - మీరు మీ స్వంత ఊళ్ళో ఉంటే. కాని కొత్త ఊరులో అయితే జరిగే నష్టం ఎక్కువ. ఎవరికైనా అక్కడ రక్షణని ఇచ్చేది అందులోని నగదు, క్రెడిట్ కార్డులే... నేను కొన్ని క్షణాలు నా జేబులన్నీ చెక్ చేసుకున్నాను. ఎప్పుడూ పర్స్‌ని ఒకే జేబులో ఉంచుకునే అలవాటు గల నేను దాన్ని ఇంకో జేబులో పొరపాటున పెట్టుకున్నానా అని చెక్ చేసుకున్నాను. ఏ జేబులోనూ అది లేదు. ఖచ్చితంగా అది నాకు దూరమైంది. నా విమానం టిక్కెట్ అందులోనే ఉంది! ఇది ఎలా జరిగింది?

ఆలోచిస్తూ, నేను నిర్మానుష్యంగా ఉన్న ఆ రోడ్లలో వేగంగా నడుస్తూ, అది నేల మీద పడిందేమో దారంతా చూసాను. రోడ్డు మీద అది ఎక్కడా కనపడలేదు. ట్వెల్త్ ఎవెన్యూలో నేను ఆఖరిసారి సందర్శించిన బార్ దగ్గరకి వెళ్ళాను.

దాన్ని మూసేసారు. అక్కడ నించి మళ్ళీ వెనక్కి నైన్టీన్త్ స్ట్రీట్ వైపు నడిచాను. కొన్ని వందల డాలర్లు, రెండు, మూడు క్రెడిట్ కార్డులు ఎంతటి ప్రాముఖ్యతని వహిస్తాయో నాకు అప్పుడు అర్థమైంది. ఏం చెయ్యాలా అని ఆలోచించాను. నా భార్యకి ఫోన్ చేసి కొంత డబ్బుని టెలిగ్రాం ద్వారా బదిలీ చేయమని కోరాలి. నా జేబులన్నీ వెతికితే బాల్ పాయింట్ పెన్, తాళం చెవులు, దువ్వెన, కొంత చిల్లర మాత్రమే కనపడ్డాయి. ఫోన్ చేయడానికి సరి పడే డబ్బు కూడా లేదు. నా బాధని పెంచుతూ వర్షం చినుకులు పడసాగాయి.

అకస్మాత్తుగా నాకు వంద అడుగుల దూరంలో నా వైపు వచ్చే ఓ వ్యక్తి కనపడ్డాడు. ముఖ పరిచయం లేని ఓ కొత్త వ్యక్తి నించి డబ్బు అడిగి తీసుకోవడం ఎంతటి ఇబ్బందికర పరిస్థితో కూడా నాకు మొదటిసారిగా తెలిసొచ్చింది. గతంలో టిక్కెట్‌కి డబ్బు లేదని ఎందరో నన్ను డబ్బు అడిగారు. అది అబద్ధం అని, వారు బిచ్చగాళ్ళని నేను భావించాను. ఇతను కూడా నన్నలాగే భావిస్తాడు. కాని తప్పదు. ఆ వ్యక్తి నన్ను సమీపించగానే చెప్పాను.

"ఎక్స్‌క్యూజ్ మి."

కళ్ళజోడు. హేండిల్‌బార్ మీసం. సన్నగా, పొట్టిగా ఉన్న ఆ వ్యక్తి నా వంక భయంగా చూసాడు. అతనిలో సంశయం, భయం గమనించాను.

"ఓ అపరిచిత వ్యక్తికి మీరు కొంత డబ్బు సహాయం చేయగలరా?" కొద్దిగా సిగ్గు పడుతూనే అడిగాను.

'డబ్బు' అన్న మాట వినగానే అతనో అడుగు వెనక్కి వేసాడు. బహుశా రెయిన్ కోట్‌లో నా రెండు చేతులూ ఉండటంతో ఓ దాంట్లోని నా చెయ్యి పిస్తోలుని పట్టుకుని ఉందని అతను భావించి ఉంటాడని తర్వాత ఆలోచిస్తే నాకు అనిపించింది.

"నా దగ్గర ఎక్కువ డబ్బు లేదు...నిజం..."

అతను అటు, ఇటు సహాయం కోసమా అన్నట్లుగా చూసాడు. సరిగ్గా అదే సమయంలో యూనిఫాంలో ఉన్న ఓ పోలీస్ ఆఫీసర్ మా మధ్య ప్రత్యక్షం అయ్యాడు.

"మీలో ఎవరికైనా ఇబ్బంది కలిగిందా?" అతను ఆ కళ్ళజోడు వ్యక్తిని చూస్తూ అడిగాడు.

"కొద్దిగా." నేను చెప్పాను.

"ఆఫీసర్. అతను నా డబ్బుని దొంగతనం చేయబోయాడు." ఆ కళ్ళజోడు వ్యక్తి అకస్మాత్తుగా చెప్పాడు.

"నేనూ అదే అనుకున్నాను. మీ ఇద్దర్నీ నేను చీకట్లో నిలబడి చూసాను. ఇతను ఈ దారిలో రెండు సార్లు నీలాంటి బాధితుల కోసం వెదుకుతూ తిరగడం కూడా నేను గమనించాను." పోలీస్ ఆఫీసర్ చెప్పాడు.

తక్షణం నా గుండె వేగం పెరిగింది. ఆ పోలీస్ ఆఫీసర్ నన్ను ఓ భవంతి గోడ వైపు తోసాడు.

"జాగ్రత్త! అతని కుడి జేబులో తుపాకీ ఉంది." అరిచాడు ఆ కళ్ళజోడు వ్యక్తి.

పోలీస్ అకాడమీలో వారికి శిక్షణ ఇవ్వబడ్డ విధంగా అతను నన్ను పూర్తిగా తనిఖీ చేసాడు. అతను ఆ ఉద్యోగానికి కొత్తో లేక ఆ ఇద్దరి కన్నా నేను ఇరవై పౌన్ల బరువు ఎక్కువో తెలీదు కాని ఆ పోలీస్‌లో కూడా కొద్ది పాటి భయాన్ని నేను గమనించాను. ఆ అర్ధరాత్రి ఆ కొత్త ఊళ్ళోని ఆ చోట మేం ముగ్గురం భయపడ్డాం.



"తుపాకీ ఉన్నట్లుగా నటించాడంతే. చాలామంది దొంగలు చేసే పని అదే." నన్ను తనిఖీ చేసాక పోలీస్ ఆఫీసర్ అతనితో చెప్పాడు.

"నటనా? నేనేం నటించలేదు. అతన్ని కేవలం డబ్బు సహాయం అడిగాను. అంతే." నా అహం దెబ్బ తినడంతో తీవ్రంగా చెప్పాను.

"పట్టుబడ్డ దొంగలనే మాటే ఇది." పోలీస్ ఆఫీసర్ చెప్పాడు.

"నేను నిర్దోషిని."

"నువ్వు కాదు. ఆ సంగతి జడ్జి చెప్పాలి."

ఆ పోలీస్ ఆఫీసర్ నాకు మియాండ్రా రైట్స్‌ని (నేరస్థులని అరెస్ట్ చేసే ముందు వారికి గల హక్కులని చెప్పే ఆచారం అమెరికన్ పోలీసులు పాటిస్తారు) చెప్పాడు.

"... నీకు నోరు మెదపని హక్కు ఉంది."

నన్ను వాడు అరెస్ట్ చేస్తున్నాడు! నేను జైలుకి వెళ్తాను. నా కుటుంబ సభ్యులు, నా బంధుమిత్రులు నా గురించి ఏమనుకుంటారు? నా ఉద్యోగం ఏమవుతుంది? నాలో వణుకు మొదలైంది. అప్పుడు అదృష్టం నా పక్షానికి వచ్చింది. ఓ బస్ పది, పదిహేను మైళ్ళ వేగంతో రావడం గమనించాను. సరైన సమయంలో నేను ఆ పోలీస్ ఆఫీసర్‌ని దూరంగా నెట్టి, రోడ్డు అవతలకి గెంతాను. ఆ బస్ డ్రైవర్ నన్ను చూసి బ్రేక్ వేసాడు. క్షణం ఆలస్యం అయితే ఆ బస్ ఫెండర్ నన్ను తాకేది. ఆ బస్ పూర్తిగా ఆగింది. పోలీస్ ఆ బస్ చుట్టూ తిరిగి రోడ్డు మీద అవతలి వైపుకి వచ్చేసరికి నేను ఓ చీకటి సందు వైపు పరిగెత్తుతున్నాను. రెండు సార్లు పిస్తోలు పేలిన శబ్దం నాకు వినిపించింది. కాని ఒక్క గుండూ నన్ను తాకలేదు. నేను ఆ పిస్తోలు రేంజ్‌ని దాటేసి ఉంటాను. ఆ చీకటి సందులోంచి ఇంకో చీకటి సందులోకి, అక్కడ నించి మళ్ళీ ఇంకో సందులోకి పరిగెత్తాను. కొద్ది దూరం దాకా నన్ను వెంటాడే బూట్ల చప్పుడు నాకు వెనక నించి వినిపించింది. తర్వాత అది ఆగిపోయింది.

నేను పార్కింగ్ లాట్‌లో ఆగిన రెండు కార్ల మధ్య నక్కి చాలా సేపు దాక్కున్నాను. పోలీస్ ఆఫీసర్ జాడ లేదు. వర్షం భోరున కురుస్తూండటం వల్ల బహుశా అతను నన్ను కనుక్కోలేక వేటని విరమించుకుని ఉంటాడు అనుకున్నాను. ఇందాక నేను తిట్టుకున్న వర్షం ఇప్పుడు నాకు లాభాన్ని చేకూర్చింది. ఐనా ప్రమాదం పూర్తిగా తొలగినట్లు కాదు. అతను ఇంకొంత మంది పోలీసులని పంపమని ఈపాటికి కోరి ఉండచ్చు. దూరం నించి వచ్చే హెడ్ లైట్లని చూసి, అది పోలీస్ వాహనం అనుకుని భయపడ్డాను. కాని కాదు. టేక్సీ. అదృష్ట కన్య నన్నింకా వదల్లేదని అనుకున్నాను. ఈల వేసి దాన్ని ఆపాను. పోలీసులు వచ్చే లోగా ఆ ప్రాంతం నించి దూరం అవాలని అనుకున్నాను.

"రీజెంట్ హోటల్." లోపల కూర్చున్నాక చెప్పాను.

ఆ పేరు గల హోటల్ లేని ఊరు అమెరికాలో ఒక్కటీ ఉండదు.

అతను మాట్లాడకుండా టేక్సీని ముందుకు పోనించాడు. నా దగ్గర టేక్సీకి చెల్లించడానికి డబ్బు లేదని నాకు తెలుసు. పది నిముషాల తర్వాత రాత్రంతా తెరిచి ఉండే ఓ మందుల దుకాణం సైన్ బోర్డ్‌ని చూసి చెప్పాను.

"డ్రైవర్. ఒక్క క్షణం అక్కడ ఆపుతావా? అర్జెంట్‌గా మందు కొనాలి."

లోపల అయిదారుగురు మించి లేరు. నేను మేగజైన్ రేక్ దగ్గరకి వెళ్ళి ఓ పత్రిక పేజీలు తిప్పి పెట్టేసాను. తర్వాత షేవింగ్ క్రీంలు ఉన్న షెల్ఫ్ దగ్గరకి వెళ్ళి వాటిని చూసాను. ఆ సరికి ఆ దుకాణం కౌంటర్‌లోని వ్యక్తికి నా మీద ఆసక్తి పోయి నన్ను చూడటం మానేసాడు. నేను దానికి పక్కన ఉన్న ఇంకో తలుపు లోంచి బయటకి వచ్చి వంద గజాల దూరం దాకా పరిగెత్తాను. పాపం ఆ టేక్సీ డ్రైవర్ అవతలి గుమ్మం దగ్గర వేచి ఉన్నాడు. ఇప్పుడు జరిగింది చెప్తే నా కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, నా బాస్ నవ్వినా ఆ నాటి నా పరిస్థితి నాకు దాదాపు కన్నీళ్ళని తెప్పించింది.

మైలు దూరం వచ్చాక చుట్టుపక్కల గల ఇళ్ళని, ఇళ్ళ ముందు లాన్స్‌ని చూసి నేను వ్యాపార ప్రాంతం నించి దూరం అయ్యానని తెలుసుకున్నాను. కొద్దిగా తూలుతూ నడిచే ఒకతను ఆ రోడ్డుకి అవతలి వైపు పేవ్‌మెంట్ మీద కనిపించాడు. అతను బార్ నించి ఆలస్యంగా ఇంటికి వచ్చే బాపతు అని గ్రహించాను. నేను ఒంగి ఓ లాన్‌కి సరిహద్దుగా కట్టిన ఇటుకరాళ్ళల్లోంచి లూజుగా ఉన్న ఒకదాన్ని తీసుకుని నా రెయిన్ కోట్‌లో దాచుకుని రోడ్డు దాటి అతని దగ్గరకి వెళ్ళాను. అతను ఆగి ఆసక్తిగా నా వంక చూసాడు. అతని తల మీద గట్టిగా మోదాను. కిక్కురుమనకుండా అతను నేలకూలాడు.

అతని పర్స్‌లో నేను మళ్ళీ విమానం టిక్కెట్ కొనగా చాలా మిగిలేంత డబ్బుంది.

మెయిన్ రోడ్‌లో ఇందాకటి టేక్సీ నన్ను చూసి ఆగింది. డ్రైవర్‌కి నోరు విప్పకుండానే మౌనంగా ఇరవై డాలర్ల నోటు ఇచ్చి టేక్సీ ఎక్కాను. నా కోసం పోలీసులు విమానాశ్రయంలో వెదకడం లేదు. చిన్న సైజు దారి దోపిడీ దొంగ కోసం పోలీసులు విమానాశ్రయాలని వెదకరు.

ఆ పర్స్‌లోని అడ్రస్‌కి అందులోని డబ్బు, క్రెడిట్ కార్డులు, డ్రైవింగ్ లైసెన్స్‌లు, నష్టపరిహారంగా కొంత డబ్బు ఓ కవర్లో ఫ్రం అడ్రస్ లేకుండా అతనికి కొరియర్ చేసాను. అందులో టైప్ చేసిన ఈ వాక్యం గల కార్డ్‌ని ఉంచాను.

'ఇది మీకు మీ ఇంటి దగ్గర కాక పొరుగూరిలో జరిగి ఉంటే ఏమయ్యేదో ఆలోచించండి. అలా జరిగిన వ్యక్తే ఈ పని చేసాడు కాబట్టి అతన్ని క్షమించండి.'





# 26. వేట

## జాక్ ఫాక్స్

గత రెండు గంటలుగా అతను సెడాన్ కారుని నడుపుతున్నాడు. దాన్ని సాధ్యమైనంత వేగంగా పోనిస్తున్నాడు. అతనికి కిటికీలోంచి చల్లటి గాలి తగులుతోంది. కొండల మీదకి వచ్చాక దూరంగా కింద సేంటా ఆల్టా పట్టణ దీపాలు కనపడ్డాయి. కొండ దిగి లోయని దాటితే తను ఆ పట్టణాన్ని చేరుకోగలడని ఉత్సాహంగా అనుకున్నాడు. అతని కుడి కాలు ఏక్సిలేటర్ పెడల్‌ని మరింతగా నొక్కింది.

ఎదురుగా రోడ్డు మధ్య తెల్లటి గీతలు కనిపిస్తున్నాయి. తన కారులోని డేష్ బోర్డ్‌కి ఉన్న గడియారంలోని రేడియం ముళ్ళని చూసి సమయం పదకొండుం పావని గ్రహించాడు. అతని సెడాన్ కొండ దిగి లోయని తేలిగ్గా దాటింది. అతను సేంటా ఆల్టాకి చేరుకుంటూండగా రేడియోలోని సంగీతం ఆగి పోయి ఓ అనౌన్సర్ కంఠం వినిపించింది. అతను కుడి చేత్తో రేడియో వాల్యూంని పెంచాడు.

జైలు నించి పారిపోయిన హంతకుడు ఫ్రాంక్ వెర్నర్ కోసం జరిగే వేట ఈ రాత్రంతా కూడా అతను దొరికే దాకా జరుగుతుంది అని పోలీస్ చీఫ్ చెప్పాడు. ఈ మధ్యాహ్నం కోల్‌మన్ నగరంలో బేంక్ రాబరీలో పాల్గొని, సెక్యూరిటీ గార్డుల్లోని ఒకర్ని వెర్నర్ చంపాడు. రాష్ట్ర రాజధాని నించి నగదుని రవాణా చేసే వేన్‌ని అతను దోచుకున్నాడు. దొంగిలించిన ఓ కారులో అతను పారిపోయాడని పోలీసులు చెప్తున్నారు. వెర్నర్ భార్య మేరియానా నివశించే సేంటా ఆల్టాకి అతను వెళ్తున్నాడని పోలీసులు అనుమానిస్తున్నారు.

అతను చెవులు రిక్కించి వింటున్నాడు.

శ్రీమతి వెర్నర్ తన భర్త దొంగతనం ప్రయత్నం చేసి తప్పించుకున్నాక నాలుగు వేల డాలర్లని బేంక్ లోంచి డ్రా చేసి మాయం అయిందని తెలుస్తోంది. ఫ్రాంక్ ఆమెకి ఫోన్ చేసి ఉంటాడని, వారిద్దరూ ఓ రహస్య ప్రదేశంలో కలుసుకునే ఏర్పాటు చేసుకుని ఉంటారని కూడా పోలీసులు భావిస్తున్నారు. వెర్నన్ దగ్గర పిస్తోలు ఉంది. అతను అత్యంత ప్రమాదకరమైన వ్యక్తి. సేంటా ఆల్టా ప్రజలు అత్యవసర పరిస్థితిలో తప్ప బయటకి...

తనకి ముఖ్యమైన సమాచారం తెలిసిందని అతను భావించాడు. కాబట్టి మిగతాది వినదలచుకోక, వెంటనే రేడియో స్విచ్‌ని ఆఫ్ చేసేసాడు. అతని నడుం దగ్గర పేంట్ లోకి ఓ పిస్తోలు దోపి ఉంది. నగర సరిహద్దులు సమీపించాక అతను కారు వేగాన్ని తగ్గించాడు. తనని అధిక వేగంతో కారుని నడిపే నేరం మీద ఏ పోలీస్ ఆపడం అతనికి ఇష్టం లేదు.

సేంటా ఆల్టా నగర వీధులన్నీ నిర్మానుష్యంగా ఉన్నాయి. ఒక్క కారు కూడా అతనికి తారసపడలేదు. నది పక్కన పారిశ్రామిక వాడలో ఏడు మైళ్ళ దూరం ప్రయాణించాక

అతను ఊళ్ళోని ఓ చిన్న కొండ వైపు కారుని పోనించాడు. రాళ్ళు తేలిన చిన్న మట్టి రోడ్డు ఎక్కి ఓ మైలు దూరం వెళ్ళాడు. ఆ రోడ్డు మీద మలుపులు అధికంగా ఉన్నాయి. మరో మైలు దూరం వెళ్ళాక ఓ ప్రైవేట్ రోడ్ కనిపించింది. కారుని ఆ రోడ్‌లోకి పోనించి అర మైలు వెళ్ళాక వేగాన్ని పూర్తిగా తగ్గించాడు. కారు ఎవరికీ కనపడకుండా తుప్పల్లోకి పోనించి దిగి తలుపు తాళం వేసి ఆ మట్టి రోడ్ మీదకి వచ్చాడు. అక్కడి నించి చూస్తే కారు కనపడటం లేదు. దట్టంగా ఉన్న పైన్ చెట్లు అడ్డుగా ఉన్నాయి.

బాగా చల్లగా ఉంది. గాలి కూడా వేగంగా వీస్తోంది. చంద్రుడు మబ్బుల వెనక దాక్కోవడంతో అక్కడ పెద్దగా వెలుగు కూడా పడటం లేదు. అతను ఆ రోడ్డు పక్కన ఉన్న రాళ్ళ మీద ఒంగి నిశ్శబ్దంగా, పిల్లిలా, రహస్యంగా పైకి నడిచాడు. అవతల మేరియానా తన కోసం ఎదురు చూస్తూండి ఉండాలి అనుకున్నాడు.

అతని గుండె వేగంగా కొట్టుకుంటోంది. నెమ్మదిగా పైన్ వృక్షాల మధ్యకి నడిచాడు. అతను నిశ్శబ్దంగా నిలబడి ఏదైనా వినపడుతుందేమోనని చెవులు రిక్కించి నాలుగైదు నిమిషాల సేపు విన్నాడు. నిశ్శబ్దం. నేల మీద బోర్లా పడుకుని నెమ్మదిగా ముందుకి పాకాడు. అతనికి ఓ ఫోర్డ్ కారు కనిపించింది. అదే సమయంలో మబ్బుల వెనక నించి వచ్చిన చంద్రుడి కాంతిలో ఓ బండ రాయి మీద తలకి స్కార్ఫ్ కట్టుకుని కూర్చున్న ఓ ఆకారం కనపడింది. అది మేరియానాది అని గ్రహించగానే అతనికి ఆనందం వేసింది. నెమ్మదిగా అతను పాకుతూనే అమె వైపు వెళ్ళాడు. అప్పటికే అతని కుడి చేతిలో సేఫ్టీ కేచ్ తీసిన పిస్తోలు సిద్ధంగా ఉంది. ఆమెకి పదిహేను అడుగుల దూరం చేరాక అతను ఆగి వినసాగాడు. రాత్రి శబ్దాలు తప్ప అతనికి ఇంకేం వినపడలేదు. అతను తలని పైకెత్తి నెమ్మదిగా పిలిచాడు.

"మేరియానా."

అమె తల తిప్పకపోవడంతో మరోసారి ఇంకాస్త గట్టిగా పిలిచాడు.

"మేరియానా."

ఈసారి ఆమె తల ఆ శబ్దం వచ్చిన వైపు తిరిగింది. అదే సమయంలో ఆమె ఆదుర్దాగా లేచి నిలబడింది.

"డార్లింగ్. నువ్వు అసలు రావని అనుకుంటున్నాను. ఎక్కడ ఉన్నావు?" ఆమె కంఠం ఆనందంగా వినిపించింది.

"నువ్వు ఒంటరిగానే ఉన్నావా?"

"అవును. నాకు ఇక్కడ ఒంటరిగా వేచి ఉండటానికి భయంగా ఉన్నా నీ కోసం ఎదురు చూస్తున్నాను."

సేఫ్టీ కేచ్‌ని మూసి అతను లేచి ఆమె వైపు అడుగులు వేసాడు. ఆమె అతన్ని అల్లుకు పోయింది. ఇద్దరూ ఒకరినొకరు కొద్దిసేపు గాఢంగా చుంబించుకున్నారు.



"నేను సరిగ్గా బయటకి వెళ్ళేప్పుడు నీ ఫోన్ వచ్చింది. లేదా..."

అకస్మాత్తుగా అతను తలని అటు ఇటు తిప్పి చూసాడు. మళ్ళీ చెవులు రిక్కించి విన్నాడు.

"ఏమిటి?"

"ష్. విను."

కొద్ది క్షణాల తర్వాత ఆమెకి కూడా ఆ శబ్దం వినిపించింది.

"కారు శబ్దం కదా?" భయంగా అడిగింది.

"అవును."

అతని కారు వచ్చిన రోడ్డుకి అవతలి వైపు నించి అదే ప్రైవేట్ రోడ్డు మీదకి వస్తోందో కారు. మేరియానా కళ్ళు భయంతో పెద్దవయ్యాయి. పెదవులు వణుకుతున్నాయి.

"మేరియానా! భయపడకు. కార్లో కూర్చో. నిశ్శబ్దంగా ఉండు. ఎదురుగా తప్ప ఎటూ చూడకు. అర్థమైందా?"

ఆమె తల ఊపింది.

"ప్రమాదం ఉండదుగా?" అడిగింది.

"జరిగేది చూస్తూండు. అంతే తప్ప ఎట్టి పరిస్థితుల్లో కారు దిగక." అతను హెచ్చరించాడు.

ఇటు వైపే వచ్చే కారు హెడ్ లైట్లు కింద నించి అతనికి కనిపించాయి. అకస్మాత్తుగా హెడ్ లైట్లు ఆరిపోయాయి.

కొద్ది క్షణాల తర్వాత కారు ఇంజన్ శబ్దం కూడా ఆగిపోయింది. కారు తలుపు మూసిన శబ్దం చిన్నగా వినిపించింది. ఆ తర్వాత అంతా నిశ్శబ్దం. మళ్ళీ అతను తన కుడి చేతి లోని పిస్తోలు సేఫ్టీ కేచ్‌ని తీసి తయారుగా పట్టుకున్నాడు. నెమ్మదిగా వెనక్కి తిరిగి ఎత్తుగా ఎదిగిన ఫెర్న్ మొక్కల చాటున నక్కాడు. కార్లోని మేరియానా ఆకారం అతనికి కనిపిస్తోంది. అతను చీకట్లోకి కళ్ళు చికిలించి చూస్తూ ఏదైనా కదలికలు కనిపిస్తాయా అని జాగ్రత్తగా చూడసాగాడు. అలాంటివేమీ అతనికి కనపడలేదు. ఎలాంటి శబ్దం కూడా వినపడలేదు. కాలం ఆగిపోయినట్లుగా అతనికి అనిపించింది. మోకాళ్ళ మీద కూర్చుని వేచి చూడసాగాడు. అకస్మాత్తుగా కారుకి పక్కనే ఫెర్న్ మొక్కల్లో ఏదో కదిలిన చప్పుడు విన్నాడు. అతను శ్రద్ధగా చూసాడు. పైన్ వృక్షాలు, నీడలు తప్ప ఇంకేం కనిపించలేదు. కొద్దిసేపు అటు వైపే గుచ్చి గుచ్చి చూడసాగాడు. అకస్మాత్తుగా ఓ నీడ మిగిలిన నీడల్లోంచి విడివడటం గమనించాడు. అది కదిలి మేరియానా కారు వైపు రాసాగింది.

అతని చూపుడు వేలు ట్రిగర్ దగ్గరకి వెళ్ళింది. సరిగ్గా అదే సమయంలో మళ్ళీ మబ్బుల చాటు నించి చంద్రుడు బయటకి వచ్చాడు. అతను కారు వైపు వెళ్తూ కనిపించాడు.

అతని మొహం స్పష్టంగా కనిపిస్తోంది. ఊపిరి బిగపట్టి అతను తనకి అతి సమీపంగా వచ్చే దాకా ఆగాడు. వెంటనే మోకాళ్ళ మీద కూర్చున్న అతను తన ఎడం చేతిలో తయారుగా పట్టుకున్న రాతిని అతని వైపు విసిరాడు. అది వెళ్ళి అతని వెనక చప్పుడు చేస్తూ పడింది.

ఆ కొత్త వ్యక్తి తక్షణం వెనక్కి తిరిగాడు. రాయి విసిరిన అతని చేతిలోని పిస్తోలు ఓసారి పేలింది. ఎడం చేతిని ఆధారంగా చేసుకుని, కుడి చేతి లోని పిస్తోలుని మరో రెండు సార్లు కాల్చాడు అతను. కొత్త వ్యక్తి ఎగిరి చిన్నగా కేక వేస్తూ నేల మీద పడ్డాడు. మేరియానా తుపాకీ చప్పుళ్ళకి అరిచిన అరుపులు గాల్లో కలిసిపోయాయి.

వెంటనే ముందు వచ్చిన వ్యక్తి లేచి కింద పడ్డ వ్యక్తి దగ్గరకి వెళ్ళాడు. అతని చేతిలో పిస్తోలు దూరంగా పడి ఉంది. అతని కళ్ళు ఆకాశంలోకి నిశ్చలంగా చూస్తున్నాయి.

అతను కారు తలుపు తెరచుకుని మేరియానా పక్కన కూర్చున్నాడు.

"అతను...?" అర్థోక్తిగా అడిగింది.

"అవును."

ఆమె చేతులు వెంటనే అతన్ని చుట్టేసాయి.

"నేను ఇంకొంచెం ముందుగా నీకు ఫోన్ చేయాల్సింది. ఎందుకు ఆగానో నాకే తెలీదు. ఐదు నిమిషాల తేడా. అంతే. లేదా అతనే నీకన్నా ముందు వచ్చేసి ఉండేవాడు..' ఏడవసాగింది.

"నేను టైంకే వచ్చి అంతా సుఖంగా ముగిసిందిగా. అది మనకి ముఖ్యం."

"పాల్! కొద్ది నెలల క్రితం నువ్వు నాకు పరిచయం అవడం నా అదృష్టం. ప్రేమంటే ఏమిటో నాకు నీ ద్వారానే తెలిసింది."

అతను అమెని మృదువుగా ముద్దు పెట్టుకున్నాడు.

"నీ భర్త ఫ్రాంక్ వెర్నన్‌ని పట్టుకునే ప్రయత్నంలో నిన్ను కలవాల్సి రావడం నా అదృష్టం."

వారి మధ్య ఓ సారి సంభోగం జరిగాక అతను పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌కి ఫోన్ చేసి చెప్పాడు.

"నేను స్పెషల్ ఏజెంట్ బేరోస్ పాల్‌ని. ఫ్రాంక్ వెర్నన్‌ని మీరు ఇక వెదకక్కర్లేదు. వాడు మరణించాడు."





# 27. ఫ్యామిలీ గేమ్

## బ్రెండెన్ డుబోయిస్

అమెరికాకి పశ్చిమాన ఉన్న కేలిఫోర్నియా నించి తూర్పున ఉన్న మసచుసెట్స్ రాష్ట్రానికి షిఫ్ట్ అయిన రెండు నెలలకి కార్లా తన భర్తతో చెప్పింది.

"నాకు సేన్‌డియాగో కన్నా మెండన్ బావుంది."

"పిల్లలకి స్కూలు సౌకర్యం, నీకు స్కూల్లో, నాకు పుస్తకాల షాపులో ఉద్యోగాలు చూసే ఫెడరల్ ఏజెంట్లు మనల్ని ఇక్కడికి రీలొకేట్ చేసారు. నీకీ ఊరు బావుందా?"

"కేలిఫోర్నియాతో దేన్నీ పోల్చలేం. వాతావరణం, సంపద, మర్యాద, మన్నన, కళలు. దేన్ని తీసుకున్నా కేలిఫోర్నియా కేలిఫోర్నియానే. కాకపోతే మరీ నెబ్రెస్కా, అలబామా లాగా ఛండాలంగా లేదు."

వారి కొడుకు పన్నెండేళ్ళ డేవిడ్ అప్పుడే స్కూల్లో బేస్ బాల్ టీంలో చేరి చాలా మంది మిత్రులని సంపాదించాడు. రెండో కొడుకు తొమ్మిదేళ్ళ లియో స్కూల్ డ్రామా విభాగంలో ఏక్టివ్ అయ్యాడు. కార్లా అదే స్కూల్లో స్పానిష్ టీచర్‌గా పని చేస్తోంది. హాఫ్ ప్రైస్ బుక్ స్టోర్‌లో రిచర్డ్‌కి ఉద్యోగం వచ్చింది. మూడు పడక గదుల ఇంటిని కూడా ఫెడరల్ ఏజెంట్లే చూసి పెట్టారు.

వారానికి ఓసారి ఎఫ్‌బిఐ ఏజెంట్లు వచ్చి రిచర్డ్‌ని కలిసి వెళ్తూంటారు. అతను పారిపోలేదని రూఢీ చేసుకోడానికి, అతనికి ప్రత్యర్థుల నించి ఎలాంటి ప్రమాదం జరగలేదని తెలుసుకోడానికి వారు వచ్చి వెళ్తూంటారు. మెండన్ నించి బయటకి వెళ్ళే రైలు, రోడ్డు మార్గాల్లో కూడా రిచర్డ్ పారిపోకుండా గట్టి కాపు కూడా ఉంది.

* * *

ఆ సోమవారం డేవిడ్ స్కూల్లో బేస్ బాల్ మేచ్ ఆడుతూండటంతో రిచర్డ్ తన కుటుంబ సభ్యులతో సాయంత్రం ఆరున్నర కల్లా స్టేడియానికి చేరుకున్నాడు. విద్యార్థుల తల్లిదండ్రులతో ఆ స్టేడియం కిటికిటలాడుతోంది. ఆటని చూస్తూ అంతా గట్టిగా అరుస్తున్నారు. అక్కడి వాతావరణం ఉత్సాహంగా ఉంది.

ఆట అయ్యాక అంతా కారెక్కారు. డేవిడ్ టీం గెలవడంతో అతని తండ్రి రిచర్డ్ ఉత్సాహంగా ఉన్నాడు. డేవిడ్ ఎదుటి టీంకి చెందిన స్మిత్ కూడా అదే సమయంలో తన కారు ఎక్కాడు. వారి కారు రిచర్డ్ కారుకి పక్కనే ఆగి ఉంది. రిచర్డ్ తన కారుని పోనించే సమయానికి సరిగ్గా స్మిత్ కారు వచ్చి రిచర్డ్ కారు ముందు ఆగింది. స్మిత్ తండ్రి ప్లమ్మర్ సెల్ ఫోన్‌లో మాట్లాడుతూ కారుని అడ్డం తీయలేదు. రిచర్డ్ అర నిముషం దాకా చూసి హారన్ కొట్టాడు.

వెంటనే ప్లమ్మర్ తన కారు దిగి రిచర్డ్ దగ్గరకి వచ్చి కోపంగా అరిచాడు.

"ఏమిటి తిడుతున్నావ్? హీరోననుకుంటున్నావా?".

"తప్పు మీది. కారు తీయండి." రిచర్డ్ కారు దిగి ప్లమ్మర్ వంక చూస్తూ చెప్పాడు.

"నువ్వు క్షమాపణ చెప్తే కాని కారు తీయను. నీ కొడుకు ఓ ఆటలో గెలవగానే మీరు హీరోలై పోయారా?"

తన కొడుకు టీం ఓడిపోయిందన్న అసూయ ప్లమ్మర్ మాటల్లో పసి కట్టాక రిచర్డ్ తన చొక్కా చేతులని మడిచాడు. తక్షణం కార్లా కారు దిగి రిచర్డ్ చేతిని పట్టుకుని చెప్పింది.

"మర్చిపోయావా? హింస వద్దు."

రిచర్డ్ తమాయించుకుని తిరిగి కారెక్కాడు. కొద్దిసేపాగి ప్లమ్మర్ కారుని తీసాడు.

"శుద్ధ అసూయపరుడు." కార్లా అతన్ని తిట్టింది.

* * *

బుధవారం రాత్రి పదిన్నరకి ఇద్దరు ఫెడరల్ ఏజెంట్లు రిచర్డ్ ఇంటికి వచ్చారు.

"వచ్చే శనివారం కాక పై శనివారం మనం ఎల్ ఏకి వెళ్తున్నాం. కోర్టులో మెల్ఫ్ ఫ్లెమింగ్‌కి వ్యతిరేకంగా నువ్వు సాక్ష్యం చెప్పాలి."

"అలాగే."

"నువ్వు అప్రూవర్‌గా మారబట్టే నిన్ను ఇక్కడకి రహస్యంగా తరలించాం. కాబట్టి ఎట్టి పరిస్థితుల్లోనూ సాక్ష్యం చెప్పడం ఎగ్గొట్టకూడదు. నువ్వు ఇక్కడ ఉన్నావని వారికి తెలీదు. ఎల్ ఏలో నీకు వారి నించి ప్రమాదం కలగకుండా నీ ప్రాణాలని మా ఏజెంట్లు సదా రక్షిస్తూంటారు."

"అలాగే."

"మన ఒప్పందంలోని అంశాలు గుర్తున్నాయిగా? ఆ కేసు పూర్తయ్యేదాకా నువ్వు ఇక్కడ ఎలాంటి చిన్న నేరం కూడా చేయకూడదు. చేసి పోలీస్ కస్టడీకి వెళ్తే ఇక అది తేలే దాకా నువ్వు కోర్టుకి రాలేవు. ట్రాఫిక్ నేరంతో సహా ఎలాంటి నేరం నువ్వు చేయకూడదు. చేస్తే మన ఒప్పందం వీగిపోయి నిన్ను తిరిగి వెనక్కి పంపుతాం. అప్పుడు నువ్వు పదకొండు హత్యానేరాలకి కోర్టులో విచారణని ఎదుర్కోవాలి."

కార్లా అందరికీ కాఫీలు ఇచ్చింది.

* * *

మర్నాడు కార్లా తన కారులో ముందు భర్తని పుస్తకాల దుకాణం దగ్గర ఎప్పటిలా దింపి, తర్వాత స్కూలుకి పిల్లలతో వెళ్ళబోయింది. అంతలో ఓ కారు వచ్చి ఆమె కారుకి అడ్డుగా నిలిచింది. ఆ కారుని గుర్తు పట్టి చెప్పాడు లియో.

"అది స్మిత్ నాన్న ప్లమ్మర్ కారు."



షాపులోకి వెళ్తూ అది గమనించిన రిచర్డ్ వెంటనే ప్లమ్మర్ దగ్గరకి వెళ్ళి చెప్పాడు.

"దయచేసి మీ కారుని అడ్డు తీస్తే బావుంటుంది."

"ఏమిటి హీరో? తీయకపోతే ఏం చేస్తావు?" ప్లమ్మర్ కారు దిగి మీద మీదకి వస్తూ అరిచాడు.

తన భర్తని లోపలకి వెళ్ళమని సైగ చేసి కార్లా కారుని బేక్ చేసుకుంది. అతను పుస్తకాల షాపులోకి వెళ్ళాక కార్లా వెళ్ళిపోయింది. ఆ రాత్రి కార్లా తన భర్తతో చెప్పింది.

"ప్లమ్మర్ గురించి వాకబు చేసాను. చాలా చెడ్డవాడు. ఈ చిన్న ఊరిలో వాడు పెద్ద రౌడీ."

చిన్నగా నిట్టూర్చాడు రిచర్డ్.

"పదకొండు మంది మాఫియా రౌడీలని, పోలీస్ ఆఫీసర్లని హత్య చేసిన నేను ఈ చిన్న రౌడీని ఏం చేయలేకపోతున్నాను. నాకు ఒళ్ళు మండిందంటే..."

"...తిరిగి సేన్‌డియాగోకి వెళ్ళి కటకటాలు లెక్క పెడుతూ ఆ పదకొండు హత్యల కేసుల విచారణని మీరు ఎదుర్కోవాలి."

"కాని వాడు కయ్యానికి కాలు దువ్వుతున్నాడు."

"నాకు, పిల్లలకి మెండసీ బావుంది. ఇక్కడ అంతా అడ్జస్ట్ అయ్యాం. మనం ఈ ఊరు వదలాల్సి వస్తే నిన్ను చంపేస్తాను." కార్లా హెచ్చరించింది.

"ఆ విషయంలో నాకు అనుమానంలేదు." కార్లాని ముద్దు పెట్టుకుని రిచర్డ్ చెప్పాడు.

* * *

మర్నాడు రాత్రి ఏడున్నరకి ఇంటికి వచ్చిన రిచర్డ్ దుస్తుల మీద రక్తం అంటి ఉండటం చూసి కార్లా కంగారుగా అడిగింది.

"ఏమిటది? మళ్ళీ ఆ ప్లమ్మర్‌తో గొడవ జరిగిందా?"

"అవును. వాడు నా కారు కుడి హెడ్ లైట్స్ పగల కొట్టాడు. నా మీదకి వచ్చి నన్ను కొట్టాడు. నేను మిన్నకుండిపోయాను."

"ఆహా! ఎల్ ఏలో మిమ్మల్ని చూస్తే అంతా ఒణికి పోయేవారు. కాని ఇక్కడ...ప్చ్! ఫెడరల్ ఏజెంట్లకి వాడి సంగతి చూడమని చెప్పండి." కార్లా సలహా ఇచ్చింది.

×××

మర్నాడు ఆదివారం రిచర్డ్ కుటుంబంతో సినిమాకి వెళ్ళాడు. పిల్లల సినిమా అది. రాత్రి ఏడున్నరకి వాళ్ళు హోటల్‌లో భోజనం ముగించి ఇంటికి చేరుకునేసరికి ఇంటి బయట పోలీస్ వేన్ ఆగి ఉంది. ఇద్దరు పోలీస్ ఆఫీసర్లు అతని కోసం వేచి ఉన్నారు.

"ప్లమ్మర్‌కీ, మీకు శతృత్వం ఉంది కదా?" అడిగారు ఒకరు.

"నా వైపు నించి అలాంటిదేం లేదు." రిచర్డ్ జవాబు చెప్పాడు.

"మీ కారు హెడ్ లైట్‌ని దేనికి రిపేర్ చేయించారు?"

"ఫ్లమ్మర్ పగలకొట్టడంతో."

"మా వారికి అతనితో శతృత్వం ఉంటే ఆ సంగతి మీకు ఫిర్యాదు చేసి ఉండేవారు." కార్లా వారితో చెప్పింది.

"మీరు దీంట్లో కల్పించుకోకండి." ఓ పోలీస్ ఆఫీసర్ ఆమెతో కఠినంగా చెప్పాడు.

వెంటనే ఆమె లోపలకి వెళ్ళిపోయింది.

"ఈ సాయంత్రం నాలుగున్నరకి ఎక్కడ ఉన్నారు?"

"సినిమా హాల్లో."

పోలీసులకి తన సినిమా టిక్కెట్ల కౌంటర్ ఫాయిల్స్‌ని చూపించాడు. ఆ సినిమా కథని టూకీగా చెప్పాడు. ఆ సినిమాకి వచ్చిన వారి వివరాలు చెప్పాడు. ఫ్లమ్మర్ కొడుకు స్మిత్, అతని భార్య, ఇంకా ఆ ఊళ్ళోని తనని గుర్తించే కొందరి పేర్లు చెప్పాడు.

"ఫ్లమ్మర్ నా మీద ఏం రిపోర్ట్ చేసాడు?"

"ఇందాక నాలుగున్నరకి అతన్ని ఎవరో తల మీద మోది చంపారు. అందర్నీ సినిమాకి పంపి అతనొక్కడే ఇంట్లో ఉన్నాడు. డోర్ బెల్ నొక్కి ఉంటారు. అతను తలుపు తీయగానే తక్షణం పంపు గొట్టం లాంటి దాంతో ఎవరో తల మీద మోది చంపారు."

"అరెరె!"

"మీ ఎలిబీని జాగ్రత్తగా పరిశీలిస్తాం. ఏ మాత్రం తేడా ఉన్నా మిమ్మల్ని అనుమానం మీద అరెస్ట్ చేస్తాం. మీరు ఫ్లమ్మర్‌తో గొడవ పడటం గురించి మాకు విచారణలో తెలిసింది."

"ఆ సినిమా హాల్లో నన్ను పది మందికి పైగా నా పుస్తకాల షాపు కష్టమర్స్, ఇతరులు చూసారు."

వారు వెళ్ళాక లోపల కార్లా దగ్గరకి వెళ్ళి రిచర్డ్ అడిగాడు.

"సినిమా హాల్లోంచి చాలాసేపు నువ్వు ఎందుకు బయటకి వెళ్ళావు?"

"స్మిత్ కుటుంబ సభ్యులందరినీ సినిమా హాల్లో చూసాక అతనింటికి ఫోన్ చేస్తే ఫ్లమ్మర్ రిసీవర్ ఎత్తాడు. అతను ఇంట్లో ఇంటరిగా ఉన్నాడని తెలియగానే మీరు చేయదలచీ చేయలేని పనిని నేను చేసి వచ్చాను. ఎవరూ నన్ను చూడలేదు."

"పంపు గొట్టం ఏం చేసావు?"

"ఎవరికీ తెలీని చోట నీళ్ళల్లో పడేసాను. అది పోలీసులకి దొరికినా వేలి ముద్రలు, రక్తపు మరకలు ఉండవు."

"నీకు మెండన్ ఎంతగా నచ్చిందో నాకిప్పుడు అర్థమైంది." నవ్వుతూ చెప్పాడు రిచర్డ్.

ఇద్దరూ ఒకరినొకరు చుంబించుకోసాగారు.



# 28. గుండె మండితే

## ఎలైన్ స్లేటర్

వారిద్దరికీ వివాహం అయ్యాక లోకంతో ప్రమేయం లేకుండా ఉండాలని నార్త్ ఉడ్స్ అనే అడవిలో ఓ కేబిన్‌ని నిర్మించుకుని, శని, ఆదివారాలు అక్కడ గడపసాగారు. పోస్ట్, ఫోన్, దినపత్రికలు లాంటి సౌకర్యాలు అక్కడ అందుబాటులో ఉండవు కాబట్టి బయటి ప్రపంచంతో సంబంధమే ఉండదు.

ఇద్దరూ జలపాతం దగ్గర చేతులు పట్టుకుని కూర్చుని ఆ ప్రశాంతతని మౌనంగా ఆస్వాదిస్తారు. లేదా కేబిన్స్‌లోని ఫైర్ ప్లేస్ ముందు, నది ఒడ్డున, ఓ విశాల వృక్షం కింద మౌనంగా కూర్చుని అప్పుడప్పుడు చుంబించుకుంటూంటారు. నదిలో ఇద్దరూ కలిసి నగ్నంగా స్నానం చేసినా వారిని గమనించడానికి పిట్ట పురుగు కూడా అక్కడ ఉండదు.

కాని క్రమేపి వారి టైం టేబుల్ మారసాగింది. వ్యాపారపరమైన వత్తిడి వల్ల అతను శనివారాలు కూడా పని చేయాల్సి వస్తోంది. ఆమె ఎప్పుడైనా పలకరిస్తే అతను తన సమక్షంలో లేదని గ్రహించేది. ఒకే ప్రశ్నని రెండు సార్లు వేస్తే కాని అతని నించి జవాబు రాదు. అతను రీడర్స్ డైజెస్ట్, పార్టిసాన్ రివ్యూలని చదవడం మానేసి వాల్ స్ట్రీట్ జర్నల్‌ని, లేదా మార్కెట్ రిపోర్ట్‌లని చదువుతున్నాడు. ఆమెతో కలిసి సినిమాలకి వెళ్తూనే ఉన్నాడు. కాని గతంలోలా సినిమా పూర్తయ్యాక ఆమెతో దాని బాగోగులని మనస్ఫూర్తిగా చర్చించడం లేదు. ఆమె చెప్పేది వింటాడు కాని ఒక్క మాట కూడా మాట్లాడడు.

"ఎక్కడున్నారు మీరు? నేను రాతితోనా మాట్లాడేది?" విసుగేసి అడుగుతుంది.

"నువ్వు చెప్పేది వింటున్నాను. నీ ఆఖరి మాటలు 'నా కుర్చీని నా భవిష్యత్ తరానికి నేను బతికుండగానే వదిలేస్తాను' అన్న వాక్యం బావుంది కదండి?' అన్నావు. అవును. బావుంది." జవాబు చెప్తాడు.

కాని తన భర్త తన మాటలని పూర్వపు ఆసక్తితో వినడం లేదని, అన్యమనస్కంగా వింటున్నాడని ఆమెకి తెలుసు. తన భర్త మనసు తను చెప్పే విషయం మీద లేదని, చాలా సార్లు అది ఇంకెక్కడో, బహుశా వ్యాపార సంబంధమైన విషయాల మీద తిరుగుతోందని అనుకుంటుంది. కాల్గేట్ షేర్ల ధరల మీదో, సౌత్ కొరియాలో పెరిగిన సిమెంట్ ధరల వల్ల జపాన్‌లో పడే ఆర్థిక ఫలితం వల్ల, జపాన్ కంపెనీల్లో పెట్టుబడి పెట్టిన అమెరికన్ కంపెనీల షేర్ల ధర ఎంత దాకా తగ్గచ్చనో... అతను ఆసక్తిగా మాట్లాడే ఆ మాటలకి ఆమె దీర్ఘంగా నిట్టూరుస్తుంది. ఏమైంది అతనిలోని కళాత్మకత?

నిజమే. అతని సంపాదన తమ పెళ్ళయినప్పటికన్నా పది రెట్లకి పైగానే పెరిగి, రెండో ఫ్రిజ్, మూడో టివి, పెద్ద కారు, ఆరు పడక గదుల ఇల్లు లాంటి విలాస వస్తువులని

కొనగలిగారు. కాని ఆమెకి ఇదివరకటి సంతోషం, తృప్తి తనలో ఇప్పుడు లోపించినట్లుగా అనిపించసాగింది. ఆ రోజుల్లో తన భర్త పూర్తిగా తనకి అంకితం. ఇప్పుడు పూర్తిగా వ్యాపారానికి అంకితం. ఇంట్లో ఉపయోగించే అనేక సౌకర్యవంతమైన పరికరాల్లా అతనికి తనూ ఓ పరికరమే అనే భావన ఆమెలో తీవ్రంగా కలిగి ఆమెని అది కలిచి వేయసాగింది.

గతంలో తన దగ్గర హాస్యంగా ఉండేవాడు. రకరకాలుగా తనని వినోదింప చేసేవాడు. గతంలో రాత్రి పదకొండున్నర దాకా అనేక విషయాలు కబుర్లు చెప్పుకుంటూ నిద్ర పోయేవారు. ఇప్పుడు రాత్రుళ్ళు బోర్డ్ మీటింగ్‌కి సిద్ధం అవాలనో, మరే కారణంగానో పుస్తకాలు చదువుతూ గడుపుతున్నాడు. తను నిద్ర పోయాకే పక్క మీదకి చేరే వ్యక్తి శారీరకంగా తనని ఎలా తృప్తి పరచగలడు? రొటీన్‌గా జరిగే రొమాన్స్ చెత్త రొమాన్స్ అని ఆమె భావన.

* * *

ఆ రోజు అతను ఇంటికి తిరిగి వచ్చేసరికి ఆమె స్నానం చేసి, కొత్త పల్చటి గౌను ధరించి, చక్కటి పెర్ఫ్యూమ్ రాసుకుని, మసక చీకటి ఉండేలా లైట్లని వేసి, డ్రై మార్టినీలని కలిపి, అతని ఫేవరేట్ సంగీతం అయిన మొజరత్ కాన్సర్ట్‌ని ఆన్ చేసింది. అతనికి ఆనందంగా ఎదురు వెళ్ళింది.

అతను రాగానే ఆమె ధరించిన దుస్తులని చూసి ఆశ్చర్యపోయాడు. మార్టినీ వద్దని, దాని వల్ల తనకి అజీర్తి కలుగుతుందని, బోర్బన్ అన్ ది రాక్స్ ఇవ్వమని, తను ఏం తింటున్నాడో కనపడటం లేదు కాబట్టి కాంతిని పెంచమని చెప్పి, భోజనం అయ్యాక బేరన్స్ రిపోర్ట్‌ని అందుకుని అది చదువుతూ సోఫాలోనే నిద్రపోయాడు. ఆ రోజు తన పుట్టినరోజు అన్న సంగతే తన భర్తకి గుర్తు రాలేదని, కనీసం స్ఫురించలేదని గ్రహించిన ఆమె మనసు మండిపడింది. ఎప్పటిలా గాయపడలేదు. మండిపడింది.

అతన్ని చంపాలన్న ఆలోచన మొదటిసారిగా ఆమెకి ఆ రోజు కలిగింది. తన భర్తకి ఇంకో యువతితో అక్రమ సంబంధం ఉండి ఉంటే, అప్పుడు అతనితో ఎలా పోట్లాడాలో ఆమెకి తెలిసేది. కాని వ్యాపారంలో మునిగి తనని నిర్లక్ష్యం చేసే భర్తతో ఎలా పోట్లాడగలదు?

ఓ ప్రేమికుడ్ని సంపాదించుకుంటే తన జీవితం సుఖంగా సాగచ్చు అనుకుని తనతో పని చేసే ఆకర్షణీయమైన ఓ కుర్రాడితో లంచ్‌కి వెళ్ళింది. అతను తన భర్తకి ఉన్న షే గురించి ఎంతో ఆసక్తితో మాట్లాడటంతో అతన్ని ద్వేషించింది. ఆమెకి మగాళ్ళంతా ఇంతే అనిపించింది. మళ్ళీ ఓ ప్రేమికుడి గురించిన ఆలోచనే చేయలేదు. వ్యాపారం లేదా ఫుట్‌బాల్ లేదా ఆల్కహాల్. ప్రతీ మగాడికి ఏదో ఓ వ్యసనం ఉండటం గమనించిందామె.

ఆమె అతని మీద తన కోపాన్ని వ్యక్తం చేసినా స్పందన లేదు. ఆమె ఆత్మహత్య గురించి కూడా ఆలోచించింది. కాని ఆశాజీవి కాబట్టి ఆ ఆలోచనని ఆరంభంలోనే తుంచేసింది. 'నేను ఎందుకు చావాలి? నాకు ఇంకా నవ్వడం తెలుసు. నవ్వించడం తె... పక్క మీద



చక్కగా రతి చేయడం తెలుసు. జీవితాన్ని అనుభవించడం తెలుసు. అవి అతను మర్చిపోయ్యాడని నేను ఎందుకు నా జీవితాన్ని అంతం చేసుకోవాలి?' అనుకుంది.

ఆ రాత్రి అతను ఇంటికి తిరిగి వచ్చాక, రోజూలా అతను బయటకి వెళ్ళాక జరిగినవి అతనికి ఆమె చెప్పలేదు. ఆమె ఎప్పటిలా లేదన్న సంగతే అతను గుర్తించనట్లుగా ప్రవర్తించాడు. పరాయి వ్యక్తి అయిన వంట మనిషి మాత్రం అది గ్రహించింది.

ఫోన్ మోగగానే అతను రిసీవర్ అందుకుని నవ్వుతూ చెప్పాడు.

"హేరి? టొరంటోలో నీ ప్రయత్నాలు ఎంత దాకా వచ్చాయి? సాయంత్రం నించి నీ ఫోన్ ఎప్పుడు వస్తుందా అని తప్ప నాకు మనసులో ఇంకేమీ లేదు... వాళ్ళు ఒప్పుకున్నారా? మంచిది. ఐతే ఈ ఏడాది మన లాభం నలభై శాతం పెరుగుతుంది..."

ఆమె వెంటనే అక్కడ్నించి లేచి పడకగదిలోకి వెళ్ళిపోయింది. అరగంట తర్వాత అతను ఉత్సాహంగా ఆమె దగ్గరకి వచ్చి అడిగాడు.

"మనింట్లో షాంపేన్ బాటిల్ ఉందా?"

"దేనికి? లేదు."

"పోనీ వైన్ బాటిల్?"

"లేదు. దేనికి అని అడిగాను. జవాబు చెప్పచ్చుగా?"

"సెలబ్రేట్ చేద్దామని. వ్యాపారంలో మరో అడుగు ముందుకు వేసాను. ఈ సారి మన కంపెనీ పేరు ఫోర్బ్స్ పత్రికలో టాప్ హండ్రెడ్‌కి చేరే దిశలో ఉన్న కంపెనీల జాబితాలోకి ఎక్కడం ఖాయం." భార్య కోపాన్ని గమనించినా దాన్ని విస్మరిస్తూ ఉత్సాహంగా చెప్పాడు.

"మనం సెలబ్రేట్ చేసుకునేది ఇలా కాదు. ఉడ్స్‌లో మనకో కేబిన్ ఉందన్న సంగతే మీరు మర్చిపోయారు. అక్కడికి వెళ్ళి సెలబ్రేట్ చేసుకుందాం. అక్కడికి మనం వెళ్ళి ఎన్ని నెలలైందో తెలుసా?"

"ఈ వీకెండ్‌కి వెళదామా?" అనుమానంగా అడిగాడు.

"మనం వెంటనే వెళ్ళాలి. మనం సెకండ్ హనీమూన్ సెలబ్రేట్ చేసుకుందాం. మనం కోల్పోతున్న ఆనందాన్ని తిరిగి పొందుదాం." ఉత్సాహంగా చెప్పిందామె.

"కోల్పోతున్న ఆనందమా? నేనేం కోల్పోవడం లేదే? నిజానికి మన ఆదాయం పెళ్ళయిన కొత్తల్లో కన్నా ఎన్నో రెట్లు పెరిగింది. కాబట్టి నీ ఆనందం నాకు తెలిసి పెరగాలే? సరే. నువ్వు చెప్పినట్లు సెకండ్ హనీమూన్ జరుపుకుందాం. కాని ఈ శనివారం నాకు రెండు ముఖ్యమైన మీటింగ్స్ ఉన్నాయి. పై శని, ఆదివారాలు వెళదాం. ఏం?"

"కాదు. వాటిని రద్దు చేయండి. ఈ శనాదివారాలే వెళదాం. మీరు జీవించి ఉన్నంత కాలం ఆ వ్యాపార లావాదేవీలు, మీటింగ్స్ కొనసాగుతూనే ఉంటాయి. లేదా ఇంకొన్ని రోజుల్లో రోడ్డు మీద మంచు కురిసి అక్కడికి వెళ్ళడం కష్టం అవుతుంది."

టొరంటోలోని విజయం వల్ల కలిగిన ఆనందం వల్ల అతను నిరాకరించ లేదు.

* * *

అక్కడకి ఎవరూ వచ్చి వెళ్ళిన గుర్తులు లేవు. ఎప్పటిలా నిర్మానుష్యంగానే ఉంది. ఆ కేబిన్‌కి వారు వెళ్ళి చాలా కాలం అవడంతో ఫ్రిజ్ లోని ఆహారపదార్థాలు పాడై ఉంటాయనుకుని ఆమె కొత్తవి వెంట తీసుకెళ్ళింది. అరగంటలో కేబిన్‌ని వేక్యూం చేసి శుభ్రం చేసింది. అతను షార్ట్స్ ధరించి గొడ్డలి తీసుకుని అడవిలోకి వెళ్ళి కొన్ని ఎండు కట్టెలని తెచ్చి ఫైర్ ప్లేస్‌ని రాజేసాడు. ఆమె స్నానం చేసి వచ్చిన అతనికి వేడి వేడి కాఫీని ఇచ్చింది. అతను గతంలోలా స్ప్రింగులున్న మంచం మధ్యలో కూర్చుని ఎగురుతూ చెప్పాడు.

"హనీ! జాయిన్ మి."

అతనిలో ఇగిరిపోయిన ప్రేమ తిరిగి చిగురించిందని ఆమెకి అనిపించింది.

"ఇద్దరమేగా? డ్రస్ దేనికి?" ఆమె వంక చూసి నవ్వుతూ చెప్పడంతో ఆమెలో ఆ విశ్వాసం బలపడింది.

షాంపేన్ బాటిల్‌ని ఓపెన్ చేసి రెండు గ్లాసుల్లో పోసి అతనికి ఒకటి ఇచ్చి చెప్పింది.

"మన ప్రేమకి, మన ఆరోగ్యానికి."

అతను ఆమె గ్లాసుకి తన గ్లాసుని తాకించి చెప్పాడు.

"మన ప్రేమకి. మన ఆరోగ్యానికి..."

గతంలోలా అతను ప్లే బోయ్ జోక్స్ చెప్పాడు. ఆమె పడీ పడీ నవ్వింది. వారి బంధుమిత్రుల గురించి కామెంట్ చేసుకుని నవ్వుకున్నారు. అతను రోనాల్డ్ రీగన్ కంఠాన్ని జార్జ్ బుష్ నడకని ఏక కాలంలో అనుకరించాడు.

ఆమె మనుసు ఆనందంతో నిండిపోయింది. అతనిలోని ప్రేమ పూర్తిగా చిగురించింది అన్న ధైర్యం ఆమెలో స్థిరపడింది. అతన్ని ఆమె అల్లుకుపోయింది. అతను ఆమెని అల్లుకుపోయాడు. ఇద్దరూ కొద్దిసేపు ఒకర్నొకరు చుంబించుకున్నాక అతను ఆమె వంక చూస్తూ అడిగాడు.

"నీకొకటి నేను చెప్పనే లేదు."

"ఏమిటది?" అతని ఛాతీ మీద వేలితో రాస్తూ అడిగింది.

"సెంట్రల్ అమెరికన్ టొబాకో కంపెనీ అమాల్గమేటెడ్ బిస్కట్ కంపెనీతో కలిసిపోయింది. అందువల్ల మన కంపెనీకి ఎంత లాభం పెరిగిందో తెలుసా..."

* * *

గంట తర్వాత ఆమె రక్తం అంటిన గొడ్డలిని కడిగింది. తర్వాత దాన్ని శవంతో పాటు పూడ్చడానికి గడ్డపార, పలుగులని అందుకుని గోతిని తీయసాగింది.



# 29. రెండో హత్య

## ఐజాక్ అసిమోవ్

మిసెస్ క్లారా బెర్న్‌స్టైన్ అపార్ట్‌మెంట్‌లో ఏర్ కండిషనర్ పని చేయడం లేదు. లోపల పెద్దగా వేడిగా లేకపోయినా, వేడిగా ఉందన్న భావన శ్రీమతి క్లారాలో ఉంది.

డోర్ బెల్ మోగితే ఆవిడ తలుపు తెరిచింది. ఎదురుగా ఏభై పై బడ్డ మిసెస్ హెస్టర్ గోల్డ్ కనిపించింది. కింద 4సి అపార్ట్‌మెంట్ నించి ఆవిడ ఇరవై ఒకటో ఫ్లోర్0 లోని క్లారా అపార్ట్‌మెంట్ నంబర్ 21డికి కాలక్షేపానికి వచ్చింది. రోజూ ఓ గంట సేపు ఇద్దరూ పాయింట్‌కి పెన్నీ చొప్పున పేకాట ఆడతారు.

"ఏ సి పని చేయడం లేదా?" మిసెస్ హెస్టర్ అడిగింది.

"లేదు. జానిటర్ (సూపర్‌వైజర్)కి ఫిర్యాదు చేసాను. ఏ ఫిర్యాదు చేసినా వాడు పట్టించుకోడు."

"అదేమిటి?"

"నిన్న ఓ ఫిర్యాదు చేసాను. ఇంతదాకా దాన్ని పట్టించుకోలేదా మూర్ఖుడు."

"ఏమిటది?" అడిగింది మిసెస్ హెస్టర్.

చెయ్యి పట్టుకుని మిసెస్ క్లారా ఆవిడని తన పడక గదిలోకి తీసుకెళ్ళి చెప్పింది.

"శ్రద్ధగా వినండి."

మిసెస్ హెస్టర్ విన్నా ఆవిడకి ఏం వినపడలేదు. ఆ సంగతే చెప్తే మిసెస్ క్లారా వెంటనే ఆవిడని కిటికీ దగ్గరకి తీసుకెళ్ళి అడిగింది.

"ఇప్పుడు?"

"ఏదో వినిపిస్తున్నట్లే ఉంది."

"అది నీటి బొట్ల చప్పుడు."

"అవునవును."

"పై అంతస్థులోని మిసెస్ మేక్ లారెన్ అపార్ట్‌మెంట్ లోంచి ఆ చప్పుడు. ఆమె తన బాత్‌రూంలోని పంపు సరిగ్గా కట్టి వెళ్ళలేదని అర్థం కావడంలా?" అడిగింది క్లారా.

"అవును." మిసెస్ హెస్టర్ చెప్పింది.

"బయటకి వెళ్తోంది కాబట్టి ఏ సి ఆఫ్ చేసి, కిటికీ తలుపులు తీసి పెట్టి వెళ్ళినట్లుంది. ఇక్కడ ఏ సి పని చేయక నా పడకగది కిటికీ తలుపులు తీసాను. దాంతో ఆ చప్పుడు వినపడుతోంది. రాత్రుళ్ళు ఆ చప్పుడుకి నాకు నిద్ర పట్టి చావదు. వేసవి శెలవలకి ఊరు వెళ్ళిందనుకుంటా. మహానుభావురాలు మళ్ళీ ఎప్పటికి వస్తుందో?"

"మిసెస్ మేక్ లారెన్ ఊరికి వెళ్ళలేదు. ఆమె కారు కింద పార్కింగ్ లోనే ఉంది."

"ఇంకెవరి కారులోనైనా వెళ్ళి ఉండచ్చుగా?"

"వెళ్తే నాకు చెప్పి వెళ్ళేది. నేను, ఆమె నార్త్ కరోలినా లోని ఒకే ఊరి నించి వచ్చాం. మాకు పూర్వ పరిచయం ఉంది. తను ఎప్పుడైనా ఊరెళ్తే తన ఇండోర్ ప్లాంట్‌లకి నీళ్ళు పోయమని నాకు చెప్పి వెళ్తూంటుంది. ఆమె చెప్పలేదు కాబట్టి ఊరు వెళ్ళిందనుకోను."

"ఆమె ఊరు వెళ్ళినప్పుడు ఆమె అపార్ట్‌మెంట్‌లోకి మీరు ఎలా వెళ్తారు?"

"ఆమె ఇంటి డూప్లికేట్ తాళంచెవి నా దగ్గర ఎప్పుడూ ఉంటుంది. ఓసారి ఆమె సినిమా నించి వస్తున్నప్పుడు హేండ్ బేగ్‌ని ఓ మగ్గర్ కొట్టేసాడు. దాంట్లో ఆమె ఇంటి తాళం చెవులు కూడా ఉన్నాయి. ఇంక ఇంట్లోకి ఎలా వెళ్తుంది? ఆ రాత్రి మా అపార్ట్‌మెంట్ లోనే పడుకుంది. మర్నాడు తన అపార్ట్‌మెంట్ తాళానికి డూప్లికేట్ చేయించి నాకు ఇచ్చింది. ఇంతకీ నేను వచ్చిన పని చెప్పనే లేదు కదూ?"

క్లారా కాఫీ కలపసాగింది.

"మా అబ్బాయికి డబ్భై రెండు డాలర్లు పెట్టి ఓ బ్లేజర్‌ని కొనిచ్చాను. దానికి ఫేషన్‌గా రెండు చేతుల చివరల్లో రెండు బ్రాస్ బటన్స్ కుట్టి ఉన్నాయి."

"ఈ రోజుల్లో కుర్రాళ్ళకి పచ్చబొట్లు, బ్రాస్ బటన్స్ ఫేషనై పోయింది."

"వాటిలో కుడి చేతి వైపున్న బ్రాస్ బటన్ ఊడిపోయింది."

"అరె! ఆ బ్లేజర్ కొని ఎంత కాలం అయింది?"

"వారం."

"మరింకేం? దాన్ని కొన్న దుకాణంలో వెనక్కిచ్చి ఇంకోటి తీసుకోవాల్సింది." క్లారా సూచించింది.

"అది బలంగా లాగితే కాని ఊడే బటన్ కాదని రెండో చేతి బటన్ కుట్లని పరిశీలించాక తెలిసింది." చెప్పింది శ్రీమతి హెస్టర్.

"ఎలా ఊడిందట?"

"వాడు చెప్తేగా? బటన్ కూడా ఎక్కడో పోగొట్టుకున్నాడు."

"ఆ చప్పుడు వినిపించిందా?"

"ఏ చప్పుడు?"

"నీళ్ళ చప్పుడు. అదిగో మళ్ళీ... మిసెస్ హెస్టర్. మీరు నాకో సహాయం చేయగలరా?"

"ఏమిటది?"

"మీ దగ్గర మిసెస్ మేక్ లారెన్ అపార్ట్‌మెంట్ తాళంచెవి ఉంది కదా?"

"ఉంది?"

"ఇద్దరం ఓసారి ఆమె అపార్ట్‌మెంట్‌లోకి వెళ్ళి ఆ పంపుని కట్టి వద్దామా?"

"అయ్యయ్యో! ఆమె అనుమతి లేకుండా ఆమె ఇంట్లోకి ఎలా వెళ్ళడం?"



"కాని ఆమె ఈ సమయంలో ఇంట్లో లేదు."

"ఒక వేళ ఉంటే? నేను ఏ దొంగతనానికో వచ్చానని అనుకోవచ్చు కదా?"

"మొన్న రాత్రి నించి లేదు. ఉంటే నాకు పైన జాగింగ్ చేసే అడుగుల చప్పుడు వినిపిస్తూంటుంది. మొన్న, నిన్న, ఇవాళ అది వినపడలేదు."

"మొన్న, నిన్న, ఇవాళ జాగింగ్ చేయలేదేమో?"

"అపార్ట్‌మెంట్‌లో ఆమె ఖచ్చితంగా లేదు."

"కాని ఆమె కారు కింద పార్కింగ్ లాట్‌లో ఉందిగా?"

"ఐతే ఏదైనా రోగం వచ్చి కదల్లేని స్థితిలో ఉందేమో? మనం వెళ్ళి సహాయం చేయచ్చు."

"ముప్ఫై ఏళ్ళ యువతికి అలాంటి రోగం ఏం వస్తుంది?"

"అకస్మాత్తుగా పక్షవాతం వచ్చిన వాళ్ళు కదల్లేరు. బయటి వారి సహాయం కోరడానికి బహుశా వేళ్ళతో ఫోన్‌ని కూడా డయల్ చేయలేదేమో? ఎవరికి తెలుసు? ఒకవేళ ఆమె అపార్ట్‌మెంట్‌లో ఉండీ సడీ చప్పుడు చేయకపోవడానికి మీరే ఇంకేదైనా కారణం చెప్పండి." అడిగింది మిసెస్ క్లారా.

మిసెస్ హెస్టర్ కొద్ది సేపు ఆలోచించి తల ఊపి చెప్పింది.

"సరే. వెళదాం పదండి... అన్నట్లు మీ దగ్గర బ్రౌన్ రంగు దారం ఉందా? మా వాడి బ్లేజర్‌కి వాళ్ళు స్పేర్‌గా ఇచ్చిన బటన్ కుట్టాలంటే ఆ రంగు దారం కావాలి. అది నా దగ్గర లేకే మీ దగ్గరకి వచ్చాను." అడిగింది మిసెస్ హెస్టర్.

"ఉండాలి. చూస్తాను."

"ఈలోగా నేను వెళ్ళి ఆమె అపార్ట్‌మెంట్ తాళంచెవిని తీసుకు వస్తాను."

"మళ్ళీ మీరు ఇక్కడికి రావడం దేనికి? నేను ఆమె అపార్ట్‌మెంట్ బయట వెయిట్ చేస్తూంటాను. సరాసరి అక్కడికే రండి. ముందా పాడు మోత ఆగితే కాని హాయిగా నిద్రపోలేను." మిసెస్ క్లారా కోరింది.

మిసెస్ హెస్టర్ ఆ ఇంట్లోంచి బయటకి వెళ్ళాక మిసెస్ క్లారా తన కుట్టు పని వస్తువులు ఉంచే పెట్టెలో చూసి, బ్రౌన్ రంగు దారపు ఉండని తీసి దాన్ని ఓ ప్లాస్టిక్ జిప్ లాక్ బేగ్‌లో వేసింది. తర్వాత తన హేండ్ బేగ్ అందుకుని తెరచి అందులో తన ఇంటి తాళం చెవి ఉందని రూఢి చేసుకున్నాక బయటకి వచ్చి తన అపార్ట్‌మెంట్ తలుపు మూసింది.

అప్పుడే లిఫ్ట్ తలుపు తెరచుకుని పొరుగింటాయన బయటకి వచ్చాడు. మిసెస్ క్లారాని చూసి పలకరింపుగా నవ్వి లిఫ్ట్ తలుపులు మూసుకోకుండా డోర్స్ ఓపెన్ బటన్‌ని నొక్కి పట్టుకున్నాడు.

"నో. థాంక్స్. పై అంతస్థులోకే. మిసెస్ మేక్ లారెన్ అపార్ట్‌మెంట్‌కి."

"ఆ నీటి గొడవ ఇంకా తీరలేదా? పోట్లాడటానికి వెళ్తున్నారా?" నవ్వుతూ అడిగాడు అతను.

"మిసెస్ హెస్టర్ దగ్గర ఆమె ఇంటి డూప్లికేట్ తాళంచెవి ఉందట. తీసుకు రావడానికి వెళ్ళింది. మేమే ఆ పంప్ మూతి బిగించి వద్దామని..."

క్లారా మెట్లెక్కి పైకి వెళ్ళింది. ఓ నిముషం తర్వాత మిసెస్ హెస్టర్ వచ్చింది. తలుపు తెరుస్తూ మిసెస్ క్లారాకి చెప్పింది.

"ఒకవేళ ఆమె ఇంట్లో ఉంటే నేను ప్లాంట్స్‌కి నీళ్ళు పోయడానికి వచ్చానని, తను ఊళ్ళో లేదని మీరు చెప్పారని చెప్తాను. లేకపోతే..."

"...అర్థమైంది. మీకు ఎంబరాసింగ్‌గా ఉంటుంది."

"మిసెస్ మేక్ లారెన్. ఉన్నారా?" మిసెస్ హెస్టర్ తలుపు తెరచి లోపలకి వెళ్ళగానే గట్టిగా పిలిచింది.

జవాబు లేదు.

"నేను చెప్పలా ఆమె ఇంట్లో లేదని." చెప్పింది మిసెస్ క్లారా.

ఇద్దరూ ఆమె పడకగదిలోకి వెళ్ళారు. వాళ్ళకి చెడ్డ వాసన గుప్పున కొట్టింది. ఎదురుగా మంచం మీద మిసెస్ మేక్ లారెన్ అడ్డదిడ్డంగా పడి ఉంది. ఓ కాలు మంచం మీద, ఇంకో కాలు నేల మీద ఉన్నాయి. అక్కడ పెనుగులాట జరిగిన గుర్తుగా ఆమె దుస్తులు చిరిగి నేల మీద పడి ఉన్నాయి. మూసి ఉన్న ఆమె కుడి చేతి గుప్పెట లోంచి బయటకి బ్రౌన్ రంగు దారం వేలాడుతూ కనిపించింది. మిసెస్ హెస్టర్ తక్షణం వెళ్ళి ఆ గుప్పెటని తెరిస్తే అందులో బ్రాస్ బటన్ ఉండటం ఇద్దరూ గమనించారు. మిసెస్ హెస్టర్ దాన్ని తీసుకోడానికి వంగగానే అరిచింది మిసెస్ క్లారా.

"ఆగండి. పోలీసులు వచ్చేదాకా మీరేం తీయకూడదు."

మిసెస్ హెస్టర్ ఆవిడ వంక నిరసనగా చూసింది.

"సాక్ష్యాలు తారుమారు చేయడం నేరం." క్లారా చెప్పింది.

మిసెస్ హెస్టర్, మరణించిన మిసెస్ మేక్ లారెన్ చేతిలోని బ్రాస్ బటన్ వంక ఓ సారి, మిసెస్ క్లారా వంక ఓ సారి చూసింది. తర్వాత చటుక్కున కింద పడి ఉన్న రక్తం అంటుకుని ఉన్న బ్రాస్ ఫ్లవర్ వేజ్‌ని తీసుకుని దాంతో మిసెస్ క్లారా తల మీద గట్టిగా ఓ దెబ్బ వేసింది. ఆవిడ తూలి గోడని పట్టుకుని ఆగాక మరో దెబ్బ వేసింది. మూలగనైనా మూలగకుండా మిసెస్ క్లారా నేల కూలింది. ఫ్లవర్ వేజ్‌కి అంటిన అన్ని వేలిముద్రలనీ శుభ్రంగా తుడిచేసి మిసెస్ హెస్టర్ ఆ బటన్‌ని తీసుకుని బయటకి వచ్చి తలుపు మూసింది 'ఇంకా నయం. తను మిసెస్ మేక్ లారెన్ ఇంట్లోకి వచ్చినట్లు ఎవరికీ తెలీదు' అనుకుంటూ తన ఇంటికి వెళ్ళిపోయింది.



# 30. ప్రిన్సిపాల్

## హెన్రీ స్లెసర్

మీకర్ ఇక ఆ ఊళ్ళో ఉండదల్చుకోలేదు. వారెన్ విల్ రెండు లక్షల జనాభా గల ఊరే అయినా ఆ రెండు లక్షల మందిలో ఎవరైనా తనని చూస్తే పోలీసులు వెతికే దొంగగా తనని ఇట్టే గుర్తు పట్టగలరన్న భయం మీకర్‌కి పట్టుకుంది.

మీకర్ ఆ ఊరికి రావడానికి కారణం, అతను తన పదో ఏట నించి పన్నెండో ఏడు దాకా అత్తయ్య దగ్గర ఆ ఊళ్ళోనే పెరిగాడు. ఇప్పుడు ఆవిడ కానీ, ఆవిడ ఆస్థిపాస్తులు కానీ ఆ ఊళ్ళో లేవు. ఎన్నడూ మంచు పడని ఫ్లోరిడా రాష్ట్రానికి అతని అత్తయ్య మారిపోయింది.

రైల్లో వెళుతూ చూస్తే ఆ ఊరి పేరు కనబడడంతో మీకర్‌కి గతం గుర్తొచ్చింది. తన అత్తయ్య పక్కింటి ప్లాన్ అతనికి ఇంకా గుర్తే. రోల్స్ రాయిస్ కార్లకి డీలర్ అయిన ఆ ఇంటాయన ఇంట్లోని ఏ ఒక్క వస్తువు కొట్టేసి అమ్మినా చోర్ మార్కెట్లో కనీసం వెయ్యి డాలర్లు వస్తాయన్న ఆశతో టిక్కెట్ ఇంకా పైకి ఉన్నా రైలు దిగేసాడు.

హోటల్లో దిగి ఆ రాత్రి ఓసారి ఆ ఇంటిని దూరం నించి చూస్తే జాతి కుక్కలు కాపలా కాస్తూ కనిపించాయి. బర్గ్‌లర్ అలారం కూడా ఇంటి బయట కనిపించే సరికి నిరుత్సాహపడ్డాడు. ఆ రెండింటిలో ఏదన్నా మీకర్‌కి ఎలర్జీ. ఇక రెండూ ఉంటే ఏం చెప్పాలి?

అందుకని ఆ రాత్రి పదిన్నరకి తను అద్దెకి తీసుకున్న కారులో ఓ లిక్కర్ దుకాణంలోకి జొరబడి, పిస్తోలు చూపించి పధ్నాలుగు వందల డాలర్లతో బాటు ఓ కార్టన్ బ్లాక్ హార్స్ స్కాచ్ విస్కీని కూడా దొంగిలించాడు. ఆ దుకాణంలో ఉన్న సర్వైలెన్స్ రిమోట్ కెమెరా లోని టేపు నాశనం అయ్యేలా ఆరు గుళ్ళు ఉపయోగించి దాన్ని కాల్చేసాడు.

అయితే మీకర్ ఎలా ఉంటాడో దుకాణం యజమాని పోలీసులకి వర్ణించి చెప్పాడు. అది ఎంత వివరంగా ఉందంటే దాన్ని టివి న్యూస్ రీడర్ చెప్పగా విన్నా, లోకల్ దినపత్రికలో చదివినా మీకర్‌ని చూస్తే ఇతనే అతను అని తెలుసుకునేంత వివరంగా ఉంది.

మర్నాడు ఉదయం లోకల్ టి.వి. స్టేషన్‌లో ఆ నేరం గురించి చెప్పి అతనెలా ఉంటాడో వివరించారు. దిన పత్రికల్లో కూడా అదే వార్త మొదటి పేజీలో వచ్చింది. వారెన్‌విల్‌లో దొంగతనాలు అరుదు కాబట్టి ఆ నేరానికి అంత ప్రాముఖ్యత వచ్చింది. గత రాత్రే లిక్కర్ కార్టన్ న్యూయార్క్‌కి బుక్ చేసి మంచి పని చేసానని మీకర్ అనుకున్నాడు.

ఉదయం ఫోన్ చేసి బ్రేక్‌ఫాస్ట్‌ని గదికే తెప్పించుకున్నాడు. దాన్ని రూం బాయ్ తెచ్చినప్పుడు బాత్ రూంలో దాక్కుని 'అక్కడ ఉంచి వెళ్ళు' అని అరిచి చెప్పాడు.

బ్రేక్‌ఫాస్ట్ చేసాక కిటికీ దగ్గర నిలబడి బయటకి చూసాడు. ఎదురుగా ఓ బేంక్, దాని అద్దాల కిటికీలోంచి క్యాష్ కౌంటర్ కనబడుతున్నాయి. బెల్లం అంటే చీమలకి ఉండే

ఆసక్తి లాంటిదే బేంక్ అంటే మీకర్‌కి ఉండే ఆసక్తి. తన సూట్ కేస్‌లోంచి బైనాక్యులర్స్‌ని తీసి చూసాడు. కేషియర్ నించి చాలామంది నగదు తీసుకు వెళ్తున్నారు.

ఆ రోజు శనివారం అని, తమ ఉద్యోగస్థులకి వీక్లీ పేమెంట్ చెల్లించడానికి వ్యాపారస్థులు డబ్బు డ్రా చేస్తున్నారని స్ఫురించగానే మీకర్‌లో ఎక్సైట్‌మెంట్ ప్రవేశించింది.

తనీ ఊరు వదిలి పారిపోక తప్పదు. అది ఇంకాస్త కేష్‌తో ఎందుకు చేయకూడదు? గబగబా డ్రస్ చేసుకున్నాడు. బైనాక్యులర్స్‌లోంచి ఇంకోసారి చూసాడు. అతను ఎదురు చూసే వ్యక్తి పావు గంటకి బేంక్ కేషియర్ దగ్గరకు వెళ్ళాడు.

ఆయన వయస్సు అరవై లోపు ఉంటుంది. తెల్లని జుట్టు, లావు. ఆయన ఇచ్చిన చెక్ తీసుకుని కేషియర్ ఏదో అడిగాడు ఆయన్ని. ఆయన చిన్నగా నవ్వి, తల ఊపి ఓ బ్రౌన్ రంగు కవర్‌ని ఇచ్చాడు. కేషియర్ ఆయనకి బండిల్స్ చూపించి అందులో పెట్టసాగాడు. అన్నీ వంద డాలర్ల బండిల్సే.

మీకర్ క్షణం ఆలస్యం చేయలేదు. బైనాక్యులర్‌ని మంచం మీదకు విసిరేసి, ఫెల్ట్ హేట్ పెట్టుకుని, మొహం సరిగ్గా కనబడకుండా దాన్ని కిందకి తోసుకున్నాడు. తల వంచుకుని నడిస్తే అతని మొహం ఎవరికీ స్పష్టంగా కనబడదు. పాత ట్రిక్కే అయినా నవీన కాలంలో కూడా పని చేసే ట్రిక్ అది. జేబు లోని పిస్తోలుని తడుముకుని, గదిలోంచి బయటకు నడిచి తలుపు మూసి తాళం వేసాడు.

తాళం చెవిని రిసెప్షనిస్టు ముందు పడేసాడు. బహుశా ఇక తను హోటల్‌కి తిరిగి రాడు అనుకున్నాడు.

మీకర్ బేంక్ ద్వారం దగ్గరకి చేరుకునే సరికే ఆయన బ్రౌన్ కవర్‌ని జాగ్రత్తగా పట్టుకుని నడుస్తున్నాడు. కారులో రాలేదాయన! ఇంత డబ్బుతో నడవడానికి ఎంత ధైర్యం?

వారన్‌విల్‌లో నేరాలు జరగవన్న సంగతి మీకర్‌కి గుర్తుకు వచ్చింది. ఏభై అడుగుల దూరంలో బేంక్ పక్కనే ఉన్న ఓ గేటు లోంచి ఆయన లోపలకి నడిచాడు.

పొడుగాటి కారిడార్‌లోంచి ముందుకి వెళుతున్న ఆయనలో తనని ఎవరో అనుసరిస్తున్నారన్న గ్రహింపు లేదు. కారిడార్ చివర ఉన్న ఓ గదిలోకి వెళ్ళి తలుపు మూసుకున్నాడు. ఆ తలుపు అద్దంతో చేసింది. దాని మీద 'జె.ఎల్. స్టైల్స్, ప్రిన్సిపాల్' అని రాసి ఉంది.

కారిడార్ పక్కన ఉన్న గదుల్లోని విద్యార్థులను చూసి మీకర్ అది స్కూల్‌గా గుర్తించాడు. తను ఆ ఊరులో ఉన్నప్పుడు ఆ స్కూల్ కట్టలేదు. అది ఖాళీ ప్రదేశం.

తలుపు తెరుచుకుని లోపలకి వస్తున్న మీకర్‌ని చూసి పలకరింపుగా నవ్వాడు ప్రిన్సిపాల్. మీకర్ ఎందుకు వచ్చాడో గ్రహించక పోవడంతో ఆయనలో ఎలాంటి తత్తరపాటు లేదు.



ఆ గదిలో ఆయన తప్ప ఇంకెవరూ లేకపోవడంతో మీకర్ తృప్తిపడ్డాడు.

"కూర్చోండి. మీకేం సహాయం చేయగలను?" గౌరవం ఉట్టిపడేలా మీకర్‌ని అడిగాడు స్టైల్స్.

"చాలా." నవ్వాడు మీకర్.

"అంటే?"

తన జేబులోంచి పిస్తోల్ తీసాడు మీకర్. దాని మీద కర్చీఫ్ పరిచి ఆయనకి మాత్రమే కనబడేలా పట్టుకున్నాడు. అద్దాల తలుపు బయట ఎవరయినా నిలబడి తనను చూసినా ఆ పిస్తోల్ వాళ్ళ కళ్ళబడకుండా జాగ్రత్త పడ్డాడు.

"అదివ్వు." కోరాడు.

"ఏదీ?" అడిగాడు స్టైల్స్.

"బ్రౌన్ కవర్."

"కానీ అది ఈ నెల టీచర్లకి జీతాలు ఇవ్వడానికి." అభ్యంతరంగా చెప్పాడు స్టైల్స్.

"ఈ పిస్తోలు నిన్న రాత్రి ఆరుసార్లు పేలింది. నా మాట వినకపోతే ఇంకోసారి పేలుతుంది."

ఎవరో బయట నిలబడి లోపలకి రావడానికి అనుమతి కోసం రెండు సార్లు తలుపు కొట్టారు.

"వాళ్ళని బయటే వేచి ఉండమని సైగ చేయి." ఆజ్ఞాపించాడు మీకర్ వెంటనే.

స్టైల్స్ అలా చేసాక చెప్పాడు.

"నవ్వు. నవ్వుతూండు. బయట వాళ్ళకి ఎలాంటి అనుమానం కలగకూడదు."

స్టైల్స్ అతని కోరిక ప్రకారం నవ్వుతూనే అడిగాడు.

"నువ్వు పోలీసులు వెతికే లిక్కర్ స్టోర్ దొంగవా? జీతాల సొమ్ము దొంగిలించడానికి బేంక్ నించి నన్ను అనుసరించి వచ్చావా?"

"అవును. ఆ డబ్బు ఇటు ఇవ్వు."

"ఆ డబ్బు తీసుకుని నన్ను కాలుస్తావా?"

"అంత పిచ్చివాడిని కాదు. మనిద్దరం కలిసి నీ కారు దగ్గరకి వెళ్ళాలి. నన్ను ఈ ఊరి నుంచి న్యూయార్క్ దాకా నువ్వు నీ కారులో దింపాలి."

"నిన్ను నేను నా కారులో న్యూయార్క్‌లో దింపాలా? అసాధ్యం. ఈలోగా పోలీసులు నిన్ను పట్టుకుంటారేమో?" చెప్పాడు ప్రిన్సిపాల్.

"నేను కోరిన సాయం చేయకపోతే మాత్రం నీ విద్యార్థుల్లో ఒకరిని నీ ముందే కాలుస్తాను." బెదిరించాడు.

"వద్దు. నా విద్యార్థులని చంపద్దు. ఇంద. డబ్బు తీసుకో!"

ఆయన ఇచ్చిన బ్రౌన్ రంగు కవర్‌ని అందుకుని లేస్తూ మీకర్ చెప్పాడు.

"నువ్వు లే. ముందు నడు. నన్ను ఇరకాటంలో పెట్టే ప్రయత్నం చేస్తే నా పేంట్ జేబులోంచి కూడా పిస్తోలు పేల్చగలను జాగ్రత్త."

"నీ హెచ్చరిక గుర్తుంచుకుంటాను. కానీ ఈ నాలుగు కాగితాలూ చదివి సంతకం చేయాలి. అర్జంట్."

మీకర్ అసహనంగా లేచి చూస్తూంటే అతనక్కడ లేనట్లుగానే ఆ కాగితాలను చదివి సంతకాలు చేసాక లేచి నిలబడ్డాడు స్టైల్స్. బయటి వాళ్ళు కూడా వేచి చూస్తున్నారు.

"పద." చెప్పాడు స్టైల్స్.

ముందు ఆయన, వెనక మీకర్ బయటకి నడిచారు. స్టైల్స్ గది తలుపు తెరచుకుని బయటకు వెళ్ళాక, అటూ ఇటూ రహస్యంగా పొంచి ఉన్న నలుగురు పోలీసులు ఆయన వెనకే బయటకు వచ్చిన మీకర్ మీదకి తమ చేతుల్లోని పిస్తోళ్ళని గురి పెట్టారు.

"తిరగబడక." హెచ్చరించారు.

తెల్లబోయిన మీకర్ జేబులోని పిస్తోలుని, చేతి లోని డబ్బు సంచీని పోలీసులు తమ స్వాధీనం చేసుకున్నారు.

"మీకెలా తెలుసు ఇక్కడ దొంగతనం జరుగుతోందని?" ఆశ్చర్యంగా అడిగాడు మీకర్.

"విద్యార్థులు ఫోన్ చేసి చెప్పారు."

"వాళ్ళల్లో ఎవ్వరికీ మూసిన తలుపుల్లోంచి మా మాటలు వినబడవు కదా?" ఆశ్చర్యంలోంచి తేరుకుంటూ అడిగాడు మీకర్.

"వినబడవన్న మాట నిజమే. నువ్వు దొంగతనానికి ఎన్నుకున్న ప్రిన్సిపాల్ విషయంలో పొరబడ్డావు." చెప్పాడు ఓ పోలీసు నవ్వి.

ప్రశ్నార్థకంగా చూసాడు మీకర్. కానీ అతనికి ఎవరూ వివరణ ఇవ్వలేదు. బేడీలు వేసి మీకర్‌ని పోలీసు కారులో వెనక సీటులో కూర్చోబెట్టి తీసుకెళుతూండగా స్కూల్లోకి వచ్చేటప్పుడు చూడని ఆ స్కూల్ బోర్డు మీకర్ కంటబడింది.

"స్కూల్ ఆఫ్ స్పీచ్ థెరఫీ ఫర్ హియరింగ్ డిజేబుల్డ్."

మాట్లాడుతూంటే పెదాల కదలికను బట్టి ఏం మాట్లాడుతున్నాడో అర్థం చేసుకోగలగడం అనే లిప్ రీడింగ్ విద్యని బధిరులకు బోధించడం ఆ స్కూల్ ప్రత్యేకత. గదిలో నించే స్టైల్స్ నవ్వుతూ తనతో మాట్లాడిన మాటలని అద్దాల గది బయట నిలబడ్డ విద్యార్థులు చూసి అర్థం చేసుకున్నారని, వెంటనే పోలీసులకి ఫోన్ చేసారని మీకర్‌కి అర్థం అయింది.

"నువ్వు చెప్పింది నిజమే. నేను సరైన స్కూల్లోకి రాకపోవడం నా దురదృష్టం." చెప్పాడు మీకర్ విచారంగా.



# 31. ఫాదర్స్ డే

## మైఖేల్ కొనెల్లి

ఆ చిన్న పిల్లవాడి శరీరం ఎమర్జెన్సీ రూమ్‌కి చేరుకున్నాక డాక్టర్లు చేసిన ఏ ప్రయత్నం ఫలించలేదు. పదిహేను నెలల విలియం మరణించాడు. ఆ పిల్లవాడి మృతదేహాన్ని పరిశీలించిన, ఆరు నెలల క్రితమే తండ్రి అయిన పోలీస్ ఆఫీసర్ హేరీ బాష్ మనసు ద్రవించింది.

"ఇక్కడికి వచ్చేసరికే ఆ పిల్లవాడు దాదాపు మరణించాడు. ఇంకేమీ చేయలేకపోయాం." పోస్ట్‌మార్టం నిర్వహించిన డాక్టర్ టికోటిన్ చెప్పాడు.

"వాడు మరణించిన చోట బాడీ టెంపరేచర్‌ని తీసుకున్నారా?" బాష్ ప్రశ్నించాడు.

"తీసుకున్నాం. 106.8. కాబట్టి పేరా మెడిక్స్ అక్కడికి చేరుకునే సరికే వాడి శరీర ఉష్ణోగ్రత 108 లేదా 109 ఉండి ఉండచ్చు. అంత చిన్న పిల్లవాడు శరీర ఉష్ణోగ్రత అంత పెరిగాక ఇక బ్రతకడం కష్టం."

"పేరా మెడిక్స్ అక్కడికి ఎప్పుడు చేరుకున్నారు?"

"మధ్యాహ్నం పన్నెండూ పదిహేడుకి. పన్నెండూ ఇరవైకి బాడీ టెంపరేచర్ తీసుకున్నారు."

* * *

పోలీస్ స్టేషన్‌లో వేచి ఉన్న తన సహచరుడు ఫెర్రాస్‌ని బాష్ ప్రశ్నించాడు.

"నువ్వు అక్కడికి చేరుకునేసరికి ఆ పిల్లవాడి తండ్రి ఎక్కడ ఉన్నాడు?"

"కారు పక్కనే నేల మీద కూర్చుని ఏడుస్తున్నాడు."

"ఏం జరిగిందో అతను చెప్పాడా?" బాష్ ప్రశ్నించాడు.

"లేదు."

"సరే. నువ్వు ఆ బిడ్డ తల్లి ఆర్లీనీని ఇంకో గదిలో ప్రశ్నించు." బాష్ సూచించాడు.

ఇంటరాగేషన్ రూం నెంబర్ మూడులో ఆ ఇంటరాగేషన్ కొనసాగింది.

ఇంటర్వ్యూ గది నాలుగులో వేచి ఉన్న ఆ పిల్లవాడి తండ్రి స్టీఫెన్‌తో బాష్ చెప్పాడు.

"నేను లాస్ ఏంజెలెస్ పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో పని చేసే డిటెక్టివ్ బాష్‌ని. విలియం మరణం గురించి మిమ్మల్ని ప్రశ్నించాలి."

"అది ఇప్పుడే జరగాలా?" స్టీఫెన్ బాధగా అడిగాడు.

"అవును. ఇది హత్యకి సంబంధించిన పరిశోధన."

"కాని అది ప్రమాదవశాత్తూ జరిగిన మరణం. తప్పంతా నాదే. నా పొరపాటు వల్ల నా కొడుకు పోయాడు."

"అయినా అది హత్య కాదని నాకు రూఢీ అయ్యేదాకా దాన్ని హత్యగా భావించే పరిశోధించాల్సి ఉంటుంది. మిమ్మల్ని నేను అరెస్ట్ చేయలేదు. ఒకవేళ మీరు బయటకి వెళ్ళదల్చుకుంటే మీకా స్వేచ్ఛ ఉంది. కానీ చట్టప్రకారం ఇలాంటి మరణం సంభవించాక, మిమ్మల్ని నేను ప్రశ్నించాల్సి ఉంది."

"ఐతే దీన్ని త్వరగా పూర్తి చేద్దాం. బిడ్డని కోల్పోయిన నా భార్యని నేను ఓదార్చాలి." స్టీఫెన్ కోరాడు.

"పక్క గదిలో ఆమెని కూడా ప్రశ్నిస్తున్నాం. ఇది ఎలా జరిగిందో చెప్పండి."

"నేను షేర్ బ్రోకర్ని. విల్లీతో కలిసి నేను లంచ్‌కి ఓ రెస్టరెంట్‌కి కారులో బయలుదేరాను. ఆర్లినీ ఆ రెస్టరెంట్‌లో మాకోసం వేచి ఉంది. మధ్యలో ఓసారి నేను నా ఆఫీస్ దగ్గర పని ఉండి ఆగాను. విల్లీ కారు వెనక సీట్లో నిద్ర పోతూండటంతో, వాడి నిద్రని భగ్నం చేయడం ఇష్టం లేక నేను వాడిని అలాగే కారులో ఉంచి రెండు నిమిషాల్లో వెనక్కి రావాలని ఆఫీస్‌లోకి వెళ్ళాను. ఆన్‌లైన్‌లో ఆ రోజు నేను అమ్మాల్సిన షేర్స్‌ని చూసాను."

చిన్నగా నిట్టూర్చి తను చెప్పేది మళ్ళీ కొనసాగించాడు స్టీఫెన్.

"పేకాటలా, రేస్‌లా, లేదా ఆల్కహాల్‌లా షేర్ బ్రోకింగ్ ఓ వ్యసనం అని మీకు తెలుసా? కంప్యూటర్ లోని షేర్ల ఆన్ లైన్ ట్రేడింగ్‌ని చూస్తూంటే ఇంకేమీ గుర్తుండదు. బయటి ప్రపంచాన్నే మర్చిపోతాం. రెండు గంటలు రెండు నిమిషాల్లా గడిచిపోతాయి. కార్లో విలియంని వదిలి వచ్చానన్న సంగతే నాకు గుర్తుకు లేదు. ఆ రెండు గంటల సేపు చాలా షేర్లు ట్రేడింగ్ చేసాను."

స్టీఫెన్ కంఠం లోని బాధ నిజమైనదా లేక తెచ్చిపెట్టుకున్నదా అన్న అనుమానం బాష్‌కి కలిగింది.

"తర్వాత?" ప్రశ్నించాడు.

"నేను కిందకి వచ్చి కారు తలుపు తెరిచే దాకా విల్లీ సంగతి నాకు గుర్తుకు లేదు. చూస్తే వాడు స్పృహలో లేడు. రెండు నిమిషాలలో తిరిగి వస్తానని అనుకోవడంతో కారులో ఏసి కూడా ఆన్ చేయలేదు. వెంటనే నైన్ ఒన్ ఒన్‌కి ఫోన్ చేసాను. మీ సహచరుడు ఫెర్రాస్, తర్వాత అంబులెన్స్‌లో పేరామెడిక్స్ వచ్చారు."

"మీ కోసం వేచి ఉన్న మీ ఆవిడ మీకు ఈ రెండు గంటల్లో ఒక్కసారి కూడా ఫోన్ చేయలేదా?" బాష్ ప్రశ్నించాడు.

"ఆరు సార్లు చేసింది. కాని ట్రేడింగ్ అప్పుడు నేను నా సెల్ ఫోన్‌ని సైలెంట్ మోడ్‌లో ఉంచుతాను."

బాష్ ఇంకేం అడగాలా అని ఆలోచించాడు.

"ఆఫీస్‌లో మీకు రెండు నిమిషాల పని ఏమిటి?"



"ఓ క్లయింట్ అమ్మమన్న షేర్లని ఆన్ లైన్‌లో అమ్మాలని వెళ్ళాను. కానీ అతను కోరిన ధర రాకపోవడంతో వాటిని అమ్మలేదు. ఇవాళ మార్కెట్ డల్‌గా ఉండటంతో చాలా షేర్లని తక్కువ ధరలకి కొనడంలో పడిపోయాను. బయట ఎండ నైన్‌టీ ఫైవ్ డిగ్రీల ఫారెన్ హీట్ అన్న సంగతే గుర్తు లేదు."

అతనిలో తప్పు చేసిన భావన లేదా ఎలాంటి పశ్చాత్తాపం బాష్‌కి కనపడలేదు.

"విలియం మీ సొంత బిడ్డా లేక..."

"నా సొంత బిడ్డే. సవతి కొడుకు కాదు."

"మీ అబ్బాయి అంటే మీకు ప్రేమేనా?" బాష్ ప్రశ్నించాడు.

"మీకు పిల్లలున్నారా?" స్టీఫెన్ ఎదురు ప్రశ్న వేసాడు.

"ఉన్నారు."

"సొంత పిల్లలేనా?"

"అవును."

"ఐతే తండ్రిగా నాకు విలియం మీద ఎలాంటి ప్రేమ, ఎంత ప్రేమ ఉంటుందో మీరు అర్థం చేసుకోగలరు. అది కేవలం నా అజాగ్రత్త వల్ల జరిగింది. నా వల్ల ఇంత ఘోరం జరిగాక నా భార్యని నేను ఎలా ఫేస్ చేయగలనో నాకు అర్థం కావడం లేదు."

"మీకు ఇంకా పిల్లలున్నారా?"

"లేరు."

స్టీఫెన్‌లో నిజమైన బాధ కనబడటంలేదు. అది బాష్‌కి విచిత్రంగా అనిపించింది. కానీ ఆ తర్వాత ఇంక ఏం ప్రశ్నించాలో అర్థం కాలేదు.

"ఇదంతా వీడియో తీయబడింది. మళ్ళీ అవసరం ఉంటే పిలుస్తాను. ఈ బాధాకర సమయంలో మిమ్మల్ని ప్రశ్నించినందుకు చింతిస్తున్నాను. కొద్ది నిమిషాల్లో మీరు వెళ్ళచ్చు. నేనో సారి బయటకి వెళ్ళి వస్తాను."

బాష్ లేచి బయటకి నడిచాడు. అప్పటికే ఫెర్రాస్ ఆర్లినీని ప్రశ్నించడం పూర్తయింది. బాష్‌తో ఫెర్రాస్ చెప్పాడు.

"నాకే అనుమానం రాలేదు. అది నిజంగా ప్రమాదవశాత్తూ జరిగిన మరణం అనిపిస్తోంది. వారిద్దరి వివాహం సజావుగానే సాగుతోంది. ఎలాంటి భేదాభిప్రాయాలు వారి మధ్య లేవు. కాకపోతే విలియం పుట్టుకతోనే మూగ, చెవిటి."

"ఓ!" బాష్ కొద్ది క్షణాలు ఆలోచించి తల పంకించి స్టీఫెన్‌ని ప్రశ్నించే గదిలోకి వెళ్ళాడు.

"ఇక నేను వెళ్ళచ్చా?"

స్టీఫెన్ మొహంలో విసుగుతో కూడిన కోపం కనిపించింది.

"మీ ఆవిడ నా సహచరుడితో మీ మొత్తం పథకం గురించి చెప్పింది. మీరిద్దరూ మీ పిల్లవాడిలోని అవకరంతో విసిగిపోయారు. తరచూ మీరిద్దరూ అందుకు కారణం నువ్వంటే నువ్వని పోట్లాడుకునే వారుట. మీరు కావాలని విలియంని చంపారని మీ భార్య అనుమానిస్తోంది."

వెంటనే స్టీఫెన్ మొహం మాడిపోయింది.

"నా భార్య అలా అందా?" నివ్వెరపోయాడు.

"అవును. మెర్సీ కిల్లింగ్ అనే పదాన్ని మీరు మీ భార్య దగ్గర ఎప్పుడైనా వాడారా? పెరిగి పెద్దయినా వాడు తనని పోషించుకోలేడని, వాడు మీకు బర్డెన్‌గా ఉన్నాడని మీరు భావించారా?"

"అది అబద్ధం. ఇది మా ఆవిడ ఆలోచన. ఇలాంటి పిల్లవాడి వల్ల మా ఆవిడకి ఎంతో సిగ్గుగా ఉంటోంది. వాడితో ఎక్కడికీ వెళ్ళలేదు. ఇంటి దగ్గర చూసుకునేందుకు ఎవరూ లేరు. విల్లీ వల్ల తన జీవితం నాశనమైందని, దీని గురించి ఏదైనా చేయమని నన్ను వేధిస్తోంది. ఒక్క ప్రాణాన్ని త్యాగం చేస్తే ఇద్దరి జీవితాలు సజావుగా సాగుతాయని... విలియంని నేనే చంపాను... విలియంని నేనే చంపాను... రెండు గంటల ఎండలో వాడు మరణిస్తాడని ఆర్లీనీ ఇంటర్నెట్‌లో రీసర్చ్ చేసి నాకు చెప్పింది." రెండు చేతుల్లో తలని ఉంచి స్టీఫెన్ ఏడవసాగాడు.

"సరే. విలియంని చంపిన నేరానికి మిమ్మల్ని అరెస్ట్ చేస్తున్నాను. మీకు మౌనంగా ఉండే హక్కు ఉంది. మీరు చెప్పేది మీకు వ్యతిరేకంగా ఉపయోగించచ్చు. లాయర్‌కి ఫోన్ చేసే హక్కు కూడా మీకు ఉంది."

బాష్ తన బెల్ట్‌కి తగిలించి ఉన్న సంకెళ్ళని తీసి స్టీఫెన్‌కి వేసాడు. తర్వాత బాష్ ఆర్లీనీని ఇంటర్వ్యూ చేసిన గదిలోకి మరోసారి తీసుకెళ్ళాడు.

"ఏమిటలా చూస్తున్నారు?" ఆమె చురుగ్గా అడిగింది.

"మీ భర్త అంతా ఒప్పుకున్నాడు. విలియంని చంపడానికి మీరు ఆయన్ని ప్రోత్సహించిన నేరానికి మిమ్మల్ని అరెస్ట్ చేస్తున్నాను."

"అది అబద్ధం." ఆమె అరిచింది.

* * *

కోర్టులో ఆర్లీనీ తన భర్త అన్యాయంగా తనని ఇరికించాడని చెప్పినా ఆమెకి కూడా శిక్ష పడింది. ఆమె హేండ్ బేగ్‌లో దొరికిన, లాస్ ఏంజెలెస్‌లో జరిగిన ఓ వార్త కటింగ్ అందుకు సాక్ష్యంగా ఉపయోగించింది. ఎనిమిది నెలల క్రితం సరిగ్గా ఇలాగే ఓ తల్లి తన సవతి కొడుకుని కారులో ఉంచి షాపింగ్‌కి వెళ్ళి తిరిగి వచ్చి చూసేసరికి వాడు మరణించిన సంఘటనకి చెందిన వార్త అది.



# 32. సహచరుడు

## అల్‌నుస్ బౌమ్

బస్ స్టేషన్ వెయిటింగ్ రూం లోని టెలిఫోన్ బూత్‌లలో ఓ దాంట్లో జెఫ్ క్రేన్‌స్టన్ మోకాళ్ళ మీద కూర్చుని, దానికి ఉన్న మట్టి పట్టిన అద్దంలోంచి బయటకి భయంగా చూస్తున్నాడు. కిరాయి హంతకుడు తనని హతమారుస్తాడనే భయం జెఫ్ క్రేన్‌స్టన్‌లో అంతదాకా లేదు. ఇప్పుడు విల్లీ ది ఫింగర్‌ని చూసాక తొలిసారిగా అది కలిగింది.

విల్లీని తను చూసే లోగా అతను తనని చూసి ఉండకపోతే తను బతికిపోయినట్లే. వెయిటింగ్ రూంలో కూర్చుని బస్ కోసం వేచి ఉన్న వాళ్ళని చూస్తున్న విల్లీ తన కంట పడగానే క్రేన్‌స్టన్ తక్షణం లేచి టెలిఫోన్ బూత్ లోకి వచ్చి దాక్కున్నాడు. అదృష్టం! లేదా విల్లీ అక్కడికక్కడే తనని కాల్చేసి ఉండినా ఆశ్చర్యం లేదు. విల్లీ ఆ పని మీదే వస్తే మాత్రం తనని ఒకటి, రెండు రోజుల్లో చంపుతాడు. అసలు తను ఈ ఊళ్ళో ఉన్నట్లు ఎలా గ్రహించాడు? విల్లీ అక్కడ ఉన్న ఆరు బెంచీల్లో కూర్చున్న వారిని పరిశీలించి చూడటం క్రేన్‌స్టన్ గమనించాడు.

తన ఎక్స్ బాస్ నిక్ ఫోలే ఎవర్ని చంపాలన్నా విల్లీని నియమిస్తాడని క్రేన్‌స్టన్‌కి తెలుసు. తనకి అప్ప చెప్పిన పనిని విల్లీ చేసి తీరతాడని కూడా జెఫ్‌కి తెలుసు. అలా ఎంతో మందిని చంపాడు. తను తప్పేమీ చేయకుండానే ఇలా వేటాడబడటం జెఫ్‌కి బాధగా ఉంది.

నిక్ ఫోలే చేసే అన్ని రకాల చట్ట వ్యతిరేక కార్యక్రమాలకి జెఫ్ కొంత మొత్తానికి తన సహాయాన్ని అందిస్తాడు. నెల క్రితం జెఫ్‌ని పిలిచి దాదాపు పాతిక కిలోల బరువు గల ఓ పెద్ద సూట్ కేస్‌ని ఇచ్చి దాన్ని మిడ్ వెస్ట్‌లో ఓ ఊళ్ళోని ఒకరికి డెలివరీ చేయమని నిక్ కోరాడు. అందుకు ఐదు వందల డాలర్లు ఇచ్చాడు. అందులో ఏం ఉందని జెఫ్ అడగలేదు. ఊహించాడు. డ్రగ్స్ కాదు. అవి అంత బరువు ఉండవు. ఆయుధాలు కాని, బంగారం లాంటి ఖరీదైన లోహం కాని అయి ఉంటుందని అనుకున్నాడు. చిన్న పిల్లల శవం ఉండచ్చని కూడా జెఫ్ ఊహించాడు. తన కార్లో రెండు పగళ్ళు ప్రయాణించి దాన్ని షార్లెట్ లోని నిక్ చెప్పిన వ్యక్తికి డెలివరీ చేసి, అతనికి అందినట్లుగా నిక్‌కి ఫోన్ చేయించాడు.

ఆ తర్వాత నిక్ అమెరికా లోని దాదాపు పాతిక ఊళ్ళకి జెఫ్ క్రేన్‌స్టన్‌ని పంపి అలాంటి పెట్టెలని డెలివరీ చేయించాడు. నెల తర్వాత ఓ రోజు దిన పత్రికలన్నింటిలో ప్రముఖంగా వచ్చిన ఓ వార్తని జెఫ్ చూసాడు. ఇరవై డాలర్ల నోట్లని ముద్రించిన ఓ దొంగల ముఠా కోసం పోలీసులు వెతుకుతున్నారన్న హెడ్డింగ్‌ని చూసి దాన్ని ఆసక్తిగా చదివాడు. గత నాలుగు వారాలుగా అమెరికా లోని అనేక బేంకులకి కొత్త ఇరవై డాలర్ల నోట్లు వచ్చాయని, అవన్నీ ఒకే సీరియల్ నంబర్ని కలిగి ఉండటం సిబ్బంది గుర్తించి పోలీసులకి ఫిర్యాదు చేసారని, ట్రెషరి డిపార్ట్‌మెంట్ ఆ నోట్లన్నిటినీ పరిశీలించి, అవి సర్క్యులేషన్‌లో ఉన్న ఓ

నోటు సీరియల్ నంబర్ అని గుర్తించారని, దాని ప్రింటింగ్‌లో వాడిన కాగితం, అచ్చు పని అత్యంత క్వాలిటీతో ఉన్నదని, ఆ నంబర్ గల నోట్లని తీసుకో వద్దని ట్రెషరి శాఖ మీడియా ద్వారా ప్రచారం ఆరంభించిందని ఆ వార్తలో ఉంది. ఆ నోట్లన్నీ మిడ్ వెస్ట్ నించి సరఫరా చేయబడ్డాయని పట్టుబడ్డ ఇద్దరు నిందితులు చెప్పారని, వాటిని డెలివరీ చేసిన వ్యక్తిని కనుక్కునే ప్రయత్నం చేస్తున్నామని, విచారణ కొనసాగుతోందని ఆ వార్తలో ఉంది.

ఆ వార్త చదివాక జెఫ్ క్రేన్‌స్టన్ క్షణం ఆలస్యం చేయలేదు. అవసరం వస్తే నిక్ నిర్దయగా తన తల్లినైనా చంపే కరకు వ్యక్తి అని, తను పోలీసులకి పట్టుబడక మునుపే నిక్ ఫోలే తనని మట్టుపెడతాడని జెఫ్‌కి తెలుసు. చెక్ బుక్, కొద్ది దుస్తులు, ఇతర అవసరాలు సర్ది ఎప్పుడూ సిద్ధంగా ఉంచే ఓ చిన్న సూట్ కేస్‌ని తీసుకుని వెంటనే కార్లో ఆ ఊరి నించి బయలుదేరాడు. అప్పట్నించి జెఫ్ ఎక్కడా ఆగకుండా ప్రయాణిస్తూనే ఉన్నాడు.

పారిపోయాక జెఫ్ రెండు వందల మైళ్ళ దూరం లోని ఓ ఊళ్ళో తన బేంకు లోని డబ్బంతా డ్రా చేసాడు. ఆ రాత్రి మరో రెండు వందల మైళ్ళ దూరం లోని ఇంకో ఊళ్ళో తన స్పోర్ట్స్ కారుని అమ్మేసాడు. అది తన వెంట ఉంటే తనని పట్టిస్తుందని తెలుసు.

నెవేడా లోని ఓ చిన్న ఊరికి జెఫ్ రెండు రోజుల క్రితం చేరుకున్నాడు. నిజానికి అతను తర్వాతి ఊరుకి ఎక్కడికి వెళ్తాడో అతనికే తెలీదు. తను ఇంకో కారు కొని దాంట్లో వెళ్తాడని విల్లీ భావిస్తాడని, తను దొరక్కుండా ఉండటానికి జెఫ్ బస్‌లలో ప్రయాణిస్తున్నాడు. గత పదేళ్ళుగా నిక్‌కి కిరాయి హంతకుడిగా పని చేసే విల్లీ ది ఫింగర్‌కి చంపమని చెప్పిన ఏ ఒక్కర్నీ విడకుండా చంపిన రికార్డ్ ఉంది అని కూడా జెఫ్‌కి తెలుసు. విల్లీ పారిపోయే అనేక మంది మనుషుల్ని వేటాడి పట్టుకుని చంపాడు. ఎవర్నీ వదలడు.

అన్ని సందర్భాల్లో అతను పాయింట్ 45 కేలిబర్ హేండ్ గన్‌నే వాడాడు. కొన్ని సందర్భాల్లో అతను చంపే పనిని పేరు గోప్యంగా ఉన్న ఓ సహచరుడికి ఇచ్చాడనే వదంతి కూడా ఉంది. అతనెవరో నిక్‌కి కూడా తెలీదు. నిక్ హత్య చేయమని విల్లీని కోరితే ఒకోసారి అంగీకరించేవాడు. ఒకోసారి తిరస్కరించే వాడు. అంగీకరిస్తే ఎంతటి గాఢ మిత్రుడ్ని అయినా తుద ముట్టిస్తాడని హతుల జాబితాని చూసిన వారికి అర్థం అవుతుంది.

తను ఈ ఊరికి వచ్చినట్లు అసలు విల్లీ ఎలా కనుక్కో గలిగాడు? తను ప్రయాణించిన పద్ధతిని అతను ఎలా ఊహించి ఉంటాడు?

అతను తన కోసం కాక మరొకరి కోసం వెదుకుతున్నాడనే ఆశ జెఫ్‌లో ఓ మూల మిణుకు మిణుకుమంటోంది.

విల్లీ అకస్మాత్తుగా టెలిఫోన్ బూత్‌ల వైపు చూసి, జెఫ్ దాక్కున బూత్ వైపే రాసాగాడు. వెంటనే జెఫ్ తన హోల్‌స్టర్ లోంచి గొట్టం కోసేసిన పిస్తోలుని తీసి సిద్ధంగా పట్టుకున్నాడు. ఆ ఫోన్ బూత్‌లో ఎవరైనా ఉన్నారని తెలిస్తే విల్లీ వచ్చి చూడచ్చని జెఫ్ అప్పటికే దాని



తలుపుని కొద్దిగా తెరచి ఉంచాడు. విల్లీ ఒక వేళ తన బూత్ తలుపు తెరిస్తే అతని తలకి గురి పెట్టి కాల్చాలని జెఫ్ నిర్ణయించుకున్నాడు. కాని విల్లీ జెఫ్ పక్క బూత్ తలుపు తెరుచుకుని దాని లోపలకి వెళ్ళాడు. నాణెం వేసిన శబ్దం, డయల్ చేస్తున్న శబ్దం వినిపించాయి.

“నేను. విల్లీని. బస్ స్టాండ్‌లో ఉన్నాను. మొత్తం వెదికాను. కాని వాడు ఎక్కడా కనపడలేదు... నిజమే. నా లెక్క ప్రకారం వాడి దగ్గర డబ్బుతో ఈ రోజుకి ఇక్కడికి చేరుకోవాలి. లేదా వాడికి ఎలాగో డబ్బు దొరికి విమానంలో ఏ సేన్ ఫ్రాన్సిస్కోకో వెళ్ళాడేమో? ఇక్కడ నా అసోసియేట్‌కి కూడా ప్రస్తుతం ఇదే పని. వాడ్ని వర్ణించాను. ఒంటరి. ఫ్రెంచ్ కట్ మీసం. ఒత్తు క్రాఫ్. ఐదడుగుల ఆరంగుళాలు. ఎనభై కిలోల బరువు. కళ్ళజోడు...”

జెఫ్ క్రేన్‌స్టోన్ తన తలని తడుముకున్నాడు. బోడి గుండు. మీసం లేదు. కాని మిగిలిన విషయాల్లో తనలో మార్పులేదు.

“నేను వెనక్కి తిరిగి వస్తున్నాను. వాడు ఇక్కడే కనుక ఉంటే నా సహచరుడు వాడి సంగతి చూస్తాడని గేరంటీ. బై.”

విల్లీ వెళ్ళిపోవడం చూసాడు. విల్లి సహచరుడు ఎవరై ఉండచ్చు? అక్కడ కూర్చున్న వాళ్ళందర్నీ చూసాడు. అతను ఎవరైనా సరే, తనెవరో బయట పడకుండా వాళ్ళల్లో ఒకడిగా కలిసిపోయాడు.

అకస్మాత్తుగా ఓ పోలీస్ లోపలకి వచ్చి అందరి టిక్కెట్లని చెక్ చేయసాగాడు. టిక్కెట్స్ లేకుండా ఆ ఏ సి గది సుఖాన్ని అనుభవించడానికి వచ్చిన కొందరు పోలీస్‌ని చూసి బయటకి వెళ్ళిపోయారు. ఫోన్ బూత్ ఎదురుగా ఉన్న బెంచీలో కూర్చున్న ఒకామె పోలీస్‌ని చూసి కంగారు పడటం జెఫ్ గమనించాడు. ఆమె పక్కన చిన్న సూట్ కేస్, ఓ పెద్ద హేండ్ బేగ్. ఆమె ప్రవర్తనని బట్టి ఆమె దగ్గర టిక్కెట్ లేదని జెఫ్ గమనించాడు. పోలీస్ వంక భయంగా చూసి, అటు ఇటు దిక్కుతోచనట్లు చూడసాగింది. ఆ పోలీస్ ఆమె దగ్గరకి వచ్చేసరికి జెఫ్ బూత్ లోంచి బయటకి వచ్చి, తన చేతిని ఆమె భుజం మీద వేసి చెప్పాడు.

“సారీ హాని! ఆలస్యం అయింది పద. వెళదాం.”

ఆమె అతని వంక, పోలీస్ వంక, మళ్ళీ అతని వంకా చూసి లేచింది. ఆమె సూట్ కేస్‌ని అందుకుని జెఫ్ బయటకి నడిచాడు. ఇప్పుడు తన వర్ణనలో అతనికి క్రాఫ్, మీసాలతో పాటు ‘ఒంటరి’ కూడా రద్దయింది. తన ఎత్తు ఇప్పుడు విల్లీ సహచరుడికి పట్టించదు.

“ఆకలిగా ఉందా?” ఆమెని అడిగాడు.

* * *

ఆమె చాలా ఆకలితో ఉందని ఆమె తిన్నదాన్ని బట్టి జెఫ్ గ్రహించాడు.

“టిక్కెట్ లేకుండా అక్కడ ఉన్నందుకు ఆ పోలీస్ నన్ను అరెస్ట్ చేసాడని భయపడ్డాను. నన్ను కాపాడినందుకు థాంక్స్. నన్ను మీతో తీసుకెళ్ళండి.” కోరింది.

"కాని నేను ఎక్కడికి వెళ్తున్నానో నాకే తెలీదు."

"ఎక్కడికైనా సరే. నా దగ్గర అయిదు డాలర్లు మించి లేదు. ఇంటి అద్దె చెల్లించనందుకు నా ఇంటి తలుపు తాళం వేసేసారు. రెండు రోజుల నించి తిండి లేదు. ఉద్యోగం లేదు. మీరు ఎక్కడికి వెళ్తున్నారో నాకు తెలీకపోయినా ఫర్వాలేదు. మీతో నన్ను తీసుకెళ్ళండి."

"అలాగే. ముందర ఇద్దరం కలిసి ఓ గదిని అద్దెకి తీసుకుందాం. నా దగ్గర కూడా ఉన్నవి రెండు వందల డాలర్లే. కాని నీ కన్నా ధనవంతుడ్ని." నవ్వాడు.

విల్లీ సహచరుడు తనని అక్కడ కనుక్కోలేకపోతే ఇక ఆ ఊళ్ళో ఉండడు. ఇంకో ఊరుకి తనని వెదుకుతూ వెళ్తాడు. ఆమెతో ఆ ఊళ్ళోనే ఉండటం శ్రేయస్కరం. ఓ నెల తర్వాత ఏం చేయాలో ఆలోచించాలి. యూరప్‌కి వెళ్తే ఇక తనని ఎవరూ పట్టుకోలేరు. అందుకు పాస్‌పోర్ట్ తన దగ్గరే ఉంది. టిక్కెట్‌కి డబ్బే కావాలి. క్రెడిట్ కార్డ్‌తో కొంటే నిక్కి తెలుస్తుంది. కాబట్టి దాన్ని వాడకూడదు. అందుకే ఇంతదాకా తను నగదే వాడుతున్నాడు. ఐనా విల్లీ తను ఈ ఊరికి వచ్చినట్లు ఎలా కనుక్కోగలిగాడో ఆశ్చర్యం!

ఇద్దరూ లేచి రోడ్ మీద నడవసాగారు. కొద్ది దూరం వెళ్ళాక ఆమె చెప్పింది.

"నీరసంగా ఉంది. కొద్ది సేపు అలా కూర్చుందాం."

ఇద్దరూ ఓ చిన్న సందు లోని ఓపెన్ మార్కెట్ వారు వదిలి వెళ్ళిన చెక్క కార్టన్స్ మీద కూర్చున్నారు. ఆమె కొద్ది సేపు కళ్ళు మూసుకుని కూర్చుంది. తర్వాత చెప్పింది.

"నా పేరు మెరోని. నేను డయాబెటిక్. అన్నం తినగానే మాత్ర వేసుకోవాలి."

తన హేండ్ బేగ్ జిప్‌ని లాగింది. తక్షణం జెఫ్ చేతి లోకి అతని పిస్తోలు ప్రత్యక్షం అయింది.

"నువ్వు, విల్లీ పార్ట్‌నర్స్ అని నాకు తెలుసు." ఆమెకి చెప్పాడు.

ఆమె అతని వంక చూడకుండానే 'ఏమిటి మీరనేది?" అంటూ జిప్‌ని పూర్తిగా తెరిచి వేళ్ళని బేగ్ లోపలకి జొప్పించింది. తక్షణం జెఫ్ పిస్తోలు బారెల్‌ని ఆమె తలకి ఆనించి ట్రిగర్ నొక్కాడు. గొట్టం కోయడంతో అది పేలినా పెద్ద శబ్దం రాలేదు. ఆమె గొంతు లోంచి వింత ధ్వని వెలువడి తలని పక్కకి వాల్చేసింది.

జెఫ్ ఆలోచిస్తున్నాడు. ఆమె విల్లీ సహచరురాలు అయి ఉండచ్చు. అంత పెద్ద హేండ్ బేగ్‌లో పాయింట్ 45 కోల్ట్ హేండ్ గన్ పడుతుంది. బహుశా ఆ తుపాకీని తీసి తనని ఇక్కడ కాల్చి చంపచ్చు. ఇక్కడ కాల్చినా మెయిన్ రోడ్ లోని ఎవరికీ కనపడదు. అందుకే ఇక్కడ కూర్చుందామని అడిగి ఉంటుంది.

జెఫ్ తన ఊహ నిజమో, తప్పో తెలుసుకోడానికి ఆమె హేండ్ బేగ్ లోని వస్తువులని బోర్లించి చూసాడు.



# 33. క్రిస్టమస్ ట్రీ కిల్లర్

## ఎడ్వర్డ్ డి హోక్

న్యూయార్క్ లోని పోలీస్ శాఖలో పని చేసే కెప్టెన్ లియోపోల్డ్ మరో వారంలో రిటైర్ అయిపోతున్నాడు. అతను కంప్యూటర్‌లో ఏదో పని మీద వెదుకుతూంటే 'ది క్రిస్టమస్ ట్రీ కిల్లర్' అనే ఫోల్డర్ కనిపించింది. అది తను పోలీస్ శాఖలో చేరడానికి పదేళ్ళ మునుపు జరిగిన కేసని, పరిష్కరింపబడని కేసుల జాబితాలో అదే మొదటి స్థానంలో ఉందని లియోపోల్డ్‌కి గుర్తుకు వచ్చింది. వెంటనే లియోపోల్డ్ ఆ ఫైల్‌ని క్షుణ్ణంగా చదివాడు.

డిసెంబర్ 1961లో శుక్రవారం 15వ తారీఖున ఎర్ర రంగు పికప్ ట్రక్‌ని డ్రైవ్ చేసే ముగ్గురు డ్రైవర్లని గుర్తు తెలియని వ్యక్తి తుపాకీతో కాల్చి చంపాడు. బాలిస్టిక్ పరీక్షలో ఆ గుళ్ళన్నీ ఒకే తుపాకీ లోంచి వచ్చాయని తెలిసింది. అంతే కాదు. ఆ డ్రైవర్లు కాల్చబడ్డ ప్రతీ ఎర్ర పికప్ ఓపెన్ ట్రక్‌లో కొని ఇళ్ళకి తీసుకువెళ్ళే ఓ క్రిస్టమస్ ట్రీ కూడా ఉంది. దాదాపు రెండు గంటల్లో ఈ మూడు హత్యలు జరిగాక ఇక హత్యలు జరగకుండా ఆగిపోయాయి. పత్రికలు ఆ హంతకుడికి 'క్రిస్టమస్ ట్రీ కిల్లర్' అనే ముద్దు పేరుని పెట్టాయి.

ఆ హత్యలన్నీ చీకటి పడ్డాక, రద్దీ లేని రోడ్లలో జరగడంతో హంతకుడ్ని ఎవరూ చూడలేదు. ఆ హత్యలని ఎవరు, ఎందుకు చేసారో పోలీసులు కారణం కనుక్కోలేక పోయారు. వాళ్ళకి ఎలాంటి ఆధారాలు దొరకలేదు. ఆ కేసుని పరిశోధించిన డిటెక్టివ్ మేని లేక్ మరణించి చాలా కాలం అయిందని, ఆ కేసుని పరిశోధించిన టీంలో ఒక్క ఫ్రాంక్ ఫాక్స్ మాత్రమే జీవించి ఉన్నాడని లియోపోల్డ్‌కి తెలుసు.

* * *

"ఓ వారంలో నేను రిటైర్ అవబోతున్నాను. ఈలోగా ఆ కేసుని పరిష్కరించే ప్రయత్నం చేయదలిచాను. క్రిస్టమస్ ట్రీ కిల్లర్‌ని పట్టుకోవాలన్నది నా ధ్యేయం. ఆ కేసుని పరిశోధించిన వారిలో మీరు మాత్రమే జీవించి ఉన్నారు కాబట్టి నాకు మీరు ఆ కేసు గురించి ఏమైనా చెప్తారనే ఆశతో వచ్చాను." లియోపోల్డ్ ఫ్రాంక్‌తో చెప్పాడు.

ఫ్రాంక్ ఫాక్స్ చిన్నగా నవ్వాడు.

"నీ కోరిక మంచిదే. కాని ఇందులో నువ్వు విజయం సాధిస్తావని నేను అనుకోను."

"కనీసం మోటివ్‌ని కనుక్కో గలిగినా చాలు."

"మోటివ్‌ని, హంతకుడ్ని కనుగొన్నా, అతను ఇప్పుడు జీవించి ఉంటాడని అనుకోను."

"లేదా జీవించి ఉండచ్చు - మీలా. మీకా కేస్ గుర్తుందా?" లియోపోల్డ్ అడిగాడు.

"నాకు ఆ కేసంతా క్షుణ్ణంగా గుర్తుంది. మొదటి స్త్రీని, మొదటి కేసుని ఎవరూ మర్చిపోలేరు కదా. నేను హేండిల్ చేసిన మొదటి మర్డర్ కేసది."

"హతులు ముగ్గురికి ఒకరితో మరొకరికి సంబంధం ఉందా?"

"లేదు. ఆ ముగ్గురూ అపరిచయస్థులే. వారు ముగ్గురూ క్రిస్టమస్ ట్రీ గల ఎర్ర రంగు పికప్ ట్రక్‌ని డ్రైవ్ చేయడం ఒకటే హతులకి గల పోలిక."

"వారు ముగ్గురూ ఆ క్రిస్టమస్ ట్రీలని ఒకే దుకాణంలో కొన్నారా?"

"లేదు. వాళ్ళని కాల్చాక ఆ ట్రక్ లోని క్రిస్టమస్ ట్రీలని హంతకుడు వెదక లేదన్న సంగతి మాకు రూఢీ ఐంది. ఒకవేళ అందులో విలువైనవేవో దాచాక వాటిని వాళ్ళు కొని ఉండచ్చుని, వాటి కోసం ఆ హత్య జరిగి ఉండచ్చని పేపర్లలో ఊహాగానాలు కూడా రాసారు."

"ఆ ముగ్గురిలో ఒకరిని వ్యక్తిగత కక్షతో ఎవరైనా చంపి, పోలీసులని తప్పు దారి పట్టించాలని ఒకవేళ క్రిస్టమస్ ట్రీలని తీసుకెళ్ళే రెడ్ పికప్ డ్రైవర్లు మరో ఇద్దర్ని ఆ హంతకుడు చంపాడేమో? ఆ కోణం నించి మీరు పరిశీలించారా?" లియోపోల్డ్ అడిగాడు.

"మన పోలీసు బుర్రలకి ఇలాంటి అనుమానాలు రావడం సహజమే కదా. నాకూ ఆ అనుమానం వచ్చింది. మొదటి హతుడి మీద రాత్రి ఏడుం ముప్పావుకి కాల్పులు జరిగాయి. ఆర్నోవా బర్‌హార్డ్ అనే అతని ట్రక్ రోడ్‌కి అడ్డంగా ఆగి ఉండటంతో సిమ్మన్స్ అనే అతను తన కారాపి, ఆ ట్రక్ డ్రైవర్ దగ్గరకి కోపంగా వెళ్ళాడు. కాని డ్రైవర్ కళ్ళు మూసుకుని ఉండటం, తల పక్కకి వాలిపోవడం కనిపించడంతో అతనికి హార్ట్ అటాక్ వచ్చి ఉండచ్చని భావించి పోలీసులకి ఫోన్ చేసాడు. ఐతే ఆర్నోవాని చంపే మోటివ్ ఎవరికీ లేదు. అక్రమ సంబంధాలు ఏమీ లేవు. క్వీన్స్‌లో పోస్ట్ ఆఫీస్‌లో క్లర్క్‌గా పని చేసే అతనికి ఆస్తిపాస్తులు కూడా లేవు. కాబట్టి డబ్బు మోటివ్ కాదు. అతను చెకోస్లోవేకియా నించి పారిపోయి వచ్చి రాజకీయ పునరావాసం పొంది అమెరికన్ పౌరుడై ఏడాదే అయింది."

"రెండో హతుడు? అతని పేరు చార్లెస్ రెంజర్." అడిగాడు లియోపోల్డ్.

"మొదట హత్య జరిగిన చోటికి ఇరవై మైళ్ళ దూరంలో ఎనిమిది ఐదుకి అతన్ని కాల్చారు. ఆ సమయానికి అతని ట్రక్ ఉన్న చోటికి చేరుకోవచ్చు. కాబట్టి హంతకుడు తన వాహనం ఆపకుండా అక్కడికి వెళ్ళి అతన్ని కాల్చాడు. మూడో హతుడి పేరు ఏదో ఉండాలి?"

"బోరిస్."

"అవును. గుర్తొచ్చింది. బోరిస్. అతన్ని ఎనిమిదీ నలభైకి కాల్చి చంపాడు. అదే ఆఖరి హత్య. ఆ తర్వాత ఇక హత్యలు జరగలేదు. ఈ విషయం మీడియా ద్వారా న్యూయార్క్ వాసులకి తెలియడంతో, ఎవరూ ఎర్ర పికప్ ట్రక్‌లని కొన్ని రోజుల పాటు బయటకి తీయలేదు. తీసినా అందులో క్రిస్టమస్ ట్రీని కొని తీసుకెళ్ళలేదు."

"ఆ మూడు ట్రక్‌లూ ఒకే కంపెనీకి చెందినవా? పోటీ కంపెనీ..."

"లేదు. లేదు. ఒకటి డాడ్జ్, ఇంకోటి ఫోర్డ్, మూడోది గుర్తు లేదు. కాని ఈ రెండూ కాదు. ఐనా అప్పటికి కార్పొరేట్ క్రైం ఇంకా రాలేదు. ఒక గంటా ఐదు నిమిషాల్లో మూడు



హత్యలు జరిగాయి. ఈ సంఘటన ఆధారంగా తర్వాత చాలా సినిమాలు వచ్చాయి. మనం అనుకున్న మోటివ్‌ల నేపథ్యంలో ఓ సినిమాలో హంతకుడ్ని సైకలాజికల్ కిల్లర్‌ని చేసారు. చిన్నప్పుడు క్రిస్టమస్ ట్రీతో వెళ్ళే ఓ ఎర్ర పికప్ ట్రక్ తన తల్లితండ్రుల మీదకి ఎక్కి ఆ ప్రమాదంలో వారు మరణించడంతో వాటి డ్రైవర్లని ఆ సినిమాలో హంతకుడు చంపాడు అని ముగించారు. నా ఉద్దేశంలో అదే సరైన కారణం."

"కాని అదే నిజమైతే ఆ ఒక్క సంవత్సరం మాత్రమే హత్యలు జరిగి ఆగిపోవుగా? తర్వాతి సంవత్సరాల్లో అది కొనసాగాలి కదా?"

"అతని ద్వేషం అప్పటికి చల్లారిపోయి ఉంటుంది."

"అదే నిజమైతే హంతకుడు సైకిక్ కాదు. సైకిక్‌కి తీరని దాహం ఉంటుంది."

"చాలా మందిని ప్రశ్నించాము. అవన్నీ నువ్వు క్షుణ్ణంగా చదివి ఉండచ్చు."

"ఫైల్ మొత్తం చదివాను. హంతకుడ్ని పట్టించే విషయాలేం అందులో లేవు."

"అందుకే అది గడ్డు కేస్. గుడ్ లక్. ఇంకేదైనా సహాయం కావాలంటే ఫోన్ చెయ్యి. లేదా మా ఇంటికి రావచ్చు. ఎప్పుడు వచ్చినా ఓ కప్పు వేడి కాఫీ నీ కోసం సిద్ధంగా ఉంటుంది." ప్రోత్సాహ పూర్వకంగా గట్టిగా కరచాలనం చేస్తూ చెప్పాడు ఫాక్స్.

* * *

లియోపోల్డ్ హతుల కుటుంబ సభ్యులని మళ్ళీ ప్రశ్నించాడు. మరణించిన వారి లోని ఇద్దరి భార్యలు జీవించే ఉన్నారు. వారిలో ఒకరు ఆ కేస్ గురించి వినగానే కంట తడి పెట్టారు. వాళ్ళని ఎన్నో కోణాల్లో తరిచి తరిచి ప్రశ్నించాడు. ఐనా లియోపోల్డ్‌కి హంతకుడ్ని కనిపెట్టే కొత్త సమాచారం ఏదీ లభించలేదు.

న్యూయార్క్ పబ్లిక్ లైబ్రరీకి వెళ్ళి పాత దిన పత్రికలన్నిటినీ చదివాడు. ఏదైనా బేంక్ దొంగతనం లేదా విలువైన వజ్రాల్లాంటి దొంగతనం జరిగి నేరస్థులు వాటిని ఆ క్రిస్టమస్ ట్రీలలో దాచారేమోనని, హత్యలు జరగడానికి నెల మునుపువి కూడా చదివాడు. అలాంటిదేం లేదు. ఆ మూడు ట్రీలు ఒకే సరఫరా దారుడి నించి ఆ దుకాణాలకి రాలేదన్న వార్తని దిన పత్రికల్లో చదవగానే ఆ అనుమాన నివృత్తి కూడా అయింది. ఆ కేసులో అతను ఎంత ప్రయత్నించినా ప్రగతిని సాధించలేక పోయాడు. చివరికి లియోపోల్డ్ కోరిక తీరనే లేదు.

అతను రిటైరయిన రోజు న్యూయార్క్ టైమ్స్ నించి ఓ రిపోర్టర్ వచ్చి పోలీస్ డిటెక్టివ్‌గా ఆయన అనుభవాలని అడిగి తెలుసుకున్నాడు. మర్నాడు ఓ అంగుళం మేర కాలంలో ఆ విషయాలని వార్తగా వేస్తామని చెప్పాడు.

* * *

"అవును. క్రిస్టమస్ ట్రీ కిల్లర్‌ని పట్టుకోవాలని నా సర్వీస్ లోని ఆఖరి వారం రోజులు నేను ప్రయత్నించాను. ఆ కేస్ సాల్వ్ చేయనందుకు బాధగా ఉందని రిపోర్టర్‌కి చెప్పాను.

మీరెవరు?" తన ఎదురుగా కూర్చున్న ఆ అపరిచిత వృద్ధురాలి వంక చూస్తూ అడిగాడు లియోపోల్డ్.

"క్రిస్టమస్ ట్రీ కిల్లర్ ఎవరో నాకు తెలుసు." ఆవిడ చెప్పింది.

లియోపోల్డ్ ఆవిడ చెప్పే దాంట్లో ఎంత నిజం ఉందన్న అనుమానంతో చూసాడు.

"ఋజువుతో సహా చెప్పగలను. నా పేరు డయానా అకార్డ్. అకార్డ్ నా భర్త. 1962 క్రిస్టమస్‌కి మా నాన్నగారు నా భర్తకి ఓ కొత్త ప్లిమత్ కారుని బహూకరించారు. ఆయన దాన్ని డిసెంబర్ పదిహేను సాయంత్రం ఐదుకి షో రూం లోంచి తీసుకుని మా ఇంటికి వస్తూంటే నియమాలకి వ్యతిరేకంగా ఓవర్‌టేక్ చేసిన ఓ ఎర్ర రంగు పికప్ ట్రక్ ఆయన కారుని రాసుకుంటూ వెళ్ళింది. దాన్లో ఓ క్రిస్టమస్ ట్రీ ఉంది. కారు కుడి వైపు భాగమంతా పెయింట్ పోయింది. ఆ కోపంతో ఆయన దాని వెంటపడ్డారు. పట్టలేని ఆవేశంతో ఆ డ్రైవర్‌ని తుపాకీతో కాల్చారు. దాన్నిప్పుడు రోడ్ రేజ్ అంటున్నారు. అప్పటికింకా ఆ పదం పుట్టలేదు."

లియోపోల్డ్ ఆవిడ చెప్పేది శ్రద్ధగా వినసాగాడు.

"మళ్ళీ ఆయనకి కొంతసేపటికి క్రిస్టమస్ ట్రీ గల అచ్చం అలాంటి ఇంకో ట్రక్ కనపడింది. తన కారుని ఢీ కొట్టింది ఆ ట్రక్ అయి ఉండచ్చనిపించి దాని డ్రైవర్‌ని కూడా కాల్చారు. ఆయన ఇంటికి వచ్చే లోగా మూడో ట్రక్ కనిపించడంతో ఇంకా కోపం చల్లారని మా వారు అతని మీద కూడా కాల్పులు జరిపారు."

"ఇది మీకు ఎలా తెలుసు?"

"మా వారు ఇటీవలే పోయారు. ఆయన డైరీలు చదువుతూంటే అందులో ఆయన రాసుకున్న ఈ విషయం బయట పడింది."

"మీరు చెప్పేది నమ్మశక్యంగా లేదు. నేను హంతకుడ్ని పట్టుకోలేదన్న బాధని వ్యక్తం చేయడంతో నన్ను సంతోషపెట్టడానికి మీరు ఈ కథతో వచ్చారని అనిపిస్తోంది."

"మీరీ మాట అంటారని నేను ముందే ఊహించాను."

నవ్వి ఆవిడ ఓ చిన్న పార్సెల్‌ని లియోపోల్డ్ ముందు ఉంచి లేచి మౌనంగా బయటకి వెళ్ళిపోయింది. లియోపోల్డ్ ఆ పార్సిల్‌ని విప్పితే లోపల పాయింట్ ఫోర్ ఎయిట్ కేలిబర్ పిస్తోలు కనిపించింది. దాంట్లో ఓ బుల్లెట్ పెట్టి పేల్చి, హతులని చంపిన బుల్లెట్ ఫొటోలతో పోలిస్తే అది ఆ హత్యలు చేయడానికి ఉపయోగించిన పిస్తోలు అవునో కాదో తెలిసిపోతుందని లియోపోల్డ్‌కి తెలుసు.





# 34. అనగనగా ఓ రోజు

## పీటర్ మస్సరెల్లి

జాక్ వార్డెన్‌కి రియర్ వ్యూ మిర్రర్‌లో మరోసారి రెండు హెడ్ లైట్లు కనిపించి మాయమయ్యాయి. అకస్మాత్తుగా ఓ నీలం రంగు బ్యూక్ కారు వెనక నించి హారన్ కొడుతూ దూసుకు వచ్చి, జాక్ నడిపే ట్రక్‌ని ఓవర్ టేక్ చేసింది. 'ఇడియట్' అరుస్తూ జాక్ తన ట్రక్‌ని కుడివైపుకి కోసాడు. రోడ్డు అంచున ఉన్న ఉక్కు గార్డ్ రెయిల్‌కి ట్రక్ రాసుకున్న శబ్దం వినిపిస్తూండగా జాక్ వార్డెన్ ట్రక్‌ని బ్రేక్ వేసి ఆపాడు.

ఎవడా పిచ్చి డ్రైవర్? కొండ మీది ఈ రోడ్డు మీద పగలే ఓవర్ టేక్ చేయడం ప్రమాదం. అలాంటిది ఆ పిచ్చి పని రాత్రి చేసింది ఎవరు? తాగిన టీనేజ్ కుర్రాళ్ళా? ఆ కారుని దొంగిలించి నడుపుతున్నారా? అతనిలో ఆలోచనలు సాగాయి.

హెడ్ లైట్ల కాంతిలో ఎదురుగా కొద్ది దూరంలో ఆ కారు ఆగింది. హజార్డ్ లైట్లని ఆన్ చేసారు. ఏమైంది వాళ్ళకి? వారికి ఏదైనా సహాయం అవసరం ఏమోననిపించి జాక్ వెంటనే ట్రక్ దిగాడు. కారు లోపల చీకటిగా ఉండటంతో ఏం కనపడలేదు.

కారు పక్కన చీకట్లోంచి ఓవర్ కోట్స్ ధరించిన ఇద్దరు ట్రక్ ముందుకి వచ్చారు. వారిద్దరి చేతుల్లో తనకి గురి పెట్టిన రెండు పిస్తోళ్ళు కనిపించాయి.

"ఎవరు మీరు? మీకేం కావాలి? నా దగ్గర ఇరవై డాలర్లు లోపే ఉంది." చెప్పాడు జాక్ వార్డెన్.

"ఎక్కు" వారిద్దరిలో పొడుగతను జాక్ దగ్గరకి వచ్చి చెప్పాడు.

అది పట్టించుకోకుండా జాక్ ఏదో మాట్లాడబోతుంటే పొట్టిగా ఉన్నవాడు గట్టిగా ఆజ్ఞాపించాడు.

"ముందు ట్రక్ ఎక్కు."

జాక్ వార్డెన్ ట్రక్ ఎక్కి డ్రైవింగ్ సీట్లో కూర్చుంటూండగానే ఆ ఇద్దరు రెండో వైపు నించి అతని పక్క సీట్లలోకి ఎక్కారు.

"పోనీ." చెప్పాడా పొడుగువాడు.

"ట్రక్‌లోని సరుకేమిటి?" ట్రక్ కదిలాక పొడుగువాడు అడిగాడు.

"లిక్కర్. ట్రక్ హైజాకింగా?"

"అవును. ఇలాంటి దారిలో పన్నెండు చక్రాల ట్రక్‌ని నడపడం మాకు ప్రమాదం. ఈ కొండ దారి లోంచి ట్రక్ బయటకి వచ్చాక నిన్ను చంపి మేం దీన్ని నడుపుకు వెళ్తాం." పొట్టివాడు చెప్పాడు.

పొడుగువాడు తుపాకీ గొట్టాన్ని జాక్ పక్కలో గుచ్చి పట్టుకుని చెప్పాడు.

"నెమ్మదిగా పోనీ. నువ్వేమైనా పిచ్చి వేషాలు వేస్తే నిన్ను కాల్చేస్తాను."

"నా ట్రక్‌ని ఎప్పటి నించి వేటాడుతున్నారు?"

"ఘాట్ రోడ్ మొదట్లోంచి."

'ట్రక్ డ్రైవర్ శవంగా మారాడు. ట్రక్ మాయం' అని తను దినపత్రిక లోని వార్తగా మారచ్చని జాక్‌కి అనిపించింది. ఆరిజోనా రాష్ట్రంలో ఇలా జరుగుతుందని అనేకమంది ట్రక్ డ్రైవర్స్ చెప్పగా జాక్ వార్డెన్ విని ఉన్నాడు.

"కొండల నిండా మలుపుల దార్లే. నువ్వు నోరు తెరచి మమ్మల్ని ఎలాంటి ప్రశ్నలూ వేయక. నిశ్శబ్దంగా, జాగ్రత్తగా డ్రైవ్ చేయి. ఇంకో ముప్పై మైళ్ళ దాటడానికి మనకి కనీసం రెండు గంటలు పడుతుంది." పొడుగు వ్యక్తి చెప్పాడు.

"నా పేరు జాక్ వార్డెన్. మీ పేర్లు చెప్తే సంతోషిస్తాను. ఇది ప్రశ్న కాదు."

"మేక్." పొడుగు వ్యక్తి పకపక నవ్వి చెప్పాడు.

"నా పేరు చెప్పను." పొట్టివాడి కంఠంలో కోపం ధ్వనించింది.

"చెప్పకపోతే షార్ట్ అని పిలుస్తాను."

షార్ట్ జాక్‌ని పిస్తోలు మడమతో కొట్టబోతుంటే మేక్ అతన్ని ఆపి చెప్పాడు.

"డ్రైవ్ చేసేవాడ్ని ఏం చేయక."

"సరే. చివర్లో నిన్నేం చేస్తానో చూడు." షార్ట్ జాక్‌తో బెదిరింపుగా చెప్పాడు.

ఐదు నిముషాలు నిశ్శబ్దంగా గడిచాక పొట్టివాడు జేబులోంచి సిగరెట్ పాకెట్‌ని తీసి ఓ సిగరెట్‌ని పళ్ళ అంచుతో పట్టుకుని తీసి దాన్ని లైటర్‌తో వెలిగించుకున్నాడు.

"ఈ ట్రక్ నో స్మోకింగ్ జోన్." జాక్ చెప్పాడు.

"మేం చేసిన పెద్ద నేరం కన్నా ఇది చాలా చిన్న నేరం."

"కావచ్చు. కాని లిక్కర్‌ని తీసుకెళ్ళే ఇందులో సిగరెట్ తాగడం అందరికీ ప్రమాదం. తర్వాత మీ ఇష్టం."

"ఇదే ఆఖరి సిగరెట్. తర్వాత వెలిగించకు." మేక్ వెంటనే షార్ట్‌తో చెప్పాడు.

జాక్ వార్డెన్‌కి ఆ ఇద్దరిలో ఒకరి నించి ఆల్కహాల్ వాసన వస్తోంది. కాని అది ఎవరి నించో తెలుసుకోలేక పోయాడు. కాసేపటికి మేక్ జేబులోంచి ఓ సీసాని తీసి ఓ గుక్క తాగి దాన్ని మళ్ళీ మూత మూసి జేబులో ఉంచుకున్నాడు.

"ఇద్దరూ మిత భాషులన్న మాట. నాకు నిద్ర రాకుండా ఏదైనా మాట్లాడచ్చుగా?" జాక్ వార్డెన్ కాసేపాగి స్వగతంగా అనుకున్నట్లుగా చెప్పాడు.

"అది ప్రశ్న కాదు." వెంటనే మేక్ నవ్వి చెప్పాడు.

జాక్ జాగ్రత్తగా హెడ్ లైట్ల కాంతిలో రోడ్డు వంక దీక్షగా చూస్తూ పోనిస్తున్నాడు. రెండు మైళ్ళు వెళ్ళాక జాక్ అకస్మాత్తుగా పెద్దగా నవ్వి ఈల వేయసాగాడు.



"ప్రమాదాలు అధికంగా జరిగే ప్రదేశం ఇదే."

"షటప్." అరిచాడు షార్ట్.

"మీకో హాస్య కథ చెప్తాను. వినండి. లేదా నిద్ర పోవచ్చు నేను." జాక్ చెప్పాడు.

మరో మైలు దూరం దాకా మలుపులని జాగ్రత్తగా చూస్తూ, స్టీరింగ్‌ని తిప్పుతూ జాక్ వార్డెన్ చెప్పాడు.

"అనగనగా ఓ రోజు ముగ్గురు తెలివి గల...."

"ఆపు." అరిచాడు షార్ట్.

"మీరు ప్రశ్నలు వేయద్దన్నారు. కాని కథ చెప్పద్దనలేదుగా."

"నోరు మూసుకో." అరిచాడు షార్ట్.

కొద్ది దూరం వెళ్ళాక మేక్ చెప్పాడు.

"డ్రైవర్‌కి నిద్ర రాకూడదు. నేనో కథ చెప్తాను. జాక్. నువ్వు అది వింటూ డ్రైవ్ చేయి. అనగనగా ఓ రోజు... కథలన్నీ ఇలాగేగా మొదలయ్యేది? అనగనగా ఓ రోజు ఇద్దరు తెలివి గల యువకులు ఓ కన్వీనియెన్స్ స్టోర్‌లోకి ఇదే తుపాకీతో ప్రవేశించి దొంగతనం చేసారు. అది ఏడేళ్ళ క్రితం. అప్పటి నించి ఏడాదికి పద్దెనిమిది నించి ఇరవై రెండు సార్లు బేంకుల్లో, పెట్రోల్ బంకుల్లో, లిక్కర్ షాపుల్లో ఆ ఇద్దరూ దొంగతనాలు చేస్తున్నారు. అమెరికా లోని పధ్నాలుగు రాష్ట్రాల పోలీసులు ఆ ఇద్దరి కోసం వెదుకుతున్నారు. ఇంతదాకా వాళ్ళు పోలీసులకి చిక్కలేదు." అతను కేబిన్ లైట్ వేసి తన ఓవర్ కోట్ జేబులోంచి ఓ క్షురకుడి కత్తిని తీసి దాని మడత విప్పి లైట్ ఆఫ్ చేసి దాంతో గడ్డం గీసుకుంటూ చెప్పసాగాడు.

ముఖానికి ఏదీ రాసుకోకుండా చీకట్లో లాఘవంగా గడ్డం గీసుకుంటున్న అతనికి ఆ విద్య బాగా వచ్చని జాక్‌కి అర్థమైంది.

తను వాళ్ళు చెప్పినవన్నీ పోలీసులకి చెప్తానని తెలిసీ చెప్తున్నాడంటే, బహుశా తనని కొండ దారి అంతం అవగానే చంపేసి రోడ్డు పక్కన తుప్పల్లో పడేయచ్చు అనుకున్నాడు. ఇక తన శవాన్ని వాసన బట్టే కనుక్కోవాలి. జంతువులు తన మాంసాన్ని తినేస్తే ఆ వాసన కూడా ఉండకపోవచ్చు.

"ఎంతదాకా చెప్పాను? ఆ. చివరికి ఆ ఇద్దరూ ఓ ట్రక్‌ని ఆపి ఎక్కారు. ఈ ట్రక్ డ్రైవరే ఈ కథని ఇంతదాకా విన్నది. ఇప్పుడు ఆ హాస్య కథని నువ్వు చెప్పు."

"ఏం కథ?"

"ఇందాక మొదట్లో ఆపిన కథ. ఇప్పుడు నీ వంతు. అనగనగా ఓ రోజు ముగ్గురు తెలివిగల... తర్వాత?"

"అనగనగా ఓ రోజు ఓ ట్రక్ డ్రైవర్‌కి నూట ఇరవైయ్యవ జీతంతో పాటు, పదేళ్ళు తమ కంపెనీలో విడవకుండా పని చేసినందుకు మంచి బోనస్ కూడా లభించింది. ఆ

డ్రైవర్ ఆనందంగా ఇద్దరు మిత్రులతో కలిసి తాగాడు. అతనికి తన ఏడేళ్ళ కూతురుని స్కూలు నించి ఇంటికి తీసుకురావాల్సిన బాధ్యత తనదే అని అకస్మాత్తుగా గుర్తుకు రావడంతో బిల్ చెల్లించి స్కూలుకి బయలుదేరాడు. ఐతే అతనికి దారిలో బాగా నిద్ర వచ్చింది. నడిచే కారులో నిద్రపోయాడు. మర్నాడు అతను హాస్పిటల్‌లో నిద్ర లేచాడు. పోలీసులు జరిగింది చెప్పారు."

"నీకు దెబ్బలు తగిలాయా?" అడిగాడు షార్ట్.

"ఆ కారు డ్రైవర్ కారులో నిద్రపోగానే ఎదురుగా వస్తున్న ఓ కారుని గుద్దిందా కారు. ఆ కారుని డ్రైవ్ చేసే తల్లి, ఏడేళ్ళ కూతురు, నాలుగేళ్ళ కూతురు గాయపడ్డారు. వారంతా అదే హాస్పిటల్‌లో మరణించారు. తల్లి కోమాలో ఉంది." జాక్ ఏడవసాగాడు.

"దేనికి ఏడుస్తావు?"

"మందు తాగి డ్రైవ్ చేస్తూ కార్లో నిద్రపోయిన డ్రైవర్ గుద్దింది తన కుటుంబ సభ్యులున్న కారునే. నా కన్నా ముందే స్కూలుకి వెళ్ళి నా కూతుర్ని ఎక్కించుకున్న నా భార్య తిరిగి ఇంటికి వెళ్తోంది."

"ఇది ఎప్పుడు జరిగింది?"

"ఏడాది క్రితం."

"మరి ఇంత కాలం తర్వాత ఇప్పుడు ఏడుస్తున్నావే?"

"మీరు నా ట్రక్ ఎక్కడానికి గంట ముందే కోమాలోని నా భార్య మరణించిందని హాస్పిటల్ నించి నాకు ఫోన్ వచ్చింది."

"జీసస్! నీ అంత దురదృష్టవంతుడు ఇంకోడు లేడు." మేక్ సానుభూతిగా చెప్పాడు.

"అదృష్టవంతుడు కూడా. ట్రక్ ఆగగానే నువ్వు నీ కుటుంబ సభ్యులని కలవచ్చు." షార్ట్ నవ్వుతూ చెప్పాడు.

"అవును. అంతే కాదు. ఈ ట్రక్‌లోని ఇద్దరిని వాళ్ళకి పరిచయం చేస్తే. వాళ్ళూ తమ కృతజ్ఞతలని మీ ఇద్దరికీ తెలియచేస్తారు." జాక్ చెప్పాడు.

అకస్మాత్తుగా ట్రక్ వేగం పెరిగింది. గార్డ్ రెయిల్ సర్రున ఆ ట్రక్‌కి రాసుకుంది. రోడ్డు మీద వంకర టింకరగా తిరుగుతూ ట్రక్ వేగంగా కొండ మీంచి కిందకి దిగసాగింది.

"ఆపు."

"అంతా కలిసే చద్దాం మిత్రమా." జాక్ చెప్పాడు.

"ముందు ఆపు." భయంగా కీచుగా అరిచాడు షార్ట్.

"ఆపకపోతే నిన్ను కాల్చేస్తాను." మేక్ అరిచాడు.

"మంచిది. ఈ వేగంలో ఇది లోయలో పడితే ఎటూ నువ్వు నాతో స్వర్గానికి రాక తప్పదు."



షార్ట్ ఎదురుగా లోయ అంచుని చూసాడు. ట్రక్ అటు వైపే దూసుకుపోతుంది. షార్ట్ క్షణం ఆలస్యం చేయకుండా తలుపు తెరచుకుని రోడ్డు మీదకి దూకేసాడు. అతని వెంటే మేక్ కూడా. జాక్ గార్డెన్ బ్రేక్ వేయగానే, ఆ లారీ ముందు చక్రాలు సరిగ్గా లోయ అంచు దగ్గర ఆగాయి. అతను దిగి వెనక్కి తిరిగి రోడ్డు మీద పడి ఉన్న వారిని చూసాడు. అవి జీవం లేని శరీరాలుగా గ్రహించాడు.

వెనక్కి వెళ్ళి ట్రక్‌లో కూర్చుని జాగ్రత్తగా దాన్ని బేక్ చేసి కొండ దిగసాగాడు. నాలుగైదు నిమిషాల్లో ఘాట్ రోడ్ అంతమై ట్రక్ మైదాన భూమి లోకి ప్రవేశించింది. గంటకి అరవై ఐదు మైళ్ళ వేగంతో వెళ్తోందా ట్రక్. ఈ వేగంతో వెళ్తే రాత్రి పన్నెండున్నరకల్లా ఇంటికి చేరుకోవచ్చు అనుకున్నాడు జాక్ వార్డెన్.

* * *

అతను తెల్లవారు ఝామున రెండున్నరకి తన ఇంటికి చేరుకున్నాడు. అతని భార్య అతని కోసం మేలుకుని ఎదురు చూస్తోంది.




మీకు ఈ కథలు నచ్చితే చదవండి
అమెరికన్ క్రైం కథలు - రూ. 100/-
విదేశీ కథలు - రూ. 100/-
దీనితో పాటు వెలువడింది
పిల్లల హిత కథలు - రూ. 120/-
(8-14 మధ్య వయసు పిల్లలకి బహుకరించదగ్గవి)